
(గాయత్రీ మంత్ర రహస్య వ్యాఖ్యాన సహిత)

# శంకరాద్వైత వ్యాసమాల - 3




రచయిత :

## త్రిపురనేని విష్ణుశంకరరావు

గుడివాడ. (కృష్ణాజిల్లా)

ప్రథమ కూర్పు :  500 కాపీలు
అక్టోబరు 1990
ద్వితీయ కూర్పు : 1000 కాపీలు
జనవరి 2013

కాపీరైటు మరియు ప్రాప్తిస్థానం :
రంగా & కో., గుడివాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

**ముద్రణ: శ్రీనివాస ప్రింటర్స్, విజయవాడ - 3.  ఫోన్: 0866-2576157**

**Sankaraadvaita series (3 books) are available at http://www.sankaraadvaita.com**

# శంకరాద్వైత వ్యాసమాల

గ్రంథకర్త : త్రిపురనేని విష్ణుశంకరరావు.

**అంకితము**

కైవల్య శ్రీ విరాజితులు, బ్రాహ్మీమయ తేజోవిరాజితులు ఆదిమద్యాంతరహితులు, ఆదిశంకర స్వరూపులు, జాతిమత కులవర్గ వర్ణ లింగ విభేదరహితులు, జ్ఞానవిజ్ఞాన ప్రజ్ఞానఘనులు, తత్త్వదర్శులు, తత్త్వవేత్తలు, తపతాంవరులు, చిన్ముద్రముద్రితులు, గురువులకు గురువు, గురుబ్రహ్మలు, శ్రోతృవర్గచోదకులు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, గుడివాడ ప్రణవాశ్రమ పీఠాధిపతులు, కులపతులునగు

**శ్రీశ్రీశ్రీ బ్రహ్మీభూత ప్రణవానందస్వాములవారికి**

విమలామల పాదకమలములను పూజించుచు, అనిర్వ్యాజ ప్రేమరసైక మూర్తులను ధ్యానించుచు, సాష్టాంగ నమోవాకము లర్పించుచు

తే॥ గీ॥**ఏ మహామహితాత్ము డీరేడు జగము**
**లహితమాసించి అద్వైత మహితబోధ**
**మాచరించి తరించె నా అమృతమయున**
**కర్పణముచేతు నస్మదీయాత్మబోధ.**

ఇట్లు,
వినయవినమితోత్తమాంగుడైన
మీ
**త్రిపురనేని విష్ణుశంకరరావు**
గు డి వా డ.




రచయిత:

త్రిపురనేని విష్ణుశంకరరావు



వీరి ధర్మపత్ని:

**త్రిపురనేని ధనలక్ష్మి**


శంభుడు
మణయ్య
త్రిపురనేని గోపాలరావు
రామస్వామి
రామయ్య
చలమయ్య
వెంకటాద్రి
మాధవరావు
శేషాద్రి
గోపయ్య
భార్య తులశమ్మ
(రచయిత, మాతాపితలు)
జానకిరాముడు
కేశవరావు
నారాయణరావు
శివరామయ్య
విష్ణుశంకరరావు, భార్య ధనలక్ష్మి
(రచయిత)
గోపీచంద్
గోవర్ధనచంద్
భార్య లీలాకుమారి
కస్తూరి
భర్త శిరిపురపు అంకయ్య
వెంకట రవి
నాగేశ్వరరావు
సచ్చిదానంద్
భార్య కేథరిన్
రోహన్
ఓర్లా

# మా గురుదేవులు



బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వామివారు
శ్రీ ప్రణవాశ్రమము
గుడివాడ

# గు రు స్తు తి

**శ్లో॥ స్వదేశికస్త్యైవచనామకీర్తనం । భవేదనంతస్య శివస్య కీర్తనం ।**
**స్వదేశికస్త్యైవచామచింతనం । భవేదనంతస్య శివస్య చింతనం ॥**

టీ॥ స్వ...స్త్యైవచ = స్వ= తనయొక్క, దేశివ స్యూవచ = జ్ఞానోపదేశమును జేసిన గురువు యొక్కయే, నామసంకీర్తనం = నామ = పేరుయొక్క, కీర్తనం = స్తుతి, అనంతస్య = అంతములేని, శివస్య = ఈశ్వరునియొక్క, కీర్తనం = స్తుతియే, భవేత్ = అగును. స్వదేశికస్త్యైవ = స్వ = తనయొక్క, దేశికస్త్యైవ = గురువుయొక్కయే, నామచింతనం = పేరు యొక్క తలంచుట, అనంతస్య = అంతములేని, శివస్య = ఈశ్వరునియొక్క, చింతనం = తలంచుట, భవేత్ = అగును.

తా॥ జనుడు తనకు బ్రహ్మజ్ఞానోపవేశము చేసిన గురువు యొక్క నామమును స్తోత్రము చేయుటయే "అంతములేని పరమ శివునియొక్క నామస్తుతి యగును. ఆ గురువు యొక్క నామమును తలంచుటయే" ఆ పరమశివుని యొక్క నామమును దలంచుట యగును.

**శ్లో॥ గురుమూర్తిం స్మరేన్నిత్యం । గురోర్నామ సదాజపేత్ ।**
**గురోరాజ్ఞాం ప్రకుర్వీత । గురోరన్యం సభావమేత్ ॥**

తా॥ ఎల్లప్పుడును సద్గురు స్వరూపమునే స్మరించవలయును. ఆ సద్గురు నామమునే జపించవలయును. సద్గురువు యొక్క ఆజ్ఞ ప్రకారమే చేయవలయును. సద్గురువు కంటె నితరమగు దాని దలంచనేగూడదు.

**శ్లో ॥ గుకారశ్చాంధకారస్తు । రుకారస్తన్నిరోధకృత్ ।**
**అంధకారా వినాశిత్వా । ద్గురురిత్యభిధీయతే॥**

తా॥ గాఢమైన చీకటియే గుకారము. ఆ చీకటిని నశింపజేయునదియే గుకారము. ఇట్లు అజ్ఞానాంధకారమును నశింపజేయుట వలననే గురువని చెప్పబడుచున్నది.

**శ్లో॥ గుకార: ప్రథమోవర్ణో । మాయాది గుణభావకం ।**
**గుకారోస్తి పరంబ్రహ్మ । మయాభ్రాంతి విమోచకం ॥**

తా॥ గురుపదమునందలి మొదటి వర్ణమగు గుకారము మాయ మొదలైన గుణములను ప్రకాశింపజేయుచున్నది. రెండవవర్ణమగు గుకారమును ఆ మాయయొక్క భ్రాంత్యాది గుణములను నశింపజేసెడి పరబ్రహ్మయై యున్నది. ఇట్లు గురుపదమే మాయగాను పరబ్రహ్మముగాను నున్నది.

**శ్లో॥ ధృవంతేషాంచ సర్వేషాం । నాస్తితత్వం గురో:పర: ।**
**గురోరారాధనం కార్యం । స్వజీవిత్వం నివేదయేత్ ॥**

తా॥ అందఱికిని గురువుకంటె నన్యమగు పరమాత్మ స్వరూపములేదు. నిశ్చయముగా గురువునే పూజింపవలయును. తన బ్రతుకునంతయు గురువునకే అర్పించవలయును.

**శ్లో॥ కర్మణా మనసా వాచా । సర్వధారా ధయేద్గురుం ।**
**దీర్ఘదండం నమస్కృత్య । నిర్లజ్జో గురుసన్నిధౌ ॥**

తా॥ జనుఁడు గురుసమీపము నందు లజ్జలేనివాడై సాష్టాంగ నమస్కారముచేసి మనోవాక్కాయ కర్మలచేతఁ ద్రికరణశుద్ధిగా గురువును పూజింపవలయును.

**శ్లో॥ గురురేకోజగత్సర్వం । బ్రహ్మ విష్ణు శివాత్మకం ।**
**గురో: పరతరంనాస్తి । తస్మాత్సం పూజయేద్గురుం ॥**

తా॥ సమస్త జగత్తునకును గురుడొకడే బ్రహ్మ, విష్ణు, శివాత్మక స్వరూపము అగుచున్నాడు. గురువుకంటెను శ్రేష్ఠమగునది యేదియును లేదు. అందువలన సద్గురుస్వామినిఁ బూజింవలయును.

**శ్లో॥ యస్వస్మరణమాత్రేణ । జ్ఞానముత్పద్యతేస్వయం ।**
**నఏవసర్వసంపత్తి । స్తస్మాత్సంపూజయేద్గురుం ॥**

తా॥ ఏ గురువుయొక్క స్మరణచేతనే పరబ్రహ్మజ్ఞానము స్వకీయముగానే పుట్టుచున్నదియో, ఆ గురువే సర్వసంపత్స్వరూపుడు గనుకనే, గురువును మిక్కిలి పూజింపవలయును.

**శ్లో॥ అఖండ మండలాకారం । వ్యాప్తంయేన చరాచరం ।**
**తత్పదం దర్శితంయేన । తస్మై శ్రీ గురవేనమ: ॥**

తా॥ ఏ పరమాత్మచే సమస్త ప్రపంచము పరిపూర్ణమైన మండల రూపమగునట్లు వ్యాపింపబడియున్నదో, యట్టి పరమేశ్వర స్థానమే గురువుచేత( జూపింపబడినదో, అట్టి సద్గురువుకొఱకు నమస్కారము.

**శ్లో॥ యస్మై కారణరూపాయ । కార్యరూపేణభాతియాత్ ।**
**కార్యకారణరూపాయ । తస్మై శ్రీ గురవే నమ: ॥**

తా॥ సర్వకారణు(డగు భగవంతునికొఱకు కార్యరూపమైన సమస్త ప్రపంచము ప్రకాశించుచున్నయది. అట్టి కార్యకారణ రూపమైన భగవంతు(డగు సద్గురువు కొరకు నమస్కారము.

**శ్లో॥ ధ్యానమూలం గురోర్మూర్తి: । పూజామూలం గురో:పదం ।**
**మంత్రమూలం గురోర్వాక్యం । ముక్తిమూలం గురో: కృపా ॥**

తా॥ గురువుయొక్క దేహమే ధ్యానమునకు కారణము. గురువు యొక్క పాదమే పూజించుటకు కారణము. గురువాక్యమే మంత్రమునకు కారణము. గురుకృపయే మోక్షమునకు కారణము.

**శ్లో॥ శివేరుష్టే గురుస్త్రాతా । గురౌగుష్టేనకశ్చన ।**
**లబ్ధ్వాకులగురుం సమ్యక్ । గురుమేవ సమాశ్రయేత్ ॥**

తా॥ ఈశ్వరుడు ఆగ్రహించుచుండగా గురువే రక్షించువాడు అగుచున్నాడు. గురువాగ్రహించినపుడు ఎవడును రక్షించెడివాడు లేడు. కనుక, కులగురువగు సద్గురువునే పొంది, బాగుగా నాశ్రయించవలయును.

**శ్లో॥ గురో: కృపాప్రసాదేన । బ్రహ్మా విష్ణు మహేశ్వరా: ।**
**సామర్థ్యమగమస్సర్వే । కేవలం గురుసేవయా ॥**

తా॥ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మొదలైన వారందరును గురుకృపను బొందుటచేతను, మిక్కిలిగా గురుసేవ చేయుటచేతను నట్టి సామర్థ్యమును బొందిరి.

**శ్లో॥ నసుఖం వేదశాస్త్రేషు నసుఖం మంత్రయంత్రయే ।**
**గురోం ప్రసాదాదన్యత్ర । సుఖం నాస్తి మహీతలే ॥**

తా॥ వేదశాస్త్రములయందును, మంత్ర యంత్రములందును సౌఖ్యములేదు. భూలోకమునందు సద్గురుని యనుగ్రహము కంటె నన్యమైన దేనియందును సుఖము లేదు.

**శ్లో॥ గురుర్దేవో గురుర్ధర్మో । గురుర్నిష్ఠాపరంతప: ।**
**గురోంపరతరం నాస్తి । త్రివారం కథయామితే ॥**

తా॥ గురువే దైవము, గురువే ధర్మము, గురువే ధ్యానాధీనమగు తపస్సు, గురువుకంటెను శ్రేష్ఠమైన దేదియును లేదని ముమ్మాటికి నీకు జెప్పుచున్నాను.

**శ్లో॥ సచ్చిదానంద రూపాయ । వ్యాపినే పరమాత్మనే ।**
**నమశ్శ్రీ గురునాథాయ । ప్రకాశానందమూర్తయే ॥**

తా॥ సచ్చిదానంద స్వరూపుడును, అంతటను వ్యాపించి యుండెడివాడును, ప్రకాశమానమగు సంతోషమే రూపముగా గలవాడును, పరమాత్మ స్వరూపుడును అగు శ్రీ గురునాధునికొరకు నమస్కారములు.

## అనాహతోపాసనా సుస్వరాలు

1. **శ్రీ బాదరాయణ వాసుదేవ రూప నమోఽ స్తుతే ।**
   **సత్యమంగళ నిత్య నిర్గుణ రూప నమోఽ స్తుతే ॥**
2. **దేవాయానంతరూపాయ నిస్సంగ నిర్వికల్పాయ**
   **అఖండ నిర్వి శేషాయ నమోవాకం ప్రశాస్మహే ।**
3. **అద్వైత బోధకాచార్యోఽ నంత శ్రీశ్రీ విభూషిత ।**
   **విష్ణుశంకర రాయోఽ కరోత్ శ్రీ సత్య సుదర్శనం ॥**

శ్రీ మదనంత శ్రీ విభూషిత అద్వయ, నిత్య, శుద్ధ, బుద్ధ, నిస్సంగ పరబ్రహ్మమొకటియే యున్నది. "ఏకోదేవ:" అని శ్వేతాశ్వతరోపనిషత్తు వెలుగెత్తి చాటినది. కాని ఏకమైన దానిని విప్రులు అనేకముగా పేర్కొనిరి. ప్రభిన్నతలో ఏకతా తత్త్వమునే వేదములు వేనోళ్ళ పేర్కొన్నవి. కాని ఇపుడు విశ్వమున లేక భారతమున సాకార నిరాకార భక్తులు ఎంతగా విచ్చలవిడిగా పెరిగినవో అంతగా రాగద్వేషాలు, పరమత అసహనములు హెచ్చు పెరిగినవి. ప్రపంచమున మానవుడు మానవుని ద్వేషించుట పెరిగినది. ఈనాటికిని అంటరానితనము వెంటాడి మనుజుని వేటాడుచున్నది. హైందవమున కూడా వివిధ శాఖలవారు పరస్పరము ద్వేషించుకొనుచున్నారు. పూర్వమే కాదు మతయుద్ధములు, మత కలహాలు ఇప్పుడు కూడా ప్రపంచమును ఉర్లోలకల్లోల మొనర్చుచున్నవి. క్రూర, ఘోర, దారుణ, మారణ హింసాకాండ చెలరేగినది. భగవద్గీత పేర్కొన్నట్లు

**శ్లో॥ "ఏతద్దృష్టిమవష్టభ్య, నష్టాత్మానోఽ ల్పబుద్ధయ:,**
**ప్రభవంత్యుగ్రకర్మాణం, క్షయాయజగతో అహితా:"**

అసుర సంపదతోనున్న సర్వోప్లవకారులు, సర్వాపకర్తలు అగు ఉగ్రకర్ములు (ఉగ్రవాదులు) హెచ్చుపెరిగిరి. వారినే రామాయణమున వాల్మీకి బ్రహ్మరాక్షసులనెను. కాన ప్రపంచమున ఏ మతసౌధమునకైనా శాంతి, అహింసలు, సత్య, ధర్మ, ప్రేమములు పునాదులై ఉన్నవి. ఆధ్యాత్మికంగా ప్రపంచము అభివృద్ధి చెందవలెనన్న ఈ ఐదును క్రమంగా అభివృద్ధికి రావలెను. విశ్వైకమతము స్థాపింపబడవలెను. అన్ని మతములు ఇట్టి ప్రధాన సిద్ధాంతానికి, అనుభూతికి కట్టుపడియుండవలెను. సాకారదైవభక్తునకు సకల మత చిహ్నములు కల "ఏకోదేవ:" అవసరము. కాన హిందీ, సంస్కృత, ఇంగ్లీషు మున్నగు భాషలలో సమగ్ర జ్ఞానము ఉన్న సామాన్య భక్తి, అద్వైతతత్త్వముల మహోపన్యాసము చేయగల గాంధీ, సోక్రటీస్‌ల వంటి ఒక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు, ఆచార్య ప్రాచార్యుడు ప్రపంచమున పుట్టినగాని మన విశ్వమున విశ్వైకమతమును స్థాపించలేము. అపుడుగాని ఏకేశ్వరోపాసన చేయగల్గిన సామర్థ్యము రాదు.

మన భారతదేశమున వేదములు, రామకృష్ణాద్యవతారములు కల్గినవి అని, మన విజ్ఞాన సంస్కృతులు చాలా గొప్పవని మహాకవులు చెప్పినారు.

**శ్లో॥ ఆదికావ్యం బలరె నిచ్చట, వేదశాఖలు వెలసెనిచ్చట।**
**బాదరాయణ పరమఋషులకు, పాదుసుమ్మిది తమ్ముడా॥**

అని భావించిరి. మనది విశ్వతోముఖ వ్యాప్తమైన విజ్ఞానము. ఇది **"సప్తద్వీపా వసుంధరా"** అనునట్లు అఖండ, భూమండలమునకు సంబంధించినది. కాని

**శ్లో॥ "భారతవర్ష జంతువుల భాగ్యములేమని చెప్పవచ్చునీ**
**భారతవర్షమందు హరి పల్మరుపుట్టుచు జంతుకోటికిన్**
**ధీరతతోడ తత్త్వముపదేశము చేయుచు చెల్మి చేయుచున్**
**అరయ బాంధవాకృతి కృతార్థుల చేయుచు నుండు నెంతయున్".**

పండిత ప్రఖాండుడైన భక్తపోతన భారతవర్షమనగా ఇరువది ఐదు రాష్ట్రములతోకూడిన భరతఖండము కాదు, విశాలవిశ్వము మాత్రమేనని ఉట్టంకించెనని

తత్వజ్ఞులు తలంచవలెను. భారతమును గూర్చి తైత్తరీయ వేదశాఖయందు ఇట్లున్నది. "ఓ భరతో రాజా!" అనగా ఈ భారతమును భరతుడు అను రాజు పరిపాలించెను. ఆదిభరతుడు వేద సంహిత, బ్రాహ్మణము, ఉపనిషత్తు భాగముల సంప్రదాయము ననుసరించి నడుచువారు భరతులు అనబడుదురు. వీరి చక్రవర్తి కూడా భరతుడే. ఈయన రాజసూయయాగ మొనరించి ప్రజలను ధర్మముగా, న్యాయశాస్త్ర సమ్మతముగా పరిపాలించెను. కాన మన దేశమునకు భారతదేశము అని పేరు వచ్చినది. "బిభక్తి భూమి మితి భరత:" అని భారతదేశ చక్రవర్తి శకుంతలా - దుష్యంతుల పుత్రుడని ఊహించుట సరికాదనవచ్చును. తత్త్వజ్ఞులు, వృద్ధశ్రవనులు భావించినది ఇది. భారతము అనగా ('భా' అనగా జ్ఞాన ప్రకాశమునందు, 'రతము' అనగా ఆసక్తి కలది.) జ్ఞానస్వరూపమైనది అని భావము. మరియు 'భా' అనగా జ్ఞాన ప్రకాశము, 'రతము' అనగా ఆనందము. ఈ రెండును కలది భారతము అనగా చిదానంద స్వరూపమైనదని భావార్థము.

మంత్రపుష్పములోని 1. విశ్వాక్షం 2. విశ్వశంభువం 3. పతిం విశ్వస్య ఆత్మేశ్వరం అనునవి విశాల విశ్వమును, విశ్వ మానవత్వమును తెల్పుచున్నవి.

**శ్లో॥ యచ్చకించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేఽపివా ।**
**అన్తర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణ స్థిత: ॥**

ఇందులో మనము చూచిన జగత్తు మనము అన్యులచే విన్న జగత్తు దీనియందంతట బహిరంతరములయందు నారాయణుడు వ్యాపించి యున్నాడు అను దీని భావము అశేష ప్రపంచమునే విశదపరచుచున్నది.

పురుష సూక్తములోని "హరి: ఓమ్ సహస్ర శీర్షా పురుష:, సహస్రాక్ష స్సహస్రపాత్ సభూమిం విశ్వతోవృత్వా". ఈ శ్లోకము నిఖిల ప్రపంచమును, విశ్వమానవత్వమును వివరించుచున్నది.

గీతలోని "1. **ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽ ర్జునతిష్ఠతి. 2. సర్వభూతహితే రతాః**" ఇవియు విశ్వమానవ సోదరత్వమును విశదీకరించు చున్నవి. విశ్వమానవులనే భరతులనియు, విశ్వమును భారతము అనియు మన వేదము పేర్కొన్నది.

విశ్వకవి రవీంద్రుడు తన జీవితచరిత్రలో **"యత్రవిశ్వం భవత్యేక నీడం"** అను వేదసూక్తి నుదహరించెను. అనగా సమస్త విశ్వము ఒక గూటి వంటిదని ఆ గూటిలో నుండువారందరు ఏక కుటుంబమువారని ప్రవచించెను.

ఈ భారతమునే తపోభూమి, కర్మభూమి మున్నగు పవిత్ర నామములతో వ్యవహరింతురు. వేదము 1. **"యాని అనవద్యాని కర్మాణితాని సేవితవ్యాని, నేతరాణి"** 2. **"పితృదేవతా పూజాభ్యాం నప్రమదితవ్యం"**.

వీని భావము:-

1. సత్కర్మలను ఆచరించవలెను. దుష్కర్మలకు దూరంగా నుండవలెను. 2. పితరుల, దేవతల పూజల నాచరింపవలెను.

కరణములతో చేయబడినది కర్మ. ఈ కర్మకాండను గూర్చి వేదములలో ఒక భాగమే చెప్పబడినది. ఇది క్రమ ముక్తికి మార్గము, గీతలో **"జ్ఞాన యోగేన, సాంఖ్యానాం, కర్మ యోగేన, యోగినాం"** అని జ్ఞాన, కర్మ మార్గములు రెండును చెప్పబడినవి.

ముక్తినందుటకు ముఖ్యముగా రెండు మార్గములు పెద్దలు పేర్కొనిరి. 1. సామాన్య కర్మమార్గములు - సామాన్య ధర్మమార్గము, సాకార భక్తిమార్గము, క్రమముక్తి మార్గము, పిపీలికా మార్గము, పరంపరాసాధన మార్గము అని ఈ మొదటి దానిని పిలుతురు. ఇది చెప్పబోవు జ్ఞానమార్గము కంటే సులభతరమైనది. సుసాధ్యమైనది. అనాయాసముగా అవలంభింపదగినది.

కర్మములు ఐదు రకములు 1.నిత్య, 2. నైమిత్తిక, 3.కామ్య, 4.నిషిద్ధ, 5.ప్రాయశ్చిత కర్మలు. మనము చేయు పనులలో అబుద్ధిపూర్వకముగ, ప్రమాదజనితముగ పంచసూనములు కల్గును. 1. నీటికుండను మట్టుపై పెట్టుటచేత, 2. పొయ్యిలో

కట్టెపుల్లలు కాల్చుటచేత, 3. కూరగాయలు, పండ్లు మున్నగునవి కత్తిపీట, చాకు మొదలగువానితో కోయుటవలన, 4. తిరుగలితో విసురుటవలన, దంపుటవలన, 5. చీపురుతో ఊడ్చుటవలన, నడచుటవలన చీమ మున్నగు క్రిమికీటకాదులు మనకు తెలియకుండానే చనిపోవును. కాన వీనికి ప్రాయశ్చిత్తముగా మన మహర్షులు ప్రతి దినము 1. పితృ, 2. దేవ, 3. బ్రహ్మ, 4. భూత, 5. అతిథి యజ్ఞములను నిత్యము చేయవలెనని చెప్పినారు.

ఏ వ్యక్తియు ఏదో ఒక పని చేయకుండా ఉండజాలడు. రెప్పపాడు, ఉచ్ఛ్వాస, నిశ్వాసములు తప్పవుగదా ! త్రిగుణములకు లొంగి, నరులాయా పనులు ఆచరించుచుందురు. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియముల నరికట్టిన, మానవుని మనస్సు త్రిలోకము లేలుచుండును. బుద్ధి భూములేలుచుండ, రాతలు రాళ్ళపాలగుట యన ఇదియే. ఇట్టివానిని గీత, మోసగాడనియు, వేషగాడనియు, మిథ్యాచార్యుడనియు తెగడినది. జీవుని కర్మములు మూడు విధములు. సంచిత, ఆగామి, ప్రారబ్ధములు. ఇందు సంచితము అమ్ములపొదిలో నున్న బాణము వంటిది. ఆగామి సంధించిన బాణము వంటిది. ప్రారబ్ధము విడిచిన బాణముతో సమానము. జ్ఞానాగ్నిదగ్ధకర్మ పండితుడైన వానికివి నశించిపోవును.

సత్కర్మపరుడు తాను కర్మ లాచరించుచునే భగవంతుని నిరంతరము ధ్యానించుచుండవలెను, భావించుచుండవలెను. “జప: తద్భావ భావనమ్” శ్రద్ధాశక్తులతో భగవానుని భావన చేయుట భక్తి యందురు. కల్మషచిత్తులకు, పాపద్రవ్యోపజీవులకు, విధిక్రియా విహీనులకు గోవిందసంకీర్తనమే గతియని బహుశ్రుతులు నుడివిరి. భాగవతులకు దయాది, సత్యగుణములు ఉండి తీరవలెను. ఈ భక్తిలో పండినవారికి స్వర్గాది లోకములకేగు ముక్తి కలుగును. వారు చేసుకున్న పుణ్యము క్షీణించగా తిరిగి వారుమర్త్యలోకమున పుట్టుదురు. వీరికి జన్మ పరంపర ఉండును. ఇట్టివారిని కృతోపాస్తులు అందురు. ప్రస్తుత ప్రపంచమున వారి వారి ప్రారబ్ధకర్మలవలన ఇట్టి భక్తులే అధికముగా కానవచ్చుచున్నారు. ఎవరు నాయందు మనస్సుంచి నిత్యమూ

శ్రద్ధాభక్తులతో నన్నుపాసింతురో వారు నా భక్తపరులని గీతయందు కృష్ణుడు పేర్కొనెను. సత్కర్మాచరణము వలన మానసము పావనమై ఉపాసనవలన స్థిరమై సత్వ, గుణస్థాపితమగును. ఇది జ్ఞానమార్గమునకు దోహదకారి యగును. వేదములలో కర్మకాండలో సంహితాభాగముల సాకారభక్తియు, బ్రాహ్మణముల ఉపాసనయు, ఉ పనిషత్తులందు కేవల జ్ఞానమును బోధింపబడినవి. కొందరు జ్ఞానకాండకు, కర్మకాండకు పరస్పరము చుక్కెదురు అని వైరుధ్యము కలదని నుడువగా, కొందరు ఈ కర్మకాండ జ్ఞానకాండకు దోహదకారి అని నుడువుదురు. ఈ జ్ఞానమార్గమునే సాక్షాత్సాధన, శాశ్వతధర్మ, విహంగ, సధ్యోముక్తిమార్గము లనియు పిలుతురు. గీతలో వేదాదులయందు లేని రత్నములవంటి నూత్న పదములు చెప్పబడినవి. అవి 1. వికర్మ, 2. స్థితప్రజ్ఞుడు, 3. కార్పణ్యదోషోప హతస్వభావుడు, 4. ఆరంభ సమారంభములు మున్నగునవి. గీతయందంతటను పార్థుని యుద్ధమునకు ప్రేరేపించుటకై పార్థసారథి “తస్మాదుత్తిష్ఠ కౌంతేయ, యుద్ధాయ కృతనిశ్చయః” అని నిష్కామ కర్మ లేక అనాసక్తి యోగమునే బోధించినాడు. మరియు ఓ కౌంతేయా! నీవు ముక్తిసంగుడవై కర్మ నాచరింపుమని చెప్పెను. తానే లోక సంగ్రహముకొరకై తక్కెడ ఒకపరి నొకదానిని తీసుకుని లోకకళ్యాణమునకై చేయుపనిని ఒక సిబ్బిలోను, కేవల జ్ఞానమును ఒక సిబ్బిలోను వేసి తూచి, సిబ్బి పరోపకృతి వంకకు మొగ్గగా దశావతారములెత్తి ధర్మరక్షణ, దుష్టశిక్షణ, ధర్మపరిపాలన చేసెను. లోక సంగ్రహము చేయు అధికారిక పురుషులు జన్మమెత్తినను, ఎత్తకున్నను ఒకటే. వారు కామము, కర్మ (కామ్యకర్మ), అవిద్యలకు గురికాకుండా లోకమునకు కళ్యాణము చేయుచు, తత్వమును బోధింతురు.

కృష్ణుడేకాదు కృష్ణునకు పరమభక్తుడైన ప్రహ్లాదుడు (సదానందుడు) దేవుడు ప్రత్యక్షమై కావల్సిన వరములు కోరుకొమ్మనగా మా నాన్నను సర్వనాశనము చేసినది గాన నాకు సామ్రాజ్యము అక్కరలేదు. స్వర్గము అంతకంటెను వలదు. పునర్జన్మ రాహిత్యమైన ముక్తియు కోరను. తినుటకు తిండి, ఉండవాసము లేక బండబారిన గుండెలతో వలవల విలపించు దుఃఖితుల దుఃఖమును పోకార్చుటకై నాకు ఆయురారోగ్యములు ఇమ్మని భక్తితో భగవంతుని ప్రార్థించును.

**శ్లో॥ అహం నకామయే రాజ్యం, నస్వర్గం నాపునర్భవం।**
**కామయే దు:ఖతప్తానాం, ప్రాణినామార్తినాశనమ్ ॥**

సాకారభక్తిలో మనస్సు ఏకాగ్రతనొందును. జ్ఞానస్థితిలో మనోనాశనము, వాసనాక్షయము, నిర్వికల్పము, నిర్గుణత్వము సంభవించును. గీతయు నిస్సంగుడై లోక కళ్యాణముకొఱకు కర్మలను చేయవలెనని చెప్పినది. ఈ కర్మఫలము కోరక కర్మలను చేయుచు, జనకాంబరీషాదులు, సిద్ధిని పొందిరని చెప్పబడెను.

ఏ కర్మఫలాభిసంధి (సంగము) తాదాత్మ్యము లేనిదో కర్తృత్వ, భోక్తృత్వ రహితమైనదో, నిరహంకారమైనదో ఆకర్మనే నిష్కామకర్మ యందురు. కామ్యకర్మ జడమగును గాని ఈ అనాసక్తి యోగముతో చేయబడిన కర్మ చైతన్యవంతమై జ్ఞానమే యగును. కర్మఫలత్యాగియే త్యాగియని, యోగియని, జ్ఞానియని గీత ఘంటాపథముగా చెప్పినది.

గీతలో "కర్మనోహ్యాపి బోద్ధవ్యం, బోద్ధవ్యంచ వికర్మణ:, అకర్మణశ్చ బోద్ధవ్యం, గహనాకర్మణక్షగతి:" గీత ఒక్కచోటనే వికర్మయను వినూత్న ప్రయోగము చేసినది. "విగతం కర్మతత్వం (కామ్యకర్మత్వం) యశ్మిన్ తత్ వికర్మ" ఇంతకు వికర్మ యనగా నిష్కామ కర్మతో స్వరూపస్థితి యందు ఉండుటయే. నియతమై, ముక్తసంగమై, రాగద్వేషరహితమై, ఫలాకాంక్షా శూన్యమైనట్టిది సాత్విక కర్మ. ఈ సాత్విక కర్మ వలన ప్రజ్ఞానోదయము అగును. దీనిని గూర్చి ఆదిశంకరులు తన భాష్యమున ఇట్లు ప్రవచించిరి. "కామ్యవర్జితమ్ నిత్యమ్, కర్మజాతమ్, సర్వమ్", ఆత్మజ్ఞానోత్పత్తి ద్వారేణ మోక్షసాధనత్వమ్ ప్రతిపద్యతే ఏవమ్ కర్మకాండేనాస్య ఏకవాక్యతా వగతి:" రజోతమోగుణములణగి సత్వగుణము ప్రబలమైనప్పుడు మనమాచరించు నిష్కామకర్మ ఆత్మజ్ఞానమును అభివృద్ధి చేసి ముక్తిని కల్గించును.

**శ్లో॥ ప్రజాహాతి యదా కామాన్సర్వాన్పార్థ: మనోగతాన్,**
**ఆత్మన్యేవాత్మనా తుష్ట: స్థితప్రజ్ఞస్త దోచ్యతే ॥"**

విష, విషము, విషయ భోగాలను, సంకల్ప వికల్పాలను అరిషడ్వర్గమును పూర్తిగా త్యజించి పూర్వానుభవములగు వాసనలను వీడి శ్రవణమననాదులజేసి చక్కగా ఆత్మతత్వమును గ్రహించిన ముముక్షువు నిర్వికల్పసమాధి యందుండవలెను. నిత్యకూటస్థాసంగచిద్రూపమునై నేత్రమునకు రూపమువలెనే సర్వత్ర అనుభవమునకు వచ్చునట్టి ఆనందైకరసమగు తన స్వరూపమునందే, క్రీడించవలెను. ఘటసరావాదులన చూడక మృత్తికనే సర్వత్ర చూచునట్లు ప్రాణ - ఇంద్రియాదులను గమనింపక ఆత్మయందే రమించు స్థిత ప్రజ్ఞత్వ లక్షణములు ఏర్పరచుకొనవలెను.

**"యోగారూఢస్యతస్వై, శమః కారణముచ్యతే"**

కర్మసన్యాసము కంటే నిష్కామకర్మయోగమే విశిష్టమైనది. కర్మఫలాపేక్ష లేక వికర్మ నాచరణలో పెట్టువాడే సన్న్యాసియు, యోగియునగును. పెద్దలు సన్న్యాసమని చెప్పినదే నిష్కామ - కర్మానుష్ఠానయోగము. ధ్యానయోగము బొందగోరు మునికి వికర్మ ధ్యానలాభ - కారణముగ చెప్పబడుచున్నది.

సాధకుని సాధనలు - (ఆహారశుద్ధౌ సత్వశుద్ధిః). సాధకుడు భావ సంశుద్ధి కలుగవలెనన్న ఆయుస్సత్వ బాలారోగ్య సుఖప్రీతి వర్ధనములు, రస్య, స్నిగ్ధహృద్యాదులగు సాత్విక పదార్ధములనే భుజింపవలెను. ప్రాణాయామము చేయుచు, యోగాసనాదుల నభ్యసించుచు, చిత్తమునకు పవిత్రతను స్థిరత్వమును సాధింపవలెను. సంకల్ప వికల్పములకు మధ్య ప్రతివ్యక్తి మనస్సు కొంచెముసేపు సంకల్పరహితముగా నుండును. ఈ క్షణములు సంకల్పరహిత క్షణములు. బ్రహ్మానుభవమును సంపాదింపగోరువాడు ఈ క్షణములను అనుక్షణము పెంచుకొనుచు వచ్చుచూ వృత్తిరహితుడు కావలెను. అభ్యాసబలం వలన సంకల్పము నష్టముకాగా నూతన సంకల్పము పుట్టకపోగా కలుగుస్థితినే తత్త్వజ్ఞులు నిర్వికల్ప సమాధియందురు.

**శ్లో॥ ద్విత్రిక్షణక్షరనుక్షణం, వికల్పస్య నిరోధనం ।**
**క్రమాదభ్యస్యతా యత్నాత్, బ్రహనుభవ కాంక్షిభిః ॥**

ఇట్లు నిత్యాభ్యాసము, వైరాగ్యము, తత్వవిచారణ చేయుచు మానవులు జ్ఞానులై విదేహముక్తిని పొంది తరింతురు గాక.

గ్రంథ విస్తరభీతిచే ఈ సుస్వరాల నధిగమించి హృదయగ్రంథిని విడదీయు ఈ గురుగ్రంథమును గూర్చి అలతి పదములతో ప్రస్తావింతును. ఈ గ్రంథ రచయిత విశ్వప్రేమైకజీవులు. జగదేక కుటుంబులు. నిర్వ్యాజ ప్రేమను గూర్చి "Hency Van Doycan" అను సుకవి "Love is not getting, buty giving; not a wild dream of pleasure and a madness of desire. Oh, no, Love is not that. It is goodness and peace and pure living. Yes, love is that, and it is the best thing in the world and the thing that lives longest" అని చెప్పెను. దీనికి సముచిత ఉదాహరణము వీరి జీవితము. వీరిది బ్రహ్మానుభూతి, బ్రహ్మానుసంధానము, బ్రహ్మప్రేమ.

ఈ వ్యాసమాల వీరి మౌన వ్యాఖ్య, మన: ప్రసాదసౌమ్యత్వ, భావ సంశుద్ధుల ఫలము, అంతర్వాణి ప్రేరణ, అలౌకిక స్మృతి. భ్రమ, ప్రమ, ప్రమాద మాయాజాలములకు లోనుగాని భూమ సంస్థితి వీరిది. వీరి ప్రభోద, ప్రవచనోపన్యాసములలో విషయసమగ్రతయే ఉండును గాని కథాకథనపద్ధతి చోటుచేసికొనదు. పండితశబ్ద వాచ్యుడనగు నేను మందమధ్యమాధికారులకు సులభతరముగా అవగాహనమగుటకై వేదాంత విషయలములను కథలతో జోడించుడని ప్రోత్సహింపగా వీరు ఈ వ్యాసమాలలో కొన్నిటియందు కథలతోపాటు ప్రజ్ఞానాంశములను చేర్చిరి.

శ్రమించి, అనుభవించి అద్వైతపరమగు గాయత్రీమంత్ర సాయన భాష్యమును జీర్ణించుకుని ప్రాణాయామ యోగాసనాది, జ్ఞానాష్టాంగములను ఆచరణలోపెట్టి అధర్వణ వేదోక్తమైన **"ఓం పరోరజసే సావదోం"** అను నాల్గవ పాదమును కూడా చేర్చి, గాయత్రీమంత్రరతులై ఉండుటచే దీనిలో గాయత్రీ మంత్ర వ్యాఖ్యాన వ్యాసమును కూడా చేర్చిరి. ఈ మాలలోని ప్రత్యేకత, విశిష్టత ఇది.

ఆదిశంకరుల ఋణమీగుటకు, ప్రణవాశ్రమ పీఠాధిపతియు, కులపతియు అగు ప్రణవానంద స్వామి శంకరా ! నేను చేయు ఈ బోధను నిరపేక్షముగా జాతి, కుల, మత, వర్గ, వర్ణ విభేదరహితముగా, ఈశ్వరునిచే ఈ ప్రపంచమున పంచభూతాలు, ప్రపంచింపబడినట్లు అద్వైతామృతమును లింగభేదరహితముగ జనతకు బోధింపుమని ఆదేశించిరి. వారి సందేశా నుసారము వారి ఋణవిముక్తికి వీరు జరాభారముతో నవసియున్న ఈ ముదిమిలో ఈ మాలాత్రయమును రచించి జిజ్ఞాసువులకొసంగిరి. ఈ గ్రంథస్త విషయమును చదివి ఆచరణలో పెట్టినవారి హృదయగత సూక్ష్మాతి సూక్ష్మ మాలిన్యములను ఇది తొలగించును. వివిధ విపరీత భావనలను సర్వసంశయములను పోకార్చును. కామ్యకర్మవర్గమును నశింపచేయును. బ్రహ్మసాక్షాత్కారమును కల్గించి, బ్రహ్మానుభూతి ననుభవింపచేయును. కాన జిజ్ఞాసుసాధక లోకము దీనిని చదివి తరింతురుగాక !

**శ్లో॥ ఆదిమధ్యాంత రమితుడై అలరునట్టి,**
**బ్రహ్మమందున లోకాలు పరిఢవిల్లు,**
**రమ్యరవి సప్తకిరణాల రక్తిమమున,**
**ఈ ప్రపంచములన్ని రంజిల్లునట్లు ॥**

ఇట్లు
మీ
విద్వాన్, విద్యాసద్మ, వైద్యమిత్ర, కవిమిత్ర,
**సుంకర శివరామకృష్ణయ్య చౌదరి.**

# ప్రస్తావన

జిజ్ఞాస వినా జ్ఞానములేదు. దు:ఖము వినా సుఖము లేదు. కామరూపశత్రువు నిరంతరము మన హృదయమందే నివసించుచున్నాడు. ఈ శత్రువుతో అఖండమైన యుద్ధము చేయవలసిందే. సదసత్తుల మ్మిశమముచే మానవుడు జన్మించి యుండుటచే. ఈ యుద్ధము నిరంతరము జరుగవలసినదే. సమాజమందు సురలు - అసురులు అను రెండు భూతవర్గములున్నవి. ఈ రెంటియొక్క వృత్తులు పరస్పరము విరుద్ధములు. ఈ రెండిటి మధ్యను వేలకొలది సంవత్సరముల నుండి యుద్ధము జరుగుచునే వచ్చుచున్నది. ఈ లోకమందుగాని, పరలోకమందుగాని ప్రకృతినుండి విముక్తమైనట్టి సత్త్వమొక్కటిగూడ లేదని గీత చెప్పుచున్నది.

**శ్లో॥ న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పున:।**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిస్స్యాత్త్రిభిర్గుణై: ॥** భ.గీ.అ.18.శ్లో.40

అసురగుణములను దైవీగుణములు ధిక్కరించుటయే స్థిత ప్రజ్ఞత్వ లక్షణముగా గీత చెప్పియున్నది. అట్టివాడే జ్ఞాని, యోగి, దైవీగుణముల సంపూర్ణ ప్రతినిధి - సంపూర్ణావతారము. కాన శుద్ధములో విశుద్ధమై ఆధ్యాత్మిక సాధనలచేతనే, ఆధ్యాత్మిక వృత్తుల చేతనే (సత్యము, అహింస, అభయము) పోరాడవలయును. ఆచరణయందు తరచు నిష్ఫలత కలుగుచుండును. ఈ నిష్ఫలతలయందే సఫలతయొక్క అభ్యుదయ కిరణములయొక్క ప్రకాశము కానుపించుచుండును. గీతలో, భౌతిక యుద్ధము నిమిత్తమయి ప్రతిమానవుని హృదయాంతరమందు నిరంతరము జరుగు ద్వందయుద్ధము యొక్క వర్ణనమే యున్నది. అవతారమనగా శరీరధారికి పురుషవేషము. ప్రతి జీవియు ఈశ్వరునియొక్క అవతారమే. కాని లౌకికభాషయందు జీవులనన్నిటిని మనము అవతారముగ చెప్పుట లేదు. ఏ పురుషుడు తనయుగమందు అందఱికంటె

శ్రేష్ఠుడయి ధర్మమూర్తి యయి యుండునో వానిచే భవిష్యత్ప్రజలు అవతారరూపునిగా పూజింతురు, "జీవుడు దేవుడు కాడు, గాని ఈశ్వరతేజమునుండి భిన్నుడు కాడు" మనుష్యునకు ఈశ్వరరూపము కలుగనిదే సుఖము కలుగుట లేదు, శాంతి లభించుట లేదు. ఈశ్వరరూపమును పొందుటకు చేయు ప్రయత్నము యొక్క నామమే సత్యము. మఱి ఏకమాత్ర పురుషార్థము. ఇదియే ఆత్మదర్శనము. యీ ఆత్మదర్శనమే సకల వేదాంత గ్రంథములయొక్క విషయమైయున్నది. **"మమైవాంశో జీవ లోకేజీవభూత స్సనాతన:"** అని గీతకూడ చెప్పుచున్నది. ఆత్మార్థులకు ఆత్మదర్శనము చేయించుటకై గీత కర్మఫలత్యాగమను యద్వితీయోపాయమును సూచించుచున్నది. భక్తి, జ్ఞానము ఇత్యాదులు చంద్రుని తారామండలమట్లు దానిచుట్టు పరివేష్ఠితములై యున్నవి. దేహమున్న చోట కర్మ యుండనేయున్నది. దానినుండి ఎవడును తప్పించుకొనజాలడు. అయినప్పటికీ దేహము ప్రభు మందిరముగ నొనర్చి దానిద్వారా మోక్షమును బొందవచ్చునని సకల ధర్మములు ప్రతిపాదన చేయుచున్నవి. **"దేహోదేవాలయ: ప్రోక్తో జీవో దేవ: సదాశివ:"** శరీరమే దేవాలయము. జీవుడే సదాశివుడగు దేవుడు అని శ్రుతికూడ చెప్పుచున్నది. కాని నిష్కామత, కర్మఫలత్యాగము చెప్పినంత మాత్రముననే లభించుట లేదు. ఇది కేవలము బుద్ధియొక్క ప్రయోగము కాదు. ఇది హృదయమథనము వలననే ఉత్పన్నమగుచున్నది. యీ త్యాగశక్తిని ఉత్పన్నము చేయుటకై జ్ఞానము కావలయును. ఒక విధమైన జ్ఞానము పెక్కుమంది పండితులు పొందుచున్నారు. వేదాదులు వారికి కంఠస్థమైయుండును. కాని వారిలో చాలామంది భోగాదులందు లంపటులై మెలంగుచున్నారు. జ్ఞానాతిరేకమయిన శుష్కపాండిత్యము కలుగరాదు. జ్ఞానములో భక్తిని మేళనము చేయ వలయును. భక్తి విహీనమగు జ్ఞానము వ్యర్థము. భక్తి బాహ్యాచరణ కాదు. అంధ శ్రద్ధకాదు, ప్రకృతి ద్వంద్వముల నతిక్రమించి సమముగా నుండుటయే భక్తి లక్షణము. **"మయ్యర్పిత బుద్ధిర్యోమద్భక్తస్సమేప్రియ:"** అనగా తన మనోబుద్ధులను నా కర్పించివేసిన ఏ భక్తవర్యుడు గలడో, అతడు నాకు ప్రియుడు అని గీత చెప్పుచున్నది. జ్ఞానము పొందుట భక్తుడగుటయే. అదియే ఆత్మ దర్శనము.

**శ్లో॥ భక్త్యా మా మభిజానాతి యావన్యశ్చాస్మి తత్త్వత:**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వావిశతే తదనన్తరమ్ ॥** భ.గీ.అ.18.శ్లో.55

భావము:- ఈ పరభక్తి చేత నేను (స్వరూపత:) ఎట్టివాడనో, మఱియు (శక్తిత:) ఎంతటివాడనో భక్తుడెఱుంగును. మఱియు నాసత్తయొక్క సత్యత యందును, తత్త్వములందును భక్తుడు నన్నెఱుంగును. ఇట్లు సమగ్రముగా నెఱింగి, అతడు వెనువెంటనే నాలో ప్రవేశించును.

ప్రతి కర్మయు బంధన రూపముగ నున్నదనుట నిర్వివాదాంశము. దీనిని గీత యిట్లు చెప్పుచున్నది. ఫలాసక్తిని విడువుము. కర్మచేయుము, నిరాశివికమ్ము, కర్మ చేయుము. నిష్కాముడవై కర్మ చేయుము. ఫలత్యాగము అనగా ఫలము యొక్క విషయమై ఆసక్తి యొక్క ఆభావము. సత్యము విచారించిన ఫల త్యాగికి వేయిరెట్లు ఫలము సిద్ధించుచున్నది.

ధర్మము, అర్థము పరస్పర విరోధముగల వస్తువులని సామాన్యులు అందురు. లౌకిక వ్యవహారములందు ధర్మము సురక్షితము కాదు. ధర్మము యొక్క ఉపయోగము కేవలము మోక్షము కొఱకే యందురు. ఏ ధర్మము వ్యవహారమునందు వ్యవహరింప శక్యము కాదో ఆ ధర్మము ధర్మము కాదని గీత సూచించుచున్నది. పరిణామము నిశ్చయించకయే సాధనయందు తన్మయుడైయుండునో వాడే ఫలత్యాగి. ఫలాసక్తిలేనిదే మానవుడు. అసత్యము పల్కుటకు లాలసుడు కాడు. హింస చేయుటకు పూనడు. కాన ఫలాసక్తిని వీడిన వాడు సత్యమును అహింసను పాలించవలసి వచ్చుచున్నది. ఒకరికి నిషిద్ధము, మరియొకరికి విహితముకావచ్చును. ఒక కాలమందు లేక ఒక దేశమందు విహితమైనదే మరియొక కాలమందు దేశమందు నిషిద్ధము కావచ్చును. నిషిద్ధము మాత్రము ఫలాసక్తి విహితమైనది అనాసక్తి. ఒక వైపున ఉపనిషత్తుల, మఱియొకవైపున బ్రహ్మ సూత్రాహారమందే గీతాపుష్పము సయితము కూర్చబడి యుండుట సంభవించినది. ఈ గ్రంథ నిర్మాతలలో ఒకరు ఋషి (ఉపనిషత్తులు)

ఒకరు కవి (బ్రహ్మసూత్రములు) మరొకరు శాస్త్రి (గీత). ఈ ముప్వురు ఒకే దండలోనున్న పుష్పములభాతి ప్రకాశించుచున్నాడు.

బంధమోక్షముల రహస్యమును తెలుపుచు భగవద్గీత చూచించినట్లు ఆసురవృత్తుల సడలించి దైవీవృత్తుల నభివృద్ధి చేయుటయే. సాధకుని కర్తవ్యమని తలంచి, భగవచ్చింతనారూప శంకరాద్వైత వ్యాసమాల - 3 రచించుట సాధకుడనగు నాకు విద్యుక్త ధర్మమని రచనకు గడంగితిని. సమస్త వేదముల సారము గ్రహించి అద్వైత మార్గదర్శియైన జగద్గురు శ్రీ శంకరభగవత్పాదులవారు, బ్రహ్మభావనానిది ధ్యానమునకై తమ లఘువాక్య వృత్తియందు **"తచ్చిన్తనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనమ్, ఏతదేక పరత్వఞ్చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః"** అని నొక్కి వక్కాణించిరి. ఇతః పూర్వము నేను రచించిన శంకరాద్వైత వ్యాసమాల - 1 మరియు శంకరాద్వైత వ్యాసమాల - 2 గ్రంథములను పఠించిన సహృదయుల, రసగ్రాహుల ప్రేమాశీర్వచనముల ప్రేరణయు కారణమై నాకు తతోధిక శక్తి నొసంగి గ్రంథ రచనకు హేతుభూతమైనదని వినయ విధేయతా పూర్వకముగా నమ్రతతో మనవి చేసుకొనుచున్నాను. ఈ గ్రంథమునందు ప్రాథమికులకు కూడ సులభ గ్రాహ్యమగుటకు ఆధ్యాత్మికానుభూతులను కథారూపముగా వెల్లడించుటకు ప్రయత్నించితిని. గుణ గ్రహణైకపారీణులగు విజ్ఞులు యీ విషయమును గమనింతురని విశ్వసిస్తున్నాను. దొసగులు పొసగిన అవి నావియనియు గుణములు మహర్షులవనియు విజ్ఞాపన చేసుకొనుచు విరమిస్తున్నాను.

**యద్ యద్ కర్మ కరోమి తత్తదఖిలం స్వామిన్ తవారాధనమ్ ॥**

ఇట్లు,
యోగి పాదరేణువు,
**త్రిపురనేని విష్ణుశంకరరావు**

# నివేదనము

ప్రపంచము లోని సకల జీవరాశులలోను మానవజన్మ చాల ఉత్కృష్టమయిన దనేది అభిప్రాయభేదము లేని మాట. కారణము మానవునికి ఇతర జీవరాశులకు లేని జ్ఞానము వుండుటమే. ఈ జ్ఞానముయొక్క ఊతతో మానవుడు మంచి చెడులను గ్రహించి తన వివేకముతో మంచి మార్గమున పయనించి తన జీవితమును ఆనందమయము చేసుకొనుటయే గాక తన కుటుంబమును, తన పరిసరములను కూడ ఆనందమయము చేసి లోక కళ్యాణమునకు దోహదపడును.

వ్యక్తి మంచిమార్గమున పయనించవలెనంటే సజ్జన సాంగత్యము, సద్గోష్టి, సద్గంథ పఠనము చాల అవసరము. అంతేకాదు సద్గురువు ఆవశ్యకత ఎంతయినా కలదు. నేటి ప్రపంచము భౌతిక భోగములతో పూర్తిగా జడమయిపోయినది. ధర్మనిష్ఠ నశించినది. మానవునిలో మానవత్వం లోపించినది. మానవుడు మహా మానవుడుగా రూపొందుటకు మారుగా దానవుడుగా మారుచున్నాడు. స్వార్థం పెచ్చుపెరిగి, చేయరాని దుష్కార్యములను చేయుచున్నాడు. ప్రపంచ పరిస్థితులు ఇంత అధ్వాన్నం కావటానికి కారణం ప్రజలలో ఆధ్యాత్మిక చింతన లేకపోవుటయే అని చెప్పక తప్పదు. అందువలన నైతిక విలువలు పతనమయిపోయి జీవన విధానము ఉన్నతికి పోవుటకు బదులు అధోగతికి దిగజారుచున్నది.

మన పవిత్ర భారతదేశము ఆర్షధర్మమునకు ఆకరము, విజ్ఞానధనులకు, సచ్చిదానంద స్వరూపులకు, బ్రహ్మవిద్యాధురంధరులకు, ఆత్మజ్ఞాన సంపన్నులకు ఆలవాలము. అట్టివారిలో గౌతమబుద్ధుడు, ఆదిశంకరులు, రామానుజులు, మధ్వాచార్యులు, రామకృష్ణ పరమహంస, వివేకానందులు, శ్రీ అరవిందులు, రమణమహర్షి వంటి మహామహిమాన్వితులెందరో ? వారందరు ప్రాచ్యఖండపు దివ్వెలు. ఐహిక భావనలతో భ్రమించు పాశ్చాత్య దేశములకు ఆముష్మిక ఆరామములను అందించిన

అమేయ ఆత్మజ్ఞాన సంపన్నులు. వారిలో ముఖ్యంగా శంకర భగవత్పాదులు ఆసేతు హిమాచలము వరకు ప్రయాణము చేసి ప్రచారము చేసిన అద్వైత సిద్ధాంతము అనన్య సామాన్యము. అట్టి అపురూప విజ్ఞానము భవబంధములనుండి విముక్తి నొందుటకు, అజ్ఞాన తిమిరము నుండి విజ్ఞానపు వెలుగుదెస పయనించుటకు, మానవ జీవితము ఆనందమయ మగుటకు, మానవులంతా ఒక్కటే, శరీరములు మాత్రమే వేరుగాని ఆత్మలన్నీ ఒక్కటే అదే సత్యము, అదే నిత్యము, అదే చైతన్యము, అదే పరమాత్మ అని నిరూపించుటకు ఏర్పడిన సిద్ధాంతము. అంతకు మించిన మహిమాన్విత మయూఖమును మరి యొకటి లేదు.

అట్టి అపురూప, మహత్తర సిద్ధాంతమును ఆంధ్రదేశములో ఆశ్రమములను స్థాపించి బోధించిన, ప్రచారము చేసిన సద్గురువులెందరో కలరు. అట్టివారిలో బ్రహ్మవిద్యాపారంగతులు, ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులు, సాధుపుంగవులు అయినవారిలో బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వామివారు (ప్రణవాశ్రమము, గుడివాడ) ప్రసిద్ధులు. వారి శిష్యులలో యీ గ్రంథకర్త శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావుగారు ప్రముఖులు. జిజ్ఞాసువుగా గురువుగారి దివ్య బోధనా మకరందమును గ్రోలి భక్తి, జ్ఞాన, వైరాగ్య, శాంతి, దయాది సద్గుణములను ప్రోదిచేసకొని తాను దివ్య జీవనము జీవించుటయే గాక, ప్రసంగముల ద్వారా, రచనల మూలమున గోష్ఠులవలనను, తన విజ్ఞానమును ప్రపంచమునకు కూడా వెదజల్ల వలెననే సదుద్దేశముతో తన జ్ఞానజ్యోతిని గ్రంథ ప్రసరింప సమకట్టి శంకరాద్వైత వ్యాసమాలలను రెంటిని యిప్పటికే వేదాంత సరస్వతీ గళమున నలంకరించియున్నారు. ఇది మూడవ మాల.

ఈ మాలలో ఆశ్రమము - ఆచరణ, సర్వజిత్తు, గురు ఆవశ్యకత, యమద్వయము, గృహస్థుడును తరించవచ్చును, మానవజన్మ ప్రాశస్త్యము, ఈశ్వరసృష్టి - జీవసృష్టి సన్మతిచే సద్గతి - దుర్మతిచే దుర్గతి, గ్రుడ్డి అనుకరణ, అహంకారము, ప్రమాత, చిదాత్మ - గౌణాత్మ - భిన్న మతములు, లయ చింతన, అవస్థాత్రయము ఏకాత్మ ప్రత్యయసారం. మిధ్యాచారము, గురు పాదుకా పూజ - దాని విశిష్టత, పరమార్థదర్శి,

జ్ఞానాజ్ఞానఫలములు, గాయత్రీ మంత్రము, గురు తత్త్వము - గురుగీత, ప్రాతఃస్మరణీయములు" వంటి శీర్షికలతో కథలరూపములో గహనాతిగహనమయిన వేదాంతసారమును సామాన్యునికి కూడా అర్థమయ్యే రీతిలలో రచించటం ముదావహము. సాధారణముగా వేదాంత గ్రంథములు సామాన్యునికి అర్థం కావు. వేదాంతము అందించినది ఆధ్యాత్మిక సంపద. ఆ సంపదను పొందిన వారు ఎంతమంది ఆనందము అనుభవిస్తున్నారు అని ప్రశ్నించుకుంటే సమాధానమునకు ఆలోచించవలసి వస్తుంది. కారణము చాలామంది వేదాంతులు ఆధ్యాత్మిక విద్యను గురువుద్వారా శ్రవణము చేయటమే తప్ప దాని పరమార్థమును ఆచరణలో పెట్టువారు బహుస్వల్పము అని అంటే అసత్యము ఏమాత్రము కాదు. వేదాంతము చదువుటకంటె మిక్కిలి ఆచరించదగినది. అప్పుడే దాని ప్రయోజనం. సత్యము, అహింస, ప్రేమ, కరుణలను ప్రతిజీవి ఆచరణలో కొంతవరకయినా చూపుచూ అరిషడ్వర్గములను సాధ్యమయినంత వరకు జయించి జీవితమును నిరాడంబరముగా, నిశ్చల మనస్కతతో గడుపుటయే వేదాంతమును ఆచరించుట. ఆశ్రమములలో గొప్పదనము లేదు. ఆచరణలోనే గొప్పదన మున్నదంటూ ఎన్నో వేదాంత సూక్తులను వుట్టంకిస్తూ, ఎంతో లోతయిన విషయాలను యింత సులభశైలిలో చెప్పి పాఠకులకు అమందానందమును, ఆధ్యాత్మికత పట్ల ఆసక్తిని యీ "శంకరాద్వైత వ్యాసమాల-3" ద్వారా కలిగించిన పెద్దలు, పూజ్యులు శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావు గారు అభినందనీయులు. ఈ గ్రంథమును ఆర్షవిద్యా సంపన్నులే గాక సామాన్య జిజ్ఞాసువులు కూడా సమాదరించగలరని నా విశ్వాసము.

ఇట్లు

**వేగుంట కనకరామబ్రహ్మం**

గుడివాడ.
13-02-1991

HIS HOLINESS JAGADGURU
**SACHIDANANDA SARASWATI BHARATI**
DANDIN SWAMY PEETHADHIPATI MAHADEV MUTH
Domuh Ki Bavdi RATLAM, (M.P.), 457001.

18-02-1991

త్రిపురనేని విష్ణుశంకరరావుగార్కి నారాయణస్మరణలు. మీ శంకరాద్వైత వ్యాసమాల పుస్తకములు అందినవి.

1) శ్రీ ప్రణవానందస్వాములవార్ని, బ్రహ్మానందరెడ్డిగార్ని ఒక వ్యక్తులుగా గాకుండా, కృష్ణాజిల్లా, గుడివాడ కేంద్రముగా, ఆధ్యాత్మిక పునర్ నిర్మాణకేంద్రముగా గుర్తించుట అవుసరము. ఒకరి ఆత్మజ్ఞానము, మరి ఒకరి సంపన్న అర్వ్రతబలము చాలాకాలము జిల్లా అంతా, చుట్టుపట్ల జిల్లాలంతా జాగృతికి తెచ్చినవి.

2) ఆదిశంకరులు 8వ శతాబ్దములో తెచ్చిన సంఘ సంస్కరణలను, 12, 13వ శతాబ్దములో బ్రాహ్మణ సంహిత బ్రాహ్మణులు దానికి జోడించి తెచ్చిన మార్పులవల్ల వర్ణవ్యవస్థలో చాలా విపరీత బేధములు ఏర్పడి, సాంఘిక, ఆర్థిక, నైతిక ఆచరణలో అహంకారము బలపడినది. దేశ ఐక్యతకు బదులు, దేశ అనైక్యతే పెరిగి, విదేశీయులచేత ముసిలిములు, పాశ్చాత్యులచేత దేశము వెయ్యి సంవత్సరముల పాటు దేశీయులను బానిసలుగా చేసి పరిపాలించ గలిగినది.

3) ఆదిశంకరుల వారు ఆధ్యాత్మిక గురువు, కవి, భక్తి, యోగి, మానసికాగోచరుడు, మతసంస్కర్త. ఆయన వ్యక్తిత్వాన్ని గుర్తించితే, i) శాస్త్రవాదములలో అన్ని వాదాలను ఓడించి అద్వైతవాదాన్ని, ii) రాజనీతిలో దిగ్విజయయాత్ర సుధన్మ చక్రవర్తితో కలసి సాగించి దేశమంతా గట్టి భుజబలముతో దేశ సంరక్షణ విధానమును చూపారు. iii) వ్యక్తిగా, సమష్టిగా జీవిత విధానము ఆర్థికముగా, నైతికముగా, సాంఘికముగా ఎట్లా నిర్వరించు కొనవలెనో ఆదర్శములను చూపేరు. iv) గుర్తించితే చైతన్యము ఒకటే, జడము నుండి విడివడి పరమాత్మ స్వరూపజ్ఞానమును పొందునని చూపేరు.

4) ఈ ప్రక్రియను వదలి, ఆత్మ బోధను ప్రత్యేకముగా సమాజమునకు ప్రచారము చేయుట వ్యర్థము. సమాజమునకు, భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునకు బోధించిన కర్మ విధానము మొదట అవసరము. వివేకానందుడు దీనిలోని కృత్రిమ సంస్థలను, బోధలను చాలవరకు నిరసించి, మానవ సాధ్యమయ్యే ఆర్థిక విధానముతో, నైతిక విధానముతో, సంఘసేవ చేసి భారతమాత సేవలో ఆత్మసాక్షాత్కారమును పొందుటకు మార్గము చూపినారు. మతాలు త్రిశంకు స్వర్గములుగా వూగుతున్నాయి.

5) ఈ పైన ఆవేదన గుర్తించి ప్రణవాశ్రమము కేంద్రముగా, కృష్ణాజిల్లా అంతటా, అన్నిరకాల ఆధ్యాత్మిక సాంప్రదాయములతో సమష్టిగా ఒక నిర్ణీత కార్యక్రమమును పొందుపరచి, నిర్భయము, నిస్సంకోచముగా, బ్రాహ్మణ, అబ్రాహ్మణ అనే మానసిక బలహీనతలు వ్యక్తిగత మానసములలో తీసివేసికొని, శుద్ధ చైతన్యముతో, ప్రస్తుత సమాజములో వంచనచే పతనమగుచున్న సమాజమునకు హెచ్చరిక, జాగృతి తేవలెను.

సమాజమునకు కావలసినది నిజాయితీ - కులముకాదు. స్వయం పోషక వృత్తులు, విధానములు - ఇతరులక్రింద జీవించుటగాదు. రాజకీయ నేతలుగా దోచుకొనే భ్రష్టులకు బుద్ధిచెప్పుట - వారికి తాళం వేయుట గాదు.

6) ప్రణవాశ్రమము తన శక్తిని తాను మరచి యితర ప్రచారకులను రప్పించి, యింకా వినాలనుకోవటం అజ్ఞానమే. తన శక్తిని గుర్తించి తగిన సాధనలను ఏర్పాటు చేసుకొని, ప్రణవానంద చూపిన ఆత్మబలము, మార్గదర్శత్వమును గుర్తించి, పూర్వ అన్ని కేంద్రములతో సమన్వయము చేసుకొని, ఆధ్యాత్మిక జీవనమును Practicalగా నిరూపణ చేయవలెను. ఎంత చేసినా ఆదిశంకరులకు, వివేకానందులకు, ప్రణవానందస్వామికి తృప్తిపరచును.

7) శంకరరావుగారు రచించిన పుస్తకములు తదితర ఆధ్యాత్మిక గ్రంథములు దినందినం సంఘములో కలుగుచున్న మార్పులను అన్నిటిని ఎప్పటికప్పుడు జోడించుతూ, జీవితమును, జ్ఞానమును సజీవపర్చుతూ యుండవలెను. వ్యాసులవారు ఎన్ని

గ్రంథములను వ్రాసినా తృప్తిపడలేదు. శ్రీకృష్ణుడు భారతయుద్ధముతో, శ్రీరాముడు రావణ సంహారముతో తృప్తిపడలేదు. నేటి భారతదేశము స్వాతంత్ర్యము తెచ్చుకొన్నా, స్వార్థులైన, భ్రష్టులైన, Parliament Members తో తృప్తిపడుటలేదు. ఎంతో నిర్ణీత కృషి, ఎప్పటికప్పుడు దష్టలకు, నిష్టులకు కొనసాగించుట వదలి, దాని కర్తవ్యమును పురికొల్పుతున్నది.

అంతా సమష్టిగా శ్రీ నిర్వికల్పానంద స్వాములవారి ఆధ్వర్యములో నిర్వర్తించగలరని, శంకరరావుగారు ప్రణవానంద వారసుడుగా విశేష బాధ్యతలు కలిగియున్నారని నమ్ముచున్నాను.

నారాయణ స్మరణలు

**సచ్చిదానంద సరస్వతి దండిస్వామి**

**SWAMI DAYANANDA SARASWATI** **ANAIKATI**

COIMBATORE - 641 108

6th February, 1991.

Dear Sri Sankara Rao,

I am very happy to see your articles on different topics in Vedanta being brought out in a book form under the title "Sankara-advaita-vyasa-mala'.

With the help of Sri Vasanta Nageswara Rao, who is studying with me here, I did go through an important article dealing with Mundaka mantra 'bhidyate...' I see your grasp of the sastra, having done a lot of satsangs with Sri Swamy Pranavananda. You have the blessing of this great teacher and I hope that this book will be read by many people. Through this book and the previous ones you are sharing with the people the vision of our Sastras so ably unfolded by Pujya Pranavananda Swamiji.

With best wishes,

yours,

(Sd.) Dayananda

P.S. I am sending a Telugu translation also along with this.

మీరు గ్రంథరూపములో రూపొందిన **"శంకర అద్వైత వ్యాసమాల-3"**ను ప్రస్తుతము నా దగ్గర (ఆర్ష విద్యాశ్రమ గురుకులములో) చదువుచున్న శ్రీ వసంత నాగేశ్వరరావు సహకారముతో మీ గ్రంథములోని వివిధ వేదాంత విషయములు గూర్చి తెలుసుకొని సంతోషించినాను. ఈ గ్రంథములోని ఒక ముఖ్య వ్యాసము ముండక ఉపనిషత్‌లోని **"భిద్యతే హృదయగ్రంథి...."** అను మంత్రమునకు మీరు చేసిన వివరణ క్షుణ్ణముగా పరిశీలించినాను. పూజ్య స్వామి ప్రణవానందతో మీరు జరిపిన సత్‌సంగము వలన మీకు లభించిన శాస్త్ర గ్రహణశక్తిని నేను గమనించినాను. మీకు స్వామి ప్రణవానంద ఆశీస్సులు లభించినవి.

ఈ పుస్తకమును చాలమంది చదవగలరని ఆశించుచున్నాను.

ఈ పుస్తకము మరియు మీరు ఇంతకుముందు వ్రాసిన పుస్తకముల ద్వారా పూజ్య ప్రణవానందస్వామి వివరించిన శాస్త్ర దృక్పథము ప్రజలకు తెలియచేయబడుతుందని ఆశిస్తున్నాను.

నా శుభాశీస్సు లందచేయుచున్నాను.

**- స్వామి దయానంద**

ఓమ్

ఓమ్ పరమ గురుభ్యోనమ: ఓమ్ సర్వ మహర్షిభ్యోనమ:

# మాతా ప్రశాంతానందగిరి అభిప్రాయము

శ్రీయుత త్రిపురనేని విష్ణుశంకరరావుగారు, వారిచే రచింప బడుతున్న (గాయత్రీ మంత్ర రహస్య వ్యాఖ్యాన సహిత) శంకరాద్వైత వ్యాసమాల - 3వది ప్రచురించుతూ, ఈ గ్రంథమును చదివి, నా అభిప్రాయము తెలుపమన్నారు. నా కంతటి సామార్థ్యము లేకున్నను, చంద్రునికొక నూలుపోగన్నట్లు వారి సహృదయమునకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటూ సాహసిస్తున్నాను.

సృష్టిలో అనేకమంది అనేక అభిరుచులతో జననమైనది మొదలు వారివారి కళలను బహుముఖప్రజ్ఞలతో ప్రకటన చేస్తూ వస్తున్నారు. ముఖేముఖే సరస్వతి అని, సాహిత్యాన్ని అందిస్తూ అనాదినుంచి నేటివరకు జరుగుతున్న పని. నిక్షిప్తమై వున్నదానిని వెలికితీసి ప్రజలకు అందించుట ప్రయోగకర్త పని. పాఠకుడు సక్రమముగా అర్థం చేసుకుని ఆచరణకు బూనుకొనుట సార్థకమైన క్రియ. అదికూడా ఒక తపస్సే అని చెప్పాలి. అందుకే అన్నారు **"మనుష్యాణాం సహస్రేషు"** అని. అందు తన్ను తాను ఉ ద్ధరించుకొనవలెననే సంకల్పము కొద్దిమందికే కలుగుతుంది. **"ఉద్ధరేదాత్మ నాత్మానం"** అని గీత బోధించింది. అనేక జన్మల సంస్కారము బలంగా వుంటేనే కాని ఆధ్యాత్మిక సాధనలో అభిరుచి కలుగదు. బ్రహ్మ జ్ఞానమును గురించి ఆలోచించేవారు బహుజన్మ పుణ్యము ఉంటేనే విఘ్నములు లేకుండా సాధనకు తోడ్పడుతుంది. వీరు యీ

గ్రంథమున మంచి నీతి, విజ్ఞానమునకు సంబంధించిన కథలను చక్కని శైలిలో పొందుపరచారు. అది సామాన్య ప్రజ్ఞగా వూహించుటకు వీలులేదు. సాధకులకు అభిరుచి కలిగించేవిగా వున్నది.

మొదలే పంచీకరణము ప్రారంభిస్తే, తెనాలి రామలింగడు పిల్లిని పెంచినట్లు వుంటుంది. పాలగిన్నె చూస్తే ఆ ప్రాంతంలో వుండదు. అలా కాకుండా పాఠకునకు మొహం మొత్తకుండా అభిరుచిని కలిగించేవిగా వున్నాయి కథలు. ఒక కథలో రాజుగారు భగవంతుడు ఎక్కడ వున్నాడు? ఎటు చూస్తున్నాడు? ఏం చేస్తున్నాడు అని, పెద్ద సందేహంతో ఆస్థాన పురోహితునికి కాలనిర్ణయం చేసి, మరి విశదపరచమంటే, ఆయన చిక్కిశల్యమై మంచంబట్టాడు. అతిసామాన్యుడు, ఆయన శిష్యుడు గడువురోజున సభలో అందరు శెభాష్ అనేటట్లు తన సూక్ష్మబుద్ధిని ప్రయోగించి, ఆయన సందేహ నివృత్తి చేసి, బహుమానింపబడ్డాడు. అందుకే ఎందరో మహానుభావులన్నారు మన త్యాగరాజుల వారు వారి జీవితమున **21600**ల కీర్తనలు వ్రాసి ధన్యత నొందిన భక్తాగ్రేసరుడు, పరమ భాగవతోత్తముడు, చిరస్మరణీయుడు. దేనికైనా అధికారి కావాలి. ఆయన గానంచేసిన కీర్తన ఒకటి ఎవరని న్ణియించేదిరా, ఎట్లా ఆరాధించేదిరా నిన్ను ఎవరని (దీనిలో) చరణంలో అంటారు. శివమంత్రమునకు, **"మా"** జీవము మాధవమంత్రమునకు, **"రా"** జీవము. యీ వివరము తెలిసిన పనులకు మ్రొక్కెద వితరణగుణ శ్రీ త్యాగరాజనుత అని. మాధవుని మంత్ర బీజాక్షరం రా, శివ మంత్రమునకు మ, జీవము. యీ రెండు బీజాక్షరముల సంపుటి తారకమైనది. త్రిలోక సంచారి నారదమహర్షి దారులుకొట్టి జీవించు రత్నాకరునికి యీ తారకమును ఉపదేశించాడు. ఆ కళ్యాణఘడియ ఎంత శుభమైనదో, లోక కళ్యాణమునకు ఆవిర్భవించిన రామచంద్రమూర్తి చరితము ఆదికవి వాల్మీకి రామాయణమును వ్రాయగలిగాడు. అంటే **'జపతో నాస్తి పాతకం'** అన్నట్లు బీజాక్షరముల కలయిక. ధారణ, ఎంతటి శక్తిని కలుగజేసినదో మనకు అందరికి తెలిసినదే. అట్లే వీరి కలము ఇంకా

శరవేగముతో ముందుకు నడచి, లోకోపకారార్ధము వీరి (ఆశయము) ప్రయత్నము ద్విగుణీకృతము కాగలదని ఆశిసన్తా వీరికి ఆ సర్వేశ్వరుని కృపవలన ఆయురారోగ్యములతో వర్ధిల్లవలెనని ఆకాంక్షించు.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓమ్ తత్ సత్ ఓమ్,

**మాతా ప్రశాంతానందగిరి**

(శ్రీ ప్రశాంతి గీతాశ్రమ స్థాపకులు)

# ఆనందానుభూతి

ఈ గ్రంథము శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావుగారి (గాయత్రీ మంత్ర రహస్య సహిత) శంకరాద్వైత వ్యాసమాల మూడవభాగము. మొదటి రెండును అద్వైత వేదాంతవిచారణకు అనువైన విభిన్న శీర్షికలతో జిజ్ఞాసువులకు ఉపాధేయముగనున్నవి. ప్రకటితపూర్వములైన వీరి వేదాంత గ్రంథములను నేను పఠించుటయు, నా సంతోషమును వారికి తెలుపుటయు జరుగుచున్నవి. దానిని పురస్కరించుకొని వారు నాపై వాత్సల్యముతో ప్రస్తుత గ్రంథముపై నా అభిప్రాయమును వ్రాయ నాజ్ఞాపించిరి. తత్ఫలితములే ఈ నాలుగు మాటలు.

జననాంతర సుకృత విశేషమునగాని ఎవరికేని అద్వైతదృష్టి కలుగదు; స్థిరపడదు. శ్రీ ప్రణవానందస్వామివారి సన్నిధిని బహుకాలము శ్రవణము చేసి శాస్త్రసంబంధములైన మెలకువలను అవగాహన చేసికొని, చింతనచేసి, వివిధ తాత్త్వికాంశములను విశ్లేషించి ప్రకటించు నర్హత నార్జించిన వారీ రచయిత. వీరి నిరంతరమునన జలధినుండి వెల్వడిన ఈ వ్యాసములు చక్కని విచారణలో నిండిన తత్త్వ నిరూపణ గలవి.

ఈ వ్యాసమాలలో ఒక క్రమోన్మీలనము పొడగట్టుచున్నది. మొదటి పదునాలుగు వ్యాసములు వేదాంత విషయ అవబోధనకు ప్రవేశ ద్వారము వంటివి. సాధనకు కావలసిన కళ్యాణ గుణములను సందర్భోచితములైన ఐతిహ్యములతో అనుసంధాన పరచుటవలన మొదటగా పాఠకునిలో చిత్త నైర్మల్య మేర్పడును.

అనంతర వ్యాసములు పదియును తత్త్వబోధకు, శాస్త్రీయ విషయ అవగాహనకు తోడ్పడునవి. ఇందు 'ప్రమాత'లోని బింబ ప్రతిబింబ విచారణమును, నిస్సంగము, నిర్వికారము అగు ఆత్మ ఎట్లు సాక్షియగునో అను విషమగు వీరు సంక్షిప్తముగ తెల్పిరి.

"చతుర్విధాజ్ఞాన రహితాత్మ"లో ఆత్మ కాలకృత - దేశకృత - వస్తుకృత పరిచ్ఛేదశూన్యమని, ఆత్మకు భిన్నములైన సర్వపదార్థములు ప్రాగభావ - ప్రధ్వంసాభావ - అత్యంతాభా - అన్యోన్యా" భావములకు ప్రతియోగులని నిరూపితమైనది. ఇట్లే "చిదాత్మ - గౌణాత్మ"లను గూర్చిన భిన్నమత విచారణ ఉల్లేఖింపబడినది.

"వ్యావహారికి సత్త - పంచీకరణము"న త్రిధావిభక్తమైన సత్తావివరణము. దాని తర్వాత సూక్ష్మ పంచభూతములు ఒక్కొక్క దాని జ్ఞానశక్త్యాత్మక వ్యష్టి సాత్వికాంశమువలన ఒక్కొక్క జ్ఞానేంద్రియమును, క్రియాశక్త్యాత్మక వ్యష్టి రాజశాంశమువలన ఒక్కొక్క కర్మేంద్రియమును కలుగు చున్నవని ప్రవచింప బడినది.

ఇట్లే **"లయచింతన", "అవస్థాత్రయము"** లలో రచయిత శ్రీ శంకర భగవత్పాదుల లయచింతనను ప్రస్తావించి అనులోమ విలోమ వివరణముతో పాటు జడచైతన్య సంబంధము, త్రిగుణాత్మకమైన త్రిమూర్తి తత్త్వముల సమాలోచన నిర్వహింపబడినవి. పిదప **"అవస్థాత్రయ"** విశ్లేషణ చేసి, ఆత్మకది తటస్థ లక్షణమని వక్కాణించిరి. **"మిధ్యాచార" - "పరమార్థదర్శి"** ప్రకరణము లలో పరిశుద్ధాంత:కరణము కలవాడే మనస్సును, జ్ఞానేంద్రియములను నియమించి, వాగాది కర్మేంద్రియములతో ఫలేచ్ఛారహితమగు కర్మాచరణ కర్తృడని గీతాశాస్త్ర వివరణ గావించిరి.

ఇక, ఈ గ్రంథమునకు మకుటాయమానమైనది గాయత్రి మంత్రార్థ రహస్య నిరూపణము. తన్మంత్ర ప్రభావము - అనుష్ఠాన క్రమము - ప్రణవము లోని వ్యాహృతిత్రయము - మంత్రభాగముల వివరణము విజ్ఞానదాయకములు. ప్రణవములోని మూడక్షరములు వేదత్రయముతో సమన్వయము పొంది, ఉపాసకునకవి ఎట్లు జ్ఞాన - క్రియా - సౌమ్య శక్తులను ప్రసాదించునో తెల్పుటతోపాటు ఈ మంత్రరాజ విశిష్టతను రచయిత సామాన్య పాఠకునకు గూడ సుబోధకము గావించిరి.

ప్రాణాయమ లక్షణము, దానికి గాయత్రీ మంత్రముతో కల సంబంధము రమణీయముగ నిరూపితమైనది.

ఆయా సందర్భములలో వివరణాత్మకమైన తాత్విక పరిభాషను పాఠకుడు అవగాహన చేసికొనుచు పఠించవలసిన వ్యాసములివి. శాంతి పాఠముతో ప్రారంభమై గురుకృపా మహిమాభివర్ణనముతో పరిసమాప్తమగు శ్రీ విష్ణుశంకరరావుగారి వ్యాసమాల ఆద్యంతము అత్యంత మనోజ్ఞము, లోకోపకారకము, నిశ్శ్రేయన నిర్దేశకము అనుటయే నా యీ అనుభూతివేశము...

ఇట్లు,
నమస్కారములతో
**నూతులపాటి రాఘవరావు.**

# కృతజ్ఞతా వచనములు

నా ఈ (గాయత్రీమంత్ర రహస్య వ్యాఖ్యాన సహిత) శంకరాద్వైత వ్యాసమాల-3 ను ఆత్మీయతతో ఆప్యాయతతో అందుకొనీ, అందలి వ్యాసముల యందు అంతర్గతముగ నిమిడి యున్న పరమార్థ తత్త్వమును పరిశీలించి నాకు ఆనందోత్సాహములను కలుగజేయుచు, అనాహతోపాసనా సుస్వరాలను పంపిన గుడివాడ వాస్తవ్యులు విద్వాన్ విద్యాసద్మ వైద్యమిత్ర కవిమిత్ర బిరుదాంకితులు, నిత్య పురాణాది ప్రవచనకర్తలునగు శ్రీ సుంకర శివరామకృష్ణయ్య చౌదరి గారికిని, పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు భూమి తనఖా బ్యాంకి కార్యదర్శిగా దర్పోద్దత్యములు ఏమాత్రము లేకుండ జీవన తపస్సమాధిలో తాదాత్మ్యము నొంది ప్రజల మన్ననల బొందుచూ 39 సంవత్సరములు కర్మయోగి వలె ఉద్యోగము చేసి, పదవీ విరమణానంతరము కూడ తన శేష జీవితమును సామాన్య మానవుడుగా ప్రజాసామాన్యమునకు ఉపకారకములగు కార్యక్రమములలో పాల్గొనుచు గడపవలెనను దృఢదీక్షగల సహృదయులు వట్లూరు గ్రామవాసి యగు శ్రీ వేగుంట కనకరామబ్రహ్మం గారికి, ఆర్ష విద్యాశ్రమము - గురుకులం - కోయంబత్తూరు వాసి, స్వామి శ్రీశ్రీశ్రీ చిన్మయానంద, గుడివాడ ప్రణవాశ్రమాధిపతులు శ్రీశ్రీశ్రీ (బ్రాభూ॥) ప్రణవానంద స్వాములవారి బోధనలను ఆకళింపచేసికొని, దేశవిదేశాలలో, ఆంగ్లములో గంగా ప్రవాహము వలె అనర్గళముగా ఆర్షవిద్యను ప్రవచించి యావత్ప్రపంచమున పేరెన్నికగన్న శ్రీశ్రీశ్రీ దయానంద సరస్వతి వారికి, గుడివాడ వాస్తవ్యులు, గుడివాడ ఎ.యన్.ఆర్. కాలేజి తెలుగు, సంస్కృత భాషా విభాగాధ్యక్షులుగా పనిచేసి విద్యార్థుల మన్ననల బొంది పదవీ విరమణానంతరము తమ జీవితమును ప్రజలలో ప్రబలియున్న మూఢ విశ్వాసములను తొలగించుటకు బహు సభావేదికల యందు ప్రసంగించుచు, పెక్కు సాహిత్య సభలకు ఆధ్వర్యమును వహించి అమృతధార వంటి తమ ఉపన్యాసములతో శ్రోతల నాకట్టి జోకొట్టుచున్న శ్రీ నూతులపాటి రాఘవరావు

ఎం.ఏ. గారికి, విజయవాడ నివాసిని, పూర్వాశ్రమములో విజయవాడ ఆల్ ఇండియా రేడియోలో బాలల కార్యక్రమములో పనిచేసి బాలల హృదయముల రంజిపజేసి "రేడియో అక్కయ్య'' అని పేరు పొందిన శ్రీమతి నాగరత్నమ్మగారు, తత్త్వాభిలాషులై గీతాపారాయణమును స్త్రీ లోకములో బహుళ ప్రచార మొనరించి, చుట్టుగుంటలో గీతాభవన నిర్మాణకర్త్రియై, దాని అభివృద్ధికి బహువిధముల శ్రమించి పనిచేయుచు, శుద్ధ సత్వాంతఃకరణ సమన్వితయై సన్యసించి గీతాప్రచార కార్యక్రమములో నిమగ్నయై జీవితము ధన్యము చేసికున్న శ్రీశ్రీశ్రీ ప్రశాంతానందగిరి వారికిని, వైదికమే ధ్యేయమైన భారతీయ సాంప్రదాయోద్ధరణకు శ్రమించుచు తన జీవితమంతయు నంకితము చేసికొన్నటువంటిన్ని గుడివాడ ప్రణవాశ్రమ అధిపతులు (బ్ర॥భూ॥) శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వాముల వారి వద్ద ఉపనిషత్తులు శ్రవణము చేసి పరమార్థ సిద్ధిని బొందినటువంటిన్ని His Holiness Jagadguru Sachhidananda Saraswati Bharati Dandin Swamy Peetadhipati, Mahadev Mutt, Domahki Bavadi, Ratlam (M.P.) 45001 వారికి, ప్రింటింగు సమయమున ప్రూఫ్ చూచుటలో సర్వ బాధ్యతలు వహించి సహకరించిన చిరంజీవులు శ్రీ చక్కా పాండురంగారావు, మామిడి నరేంద్రబాబు, పుల్లేటి నరసయ్యగార్లకు, గ్రంథ ప్రచురణయందు శ్రద్ధాతత్పరతగల్గి అచ్చుపని నిర్వర్తించి సకాలములో పనిపూర్తిచేసిన శ్రీ అశోకా ఆర్టు ప్రెస్, గుడివాడ వారలకు నా కృతజ్ఞతలు.

ఇట్లు,

**త్రిపురనేని విష్ణుశంకరరావు**

రచయిత.

# విషయసూచిక


| | | పేజీ నెం. |
|---|---|---|
| | శాంతి పాఠం | |
| 1. | ఆశ్రమము - ఆచరణ | 1 |
| 2. | సర్వజితు | 5 |
| 3. | గురు ఆవశ్యకత | 8 |
| 4. | యమద్వయము | 11 |
| 5. | గృహస్థుడును తరించవచ్చును | 16 |
| 6. | మానవజన్మ ప్రాశస్త్యము | 21 |
| 7. | ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి | 24 |
| 8. | ఈశ్వర సృష్టి - జీవ సృష్టి | 28 |
| 9. | దేహాత్మ మనోదృష్టులు | 31 |
| 10. | క్రోదాత్ భవతి సమ్మోహః | 34 |
| 11. | దైవప్రశ్నత్రయము | 37 |
| 12. | సన్మతిచే సద్గతి - దుర్మతిచే దుర్గతి | 43 |
| 13. | గ్రుడ్డి అనుకరణ | 46 |
| 14. | అనహంకారము | 50 |
| 15. | ప్రమాత | 53 |
| 16. | సాక్షి | 55 |
| 17. | శాస్త్ర విచారణావశ్యకత | 57 |
| 18. | చతుర్విధాభావరహితాత్మ | 60 |

| | | పేజీ నెం. |
|---|---|---|
| 19. | చిదాత్మ - గౌణాత్మ - భిన్నమతములు | 63 |
| 20. | వ్యావహారిక సత్త - పంచీకరణము | 66 |
| 21. | లయచింతన | 70 |
| 22. | అవస్థాత్రయము | 73 |
| 23. | ఉపలంబము : ఆశ్రయము<br>సుఖమహమస్వాప్సమ్, నకించి దవేదిషమ్ | 77 |
| 24. | ఏకాత్మ ప్రత్యయసారం | 82 |
| 25. | మిథ్యాచారము | 88 |
| 26. | గురుపాదుకాపూజ - దాని విశిష్టత | 90 |
| 27. | పరమార్ధదర్శి | 94 |
| 28. | జ్ఞానాజ్ఞాన ఫలములు | 98 |
| 29. | గాయత్రీ మంత్రము | 101 |
| 30. | గురుతత్త్వము - గురుగీత | 123 |
| | ప్రాత: స్మరణీయములు | 128 |

## శాంతిపాఠం

**శ్లో॥ ఓం భద్రం కర్ణేభి శ్రుణు యామదేవా:**
**భద్రం పశ్యేమాక్ష భిర్యజ త్రా:**
**స్థిరైరంగైస్తుష్టు వాగ్ం సస్తనూభి:**
**వ్యశేమ దేవహితం యదాయు:**

దేవా: దేవతలారా, (వయం = మేము) కర్ణేభి: = మా చెవులతో, భద్రం = శుభవాక్యములను, శ్రుణుయామ = విందుముగాక!, అక్షుభి: = మా కనులతో, యజత్రా: = పూజనీయములైన భద్రం = శుభరూపములను, పశ్యేమ = చూచెదముగాక! స్థిరై: = చంచలములు కాని, అంగై: = అవయవములుగల, తనూభి: = శరీరముతో, తుష్టువాగ్ంస: = స్తుతించుచు, దేవహితం = భగవంతుడిచ్చిన, యత్ = ఏ, ఆయు: = ఆయువు గలదో, తత్ = దానిని, వ్యశేషు = పొందుదుము గాక!

తా॥ ఓ దేవతలారా! గురు శిష్యులమగు మేము మా చెవులతో నిరంతరము శుభవాక్యములనే విందుముగాక! మా కనులతో పూజనీయములైన శుభరూపములనే చూచెదముగాక! భగవంతుడిచ్చిన ఆయువు ఉన్నంతవరకు చంచలములు కాని అవయవములు గల శరీరములతో మిమ్ములను స్తుతించుచుందుముగాక!

స్వస్తిన ఇంద్రోవృద్ధశ్రవా:, స్వస్తిన: పూషావిశ్వవేదా:, స్వస్తినస్తార్ఖ్యో అరిష్టనేమి:, స్వస్తినో బృహస్పతి ర్దధాతు.

ఓం శాంతి: శాంతి: శాంతి:

వృద్ధశ్రవా: = పురాణప్రసిద్ధుడైన, ఇంద్ర: = ఇంద్రుడు, న: = మాకు, స్వస్తి=క్షేమమును, విశ్వవేదా:=సర్వజ్ఞుడగు, పూషా=సూర్యుడు, న:=మాకు, స్వస్తి = జ్ఞానమును, అరిష్టనేమి: = అరిష్టములను బాపు, తార్ఖ్య: = గరుడుడు, న: = మాకు,

స్వస్తి = అనర్థరహితమును (మేలును) బృహస్పతి = బృహస్పతి, నః = మాకు స్వస్తి = ఆత్మవిద్యను, దధాతు = కలుగజేయుదురు గాక!

తా॥ ఇంద్రుడు, సూర్యుడు, గరుడుడు, బృహస్పతి గురు శిష్యులము అగు మాకు సుఖమును, జ్ఞానమును, అనర్థ నివృత్తిని, ఆత్మవిద్యను అనుగ్రహింతురు గాక! ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవిక శాంతి చేకూరునుగాక!

# ఆశ్రమము - ఆచరణ

మానవ జీవితమును నాలుగాశ్రమములుగా శాస్త్రము చెప్పుచున్నది. అవి బ్రహ్మచర్యాశ్రమము, గృహస్థాశ్రమము, వానప్రస్థాశ్రమము మఱియు సన్యాసాశ్రమము, బ్రహ్మచర్యాశ్రమమున సకల విద్యలు గురువుల వద్ద నభ్యసించవలెను. గృహస్థాశ్రమములో భార్యా పుత్రాదులతో ధర్మనిష్ఠతో త్యాగబుద్ధితో జీవితము గడపవలెను. వానప్రస్థాశ్రమములో కుటుంబ భారమంతయు బిడ్డలకు వదలి ఒంటరిగా మనశ్శాంతితో నుండ వలెను. సన్యాశ్రమములో సర్వము వదలి కాషాయాంబరధారియై దేశ సంచారము చేయుచు స్వరూపజ్ఞాన సముపార్జనలో నిమగ్నుడై జీవించవలెను.

ఇందు గృహస్థాశ్రమము శ్రేష్ఠమా సన్యాసాశ్రమము శ్రేష్ఠమా యను విషయమును ఒక కథారూపముగా తెలిసికొనుట మంచిది.

కళింగ దేశమును పాలించుచుండిన రాజునకు గృహస్థాశ్రమము శ్రేష్ఠమైనదా? సన్యాశ్రమము శ్రేష్ఠమైనదా? అను సందేహము కలిగెను. ఒకనాడు పట్టణములోని పండితుల నందరిని పిలిపించి, తన సందేహమును తెలిపెను. వారు గృహస్థాశ్రమము మంచిదని తెలిపిరి. కాని వారు సరిఅయిన హేతువులతో నిరూపించలేక పోయిరి. తరువాత ఆ పట్టణమునకు వచ్చుచున్న సన్యాసుల నందఱిని తన యాస్థానమునకు రప్పించి తన సందేహమును దెలుపు చుండెను. వారు సన్యాశ్రమము శ్రేష్ఠమైనదని పలుకుచుండిరి. కాని సరియైన హేతువులతో నిరూపిపంచలేక పోవుచుండిరి.

ఒకనాడు ఒక సమర్థుడైన సన్యాసి ఆ పట్టణమునకు వచ్చెను. రాజు ఆ సన్యాసిని రావించి, గౌరవించి, గృహస్థాశ్రమము, సన్యాశ్రమములలో నేది శ్రేష్ఠమైనదని ప్రశ్నించెను. సన్యాసి ఆశ్రమములలో గొప్పతనము లేదు, ఆచరణమునందే గొప్పతనమున్నదని చెప్పెను. రాజు దీనిని సహేతుకముగా నిరూపించగలరాయని అడిగెను. అందులకా సన్యాసి నీవు కొంతకాలము నాతో సంచరించినచో నీకు చక్కగా నిరూపించగలనని

చెప్పెను. జిజ్ఞాసువైన రాజందులకు సమ్మతించి రాజ్యమును మంత్రి కప్పగించి తాను సామాన్య వేషముతో సన్యాసి వెంట బయలుదేరెను. ఇరువురు దేశ దేశములు తిరుగుచుండిరి.

మాళవదేశపు రాజుకు పుత్ర సంతానము లేదు. యుక్త వయస్సు గల యొక పుత్రిక మాత్రముండెను. ఆ రాజు తన కుమార్తె వరించిన ఏ వర్ణపువాడైనను, యే యాశ్రమము వాడైనను, ఏ మతము వాడైనను, వానికి తన రాజ్యముతో కూడ తన పుత్రిక నిచ్చెదనని స్వయంవరము చాటించెను. ఆ స్వయంవరమునకు దేశదేశములనుండి ప్రభువులును, ప్రజలను గుంపులు గుంపులుగా వచ్చియుండిరి. ఆ సమయముననే సౌందర్యవంతుడు, యువకుడునగు ఒక సన్యాసి అచటికి వచ్చెను. ఆ స్వయంవరమునకు వచ్చిన వారినందఱిని మంత్రి రాజకుమార్తె కెఱిగించెను. కాని ఆమె వారినెవ్వరిని పరిగ్రహింపక, బాలభానునివలె ప్రకాశించుచు తేజోవంతుడైన యువక సన్యాసి మెడలో పుష్పహారము వేసెను. అది చూచి ఆ సన్యాసి విస్మయమునొంది ఆ హారమును త్రెంచి పారవైచి పోవుచుండెను.

సన్యాసియైన తనకు రాజకుమార్తె నీయడని తలంచి పోవుచున్నాడని గ్రహించి, రాజు ఆ యువక సన్యాసిని సమీపించి, మీరు సందేహింపవలదు. నా పుత్రికను రాజ్యముతో సహా నేడే మీ కొసంగెదను, స్వీకరింపుడని కోరెను. కాని ఆ సన్యాసి అంగీకరింపక అరణ్యమును బట్టి పోవుచుండెను. రాజకుమార్తె నేను వరించిన ఆ సన్యాసియే నా భర్త, అన్యుని స్వీకరింపనని వానిని వెంబడించెను. ఆ వినోదమును చూచుటకు మన కథానాయకులగు రాజ సన్యాసు లిరువురును ప్రచ్ఛన్నముగ వారిని వెంబడించి పోవుచుండిరి. వీరొక మహారణ్య మధ్యముగా పోవుచుండగా ప్రొద్దుకుంకినది. ఆ యువక సన్యాసి అరణ్య మధ్యమున యెవరికి కన్పించకుండా తప్పించుకొని పోయెను.

అప్పుడు రాజకుమార్తె యెటుబోవుటకును తోచక యొక చెట్టు క్రింద కూలబడి ఏడ్చుచుండెను. ఆ సమయమున మన కథానాయకులగు రాజ సన్యాసులు ఇరువురు ఏమియు తెలియనివారి వలె, ఆమెను సమీపించి, ఆమె వృత్తాంతము నడిగిరి. ఆమె

జరిగిన కథ అంతయు చెప్పెను. అప్పుడు వారు, సన్యాసి సర్వాత్మ స్వరూపుడు, నీవు సన్యాసిధర్మ మెరుగని దానవగుట వలన అతనిని వరించియుంటివి. రేపు సూర్యోదయమైన తర్వాత నిన్ను మీ తండ్రియొద్దకు చేర్పించెదము. మరియొక రాజపుత్రుని వివాహమాడి సుఖింపుము అని చెప్పిరి. వారు ముప్పురు ఒక చెట్టు క్రింద బసచేసిరి.

ఆ చెట్టుమీద రెండు కపోత పక్షులు గ్రుడ్లు పెట్టి పిల్లలను చేసి యున్నవి. అందు మగపక్షి చెట్టు క్రింద కూర్చుండి యున్న వీరిని చూచి, మన నివాసమునకు ముగ్గురు అతిధులు వచ్చి యున్నారు. మనము గృహస్థ ఆశ్రమమున నుండుటచేత వారిని సత్కరించుట మన ధర్మము. చలి బాధకు తాళజాలక గడగడా వణుకుచున్నారు. నీవు ఈ యరణ్యమున చిదుగులను ప్రోగుచేయుము. నేను యీ సమీపమునందున్న పల్లెకు పోయి నిప్పు కొఱివి తెచ్చెదనని ఆడుపక్షికి చెప్పి తాను పల్లెకుపోయెను. ఇంతలో నాడుపక్షి చిదుగులను పేర్చి, మగపక్షి తెచ్చిన నిప్పుకొఱివి నందులోనుంచి ఱెక్కలతో విసరి మంటజేసెను.

అప్పుడా అతిధులు ముగ్గురా మంటయొద్ద చలి కాచుకొనుచు నాకలిచే బాధపడుచుండిరి. అదిచూచి మగపక్షి పాపము! వీరికి చలిబాధ పోయినది. ఆకలిబాధ యెక్కువైనది. ఆకలిబాధ తీర్చుటకు వేఱుపాయము కానరాదు. నేనా యగ్నిలో ప్రవేశించి, యీ అతిధులకు ఆహారమయ్యెదనని చెప్పి యగ్నిలో ప్రవేశించెను. తరువాత ఆడుపక్షి నా భర్త ప్రారంభించిన అతిధి యజ్ఞము పూర్తి అయినట్లు లేదు. ఒక చిన్న పిట్ట మాంసము ముగ్గురు అతిధులకెట్లు సరిపోవును అని తలంచి తానుకూడ నగ్నిలో ప్రవేశించెను. అటు పిమ్మట ఆ పక్షి పిల్లలు మా తల్లిదండ్రులు ప్రారంభించిన యీ యజ్ఞము పూర్తియైనట్లు లేదు. ఈ చిన్న పిట్టల మాంసము వారికి చాలినట్లు లేదు. కావున మనమా యజ్ఞమును పూర్తిచేయుట ధర్మమని తలంచి ఆ యగ్నిలో ప్రవేశించెను.

చలి కాచుకొని, ఆకలి దీర్చుకొని, రాజసన్యాసులు రాజకుమార్తె ముగ్గురు ఆ రాత్రి అరణ్యమున గడపి మరునాడుదయము రాజకుమార్తెను ఆమె తండ్రి వద్దకు

తీసికొనిపోయి వప్పగించి, రాజసన్యాసులు ప్రయాణము సాగించిరి. అప్పుడు రాజు సన్యాసితో అయ్యా! ఏ ఆశ్రమము గొప్పదో సహేతుకముగ నిరూపించెదనని చెప్పి, మీరు సంవత్సరము నుండి దేశదేశములు త్రిప్పుచు నింత వరకు నాకు చెప్పరైతిరి. ఇంకెప్పుడు చెప్పెదరని యడుగగా, ఆ సన్యాసి, రాజా! నేను నీకు ప్రత్యక్షముగనే చూపియుంటిని, కాని నీవు తెలిసికొన జాలవైతివి. గృహస్థాశ్రమమునందు వుండదలచినచో కపోతపక్షులవలె స్త్రీ పుత్ర దేహాదుల యందు భ్రాంతిని విడిచి స్వధర్మ నిర్వహణము కొఱకై ప్రాణముల నర్పించుటకైనను సిద్ధపడవలయును. సన్యాసాశ్రమమున నుండదలచినచో ఆ యువక సన్యాసివలె త్రిలోకాధిపత్యము లభించినను, సౌందర్యవతి యగు స్త్రీ లభించినను గడ్డిపోచతో సమానముగ చూచి తృణీకరింప వలయును. ఇందాశ్రమములలో గొప్పతనము లేదు. ఆచరణ మందే గొప్పతనమున్నదని చెప్పెను. రాజు అందులకు సంతోషించి తన రాజ్యమునకు జేరి సర్వభ్రాంతులను వీడి గృహస్థాశ్రమమునందే యుండి గార్హస్థ్య వివిదషా సన్యాసమును గ్రహించి జనకాదులవలె జ్ఞానమును పొంది మోక్షసామ్రాజ్య పట్టాభిషిక్తుడయ్యెను. కాన ఆశ్రమము కంటె నాచరణము శ్రేష్ఠమని గుర్తించవలెను.

ఓం తత్ సత్

# సర్వజిత్తు

పూర్వము భీమసేనుడను మహారాజు పృథ్వీమండలము నంతటిని జయించి, సామ్రాజ్యాధిపతియై సర్వజిత్తను నామము పొందెను. ప్రజలందరు అతనిని సర్వజిత్తనియే వ్యవహరించుచుండిరి.

కాని యింటి వద్ద తల్లి మాత్రము పూర్వము వలెనే భీమసేనుడనియే పిలుచు చుండెను. ఒకనాడతడు తన తల్లితో లోకులందరు నన్ను సర్వజిత్తని పిలుచుచుండిరి, కాని నీవు మాత్రము నన్ను పూర్వమువలెనే పిలుచుచుంటివి. నేను సమస్త భూమండలమును జయించి సామ్రాజ్యాధిపతినైతిని. సర్వము నా ఆజ్ఞ ప్రకారము నడుచుచున్నది. ఇంకను నీవు నా ప్రతాపమును గుర్తింపక పూర్వము వలెనే జూచుట నాకు చిన్నతనముగ నున్నదనెను. ఆమాటలు విని తల్లి నాయానా! నీవు మహాశూరుడవని వినుటచేత నేను ధన్యురాలనైతిని. నీవు పృథ్వియందుగల బాహ్యాశత్రువులను, కామ క్రోధాద్యంతశ్శత్రువుల నందరిని సమూలముగా జయించితివా? బాహ్యమైన పృథ్వీరాజ్యము, అంతరమైన దేహేంద్రియ మనోబుద్ధులును నీ స్వాధీనమునందున్నవా? బాహ్యాశత్రువులను జయించినంత మాత్రమున మానవుడు శత్రుజిత్తు కానేరడు. అంతరములగు కామక్రోధాది శత్రువులను జయించినవాడే శత్రుజిత్తనబడును. పృథ్వీరాజ్యమును తన వశమునందుంచుకున్న మాత్రమున సర్వసామ్రాజ్యాధిపతి కానేరడు. దేహేంద్రియ మనోబుద్ధులను వశీకృత మొనర్చుకొనినవాడే సామ్రాజ్యాధిపతి యగును.

బిడ్డా! ప్రపంచమంతయు నీ యాజ్ఞ ప్రకారము వర్తించుచున్న దంటివిగదా! నీ దేహేంద్రియ మనోబుద్ధులు నీ యాజ్ఞ ప్రకారము వర్తించుచున్నవా?. ఈ శరీరము ప్రతిదినము నీ యాజ్ఞను పొందకయే క్షీణించుచన్నది. ఒకానొకప్పుడది నీకు చెప్పకయే

నాశమొందును. నీ ఇంద్రియములు, నీ మనస్సు నీ యాజ్ఞ లేకయే నిత్యము విషయముల యందు ప్రవర్తించుచున్నవి. నీ కిష్టము లేకపోయినను పాపకార్యములు చేయుచున్నవి. నీ శరీరేంద్రియములే నీ స్వాధీనములో లేనప్పుడు యీ ప్రపంచమంతయు నీ స్వాధీనములో నున్నదని తలంచుట మూఢత్వము. కామక్రోధాద్యంత: శత్రువులు నీ దేహేంద్రియ మనోబుద్ధుల నాక్రమించుకొని నిన్ను బానిసను జేసి ఆటలాడించుచుండగా నేను సర్వజిత్తునని చెప్పుకొనుట హాస్యాస్పదము.

**శ్లో॥ "నరణే విజయాచ్ఛూరోఽ ద్వయనాన్నచ పండిత:**
**నవక్తా వాక్పటు త్వేన, నదాతా చార్థదానత:॥**

అనగా యుద్ధము నందు జయించినంత మాత్రమున శూరుడు కాజాలడు. శాస్త్రములు చదివినంత మాత్రమున పండితుడు కాజాలడు. వాక్చాతుర్యముతో మాటలాడిన మాత్రమున వక్త కాజాలడు. ధనమును దానము చేసినంత మాత్రమున దాత కాజాలడు. మరేమనగా

**శ్లో॥ "ఇంద్రియాణాం జయేశూరో, ధర్మంచరతి పండిత:।**
**హితప్రియోక్తి భిర్వక్తా దాతా సన్మాన దానత:" ॥**

అనగా ఇంద్రియ మనంబులను జయించిన వాడే శూరుడు అనబడును. ధర్మాచరణము గలవాడే పండితుడు అనబడును. ఇతరులకు హితముగను, ప్రియముగను మాటలాడు వాడే వక్తయనబడును. ఇతరులను సన్మానించువాడే దాత అనబడునని వ్యాస స్మృతియందు గలదు.

**"యౌవనము, జీవనము, మనము, ఛాయ, ధనము, ప్రభుత్వము"** నీ యాఱును చంచలములు. ఇవి స్థిరముగ నుండజాలవు. వీని యదార్థము నెఱిగినవాడే ధర్మ మార్గమున వర్తించునని నీతి శాస్త్రమున గలదు. యౌవనము ముసలితనముచే గ్రహించ బడుచున్నది. ఆరోగ్యము వ్యాధులచే హతము అగుచున్నది. జీవితము మృత్యువుచే కబళింపబడుచున్నది. ఆశ మాత్ర మేయుపద్రవము లేక విరిజిల్లుచున్నదని భర్తృహరి చెప్పెను.

బిడ్డా! కామ క్రోధాదులే పరమ శత్రువులు. దుర్వాస మహర్షి మహాజ్ఞాని యైనను, క్రోధమునకు వశుడై నానా విపత్తులు పొందెను. కామమునకు వశులై ఇంద్రాది దేవతలుగూడ మహా కష్టముల ననుభవించిరి. మహా తపోవంతుడగు విశ్వామిత్రుడు రూప లావణ్యములు గల మేనక యను అప్సరసను జూచి మోహితుడై తపస్సునకు స్వస్తిజెప్పి యామెతో భోగ విలాసముల దేలెను. వశిష్ఠ మహర్షి పౌత్రుడైన పరాశరుడు పల్లెపడుచు యొక్క సుందర రూపమునకు మోహితుడై పట్టపగలే సంగమమునకు దార్చెను. ఇటువంటి మహర్షులే కామము నడుపజాలనపుడు సామాన్య మానవులు అడంతురనుట కల్ల. కామక్రోధములు పితాపుత్రులగుదురు. వీరు మహా బలవంతులు. వీరు సమస్త ప్రపంచమును జయించిన జయశీలురై విరాజిల్లుచున్నారు.

**శ్లో॥ "కామేన విజితో బ్రహ్మా, కామేన విజితోహరి:**
**కామేన విజిత: శంభు:, శుక్ర:, కామేన నిర్జిత: ॥**

అనగా కామముచేత బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు, మొదలగు వారందరు జయింపబడిరి. ఆత్మజ్ఞాన విహీనుల నందరను కామము జయించుచున్నది. ఆత్మజ్ఞానికి మాత్రమిది వశీభూతమగుచున్నది. కావున నీవు కామక్రోధాది శత్రువులను జయించి దేహేంద్రియ మనోబుద్ధులను నీ స్వాధీనమునందుంచుకొన్నచో నిన్ను నేను సర్వజిత్తని పిలిచెదను. అట్లు చేయనిచో సర్వజిత్తు నామము నీయందు నేతి బీరకాయ చందమగుననెను. తల్లి హితబోధ విని, లజ్జితుడై రాజ్యమును కుమారున కప్పగించి, యరణ్యమున కేగి తప మాచరించి, మహాత్ముల ఉపదేశములచే కామ క్రోదాధి శత్రువుల జయించి, దేహేంద్రియ మనోబుద్ధులను తన స్వాధీనము నందుంచుకొని సర్వజిత్తను నామమును సార్ధకపరచుకొనెను. ఈ కథాసంగ్రహమును వేదాంత జిజ్ఞాసువులందరు గ్రహించి తదనుసరణతో ఆచరణతో సర్వజిత్తులు కాగలరని మదీయాకాంక్ష.

ఓం తత్ సత్

# గురు ఆవశ్యకత

మనము వేదాంత గ్రంథములు బాగుగా చదువగలిగినను, వాని అర్థము చక్కగా గ్రహించగలిగినను ఆత్మయొక్క వాస్తవ స్వరూపము తెలియబడదు. వేదాంత గ్రంథములయందాత్మ సర్వవ్యాపకుడనియు, దేహత్రయమునకు ద్రష్టయనియు, అవస్థాత్రయమునకు సాక్షియనియు పంచకోశములకు ప్రకాశకుడనియు చెప్పబడెను. అది సత్యమే యైనను శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడగు సద్గురువు వలన దాని యదార్థ తాత్పర్యము తెలియనిచో నాత్మరూప ధనము లభింపదు. ఇందులకు దృష్టాంతపూర్వకముగా ఒక కథ చెప్పెదను.

ఒక గ్రామములో ఒక గొప్ప ధనవంతుడుండెను. ఒకనాడతడు ఎవరికి తెలియకుండ పదునేను లక్షల రూపాయలను గుప్తపఱచెను. ఈ విషయ మెవ్వరికి చెప్పకుండ తన సొంత లెక్కలలో మాత్రము "ఈశ్వర నామ సంవత్సర చైత్ర శుద్ధ దశమి నాలుగు ఘడియల ప్రొద్దెక్కిన పిదప నాచే నిర్మింపబడిన శివాలయ శిఖరము నందు పదునేను లక్షల రూపాయలు దాచితిని. అవసరమైనపుడు నా పుత్రులు తీసికొనవచ్చు'' నని వ్రాసియుంచెను, కొన్ని దినములు గడచిన పిదప నతడు మిత్రులతో తీర్థయాత్రలు సేవించుటకు వెళ్ళి యచ్చటనే మృతి నొందెను. అతని వెంట వెళ్ళిన మిత్రులు ఆ విషయమును అతని పుత్రులకు చెప్పిరి. పుత్రులు తండ్రి మరణమునకు దు:ఖించి అతని అంత్యక్రియల నొనర్చిరి.

తరువాత కుటుంబ భారము తమమీద బడుటచేత వారు తండ్రి చేయు వ్యాపారము చేయసాగిరి. దైవయోగముచే వ్యాపారమున వారికి గొప్ప నష్టము కలిగెను. మరల వ్యాపారము చేయుటకు కొంత ధన మప్పుజేసిరి. కాని అదియు నష్టమయ్యెను. వారికి గ్రామమునం దెచ్చట అప్పు పుట్టక పోవుటచే ఇట్లు విచారించిరి. మన తండ్రి

గొప్ప ధనవంతుడని వాడుక కలదు. అతడు ధనమెచ్చటనైన దాచియుండును. పాత లెక్కలను పరికించి చూచినచో జాడ తెలియగలదని తలంచి పాత లెక్కల పుస్తకములను వెదుకజొచ్చిరి. అందొకచోట దాత నామసంవత్సరమున బాకీదార్ల నుండి పదునేను లక్షల రూపాయలు వసూలైనట్లు జమ పద్దులు కన్పించెను. మరియొకచోట ఈశ్వరనామ సంవత్సరమున చైత్ర శుద్ధ దశమినానడు నాలుగు ఘడియల ప్రొద్దెక్కిన పిదప శివాలయ శిఖరమునందు పదునేను లక్షల రూపాయలు దాచబడినట్లు ఖర్చు వ్రాయబడి యున్నది. షాహుకారు కుమారులు సంతోషాంతరంగ భరితులై వెంటనే కూలీలను పిలిపించి శివాలయ శిఖరమును బడగొట్టించిరి. కాని వారి కచ్చట ధనము జాడ తెలియలేదు. చోరు లపహరించినట్లు కూడ కనిపించలేదు. ఋణదాతలు ఋణముల నిమ్మని తొదర చేయసాగిరి. గృహములో ఆహార పదార్థములు లేక పెక్కు ఇబ్బందులు పడుచుండిరి. శివాలయ శిఖరమును బడగొట్టించి నందులకు లోకులు నిందింపసాగిరి.

ఈ బాధలను సహింపజాలక షాహుకారు పుత్రులు తమ కుల పెద్ద యొద్దకు వెళ్ళి జరిగిన వృత్తాంత మంతయు చెప్పి ఆయ్యా! మాకు దిక్కెవ్వరు లేరు. వ్యాపారమున ధనము నష్టమయ్యెను, అప్పులధికమగుటచే ఋణదాతలు తొందర చేయుచున్నారు. పాత లెక్కలను జూచి శివాలయ శిఖరము బడగొట్టించితిమి. ఫలితమేమియు లేదు. అందుకు లోకులు నిందించుచున్నారు. మమ్ములనేమి చేసినను సరే, మీరే దిక్కని ఏడ్వసాగిరి.

అప్పుడా వివేకవంతుడగు వృద్ధుడు వారల నోదార్చి పాత లెక్కలను తెప్పించి వానిని తాను స్వయముగ చూచి చైత్ర శుద్ధ దశమి నాలుగు ఘడయల ప్రొద్దెక్కిన పిదప దాచితినను దాని యర్థమును గ్రహించి సాహుకారు పుత్రులతో విచారింపకుడు, ధనము దొరకగలదు. చైత్ర శుద్ధ దశమి దినమున మీరు నా యొద్దకు రండు. ఇప్పుడు నేను మీకు కొంత ధనమిచ్చెదను. దీనితో మీరు శివాలయ శిఖరమును నెప్పటివలె కట్టించుడు. అంతవరకు మీ కుటుంబ పోషణకు కావలసిన భోజన సామాగ్రుల నిచ్చెదను, తీసుకొని పొండని చెప్పెను.

షాహుకారు కుమారులు సంతోషించినవారై ఆ వృద్ధుడిచ్చిన ధనమును, దానితోబాటు భోజన సామాగ్రులను తీసికొనిపోయి, పూర్వము వలెననే మరల శివాలయ శిఖరమును కట్టించిరి. తరువాత వారు చైత్రశుద్ధ దశమి నాడు కులవృద్ధుని యింటికి వెళ్ళి యతనిని తీసికొని శివాలయమునకు వచ్చిరి. ఆ వృద్ధుడు నాలుగు ఘడియల ప్రొద్దెక్కినపుడు శివాలయ శిఖరచ్ఛాయ పడిన ప్రదేశమును జూపి, బిడ్డలారా! మీ తండ్రి దాచిన శివాలయ శిఖరమిది. ఇచ్చట త్రవ్వించినచో ధనము లభించగలదని చెప్పెను. అప్పుడు వారు కూలీలను పిలిపించి ఆ ప్రదేశమును త్రవ్వించగా నచ్చట పదునేను లక్షల రూపాయలు కన్పించెను. లెక్కల యందబద్ధము లేదు, అక్షరములు స్పష్టముగా తెలియబడుచున్నవి. భాష బాగుగా అందరకు అర్థమగుచున్నది. కాని ధనము మాత్రము కన్పించుట లేదు. వృద్ధుడు పదునేను లక్షల రూపాయలీ చిన్న శిఖరమునం దెట్లుండగలవని విచారించి లెక్కలలో వ్రాసిన విధమున నా సమయమున శిఖరచ్ఛాయ బడిన చోట ధనము కలదని గ్రహించెను.

కాన వాచ్యార్థము ప్రయోజనవంతము కానపుడు విచారించి లక్ష్యార్థముతో ఫలము పొందుటకు వ్యవహారికముగా అనుభవజ్ఞులగు పెద్దలెట్లవసరమో, స్వరూప ప్రాప్తి లాభమునకు శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠులగు గురువు లావశ్యకము. కాన గురువనుగ్రహ ప్రాప్తి లేనిదే ఆత్మజ్ఞానము దుర్లభము.

ఓం తత్ సత్

# యమద్వయము

మానవులు కామ్య నిషిద్ధ కర్మము లాచరించుచున్నంత వఱకు యమధర్మరాజు తీర్పునకు బద్ధులై ఉత్తమాధమ లోకములను పొందుచు, ఆ లోకములయందు కర్మఫలము లనుభవించి మరల భూలోకమున బుట్టి నానావిధములగు సంసార దు:ఖముల ననుభవింపవలయును.

ఒకానొక సమయమున యమలోకములో చిత్రగుప్తుడు లెక్కలను పరిశీలించి భూలోకమున రామచంద్ర పురమందున్న కోమటి సుబ్బిశెట్టి ఆయువు నేటితో తీరిపోయినదని యమధర్మరాజుకు చెప్పెను. యముడు తన భటులకు రామచంద్రపురము పోయి కోమటి సుబ్బిశెట్టి శరీరము నుండి జీవునితీసికొని రండని చెప్పెను. అంతట యమభటులు సుబ్బిశెట్టి యింటికి వెళ్ళిరి. కుర్చీలో కూర్చొనియున్న సుబ్బిశెట్టి మీరెవరని ప్రశ్నించెను. అందులకు వారు మేము యమభటులము, నేటితో నీ ఆయువు తీరిపోయినది. నీ జీవాత్మను తీసికొని రమ్మని యమధర్మరాజు మమ్ములను పంపుటచే వచ్చితిమని చెప్పిరి.

వెంటనే సుబ్బిశెట్టి మిమ్ములనే యముడు పంపినాడు? క్రొత్త యముడా? పాత యముడా? యని అడిగెను. యమభటు లాశ్చర్యముతో నిద్దరు యములున్న సంగతి మాకు తెలియదనిరి. సుబ్బిశెట్టి అట్లయిన మీ ప్రభువు నడిగి తెలిసికొని రండు, పొండని చెప్పెను.

యమభుటులు ఇప్పుడితనిని తీసుకుపోయినచో నేమి ప్రమాదము సంభవించునో! నని విచారించి తీసికొని పోవుటయే మంచిదనుకొని యమలోకమునకు తిరిగి వెళ్ళి యమధర్మరాజుతో ఆయ్యా! మేము సుబ్బిశెట్టి జీవుని తీసుకొని వచ్చుటకు వాని యింటికి వెళ్ళితిమి. అతడు మమ్ములను జూచి మీరు క్రొత్త యముని భటులా? పాత యముని

భటులా? యని ప్రశ్నించెను. ఆ సంగతి తెలియదు గావున దేవరవారి నడుగుటకు వచ్చితిమని చెప్పిరి. అంత యమధర్మరాజు నాకును తెలియదు. ఈ విషయము మిక్కిలి ఆశ్చర్యముగానున్నది. బ్రహ్మ దేవుడు మఱియొక యముని సృష్టించినాడేమో తెలియదు. కావున సత్యలోకమునకు వెళ్ళి బ్రహ్మదేవుని విచారించుదము రండని వారిని వెంటబెట్టుకుని సత్యలోకమున కేగెను. వారిని చూచి, బ్రహ్మదేవుడు **"యమధర్మరాజా! ఏదియో కార్యార్థమై వచ్చినట్లు తోచుచున్న"**దనెను.

యమధర్మరాజు చిత్తము. భూలోకములో రామచంద్రపురము నందున్న సుబ్బిశెట్టి జీవుని తీసికొని వచ్చుటకు మా భటులు వెళ్ళగా నతడుమీరు క్రొత్త యముని భటులా? పాత యముని భటులా యని ప్రశ్నించినాడట. తాము నన్నుగాక మరొయొక యముని గూడ సృష్టించినారా? యని అడిగెను. నేను సృష్టించలేదు. ఒకవేళ విష్ణుమూర్తి ఏమైన సృష్టించినాడేమో నాకు తెలియదు. వైకుంఠమునకు వెళ్ళి వారిని విచారించెదము రండని వారిని వెంటబెట్టుకుని వైకుంఠమునకు వెళ్ళెను.

వారిని జూచి విష్ణుమూర్తి "బ్రహ్మదేవా! నీ వాలకము చూడ నేదియో పనిమీద వచ్చినట్లున్నదే!'' అని అడిగెను. బ్రహ్మదేవుడు చిత్తము, యమభటులు రామచంద్రపురమునందున్న సుబ్బిశెట్టి జీవుని తీసుకొని వచ్చుటకు వెళ్ళిరి. అప్పుడతడు యమభుటులను జూచి మీరు క్రొత్త యముని భటులా? పాత యముని భటులా? అని ప్రశ్నించినాడట. రెండవ యముని విషయము మాకు తెలియదు. తామేమైనా సృష్టించినారేమో! అని తెలిసికొనుటకు వచ్చితి మనెను.

విష్ణుమూర్తి నేను సృష్టించలేదు. ఒకవేళ శంకరుడేమైన సృష్టించినాడేమో విచారింతము. రండని వారి నందరిని వెంటబెట్టుకొని కైలాసమున కేగెను. వారిని జూచి శంకరుడు వీరంద ఱొక పర్యాయమే యిచ్చటికి వచ్చుటకు కారణ మేదియో యుండునని తలంచి, వెంటనే కారణము తెలియజేయుడని వారి నడిగెను. అందులకు కారణము లేక కార్యముండునా! భూలోకములో రామచంద్రపురము నందున్న కోమటి సుబ్బిశెట్టి జీవుని తీసికొని వచ్చుటకు యమభటులు వెళ్ళగా నతడు మీరు క్రొత్త యముని

భటులా? పాత యముని భటులా? యని ప్రశ్నించినాడట. ఇద్దరు యములున్న సంగతి మా కెవరికి తెలియదు. మీరేమైన మరొక యముని సృష్టించినారేమోయని అడుగుటకు వచ్చితిమనిరి.

శంకరుడు నేను సృజించలేదు. ఇది చాలా ఆశ్చర్యముగా నున్నది. మనము ముగ్గురము సృజించకపోయిన నింకెవరు సృజించియుందురు? ఈ విషయమును మనము సుబ్బిశెట్టినే యడిగినచో విశదము కాగలదు రండు సుబ్బిశెట్టి నడుగుదమని చెప్పి వారినందరిని వెంటబెట్టుకొని భూలోకములో రామచంద్రపురము నందున్న సుబ్బిశెట్టి గృహమునకు వెళ్ళిరి.

సుబ్బిశెట్టి దూరముననే త్రిమూర్తులను, యమధర్మరాజును జూచి సంభ్రమాశ్చర్యములు గలవాడై ఆహా! ఏమి నా భాగ్యము. త్రిమూర్తులు, యమధర్మరాజును నా గృహమునకు వచ్చుచున్నారు. వారిని షోడశ ఉపచారములతో బూజించి తరించెదనని తలంచి వారి కెదురుగా బోయి సాష్టాంగ దండ ప్రణామము లాచరించి **"మహాత్ములారా! తమ రాకవలన నా గృహము పావనము అయ్యెను. నా జన్మము తరించెను. తామీ యున్నతాసనములపై దయచేయు"**డని చెప్పి వారిని ఉన్నతాసనములపై గూర్చుంచబెట్టి బంగరు పళ్ళెరములో నా మహాత్ముల పాదములను గడిగి ఆ పాదోదకమును లోపలికి పుచ్చుకొని మిగిలిన జలమును తన శిరస్సుపైనను గృహమునందును చల్లుకొని వారల కష్టోత్తర శతనామములతో పూజలు చేసి ధూపదీప నైవేద్య తాంబూలాదులను సమర్పించిన పిదప అయ్యలారా! తామీ దాసుని గృహమునకు విచ్చేసిన కారణము తెలుపగోరుచున్నానని అడిగెను.

శంకరుడు - ఓ సుబ్బిశెట్టి! నీవు చేసిన మర్యాదలకు చాలా సంతసించితిమి. యమభటులు నీ జీవుని తీసికొని వెళ్ళుటకు వచ్చినపుడు నీవు వారిని "మీరు పాత యముని భటులా? క్రొత్త యముని భటులా?'' యని ప్రశ్నించితివట. పాత యముని పూర్వము మేము సృష్టించితిమి. క్రొత్త యముని సృష్టించిన వారెవరు? అతని నివాస స్థలమెక్కడ? అని అడిగెను.

అంతట సుబ్బిశెట్టి అయ్యలారా! తమకు తెలియని విషయమేమి ఉండును? అయినను తాము నన్నడుగుచున్నారు. కావున నాకు తెలిసినంతవఱకు చెప్పెదను, వినుడు. మీరు సృజించిన పాత యముడు యమలోకము నందుండి జీవుల ప్రారబ్ధములు తీరినప్పుడు వారి స్థూలదేహముల నుండి జీవులను వేఱుచేయుచున్నాడు. కాని సూక్ష్మ దేహముల నుండిగాని, కారణదేహముల నుండిగాని వేఱు చేయుటలేదు. ప్రారబ్ధము తీరనిచో నతడు స్థూలదేహము నుండి కూడ జీవుని వేఱుచేయ జాలడు. ప్రారబ్ధము తీరిన జీవుని స్థూలదేహము నుండి వేఱుచేసినప్పుడు ఆ స్థూలదేహ మొక్కటి మాత్రమే నశించుచున్నది. కాని సూక్ష్మకారణ దేహములు నశించుటలేదు. ఆ స్థూలదేహములు నశించినను జీవునికి మరల వెంటనే మఱియొక స్థూలదేహము వచ్చుచున్నది. కావున పాత యముడు జీవులకు జనన, మరణ రూపమగు సంసార దు:ఖములను కలిగించుచున్నాడే గాని వానిని నివృత్తి చేయుటలేదు.

సద్గురిమూర్తిచే సృజింపబడిన బ్రహ్మాకారవృత్తి రూపుడగు క్రొత్త యముడు మలిన చలనరహితమగు పరిశుద్ధాంత: కరణమున నుత్పన్నుడై స్థూల సూక్ష్మ కారణ దేహముల నుండి ఆత్మను వేఱుచేసి బ్రహ్మముతో చేర్చుచున్నాడు. ఆత్మ నుండి వేఱుచేయబడిన దేహములు మూడును నానశమొందుచున్నవి. క్రొత్త యమునిచే నాశమొనర్పబడిన స్థూల సూక్ష్మ కారణ దేహములు మరల జన్మించుట లేదు. తనకు జన్మస్థానమగు సూక్ష్మ దేహము నశించుటచే దానితోపాటు బ్రహ్మాకారవృత్తి రూపుడగు క్రొత్త యముడు కూడ నశించుచున్నాడు. కావున నితడు జీవులయొక్క జనన మరణ రూపమగు సంసార దు:ఖములను నివృత్తి చేసి బ్రహ్మావస్థాన రూపమగు మోక్షమును గలిగించుచున్నాడు. ఈ విషయము సర్వజ్ఞులరగు మీకు తెలియనది కాదని చెప్పెను.

అప్పుడందరను విస్మయము నొంది చూచుచుండగా యమధర్మరాజు, వాడు పాపి, చీకటి వర్తకము జేసి మోసముతో ద్రవ్యము గడించిన దుర్మార్గుడు. వీడి యుక్తితో జీవింప జూచుచున్నాడు. వీని నిపుడే అంతమొందించెదనని కాలపాశము నతనిపై విసరబోయెను. వెంటనే సుబ్బిశెట్టి లేచి త్రిమూర్తులకు నమస్కరించి అయ్యలారా!

మీరు న్యాయము చెప్పుడు. మీలో ఒక్క మూర్తిని దర్శించిన వారి పాపములు పటాపంచలై పోవుననియు, వానియొద్దకు యమధర్మరాజు గాని, వాని భటులు రారనియు మీరే శాస్త్రములందు వ్రాసి పెట్టిరి. ఏకకాలమున మీ ముగ్గురు మూర్తులను దర్శించి పూజించిన నాకు పాపమెక్కడిది? నన్ను ముట్టుట కీ యమధర్మరాజున కేమి యధికారమున్నది? ఈ యధర్మమును ధర్మమూర్తులైన మీరే నివారించవలయును. యమధర్మరాజు బారినుండి నన్ను రక్షింపవలయునని ప్రార్థించెను.

త్రిమూర్తులాశ్చర్యానందములతో యమధర్మరాజును జూచి, త్రిమూర్తులను దర్శించుటచే వీని పాపములన్నియు పటాపంచలై పోయినవి. ఇప్పుడితడు పుణ్యాత్ముడు, వాని జోలికి పోరాదని యమునికి జెప్పి, సుబ్బిశెట్టి ధైర్యమునకు, యుక్తికిని, భక్తికిని మెచ్చితిమని, నీకు వరములిచ్చెదము కోరుకొమ్మని పలికిరి. సుబ్బిశెట్టి మహాత్ములారా! నేను సిరిసంపదలతో తులతూగుచు, సంపూర్ణాయుర్దాయము గలవాడనై యుండి సద్గురుమూర్తి అనుగ్రహము వలన బ్రహ్మజ్ఞానమును పొంది ముక్తుడను కావలయును. ఇంతకంటె నేను కోరదగిన దేదియు లేదనెను. త్రిమూర్తులట్లె వరమొసంగి, తమ తమ లోకములకు వెడలిపోయిరి. మరణ రాహిత్యమన స్థూలదేహ పతనమును తప్పించుకొనుటయే కాదు. స్థూలదేహమే గాక, సూక్ష్మ కారణ దేహములకు ప్రకాశకుడు ఆధారుడు అగు ఆత్మస్వరూపుడను నేనని గురువు అనుగ్రహముచే గుర్తించుటయే.

ఓం తత్ సత్

# గృహస్థుడును తరించవచ్చును

**శ్లో॥ "యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యః సమే ప్రియః ॥**

భావము:- ఎవడు ప్రియమును కాంక్షించడో, మఱియు అది లభించినపుడు హర్షించడో, అటులే అప్రియమును ద్వేషించడో, మఱియు నది ప్రాప్తించినపుడు శోకింపడో, శుభాశుభ ఘటనలకు గల విభేదము నట్లు పరిత్యజించు శీలముగల భక్తిమంతుడు, అర్జునా, నాకు ప్రియుడు.

మనము స్త్రీ పుత్ర ధనాది పదార్థములతో గూడియున్నను వాని యందలి భ్రాంతిని మాత్రము విడిచి యుండవలయును. ప్రారబ్ధానుసారముగ నీవు ప్రియ వస్తువును పొందినప్పుడు హర్షముగాని, అప్రియ వస్తువును పొందినపుడు ద్వేషమునుగాని పొందకుము. స్త్రీ, పుత్ర ధనాది పదార్థములెవ్వరికి దుఃఖ హేతువులు కావు. వానిని విడువవలసిన పని కూడ లేదు. దుఃఖహేతువులు కాని వానిని విడువ నెంచుట మూఢత్వమగును. వాని యందు అనురాగము మాత్రమే సర్వదుఃఖములకు కారణమగును. కాని, వాని యందు అనురాగమును మాత్రము విడువవలయును. ఈ విషయముననే గూర్చి మీకొక కథ చెప్పెదను వినుము.

పూర్వము మాళవదేశమును శిఖిధ్వజుడను రాజు పరిపాలించుచుండెను. అతనికి చూడాలయను భార్య గలదు. వారిద్దరెప్పుడు నెడబాయక పరస్పరము అనురాగముతో మెలంగుచుండిరి. అట్టి తరి చూడాల పక్వమైన ఫలమునకు పతనము తప్పనియట్లు మనుజులకు మరణము దుర్నివారమైనదని తలంచి, సద్గురుని వలన ఆధ్యాత్మ విద్య గ్రహించి, అహర్నిశలు ఆత్మవిచారణ చేయుచు బ్రహ్మవేదిని అయ్యెను. ఒకనాడు శిఖిధ్వజుడు తన భార్య యందు ప్రకాశించుచున్న బ్రహ్మతేజస్సును చూచి ఇది నీకెట్లు

గలిగెనని యడిగెను. ఆమె యనృతజడ దు:ఖాత్మకమగు సర్వ సంసార భ్రాంతిని విడిచి, నేను సత్యజ్ఞానానందాత్మ యందు రమించుచున్నదానను. కావున నాకీ కాంతి కలిగినదని చెప్పెను. శిఖిధ్వజుడు నీవు బాల్యచాపల్యముచే నిట్లు పలుకుచున్నావు. నీవును నావలె విషయభోగములయందు వర్తించుచు, బ్రహ్మానంద మనుభవించుచుంటి వనుట పరిహాసాస్పదము అగును. బ్రహ్మానందము సర్వసంగ పరిత్యాగులకే లభించునుగాని, భోగాసక్తులకు లభింపనేరదని చెప్పి, తీవ్ర వైరాగ్యము గలవాడై స్త్రీ పుత్ర ధన రాజ్యాది సమస్త పదార్థములను పరిత్యజించి, కౌపీన దండ కమండలములను ధరించి, మందరశైల ప్రాంతమున నున్న మహారణ్యముల కేగి, యచ్చట నాశ్రమము నిర్మించుకొని, ఘోరముగ తపమొనరించు చుండెను.

అప్పుడు చూడాల భర్తకు జ్ఞానోపదేశము చేయవలయునని తలంచి, ధైర్యము వహించి, తాను యోగాభ్యాస మొనరించుచు నణిమాద్యిష్ట సిద్ధులను బడసి యొకనాడు మునికుమారుని వేషముధరించి, ఆకాశ మార్గమున మందరాచల ప్రాంతారణ్యమున నున్న శిఖిధ్వజుని ఆశ్రమము చెంత కేతెంచెను. శిఖిధ్వజుడు బాలసూర్యుని వలె ప్రకాశించుచున్న ఆ మునికుమారుని జూచి, అర్ఘ్యపాద్యాది విధుల బూజించి, ఉచితాసనమున గూర్చుండబెట్టిన పిదప, "మీ రెవ్వరు? ఎవ్వరి పుత్రులు?" అని యడిగెను. మునికుమారుడు "నేను కుంభుడను నామము గలవాడను. నారదుని పుత్రుడను. మీ రెవ్వరు? మీ వృత్తాంత మేమి"యని యడిగెను.

"అయ్యా! నేను శిఖిధ్వజుడను పేరుగలవాడను. మాళవ దేశమునకు రాజును. జనన మరణ సంసార దు:ఖములకు వెఱచి, సర్వసంగ పరిత్యాగుడనై యీ వనమున తప మాచరించు చుంటిని. కాని యింతవరకు నాకు ఆత్మశాంతి కలుగలే"దనెను.

అప్పుడా బాలమౌని, రాజా! మోక్షమునకు జ్ఞాన మొక్కటియే సాక్షాత్సాధనము. ఆ జ్ఞానము వైరాగ్యము లేనిచో కలుగదు. తప స్స్వాధ్యయనాది కర్మము లంత:కరణ శుద్ధిని, చిత్తైకాగ్రతను మాత్రమే కలిగించును. సాధన చతుష్టయ సంపన్నుడగు సద్గురుని వలన బ్రహ్మజ్ఞానము పొందినచో శాంతి, మోక్షము కలుగుననెను.

శిఖిధ్వజుడు అయ్యా! ఈ విషయము నా భార్య మొదటనే చెప్పినది. కాని మౌర్ఖ్యంబున నామె మాటలను నిరాకరించి సజ్జన సాంగత్యమును పరిత్యజించి, వనమునందు ఘోరముగ తపమాచరించు చున్నాడను. కాని నా కాత్మశాంతి యింతదనుక కలుగలేదు. నా సుకృత విశేషముచే చిరకాలమునకు మీ దర్శనభాగ్య మబ్బినది. నేను మీకు శిష్యుడనైతిని. నన్ను అనుగ్రహింపుడనెను.

ముని కుమారుడు రాజా! నీ కాత్మశాంతి కలుగవలయు నినిచో జ్ఞానము పొందవలయును. జ్ఞానము కలుగవలయుననినచో వైరాగ్య ముండవలెను, వైరాగ్యము లేనివానికి జ్ఞానముగాని శాంతి గాని కలుగనేరవు. కావున నీవు శాంతిని గోరినచో సర్వసంగ పరిత్యాగివి కావలయును. అట్లయిన నీకు జ్ఞానోపదేశము చేసెదననెను.

రాజు అయ్యా! నేను రాజ్యమును, గృహమును, ధనమును, ఆలుబిడ్డలు మొదలగు సమస్తమును త్యజించితిని. ఇంకను నేను త్యజింపదగిన దేమున్న దనెను. రాజా నీవు స్వీయంబులు కాని యితర పదార్థములను విడిచిన మాత్రమున నీవు సర్వసంగ పరిత్యాగివి కావు. నీచే కల్పితమై నీ సుఖ దు:ఖములకు కారణములగు వానిని నీవు విడిచిపెట్టలేదు. వానిని విడిచి పెట్టినపుడే సర్వసంగ పరిత్యాగివి అగుదువనెను. రాజు అట్లయిన నేను కల్పించుకున్న యీ పర్ణశాల, కృష్ణాజినము, దండ కమండలములు, కౌపీనము మొదలగు సమస్త వస్తువులను విడిచెదను చూడుమని, వాని కగ్నిదరికొల్పి యిక నేను సర్వసంగ పరిత్యాగినైతినని చెప్పెను. ఆ మాటలు విని ముని కుమారుడు నవ్వి రాజా! నీవు నీచే కల్పింపబడిన దానిని దేనిని విడువకయే సర్వసంగ పరిత్యాగినైతినని వృథాభిమానమును చూపుచున్నావు. సర్వసంగ పంరిత్యాగివైనచో నీదనువస్తువే లేకపోవలయును గదా! యనెను.

రాజు అయ్యా! నా సర్వము నిపుడు మీయెదుటనే దహించివైచితిని గదా! ఇంకను నాదను వస్తువెచ్చట నున్నదనెను. ముని కుమారుడు రాజా! నీదను వస్తువుల నన్నిటిని కాల్చి వేచితినంటివి కదా! అట్లయిన యీ దేహమెవరిదని యడిగెను. రాజు నాదేయని

బదులు చెప్పెను. ముని కుమారుడు నాదను వస్తువింకను మిగిలియే యున్నదికదా! యనెను. రాజు వెంటనే లేచి నాదను వస్తువు లేకుండ జేసెదనని చెప్పి యగ్నిలో బడబోయెను. అది చూచి మునికుమారుడు రాజా! ఆగుము. ఈ శరీరము దహింపజేసినచో భస్మమగును. ఆ భస్మమెవరిదగునని యడిగెను. రాజు నాదే యనెను.

ముని కుమారు రాజా! శరీరము భస్మమైపోయినను నాదనునది ఇంకను మిగిలియున్నది గదా! దాని నేమి చేసెదవని యడిగెను. రాజు ఏమియు దోచక మహాత్మా! నే నజ్ఞానిని. మూఢుడను. నా కేమియు తెలియదు. నాకు సర్వసంగ పరిత్యాగము సిద్ధించి, మోక్షము లభించు పద్ధతి ననుగ్రహింపుడని వేడుకొనెను.

అందులకు ఆ మునికుమారుడు రాజా! నీవు రాజ్యము, ధనము, గృహారామక్షేత్రాదులు, దేహ పుత్రమిత్ర కళత్రాదులు మొదలగు సమస్తమును విడిచినను సర్వసంగ పరిత్యాగివి కాజాలవు. వీని నెన్నటికిని విడువజాలవు. ఇవి అన్నియు ప్రారబ్ధానుసారముగ నీకు సంభవించుచుండును. ప్రారబ్ధము తీరినచో నవి తమంతట తామే నశించిపోవును. నీవు వీనిని త్యజించ నెంచుట మూఢత్వము. దేహాభిమానమును, విషయానురాగమును త్యజించినచో నీవన్నిటిని ద్యజించిన వాడవగుదువు. విషయానురాగము విషయవాసనల వలన నేర్పడును, అంత:కరణమున విషయవాసన లున్నంతవఱకు సర్వ సంసారము, నిన్నంటియే యుండును. వాసనలను వీడినచో నీవు సంసారము నందుండినను సన్యాసివే యుగుదువు. పడవ నీళ్ళలోనే వుండవలయును గాని పడవలో నీళ్ళుండరాదు. అట్లే బ్రహ్మవేత్తయైనను ప్రపంచములో వుండవలయును గాని, ప్రపంచవాసన లతనిలో వుండరాదు. పడవలో నీళ్ళుండినచో, అది మునిగిపోవునట్లు బ్రహ్మవేత్త అంత:కరణము నందు ప్రపంచ వాసనలుండినచో నతడీ సంసార సముద్రమున మునిగిపోవునని చెప్పి అతనికి బ్రహ్మవిద్యోపదేశ మొనర్చెను. రాజునకు బ్రహ్మనిష్ఠ దృఢపడిన పిదప నిజస్వరూపమును జూపి తమ రాజ్యమునకు తీసికొనిపోయెను. వారిద్దఱు విషయ వాసనారహితులై బహుకాలము రాజ్యపరిపాలనమొనర్చి మోక్షమును పొందిరి.

**శ్లో॥ "ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥** **భ.గీ.అ.14.శ్లో.22**

ప్రకాశము - సత్వవికారము, ప్రవృత్తి - రజోవికారము, మోహము - త్రయోగుణవికారము, ఇవి చిదాభాసుని సంబంధించిన విషయములు. గుణాతీతుడు సంప్రాప్తములైన ప్రకాశాదులను ద్వేషింపను ద్వేషింపడు. మఱియు తొలగిపోవలయునని కోరడు. నిత్య నిరంతర నిర్వికల్ప సమాధ్యగ్ని చేత అహం మమ అనెడి అధ్యాస సంబంధియైన బంధమును నిశ్శేషముగా దగ్ధముచేసిన వాడగుట వలన జ్ఞాని ప్రవృత్తి యందుగాని నివృత్తి యందుగాని పరమశాంతినే పొందియుండును.

ఓం తత్ సత్

# మానవ జన్మ ప్రాశస్త్యము

**శ్లో॥ "ఆహార నిద్రా భయమైధునంచ, సామాన్యమే తత్పశుభిర్నరాణామ్ ।**
**జ్ఞానం నరాణా మధికం విశేషో, జ్ఞానేనహీనా, పశుభి: సమాన: ॥**

ఆహార నిద్రాభయమైదు నాదులయందు మానవులు, పశు పక్ష్యాదులు సమానములు. ఆత్మజ్ఞానమువలననే మానవుడితర జీవుల కంటె శ్రేష్ఠుడనబడు చున్నాడు. ఆత్మజ్ఞానము లేనివాడు పశువుతో సమానుడని శాస్త్రమునందు గలదు. అనేక జన్మములయందు చేయబడిన పుణ్యకర్మల విశేషముచే జీవునకు మానవజన్మ లభించుచున్నది. పవిత్రమైన మానవజన్మ మెత్తియు పశుపక్ష్యాది నీచ జంతువులవలె విషయభోగములతో కాలము గడుపు మూఢుడు డెనుబది నాలుగు లక్షల జీవయోనుల యందు పుట్టుచు, చచ్చుచు, తిరుగుచుండును. ఇందుల కొక కథ ఉదాహరణ పూర్వకముగా జెప్పెదను వినుము.

ఒక పెద్ద పట్టణమునందు ఒక గ్రుడ్డివాడు ఉండెను. అతనికి పట్టణము నందనేక కష్టములు సంభవించుటచే అతడు దానిని విడువ నిశ్చయించుకొని, ఒక పెద్దమనుష్యుని బయటకు పోవుదారి నడిగెను. అందులకాయన యీ పట్టణమున కొక్కటే మార్గము గలదు. చుట్టు కోటగోడ యెత్తుగా నుండెను. ఆ గోడ బట్టుకొనిపోయినచో ద్వారము లభించునని చెప్పి, అతని నా గోడను పట్టించెను. గ్రుడ్డివాడా గోడ బట్టుకొని నడచుచు ద్వారము సమీపమున కేగెను. అతని శరీరమున తామరరోగ మున్నది. ద్వారము సమీపమునకు రాగానే యతని తామరయందు దురదరేగెను. అప్పుడతడు గోడమీద చేతిని దీసి గోగికొని దురద తీరిన పిదప మరల చేతిని గోడమీద వేసి గోడబట్టుకొని నడచుచుండెను. గోకికొనినప్పుడు కూడ నతడు నడచుచుండుటచే ద్వారము వెనుకబడిపోయెను. మరల నతడు గోడబట్టుకొని పట్టణము చుట్టి తిరిగి రావలసివచ్చెను.

పట్టణము చాలా పెద్దది. మార్గము ముండ్లతోడను, ఊబలతోడను, మెరక పల్లములతోడను నిండియుండెను గ్రుడ్డివాడా మార్గమున బహు దు:ఖముల ననుభవించుచు, నడచి ద్వారము సమీపమునకు వచ్చుసరికి అతని భాగ్య దోషముచే మరల తామర యందు దురద రేగెను. ఆ తీట గోకికొనుచు నడుచుచుండుటచే మరల ద్వారము వెనుకబడిపోయెను. ఈ విధముగా గ్రుడ్డివాడు మరల మరల జుట్టివచ్చుచు ననేక దు:ఖముల ననుభవించుచుండెను.

అజ్ఞానియగు జీవుడు నట్టి గుడ్డివానితో సమానుడు. ఎనుబది లక్షల యోనులే కోటగోడ. మనుష్యదేహము ద్వారము. విషయ వాసనలు తామర. అజ్ఞానియగు జీవుడు ఎనుబది నాలుగు లక్షల జీవయోనులందు బుట్టుచు చచ్చుచు, తిరిగి తిరిగి యొకానొకప్పుడు మనుష్య దేహమును పొందుచున్నాడు. ఇదియే ముక్తికి మార్గము. అయిన అజ్ఞానియగు జీవుడు మనుష్య శరీరము ముక్తికి మార్గమని తెలియజాలక తామరరోగమువంటి విషయభోగముల యందు జిక్కి, ఆయువును వ్యర్థముగ గడుపుచున్నాడు. తామర గోకుకొనునపుడు సుఖముగ దోచుచున్నట్లు విషయభోగములను అనుభవించునపుడు సుఖముగ కనుపించును. గోకిన పిదప తామర యందు మంటపుట్టునట్లు, అనుభవించిన పిదప విషయభోగములు బహుదు:ఖములను కలుగజేయును. విషయభోగముల ననుభవించు మానవుడు పరమార్థమును గోరడు. అనేక జన్మముల సుకృత విశేషమువలన మోక్షద్వారమైన మనుష్య దేహమును పొందియు, ఆత్మజ్ఞానము సంపాదింపక విషయభోగము లందే కాలము గడుపువాడు మృతినొందిన పిదప పశ్వాది నీచయోనుల యందు జన్మించి బహుదు:ఖముల ననుభవించుచున్నాడు.

**శ్లో॥ "నర దేహాతిక్రమణాత్ ప్రాప్తౌ పశ్వాది దేహానాం**
**స్వతనో రప్యజ్ఞానం పరమార్థ స్యాఽ త్రికా వార్తా॥**

మనుష్యదేహము నందు ఆత్మజ్ఞానము పొందక విషయ భోగములయందే ఆయువంతయు గడిపినవాడు మనుష్యదేహము నశించిన పిమ్మట, పూర్వము జేసిన

పాపకర్మల ననుసరించి, పశ్వాది దేహములను ధరించుచున్నాడు. ఆ పశ్వాది శరీరములయందు సంపూర్ణమగు దేహజ్ఞానమే యుండదు. ఇక పరమార్థజ్ఞాన మెట్లు కలుగును? వానికి ఇహపరజ్ఞాన మేమాత్రము ఉండదు. సర్వకాల సర్వావస్థలయందు అవి దు:ఖమాత్ర మనుభవించు చుండునని ప్రబోధ సుధాకరమునందు చెప్పబడెను. కాన మానవులు స్వరూపజ్ఞానమును ఆచార్యులవద్ద తెలిసికొని జన్మ సార్థకము చేసికొందురుగాక.

ఓం తత్ సత్

## ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి

**శ్లో॥ "నవారే పత్యు:కామాయ పతి: ప్రియోభవతి ।**
**ఆత్మనస్తు కామాయ పతి: ప్రియోభవతి ॥**

భావము:- భార్య భర్తసుఖముకొఱ కతనిని ప్రేమించుట లేదు. తన సుఖము కొఱకు మాత్రమే అతనిని ప్రేమించుచున్నది.

**శ్లో॥ "నవారే జాయాయై కామాయ జాయా ప్రియాభవతి ।**
**ఆత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి ॥**

భావము:- భర్త భార్య సుఖముకొఱకామెను ప్రేమించుట లేదు.

తన సుఖముకొఱకే ఆమెను ప్రేమించుచున్నాడు. ప్రతి జీవుడు తన సుఖము కొఱకు ఇతరులను ప్రేమించుచున్నాడు కాని యితరుల సుఖముకొఱకు తానెవరిని ప్రేమించుటలేదు.

ఈ విషయమునే ఒక పురాతన కథ ద్వారా తెలియగలము. ఒక గ్రామమునందొక షాహుకారుండెను. అతనికొక కుమారుడు గలడు. అతడు నిత్యము ఒక మహాత్ముని సన్నిధికేగి వేదాంత శాస్త్ర శ్రవణము చేయుచుండెను. తల్లిదండ్రులది చూచి నిత్యము మహాత్ముని బోధను విన్నచో వైరాగ్యము గలిగి సన్యసించునేమోయని భయపడి వానికి తొందరగా వివాహము చేయుట మంచిదని తలంచిరి. వెంటనే యౌవన రూపలావణ్యములుగల స్త్రీని వివాహము చేసిరి. వివాహమైన పిదపగూడ నతడు మహాత్ముని యొద్దకు వెళ్ళుట మానలేదు. అది చూచి అతని తల్లిదండ్రులు కోడలితో "నీ భర్త నిత్యము నొక మహాత్ముని యొద్దకు వెళ్ళుచుండెను. ఆయన బోధను వినినచో వైరాగ్యము గలిగి నీ భర్త నిన్ను విడిచి సన్యసించును. నీవెట్లయిన నతనిని అచ్చటకు బోకుండ చూచుకొనవలయు"నని చెప్పిరి.

అప్పుడామె భర్తకు వివిధ సేవలు చేయుచు, అతి ప్రేమను జూపించుచు, అతనిని తనకు వశీభూతునిగా నొనర్చుకొనెను. అంత నతడు క్రమముగ మహాత్ముని యొద్దకు వెళ్ళుట తగ్గించి, రెండు మూడు దినముల కొకసారి మాత్రము వెళ్ళుచుండెను.

అది చూచి భార్య భర్త పాదముల నొత్తుచు, కన్నుల వెంట నీరుకార్చుచు నిట్లనెను. "నేను నిన్ను చూడనిదే, యొకక్షణమేనియు నుండలేను. నీవు బయటికేగినపుడు నా కొంటరిగ నుండుటకు భయమగుచున్నదని యేడ్చెను. భార్య మాటలను విని జాలినొంది యతడు మహాత్ముని యొద్దకేగుట పూర్తిగా మానివేసెను. ఇట్లు కొన్ని దినములు గడచిన పిదప ఒకనాడు అతనికి ఒక అంగడి వీధిలో మహాత్ముడు కన్పించెను. అప్పుడా మహాత్ము డాతనితో నీవిప్పుడు ఆశ్రమమునకు వచ్చుటలేదేమని యడిగెను.

అతడు అయ్యా! నా భార్య మహాపతివ్రత. ఆమె నిరంతరము నా సేవయందే నిమగ్నమై యుండును. నన్ను విడిచి ఆమె యొక్క క్షణమేనియు నుండజాలదు. ఆమె నొంటరిగా విడిచిపెట్టి రాలేక పోవుచున్నా ననెను. మహాత్ము డతనితో పిచ్చివాడా! లోకములో నెవరును నితరుల సుఖముకొఱకు వారిని ప్రేమించుట లేదు. తన సుఖము కొఱకే యితరులను ప్రేమించుచున్నారు. నీ భార్య తన సుఖము కొఱకే నిన్ను ప్రేమించుచున్నది; కాని నీ సుఖము కొఱకామె నిన్ను ప్రేమించుట లేదు. నా మాటల యందు నీకు విశ్వాసము లేనిచో, నీ వొకనాడు నేను చెప్పినట్లు పరీక్షించి చూడుము. అప్పుడన్నియు నీకు స్పష్టముగా దెలియును. నేను నీకు శ్వాసను నిరోధించెడు ఉపాయమును జెప్పెదను. ఒకనాడు నీవు నీ భార్యతో నేడు నాకు క్షీరాన్నము, మిఠాయి తినవలెనని యున్నది; చేసిపెట్టుమని యడుగుము. ఆమె వానిని సిద్ధము చేయగానే నీవు కడుపులో నొప్పి వచ్చినట్లు నటించి తన్నుకొనుచు కొంతసేపటికి నేను చెప్పిన శ్వాస నిరోధపు యుక్తిచే నుచ్ఛ్వాస నిశ్వాసములు లేనివాడవై చనిపోయినట్లు పడియుండుము. అప్పుడన్నియు నీకు ప్రత్యక్షముగ బోధపడును. నా మాట తప్పుగూడదని యొప్పించుకొని మహాత్ముడు వెళ్ళిపోయెను.

తరువాత షాహుకారు కుమారుడు ఇంటికి వచ్చి భార్యతో నాకు క్షీరాన్నము, మిఠాయి తినవలయునని యున్నది. చేసిపెట్టమని యడిగెను. ఆమె అట్లే చేసిపెట్టెదనని చెప్పి తొందరగా సిద్ధపరచెను. ఇంతలో కడుపునొప్పి వచ్చినట్లు నటించి యింటికి పాతియున్న రెండు స్తంభముల మధ్య కాలు నిరికించి తన్నుకొను చుండెను. భార్య తొందరగా పరుగెత్తుకొనివచ్చి యిది యేమని యడుగగా నతడు కడుపులో మిక్కిలి బాధగా నున్నదని చెప్పి మహాత్ముడు చెప్పిన ఉపాయముచే శ్వాసను బంధించి చచ్చినవానివలె పడిపోయెను. అది చూచి అతని భార్య "ఇతడు చచ్చిపోయినాడు. ఇప్పుడు నేనేడ్చుచున్నచో నలుగురు ప్రోగయ్యెదరు. ఈ శవమును పారవేయువరకు నేను ఆకలితో బాధపడవలసి యుండును. క్షీరాన్నము కూడ చెడిపోవును. కావున నేనిప్పుడు క్షీరాన్నమును భుజించెదను. మిఠాయి చెడిపోదు. కావున దానిని దాచియుంచెద''నని తలంచి మిఠాయిని పెట్టెలో పెట్టి దాచి, క్షీరాన్నమును కడుపునిండ భుజించిన పిదప నేడ్చుటకు మొదలుపెట్టెను. ఆ రోదన ధ్వనికి తలిదండ్రులు యిరుగుపొరుగు వారందరు పోగై, ఈయన యెట్లు మరణించెనని యడిగిరి. ఆమె గంటకు ముందు కడుపునొప్పిగా వున్నదని పండుకొని ప్రాణములు విడిచినాడని చెప్పెను. అది విని ఇరుగు పొరుగు వారిక ఆలస్యము చేయరాదు. వెంటనే స్మశానమునకు దీసికొనిపోయి దహనము చేయవలయునని చెప్పి, శవమును బయటికి తీసుకొని వెళ్ళుటకు ప్రయత్నించగా, నతని కాలు రెండు స్తంభముల మధ్య నిఱుకుకొని యున్నది. ఎంత ప్రయత్నించినను రానందున వారు స్తంభమును నఱికి కాలు బయటికి తీయుదమని ప్రయత్నించుచుండగా, అతని భార్య అట్లు చేయవలదు. ఈ స్తంభమును నఱికినచో మరల నాకెవరు దీనిని సరిజేసి యిచ్చెదరు? ఈ శరీరమెట్లును దహనము చేయునదే గనుక కాలు నఱుకుటకు ప్రయత్నము చేయుడు అనగా అతడు లేచి కూర్చుండి నా కడుపులో నొప్పి యిప్పుడు సర్దుకున్నదని చెప్పెను. ఇరుగు పొరుగు వారందరు ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోయిరి. అతడు లేచి మహాత్ముని సన్నిధికేగి జరిగిన వృత్తాంతమంతయు జెప్పెను.

మహాత్ముడు బిడ్డా! నేను జెప్పినదంతయు సత్యమైనదా? సందేహ మేమియు లేదుగదా? యని యడిగెను. అతడు నాకేమియు సందేహము లేదు. మీరు చెప్పినదంతయు సత్యము. తన సుఖము కొఱకే భార్య భర్తను ప్రేమించుచున్నది. భర్త సుఖము కొఱకెప్పుడును భార్య ప్రేమించుటలేదని చెప్పి అప్పటినుండి మహాత్ముల వలన వేదాంత శాస్త్రమును శ్రవణము చేసి తరించెను. కావున మనము కూడ మహాత్ముల వద్ద బ్రహ్మోపదేశమును పొంది తరింతుము గాక.

ఓం తత్ సత్.

# ఈశ్వరసృష్టి - జీవ సృష్టి

దృశ్యమైన నామరూప క్రియాత్మకమగు నీ భూత భౌతిక ప్రపంచ మీశ్వర రచితము. ఈ ప్రపంచ పదార్థములయందుగల అహంకార మమకారములు జీవరచితములు. ఇందీశ్వర సృష్టియైన బాహ్యపదార్థము లెవరికిని బంధమును గలిగింపవు. జీవసృష్టియైన మనోమయద్వైతమే బంధమునకు హేతువగును. దానివలననే మానవులకు సమస్త సుఖ దు:ఖములు సంభవించుచున్నవి. ఇందుకు కొన్ని దృష్టాంతములను తెలిపెదను.

దృష్టాంతము:- ఒక గ్రామమునందు రామశర్మ, భీమశర్మ యను నిరువురు బ్రాహ్మణులు గలరు. రామశర్మకు గోపాలశర్మ యను పుత్రుడు, భీమశర్మకు కృష్ణశర్మ యను పుత్రుడు గలరు. ఆ బ్రాహ్మణ కుమారు లిరువురు విద్య నభ్యసించుటకు వారణాసి వెళ్ళిరి. ఒక సంవత్సరమునకు భీమశర్మ కుమారుడు కృష్ణశర్మ మృతి నొందెను. గోపాలశర్మ అధిక విద్యావంతుడై అమితముగ ధనము సంపాదించుచుండెను.

కొంతకాలమునకు వీరి స్వగ్రామము నుండి యొకడు యాత్రార్థముగా కాశికి వెళ్ళి అచ్చట కృష్ణశర్మ మృతినందినట్లును, రామశర్మ కుమారుడు గోపాలశర్మ విద్యావంతుడై అధిక ధనము సంపాదించుచున్నట్లు వినెను. అతడు స్వగ్రామమునకు వచ్చి పొరపాటుగా రామశర్మ కుమారుడు గోపాలశర్మ మరణించెననియు భీమశర్మ కుమారుడు కృష్ణశర్మ అధిక విద్యావంతుడై అమిత ధనమును సంపాదించిననియు తారుమారుజేసి చెప్పెను. అది విని రామశర్మ మహా దు:ఖమును పొందెను. భీమశర్మ మహానంద సాగరమున మునింగెను. చూడుము - ఈశ్వర రచితుడగు మాంసమయ పుత్రుడు వారణాసిలో అధిక విద్యావంతుడై బహు ధనము గడించుచు జీవించి యుండినను యాత్రికుని వాక్యము వలన జీవరచితుడగు మనోమయ పుత్రుడు మృతినొందుటచే రామశర్మ మహాదు:ఖము ననుభవించెను. ఈశ్వరరచితుడగు మాంసమయ పుత్రుడు వారణాసిలో మరణించినను యాత్రికుని వాక్యముచే

జీవరచితుడగు మనోమయ పుత్త్రుడు అధిక విద్యావంతుడై అధిక ధనమును సంపాదించుచు జీవించి యుండుటచే భీమశర్మ మహదానందము ననుభవించెను.

కొన్ని సంవత్సరములకు గోపాలశర్మ గొప్ప విద్వాంసుడై బహుధనమును సంపాదించి యింటికి వచ్చెను. అమిత విద్యావంతుడును, ధనవంతుడునైన పుత్త్రుడు జీవించి యుండుటను గాంచి రామశర్మకు విస్మయానందములు కలిగెను. తన పుత్రుని మరణ వార్త వినుటవలన భీమశర్మకు కమిత దు:ఖము కలిగెను. కావున జీవసృష్టియగు మనోమయద్వైతమే సర్వబంధములను కలిగించును. ఇదియే సర్వ దు:ఖములకు కారణమగును.

2. స్త్రీ - యీశ్వర నిర్మితమగును. ఆమెను జూచి యొకడు భార్యయనియు, నొకడు తల్లియనియు, నొకడు సోదరియనియు నీ విధముగ అనేకు లనేక భావములను కల్పించుకొనుచున్నారు. ఆ స్త్రీ మాంసమయ ఆకారము నొక్కటిగా యున్నను మనోమయాకారములు వారి వారి సంబంధముల ననుసరించి, మనోవృత్తులు వేరు వేరుగా నుండును.

3. ఈశ్వర నిర్మితమైన పశువు సంతలో అమ్మకమునకు వచ్చినపుడు మాదిగవాడు చర్మము ఖరీదునుబట్టి బేరమాడును. కటికవాడు మాంసము ననుసరించి ఖరీదడుగును. గొల్లవాడు పాలను చూచుకొని బేరమడుగును. సత్పురుషులు అందచందమును, సాధుత్వమును చూచి ఖరీదడిగెదరు. ఈశ్వర రచితమైన మాంసమయ పశువు ఒక్కటియేయైనను వారివారి అవసరములను బట్టి మనోమయ పశువు లనేకములగును.

4. ఈశ్వరరచితమైన గులాబి పుష్పము ఒక పార్కునందు కన్పించుచుండెను. అందు విశ్రాంతి తీసుకొనుటకై వచ్చి కూర్చొని యున్న పూలవర్తకుడు తాను చిన్న చిన్న గులాబి పుష్పమును అర్ధరూపాయకు అమ్ముచున్నాను. ఈ పెద్ద గులాబి పుష్పము రూపాయి కమ్మి మరింత లాభమును సంపాదించుకొన వచ్చునని తలంచెను. అట్లే విశ్రాంతికై వచ్చిన యువకుడు ఆ అందమైన పెద్ద గులాబి పుష్పమును తీసికొని వెళ్ళి తన ప్రియురాలు కిచ్చిన ఎంతో సంతోషించునని తనలో అనుకొనెను. ఒక వేదాంతి

ఆ పుష్ప సౌందర్యమును జూచి ఈశ్వరుని గొప్పతనముగదా యీ సృష్టి అంతయు అని ఆనందపడును. అట్లే వచ్చిన యొక కవి ఆ పుష్పమును జూచి ఆనందపడి కవితారూపములో ఒక పద్యమును అల్లి సంతోషపడెను. ఈశ్వరరచితమైన పుష్పము యొక్కటియైనను వారి వారి మనస్సులలో ఉన్న అభిరుచులనుబట్టి మనోమయ పుష్పము లనేకములాయెను.

లోహమును కరగించి విగ్రహాకారముగనున్న మూసయందు పోసినప్పుడా లోహమా మూసయొక్క ఆకారమును పొందునట్లు ఈశ్వర రచితమైన వస్తువు నందు వ్యాపించిన మనోవృత్తి యావస్త్వాకారమును పొందుచున్నది. ఇందు వస్తువు ఈశ్వర నిర్మితము. వస్త్వాకారమును పొందిన మనోవృత్తి జీవరచితము. ఈ జీవరచిత మనోమయ ద్వైతమే జీవుల సుఖదు:ఖములకు కారణమగుచున్నది.

స్వప్నమునందు ఈశ్వర రచితమగు బాహ్యపదార్థములు లేకపోయినను జీవరచితములగు మనోమయ పదార్థము లుండుటచే నచ్చట జీవులకు సుఖదు:ఖములు కలుగుచున్నవి. సుషుప్తి సమాధ్యవ స్థలయందు ఈశ్వర రచితములగు బాహ్యపదార్థము లున్నను, మనస్సు గాని, మనోమయ పదార్థములుగాని లేకపోవుటచే నా అవస్థలయందు జీవులకు సుఖదు:ఖములు కలుగుట లేదు. కావున జీవరచితమగు మనోమయ ద్వైతమే బంధ హేతువగును. ఈశ్వర రచితమగు బాహ్య ప్రపంచము అద్వైత జ్ఞానమునకు బాధకముగాదు. గురుశాస్త్రముల మూలమున నది సాధకమే యగుచున్నది. దీనిని నాశముచేయుట కూడ నెవ్వరికి సాధ్యపడదు. జీవకల్పిత మనోమయద్వైతమే జీవులకు బంధము కలిగించుచన్నది గాన దాని నివృత్తియే అత్యంతావశ్యకము.

**సర్వ సంసారమును మానసమున నొదవు,**
**సర్వ సంసారమును మానసమున నుండు,**
**సర్వ సంసారమును మానసమున నడగు,**
**సర్వ సంసారమును మానసంబె యగును.**

ఓం తత్ సత్

# దేహాత్మ మనోదృష్టులు

మనుజులలో మూడు తరగతులవారుందురు. కొందఱికి దేహదృష్టి, కొందఱికి మనోదృష్టి, మఱికొందరికి ఆత్మదృష్టి నుండును. ఒక ప్రాణిని చూడగానే బాహ్య ఆకారము మాత్రమే కొందరికి గోచరించుచుండును. వారి రూపురేఖలు, వారి సౌందర్యము, వారి కట్టు, వారి బొట్టు, వారి జుట్టు, వారి జాతి, వారి కులము, వారి రంగు - ఇవి మాత్రమే వారి దృష్టికి అగుపడుచుండును. ఇట్టివారు దేహదృష్టి గలవారు.

మరికొందరికి ఒక మానవుని చూడగానే అతని విద్వత్తు, అతని పాండితీ ప్రకర్ష, అతని సాహిత్య సంపద, అతని చదువు సంధ్యలు గోచరించుచుండును. ఇట్టివారు మనోదృష్టి గలవారు. మరికొందరికి మనిషిని చూడగానే అతని హృదయమందు వెలుగొందుచున్న సర్వభూతాంతర్వర్తి యగు పరమాత్మయే గోచరించుచుండును.

మిధిలానగరమును జనక మహారాజు పరిపాలించుచుండెను. అతడు ఆధ్మాత్మిక జిజ్ఞాస కలవాడు. యాజ్ఞవల్క్యుని వద్ద బ్రహ్మజ్ఞానము బొంది, ఆయనకు పెక్కు సమయములలో కొమ్ములకు బంగారము తొడిగిన గోవుల పెక్కింటిని దానముగా నొసంగెను. అట్టి జనక మహారాజు తన ఆస్థానమున గొప్పగొప్ప పండితులను, కవులను, భాషా ప్రవీణులను, శాస్త్రకోవిదులను రప్పించి సభ జరుపుచుండెను.

జనక మహారాజు ఆత్మానుభూతి కలిగిన అష్టావక్రుడు అను మహానుభావుని, ఆ పండితులు గల సభకు ఆహ్వానించెను. క్రిక్కిరిసిన ఆ సభలో, తమతమ పాండిత్య ప్రకర్షను వెలిబుచ్చుకొను వారు కొందఱు, తమతమ విద్యావైదుష్యమును భూపాలునకు పరిచయము చేయువారు కొందరు; ఈ విధముగ సభ కిటకిటలాడు చుండెను. ఇంతలో ఆహ్వానితుడైన అష్టావక్రమహర్షి సభలోనికి ప్రవేశించుచుండెను. ఆ మహనీయుని దర్శనము కొరకు, వారి వేదాంత పాండిత్యమును శ్రవణము చేయవలెనను

పండితులు ఆతురతో వారిని చూచిరి. అతని శరీరము యెనిమిది వంకరలు కలిగియుండుటచే ఆయనకు అష్టావక్రుడను పేరు గలిగెను. అతడు గొప్ప తపస్సు చేసిన మహనీయుడు. బహుకాలము తత్త్వ విచారణ సలిపి, తీవ్రసాధన యొనర్చి ఇంద్రియమనస్సుల నదుపులోనికి తెచ్చుకొని స్వస్వరూప పరమాత్మ సాక్షాత్కారమును బొందిన మహర్షి సత్తముడు. అతని ముఖము బ్రహ్మవర్చస్సుచే దేదీప్యమానముగ ప్రకాశించుచుండెను. అట్టి మహనీయుని ఆగమనమున, సభలో ఆసీనులైయున్న కవిశేఖరులు, పండిత ప్రకాండులు, ఆ మహర్షి భౌతిక దేహమునందు గల యెనిమిది వంకరలను చూచి ఒక్కుమ్మడి పకపక నవ్వసాగిరి. బిగ్గరగా నవ్వుచున్న ఆ పండిత మ్మన్యుల జూచి వెనుదిరిగి బోవుచుండెను.

జనక మహారాజు అది చూచి వెంటనే లేచివెళ్ళి ఆ మహర్షిని లోనికి ఆహ్వానించి తీసుకొనివచ్చెను. ఆష్టావక్ర మహర్షి సభలోనున్న పండితులను జూచి నవ్వసాగెను. మహర్షి అష్టవంకరలను జూచి సభాసదులు నవ్వి యుందురు. కాని తమరు నవ్విన కారణము కాకు దురుహ్యము. వివరించి కృతార్థులను చేయుమని జనక భూపాలుడు కోరెను.

ఆ వాక్యము విని మహర్షి యీ ప్రకారముగ సమాధానమిచ్చెను. ఓ రాజా! పండితుల సభ జరుగుచున్నదని నన్ను ఆహ్వానించిరి. అందులకు నేను సంతోషించి మంచి అవకాశము దొరికినదని పరమానందపడితిని. కాని నేను సభలో ప్రవేశించగనే వారు ప్రవర్తించిన తీరు చూచి నాకు పట్టరాని నవ్వు వచ్చినది. మాదిగవారి సభలోనికి నన్నేల జనకుడు ఆహ్వానించెనని నాకు నవ్వు వచ్చినది అని సమాధానము చెప్పెను.

ఈ సభ నలంకరించిన వారందరు మహా పండితులు, వారిని మాదిగవారుగ ఏల వచించుచున్నారని జనకుడు మహర్షిని ప్రశ్నించెను.

దానికి అష్టావక్రమహర్షి ఇట్లు వివరించెను. దేహదృష్టిగల వారు అధమ మానవులు, మనోదృష్టి గలవారు మధ్యములు, ఆత్మ దృష్టి గలవారు ఉత్తమోత్తములు. ఎన్ని విద్యలు

కలిగియున్నను భౌతిక దృష్టిని, స్థూలదృష్టిని, దేహదృష్టిని విడనాడి ఆత్మదృష్టి సంపాదించనిచో, ఆ విద్యలన్నియు నిరుపయోగములే. జీవిత లక్ష్యమైన ఆత్మదృష్టిని సంపాదించుకొనుటయే జన్మ సార్థకతకు ఏకైక మార్గము. మాదిగవారు చెప్పులు మొదలైనవి కుట్టుచుందురు. చర్మము పైననే వారి దృష్టి సదా ప్రసరించుచుండును. గొప్ప పండితుడైనను, చర్మముపైననే ఎవని దృష్టి యుండునో, ఎవడు దేహమును మాత్రమే జూచుచు దేహియగు ఆత్మను విస్మరించునో అతడు మహా మేధావియైనను, దేహదృష్టి గలిగియుండుట వలన మాదిగ వానితో సమానమేయగును.

పండిత మహాసభ జరుగుచున్నదని నన్ను ఆహ్వానించిరి. సభలో ఆసీనులైన పండితులు నా దేహమునే జూచిరిగాని, నా ఆత్మను గాదు. నా చర్మమునే వీక్షించిరి గాని, నాలోని చిత్స్వరూపమును గాదు. నా దేహ వికారములనే గమనించి నవ్విరి కాని, దేహాంతర్గత పరమాత్మను సందర్శించలేదు. దేహ భ్రాంతిని విడువనివారు ఎంత శాస్త్రాధ్యయనము చేసినను మాదిగవారి చర్యను అనగా చర్మావలోకనము చేయుచున్నవారే అగుదురు. జనక మహారాజు నన్ను పండిత మహాసభకు ఆహ్వానించెనే గాని, అచట కూర్చొనియున్న వారందరు మాదిగవారుగ కన్పించుచున్నారే యని నాకు నవ్వు వచ్చినదని వివరించెను. కాన ఆత్మ దృష్టి ప్రాశస్త్యమును, దేహ దృష్టి యొక్క నికృష్టత్వమును గుర్తెరింగిన వారమై సదా ఆత్మావలోకన తత్పరులమై జీవితమును చరితార్థ మొనరించుకొందము గాక.

ఓం తత్ సత్

## క్రోధాత్ భవతి సమ్మోహః

(ఆత్మశుద్ధి లేని ఆచార మదియేల)

కోపము ముఖ్యమైన దుర్గుణములలో ఒకటి. కోపము చావనిదే ఎన్ని శాస్త్రములను చదివినను ఏమియు ఫలముండదు. ఎన్ని కోట్లు నామజపము సల్పినను లాభముండదు. పైపై చేష్టల వల్ల ఏమియు ఉపయోగముండదు. చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా యని వేమన బోధ. దీనినొక కథారూపముగా తెలిసికొనుము.

ఒక గ్రామములో కమల పుష్పములతో శోభాయమానముగ నుండు ఒక చెరువు గలదు, ప్రభాత సమయమున సదాచార సాంప్రదాయ యుక్తుడగు ఒక బ్రాహ్మణోత్తముడు ఆ చెరువులో స్నానమాచరించి సూర్యున కర్ఘ్య మొసంగి తదుపరి ఆ చెరువుకట్టపై దర్భాసనము వైచుకొని జపమాలను చేత ధరించి, ఉత్తరాభిముఖుండై మంత్రజపము చేయుచుండెను.

ఆ సమయమున చాకలివాడొకడు విప్రునకు సమీపముగనే ఆ చెరువునందు బట్టలుతుకుచుండెను. ధ్యాననిష్టుడగు బ్రాహ్మణుని ఆ రజకుడు చూడలేదు. పొరపాటున ఉతుకుచున్న వస్త్రముల నుండి నీటి బిందువులు ఎగిరి ఆ విప్రునిపై బడెను. వెంటనే ఆ విప్రుడు జపధ్యానములను విరమించి తీవ్ర కోపముతో లేచి చూడగా బట్టలు ఉతుకుచున్న చాకలివాడు కన్పించెను. కోపము క్రోధముగా మారి కారుచిచ్చువలె అది హృదయసీమ నందంతటను వ్యాపింపదొడగెను. ఇచ్చట కోపమునకు క్రోధమునకు బేధము పరికించవలెను. కోపము నొకపనిముట్టుగా ఉపయోగించుకొని కార్య సాఫల్యము బొందవచ్చును. కాని కోపము స్వాధీనము తప్పి అందు తన్మయుడై ఒడలు మరచిన దుష్ఫలితములకు కడంగును. ఇచ్చట విప్రుడు క్రోధావేశుడై ఒడలు మరచినవాడై కైపులో తానెవరో ఎదుటి వాడెవడో తెలియ లేని నీచబుద్ధికి దిగజారిపోయెను.

**శ్లో॥ క్రోధాద్ భవతి సమ్మోహ: సమ్మోహత్ స్మృతివిభ్రమ: ।**
**స్మృతి భ్రంశాద్ బుద్ధినాశో, బుద్ధి నాశాత్ ప్రణశ్యతి ॥** **భ.గీ.అ.2.శ్లో.63**

బ్రాహ్మణోత్తముడు ఆ స్థితికి వచ్చి ఆ చాకలిని సమీపించి తనపై మురికి నీరు చల్లినందుకు అతనిని దుయ్యబట్టి దుర్భాషలాడి, అంతటితో ఆగక చాకలి వీపుపై మిక్కుటముగా కొట్టెను. చాకలి మారు పలుకలేదు, ప్రతీకారము సలుప లేదు. ప్రశాంతచిత్తుడై యుండెను. అట్లు జరిగిన తర్వాత బ్రాహ్మణునకు కోపము తగ్గి ఇట్లు విచారించ దొడంగెను, అయ్యో! చాకలి వానిని తాకితినే, నేను బ్రాహ్మణుడను, అతని కులమేమి, నా కులమేమి? ఎంత పొరపాటు జరిగినది, నా పవిత్ర శరీర మపవిత్రమైనదే అని పశ్చాత్తాపపడుచు, తాను మైలపడితినని భావించుచు ఆ మైలను పోగొట్టుకొనుటకై ఆ చెరువులో ఒక మూల స్నానము చేయుచుండెను. చాకలియు సమీపములో స్నానము చేయుచుండట చూచెను. చాకలి స్నానము చేయుట చూడగా ద్విజుని చిత్తమున సంభ్రమాశ్చర్యములు రేకెత్తెను. చాకలిని తాకినందుకు నేను స్నానము చేయుట న్యాయముగా నున్నది. మరి చాకలి యెందుకు స్నానము చేయుచున్నాడు అని తెలిసికొనుటకు రజకుని వద్దకు పోయి చాకలివైన నిన్ను తాకినందున బ్రాహ్మణుడనైన నేను స్నానము చేయుట న్యాయము. మరి నీవెందులకు స్నానము జేయుచున్నావని యడిగెను. అందులకు రజకుడు అయ్యా! నిన్ను తాకినందుకు నేను స్నానము చేయుచున్నాననెను. అది విని భూసురుడు ఇదెక్కడ న్యాయమురా! నేను బ్రాహ్మణుడను, నీవు అబ్రాహ్మణుడవు, నిన్ను స్పృశించినందున నేను స్నానము చేయుట సహేతుకము. మరి నీ స్నానము యొక్క ఆంతర్యము ఏమియని యడుగగా రజకుడిట్లు చెప్పెను.

ఓ విప్రవర్యా! మీ దేహము బ్రాహ్మణ దేహము, పవిత్రమైనది. అంతవరకు గౌరవించవలసినదే. కాని మీ శరీరము లోపల కోపమను చండాలుడు ప్రవేశించియున్నాడు. అతనిని స్పృశించినందున నేను అపవిత్రుడనైతిని. అందుచేత నేను స్నానము చేయవలసి వచ్చినది. రజకుని ఆ గంభీర వాక్యములు కర్ణపుటములందు పడగనే విప్రునకు జ్ఞానోదయము అయ్యెను. తన పొరపాటు నతడు గ్రహించి పరితప్త

హృదయుడయ్యెను. నేను శరీరమును విభూతి రేఖలచే అలంకరించుకొనుచున్నాను. మడి బట్టలచే పవిత్రము గావించుకొనుచున్నాను. కాని అంతరంగమున, శ్రుతి స్మృతులచే విడువదగినవిగా నిర్ణయమైన కామ క్రోధాలను చండాలురు, విజృంభించి వున్నారు. వారిని తొలగింపనిదే, వారికి ఉద్వాసన నొనర్పనిదే, ఈ శరీరము ఎంత పవిత్రముగ వున్నదనుకొన్నను, అపవిత్రమైనదే. దానిని బహు ప్రయత్నముతోనైనను దూరీకృతమొనర్చి బాహ్యశుద్ధితో పాటు అంతశ్శుద్ధిని కూడ సంపాదించుకొందును అని నిర్ణయము గావించుకొని అచ్చోట వీడెను.

ఇచ్చట మనము గ్రహించవలసినది ఒక పక్షమున దేహము యొక్క జన్మ బ్రాహ్మణ జన్మ, గుణములు శూద్రగుణములు. అనగా రజోతమో గుణములతో కూడిన కామ క్రోధాదులు. రెండవ పక్షమున దేహము యొక్క జన్మ శూద్రజన్మ. గుణములు సత్త్వ గుణములలో గూడిన శాంత, సహన, సమచిత్తత్వము. ఈ కథాంశమును గణణ చేసి గుణములకు ప్రాధాన్యమీయ వలయునో, జన్మకు ప్రాధాన్య మీయవలయునో నిర్ణయించుట విజ్ఞులకు విడిచివేయుదుము. యే జన్మవారైనను దుర్గుణములు, అతి నీచములైన కామ క్రోధములను ప్రయత్న పూర్వకంగా తొలగించుకొని శుద్ధసత్త్వ ప్రధానులము కావలయును. కోప ముపకారకము, క్రోధమపకారకము. కాన కోపమును క్రోధముగా పరిణమింప చేయరాదు.

ఓం తత్ సత్

# దైవ ప్రశ్న త్రయము

మాళవదేశమును రామప్రభువను రాజు పాలించుచుండెను. అతడు దానధర్మములు చేయుటయందు ప్రముఖుడు. శాస్త్ర విచారణ చేయుచు, నిరంతరము భగవద్భక్తి చేయుచు సత్కార్యములయందు నిమగ్నుడై యుండును. అతని ఆస్థానమున అనేక పండితులు, వేదవేదాంగ పారంగతులు సదా విరాజమానులై యుందురు. ఈ ప్రకారముగా రాజప్రసాదమున మిక్కుటముగ దైవగంధము వ్యాపించి యుండెను.

ఐనప్పటికిని రాజుగారి మనస్సునందు ఏదియో లోపించినట్లుగా బాధపడుచుండెను. ఎంత శాస్త్ర విచారణ చేసినప్పటికిని, ఎందరివలన వేదాంత శ్రవణము చేసినను అతనికి పూర్తి సంతృప్తి కలుగలేదు. ఆధ్యాత్మిక క్షేత్రమున కొన్ని సంశయములు అతనిని వేధించుచునే యుండెను. వారి ఆస్థానమునగల పండితులు వారి సంశయములను తీర్చనందున ఖిన్నుడయి స్వకీయసంశయ విచ్ఛేదనకు దారి ఏదియాయని పరిపరి విధముల ఆలోచించు చుండెను. ఇట్లుండ ఒకనాడాతని చిత్తకుహరమున పరిష్కార మార్గము మెఱుపువలె అకస్మాత్తుగా స్ఫురించెను.

రాజ ఆస్థానమున రాజవంశమునకు పౌరోహిత్యమును నెరపునట్టి మహాపండితు డొకడుండెను. అతడు శాస్త్రవిచారణ యందు నేర్పరి. ప్రతిపక్షాలను వాద వివాదములలో క్షణములో ఓడించగల వాక్పటిమ గలవాడు. లయితే అతడు పాండిత్య ప్రకర్ష గలవాడేగాని, అనుభవశూన్యుడు. వాచా వేదాంతియే గాని అనుష్టానతత్పరుడు గాడు. ఈ విషయము రాజుగారికి తెలియదు. బహుకాలము నుండి తనను బాధించుచున్న సంశయములను ఆ పౌరోహితుడు తృటిలో తొలగించగలడని తనలో తలంచెను. రాజు అవసరములు తీర్చవలసిన బాధ్యత కూడ పురోహితుని యందు కలదని నిశ్చయించి, ఒకనాడా పురోహితుని తన యొద్దకు ఏకాంతముగ పిలిచి తన

సందేహములనిట్లు వివరించెను - పండితోత్తమా! నన్ను మూడు సందేహములు చాలాకాలము నుండి పీడించుచున్నవి. ఎన్ని శాస్త్రములు చదివినను, ఎందరు పెద్దలను ప్రశ్నించినను నాకు సరియైన సమాధానము వచ్చుటలేదు. నాకు ఆందోళన జనింప మహాబాధితుడనై న్యాయస్థానము నందు గల మీ రొక్కరే ఆ సంశయములు నివారించగలరని ఊహించి మిమ్ముల పిలిపించితినని చెప్పెను. రాజుకు గల సంశయముల నివారించ వలసినది ఆస్థాన పురోహితుడేగదా! శ్రీరామచంద్రున కుదయించిన సంశయావళి నంతను వారి పురోహితుడగు వశిష్ఠ మహర్షి యోగవాశిష్టరూప దివ్య పరమార్ధబోధచే విచ్ఛన్న మొనర్చిరి. కాన నా సంశయములను మీ ముందుంచుచున్నాను. తమరు ఇతరులతో సంప్రదించిగాని, స్వయముగా గాని, శాస్త్రముల పరిశోధించి గాని బాగుగా విచారించి ఆరుమాసములైన పిదప నాకు తగు సమాధాన మొసంగవలసి యున్నది. ఆ గడువులోపల నాకు తగు ప్రత్యుత్తర మీయనిచో నా యాస్థానము నుండియేగాక, నా దేశము నుండి కూడ బహిష్కరించి వైచెదను. ఆ పశ్రలను చెప్పెదను వినుము.

1. దేవుడు ఎచట నున్నాడు?

2. దేవుడు ఏవైపు చూచుచున్నాడు?

3. దేవుడు ఏ పని చేయుచున్నాడు?

ఈ విధముగా రాజు తన పురోహితుని శాసించి పంపివైచెను.

పురోహితుడా ప్రశ్నలను విని మనస్సునందు బహు వ్యాకులత బొందెను. రాజడిగిన ప్రశ్నలకు సమాధానము బ్రహ్మానుభూతిగల మహనీయుడే చెప్పగలడు గాని, శాస్త్ర పరిశోధన చేసినవాడు చెప్పజాలడు, ఇక్కారణమున భగ్నహృదయుడై ఇంటికి వెళ్ళి అన్నపానాదులను కూడ స్వీకరించక, దిగులుతో, దుఃఖముతో ఆవేదన పడుచు మంచముపై పడియుండెను.

ఆ పురోహితుని ఇంటియందు ఆవులను మేపుచు ఇంటి పనులను చేయుచుండునట్టి గోపాలు డొకడుండెను. అతడు చిన్న వయస్సు గలవాడు. పూర్వజన్మ సుకృతముచే చిన్నతనము నుండియు భగవన్నామ ముచ్చరించుచు, భక్తితో తన్మయుడై భగవన్మహిమను వర్ణించు కీర్తనలు పాడుచు ఒడలు తెలియక ఆనంద నిమగ్నుడై యుండెను. భగవద్భక్తి ప్రధానుడగుటచే అతనికి జ్ఞాన ముదయించెను. వ్యాకులచిత్తుడైయున్న యజమానుని గోపాలుడు సమీపించి వినయముతో ప్రశ్నించి, అతని దీనత్వమునకు కారణమరసి యతనితో నిట్లనెను.

స్వామీ! తమరు దిగులు పడవద్దు. ఆరు నెలలైన తర్వాత రాజపురోహితుడనగు నేను ఆస్థానమునకు కారణాంతరముచేత రాలేక పోయితిని. నేను చెప్పవలసిన జవాబులు యీ చీటీ తెచ్చిన యువకుడు నా ప్రతినిధిగా చెప్పును. అని చీటీ వ్రాసి నాకు యిండు. నేను వెళ్ళి ప్రశ్నలకు తగు జవాబులు లొసంగి రాజునకు తృప్తి గలిగించి వచ్చెదనని గోపాలుడనెను.

ఆరు మాసములైన తర్వాత మహత్వపూర్ణమైన మూడు గొప్ప ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానము రానుండట బట్టి, అది వినవలెననే కుతూహలముతో అశేష జనులు రాజుగారు నిర్ణయించిన మహా సభా ప్రాంగణమునకు పరిసర గ్రామముల నుండి వచ్చి ఆసీనులైయుండిరి. ఈ విధముగ రాజాస్థాన మంతయు ఆధ్యాత్మిక జిజ్ఞాసువులచే, భాగవతులచే క్రిక్కిరిసిపోయెను.

ఇంతలో ఒక యిరువది సంవత్సరముల యువకుడు, చింపిరి గుడ్డలు ధరించి ఒక ఉత్తరమును తీసికొని రాజభవనములో ప్రవేశించి, పురోహితుని ఉత్తరమును ద్వారపాలకుని ద్వారా రాజునకు పంపించెను. రాజు ఉత్తరము చదువుకొని ఆ గోపాలుని సగౌరవముగ లోనికి రావించి ప్రశ్నలకు జవాబులు చెప్పవలసినదిగా కోరెను. వేలకొలది జిజ్ఞాసువులు కూడియున్న ఆ సభా మధ్యమున ఎత్తయిన సింహాసనముపై రాజు కూర్చొనియుండెను.

ఆ యువకుడు రాజును సంబోధించి ఇట్లనెను - ఓ మహారాజా! లోకములో ఒక సంప్రదాయము కలదు. ఒక గురుశిష్య న్యాయము కలదు. బోధించువాడు గురువు. బోధింపబడువాడు శిష్యుడు. బోధించునపుడు గురువు ఉన్నతస్థానము నధిష్టించి యుండుటయు, శిష్యుడు భక్తిభావముతో క్రింద చేతులు కట్టుకొని యుండటయు లోకాచారము, తదనుసారముగ బోధించు నేను గురువును, వినునట్టి నీవు శిష్యుడవు అయియున్నాము. గురు వున్నతస్థాన మలంకరించ వలెను గాన నేను సింహాసనముపై నెక్కెదను. శిష్యుడు క్రింద చేతులు కొట్టుకొని నిలబడవలెను కాబట్టి మీరు సింహాసనము పైనుండి దిగగోరెదను.

గోపాలుని పలుకులు సహేతకములని, యుక్తియుక్తములని రాజు భావించి సింహాసనము దిగి ఎదురుగా చేతులుకట్లుకొని నిలబడి యుండగా గోపాలుడు సింహాసనముపై నెక్కి కూర్చొని యుండెను.

ఇక ప్రశ్నలకు సమాధానము చెప్పుమని కోరగా గోపాలుడు ఏదైన శుభకార్యములు చేయునపుడు ముందుగా దీపారాధన చేయవలెను. దేవునకు పూజ అభిషేకము చేయవలెను. కాన ఒక గ్లాసులో పాలుపోసి తెప్పింపుమని కోరెను.

రాజట్లే అన్నియు తెప్పించెను. పూజాదికము లొనర్చబడెను.

మొదటి ప్రశ్న - "దేవు డెచ్చటనున్నాడు" అను ప్రశ్నకు సమాధానము చెప్పవలసినదిగా రాజుగారు కోరినారు. అంతట గోపాలుడు పాలపాత్రను పైకెత్తి దీనిలో వెన్న యెక్కడున్నదో పరిశీలించి ముందుగా నాకు చెప్పుమని యడిగెను. తరువాత నీ ప్రశ్నకు సమాధానము చెప్పెదననెను. రాజు పాలను బుద్ధికుశలతో పరిశీలించి పాలలో వెన్న అంతటను వ్యాపించియుండెను అనెను. అట్లే దేవుడు సమస్త చరాచరములందును నిగూఢముగ వ్యాపించియున్నాడు. అతడు లేనిచోటే లేదు.

రాజు గోపాలుని మొదటి ప్రశ్నకు చెప్పిన సమాధానమునకు మెచ్చి కృతజ్ఞత తెలిపెను.

ఉపనిషత్తుకూడ యిట్లె తెలిపెను.

**శ్లో॥ సర్వ్యాపిన మాత్మానాం**
**క్షీరే సర్పిరి వార్పితమ్।**
**ఆత్మవిద్యా తపోమూలం తద్**
**బ్రహ్మోపనిషత్ పరమ్ ॥** **శ్వే.ఉ.అ.1.శ్లో.16**

భావము:- పాలలో వెన్నలాగ పరమాత్మ బుద్ధియందు దర్శింపబడుచున్నది. సత్యము, ఆత్మ నిగ్రహము, తపోధ్యానములను సాధనములుగా చేసికొని పాలలో వెన్నలాగా సర్వవ్యాపీ, ఆత్మ జ్ఞానమూ ధ్యానముల అందే సుప్రతిష్ఠితమై పరమాత్మను తదేక నిష్ఠతో అన్వేషించువాడు అజ్ఞానవినాశకమైన ఆ పరబ్రహ్మయే కాగలడు.

రెండవ ప్రశ్న:- "దేవుడేవైపు చూచుచున్నాడు" దానికి గోపాలుడు దగ్గరలో వెలుగుచున్న ప్రమిదెను చూపించి ఆ దీపము ఏవైపు చూచుచున్నదో ముందుగా నాకు చెప్పుము అని రాజు నడిగెను. దానికి రాజుగారు దీపము అన్ని వైపుల చూచుచున్నదనెను. గోపాలుడు దేవుడు కూడ ఒక దిక్కనిగాక సర్వ దిక్కులను చూచుచున్నాడు. సమస్త ప్రాణుల హృదయములలో అంతర్వర్తియై సమస్తమును పరికించుచున్నాడు అనెను. భేష్ అని అంటూ రాజుగారు చక్కగా సమాధానము చెప్పితివని పొగడెను.

మూడవ ప్రశ్న:- "దేవుడు ఏపని చేయుచున్నాడు" దానికి గోపాలుడు దేవుడు చేయు పని ఇప్పుడే కనుపించలేదా? ఒకరిని సింహాసనము పైనుండి దింపుట మరియొకరిని సింహాసనముపై కూర్చుండబెట్టుట ఇదియే దేవుని పని. అనగా ధన అధికారాదులతో గర్వము కలిగియున్నవారిని క్రిందకు త్రోయుట, వినయవిధేయతలు భక్తిశ్రద్ధలు కలిగియున్నవారిని పైకిలేపుట దేవుడు చేయు పని. పాపాత్ములను నరకమున బడద్రోయుట, పుణ్యాత్ములను మోక్షధామమునకు జేర్చుటయే దేవుని పని అని వివరించెను. ఈ విధముగా మీరడిగిన మూడు ప్రశ్నలకు సమాధానము చెప్పినాను.

ఇక నేను వెళుచున్నాను. ఓ రాజా! మీరున్ను, యీ సభలోని వారందరును సర్వత్ర దైవసాన్నిధ్యముననే అనుభవించుచు, పాపము చేయక హృదయమును శుద్ధ సత్వమునందుంచి, నిర్మలమొనర్చుకొని జీవితము ధన్యమొనర్చుకొందురు గాక! పరమేశ్వరుడను గ్రహించునుగాక. అను హితవాక్యములు వచించుచు సభను విడిచెను. పండిత పురోహితుడు శాస్త్రపఠనము మాత్రము చేసి తన వాచా వేదాంతమును ప్రకటించెనే గాని ప్రశ్నలకు సమాధానము చెప్పలేకపోయెను. ఆవులకాపరిగా గోపాలుడు భగవంతునితో తాదాత్మ్యము పొంది భగవదనుభూతిని బడసి జ్ఞానియైనందున ప్రశ్నలకు సమాధానములు స్ఫురణకు వచ్చి యుక్తితో ఉదాహరణలతో ప్రత్యక్షముగా చూపి కృతార్థుడాయెను.

ఓం తత్ సత్.

# సన్మతిచే సద్గతి - దుర్మతిచే దుర్గతి

భగవానుని యనుగ్రహము లోకమున సమతతో ఎల్లెడల వ్యాపించియే యున్నది. తదనుగ్రహముపొందుటకు తగు సాధనల నవలంభించు జీవులకు ఉన్నతాశయములు, ఉదాత్తగుణములు సంక్రమించి మోక్షకాంక్ష జనించి, సర్వేశ్వరుని కృపాకటాక్షములచే మోక్షప్రాప్తిని పొందగలరు. తద్విరుద్ధముగ ప్రాపంచక భోగ భాగ్యములం దాసక్తిగలిగి జీవితకాలమంతయు శక్తియుక్తుల నన్నింటిని వాటి సముపార్జనమునకు వినియోగించు మానవులు భగవంతుని తలంచుట గాని సజ్జనుల సాంగత్యమును కోరుట గాని జరుగదు. వికారవంతమైన దృశ్యప్రపంచ రామణీయతకు ఆకర్షింపబడి దు:ఖములపాలై జీవిత సాఫల్యమైన నిత్యానందమును పొందలేకపోవుచున్నారు. ఈ విషయమున ఒక కథారూపముగా తెలిసికొనగలము.

ఒక వర్తకుడు కాశీయాత్ర చేయవలయునని తలంచి పాదచారియై ఇంటినుండి బయలుదేరెను. అది వేసవికాలమగుటచే ప్రయాణము కొంచెము కష్టమాయెను. ఎండ మిక్కుటముగా నుండెను. బాధతో ప్రయాణము చేయుచుండెనే గాని ఆగిపోలేదు. దారిలో ఇసుక ప్రదేశ ముండుటవలన వేసవి వేడిమికి బహుకష్టముతో పయనము చేయుచుండగా మార్గమున ఒక మహావృక్షము కన్పించెను. దాని చెంతకుచేరి ఆ వృక్షచ్ఛాయయందు విశ్రమించెను. పూర్వమెపుడో ఏ బ్రహ్మనిష్ఠుడో, ఏ తపస్సంపన్నుడో ఆ వృక్షము క్రింద ధ్యాననిష్ఠ కలిగియుండిన కారణమున ఆ వృక్షమునకు కల్పవృక్షము యొక్క శక్తి గలిగెను. ఆ చెట్టుక్రింద ఎవరు ఏ కోరిక కోరిన ఆ కోరికలు వెంటనే తీరుచుండెను. ఇట్టి అమోఘమైన శక్తి ఆ వృక్షమున కలదని ఈ వర్తకునికి తెలియదు. ఎండలోనుండి వృక్షము నీడకు వచ్చుటవలన శరీరమంతయు చెమటతోనిండి చికాకుగలిగిన వాడై దరిదాపులలో ఎచ్చటనైన జలాశయము కలదేమోనని పరికించు

చుండెను. ఎచ్చటను కానరాలేదు. అప్పుడు స్నానముచేయుటకు జలమున్నచో శరీరము శుభ్రపరచుకొని విశ్రమించవచ్చును అని అనుకొనుచుండెను. వెంటనే ఆ చెట్టుపై నుండి గంగా ప్రవాహము వలె నీరు జలజల క్రిందకు పడజొచ్చెను. కల్పవృక్షమహిమ ఆ చెట్టుకుండుటవలన అట్లు జరిగెను. వర్తకునకు ఆ చెట్టుయొక్క కల్పవృక్ష శక్తిని గూర్చి పరిచయము లేదు. ఆశ్చర్యముతో అతడు ఆ జలములో స్నానమాడి సంతోషముతో చెట్టు క్రింద విశ్రమించెను. కాని వేసవి కాలము, భోజనకాలము అతిక్రమించిన కారణమున ఆకలిబాధ మిక్కుటముగ నుండెను. ఎవరైన భోజనము తెచ్చిపెట్టినచో తృప్తిదీర భోజనముచేసి ఆ చెట్టు క్రింద మరికొంతకాలము విశ్రమించవచ్చునని తలంచుచుండెను. తక్షణమే యాతని సంకల్పముకూడ నెరవేరెను. పంచభక్ష్య పరమాన్నములతో ఒక పళ్ళెరము చెట్టుక్రింద ప్రత్యక్షమాయెను. ఆశ్చర్యము ఒక వైపున, సంతోషము మరియొకవైపున అతనికి కలిగెను. ఏమి యీ విచిత్రమని తలంచుచు ఆ మృష్టాన్నమును ఆరగించి సంతుష్టుడై వృక్షచ్ఛాయను విశ్రమించెను. జనసంచారములేని యీ ప్రాంతములో నాకు భయము కలుగుచున్నది. నా భార్య కూడ నాతో ఉన్నచో నిర్భయుడనై పయనించుట నాకెంత ఆనందదాయకముగ నుండును అని మదిలో తలంచెను. సంకల్పించిన వెంటనే అతని భార్య ఆదర వాక్యములతో ఆయనముందు ప్రత్యక్షమయ్యెను. ఇది అంతయు ఆ వృక్షముయొక్క మహిమయని ఆయన యెరుంగడాయెను. ఆరువందలమైళ్ళ దూరములోనున్న నా గ్రామము నుండి నా భార్య నేను తలంచిన తృటికాలములోనే వచ్చుట అసంభవము. ఈమె నా భార్యయా లేక ఏదైన దయ్యమయి యుండవచ్చునా అని తలంచుచుండెను. అంతలోనే ఆ వృక్ష శక్తిచేత ఆమె దయ్యముగా మారిపోయెను. ఆ దయ్యమును జూచి ఆ వర్తకుడు ఈ భయంకర రూపమగు దయ్యము నన్ను మ్రింగి వేయునేమో యని భయపడుచుండెను. తక్షణమే ఆ దయ్యమాతనిపై పడి మ్రింగివేసెను.

కల్పవృక్షము క్రింద ఉన్నను, వర్తకుడు తన వినాశమునే కొని తెచ్చుకొనెను. మహోన్నత అవకాశమును విడిచి పతనము పొందెను. భగవంతుడు కల్పవృక్షము

వంటివాడు ఎవరు ఏదేని యభిలషించి తనను ప్రార్థించుచుందురో వారికి దానిని యిచ్చుచుండును. విజ్ఞుడైనవాడు శ్రేయస్కరమైన దానిని కోరుచుండును. బంధవిముక్తినే అభిలషించును. అజ్ఞాని అల్పములగు ప్రాపంచిక వాంఛలను, నశ్వరములగు భోగపదార్ధములను కోరుకొని తన పతనమునకు తానే కారకుడగును. ఇట్లే సన్మతిచే అనగా మోక్షాపేక్షగల మతిగలవాడు మోక్షమునే కోరుకొని మోక్షము బొందును. దుర్మతి అనగా నశ్వరమగు ప్రపంచ విషయములనే కోరుకొని జననమరణ సంసారమున బడి దు:ఖముల పాలగును. ఈ కథాసారమును గ్రహించి మనము శాశ్వతానందము నొసగు భగవంతుని ప్రార్థించు సన్మతిని కలిగియుండవలెను.

ఓం తత్ సత్

# గ్రుడ్డి అనుకరణ

ప్రపంచమున పెక్కురు ఒక అంధపరంపరను అనుసరించుచున్నారు. అనగా పరమాత్మను గూర్చి ఒకింతయు ఆలోచింపక తమ తండ్రులు తాతలు, ఇరుగుపొరుగు ప్రాంతములవారు ఏయే విషయజాలములోబడి కొట్టుకొనిపోవుచు తాత్కాలిక సుఖదుఃఖముల ననుభవించు జనన మరణరూప సంసారమున బడియున్నారో దానినే అనుసరించుచున్నారు. కాని యీ దుఃఖము స్వాభావికమా లేక అగంతుకమా అని విచారించి, దుఃఖకారణమరసి, నిత్యానంద ప్రాప్తి దుఃఖరహిత స్థితియందుండలేక పోవుచున్నారు. ఈ క్రింద వ్రాయు కథలో ప్రజల అంధ విశ్వాసమును తెలిసికోగలము.

ఒక పట్టణమున ఒక మహారాజు నివసించుచుండెను. ప్రజలందరు రాజుగారి యందు విశ్వాసపాత్రులై రాజాజ్ఞను మీరక మెలగుచుండిరి. రాజభవనము నందు రాజమహిషి కూడ తనకు పరిచర్యలు చేయు పరిచారికా సమూహముతో అతి సన్నిహితముగ మెలంగుచు వారి కష్టసుఖములను విచారించి వారికి హితము బోధించుచు వారి మన్ననలకు పాత్రురాలయ్యెను. ఆ రాణీవాస మందిరమునకు ప్రతిదినము ఒక చాకలిది రాణియొక్క చీరలు వగైరా బట్టలను శుభ్రపరచి తెచ్చుచుండెను. నైపుణ్యముతో, శ్రద్ధతో ఆమె కార్యములను చేయుచు క్రమక్రమముగా రాణియొక్క పూర్ణవిశ్వాసమునకు పాత్రురాలయ్యెను. ప్రతిదినము బట్టలను ఉతికి తెచ్చియిచ్చునపుడు రాణితో కొద్దికాలమైనను ఇష్టాగోష్ఠి జరుపుచు, ఆనందముతో చిరునవ్వులతో తిరిగి యింటికి వెళ్ళుచుండెడిది. ఇట్లు వారి మైత్రి దినదిన ప్రవర్ధమానమై ఒకరిని విడిచి మరియొకరు వుండలేనంత ప్రగాఢ మాయెను.

ఒక దినమున చాకలి రాణి వస్త్రములను శుభ్రపరచి తీసికొని వచ్చి రాణికి అప్పగించి కంటివెంట నీరుబెట్టి ఏడ్వసాగెను. ఆమె నేత్రములనుండి అశ్రువులు ధారగా

ప్రవహింపజొచ్చెను. కారణమేమియో తెలువదు. ఆ దృశ్యమును జూచి రాణీయొక్క హృదయము పరమ ఆవేదనతో నిండిపోయెను. ఆమెకు ఏదియో బ్రహ్మాండమైన ఆపద సంభవించనిచో ఎందుల కేడ్చును. ఆమె సన్నిహిత బంధువు లెవరైన మరణించి యుండవచ్చును. లేక వారికేదైన ధననష్టము గాని మరేదైన ప్రమాదములుగాని సంభవించి యుండవచ్చును. అట్లుగాకున్న యీ చాకలి యింతగా ఎందులకు దు:ఖపడును. కాని ఆమె యీ మహాదు:ఖమునకు కారణమడుగుట సహేతుకముకాదు. మనము మాట్లాడించిన మరింత దు:ఖితరాలగును. ఆపదలుగలవారిని ఓదార్చుటకు వెళ్ళునపుడు మౌనముగా నుండి వారి దు:ఖమును పంచుకొనవలెను. ఇది లోకములో జరుగు పద్ధతి. కావున మనము కూడ మన ఆప్తురాలి దు:ఖములో పాలుపంచుకొనుట యుక్తము. ఇదియే లోకాచార పద్ధతి. ఆ నిర్ణయప్రకారం రాణి కూడ చాకలితో బాటు పెద్దగా నేడ్చుచుండగా చాకలి వెళ్ళిపోయెను.

రాణియొక్క ఏడ్పు విని రాజభవనములో మరియొక గదిలో నున్న రాజు ఏదియో ప్రబలకారణము లేనిదే రాణి ఎందుల కేడ్చును? కారణమడుగుట ఈ సమయమున మంచిదికాదు. నాకు ప్రేమపాత్రురాలైన ఆమె ఏడ్చునపుడు మనము వూరకుండుట భావ్యముకాదు. అని తలంచి కారణము తెలియకయే పెద్దపెట్టున ఏడ్వసాగెను. వారిని జూచి భృత్యులు, వారి పరిచారికలు కూడ మర్యాదకొరకై ఏడ్వసాగిరి. ఈ ప్రకారముగ రాజభవనమంతయు ఆక్రందనములతో, పెడబొబ్బలతో నిండిపోయెను. ఆ రోదన ధ్వని, నలుదెసల వ్యాపించగా రాజభవనము చుట్టుప్రక్కలనున్న ప్రజలు తమ మనములు కలతచెంద, రాజు ఏడ్చుచుండ మనమూరకుండుట మర్యాదకాదు. "యథారాజా తథా ప్రజా" అని పెద్దల వాక్యము కదా? కాన మనము కూడ రాజుగారి కష్టసుఖములలో పాలుపంచుకొనుట సముచితమని నిశ్చయించుకొని రాజప్రసాద సమీపమునగల ప్రజలందరు ఏడ్వసాగిరి. వారిని చూచి తక్కిన పురమునందలి ప్రజలందరు గొల్లున ఏడ్వ మొదలుపెట్టిరి. "కారణ మడుగుదమా మర్యాదకు లోటు" అని అందరు భావింపదొడగిరి. ఈ విధముగా దు:ఖసాగరమున మునిగియున్న పట్టణమునకు ఒక

సాధువు వచ్చుట జరిగెను. ప్రవేశములోనే ఇండ్లలో రోదన ధ్వనులు వినిపించెను. కారణ మరయదలచి ఇంటిలోనికేగి అయ్యలారా! అమ్మలారా ఎందుల కేడ్చుచున్నారని అడుగగా స్వామీ మాకు కారణము తెలియదు. మా ప్రక్కయింటివారు ఏడ్చుచుండ, మర్యాద కొఱకై వారి దు:ఖములో పాలుపంచుకొనుటకు ఏడ్చుచున్నామనిరి. దీనికి కారణము తెలియవలెనని సాధువు కృతనిశ్చయుడై ప్రక్క యింటికివెళ్ళి వారిని కారణ మడిగెను వారు తమ ప్రక్క యింటివారి నడుగమనిరి. ఈ ప్రకారముగ అడుగుచు పోయి రాజభవనమును చేరెను. అచ్చట ఏడ్చుచున్న రాజభవన భృత్యులను అడిగెను. మంత్రిగారు ఏడ్చుచున్నారు. అందువలన భృత్యులము మేము కూడా ఏడ్వవలయును గదా యనిరి. సాధువు విషయము తెలిసికొనుటకు కృతనిశ్చయుడై యున్నందున ఏడ్చుచున్న మంత్రిగారి వద్దకు వెళ్ళి కారణ మడిగెను. రాజుగారు ఏడ్చుచుండగా వారి మంత్రినైన నేను ఏడ్వకుండుట న్యాయము కాదుగదా యనెను. అప్పుడు సాధువు ఏడ్చుచున్న రాజుగారిని సమీపించి తమ దు:ఖమునకు కారణమేమని ప్రశ్నించెను. రాజు నా భార్య మహాదు:ఖములో మునిగియుండగా నేనెట్లు తద్విరుద్ధముగా నుండగలననెను. ఈ ప్రహసనముయొక్క అంతు చూడవలెనని రాణీగారి యొద్దకు బోయి అమ్మా తమరేల ఏడ్చుచున్నారని యడిగెను. రాణిగారు నాకు అతి సన్నిహితముగా ఉంటున్న మా చాకలి ఏడ్చుచున్నది. ఆమె దు:ఖమున కారణమడుగుట మర్యాదకాదని నేను ఆమె దు:ఖములో పాలుపంచుకొని ఆమెకు కొంత ఓదార్పు కలిగించవలెనని దు:ఖించు చున్నాననెను. సాధువు చాకలియొద్దకు పోయి ఆమె దు:ఖమునకు కారణమేమిటని ప్రశ్నించెను. "ఆమె తనకొక అడుగాడిదె కలదని, దానికి బహుకాలమునకు చూలు వచ్చి మగబిడ్డను కన్నదని, కాని అది వెంటనే మరణించినదని, అందువలన ఎంతయో కాలమునుంచి నిరీక్షించుచున్న నా గాడిదబిడ్డ చనిపోయిన కారణంచేత నాకు హితురాలైన రాణిగారివద్ద విషయము చెప్పుటకు నోటినుండి మాట రాలేదు. నేను విపరీతముగా ఆమెముందు ఏడ్చితినని చెప్పెను. సాధువు ఫక్కున నవ్వెను. చాకలి గాడిదపిల్ల చచ్చినందుకు ఊరంతయూ ఏడ్చుటయా

ఎంత విపరీతము? ఎంత అంధపరంపర. ఈ పట్టణవాసులు అందరు అజ్ఞానులై యదార్ధమారయక గ్రుడ్డి నమ్మకముతో దు:ఖములపాలై వున్నారని విచారించి వెడలిపోయెను. కథలోని రాజు, పట్టణవాసులు వలె ప్రపంచమున పెక్కురు ప్రజలు, తమ జన్మకు కారణమేమిటి, ఎచ్చటినుండి వచ్చితిమి, ఏమిచేసి ఎచ్చటికి పోవలసియున్నామను విచారణ చేయక, తమ గమ్యస్థానమైన పరమాత్మ నొక్కింతయు ఆలోచింపక నశ్వరమైన ప్రపంచవస్తు సంపదయందు గల సుందరత్వా సుందరత్వములకు లోనై, తన అమృత స్వరూపమును మరచి శరీరభావన యందు తాదాత్మ్యము చెంది, దు:ఖితులై జీవితము వ్యర్థపరచుకొనుచున్నారు.

**శ్లో॥ అవిజ్ఞాతే జన్మనష్టం విజ్ఞాతే జన్మ సార్థకమ్,**
**జ్ఞాతురాత్మా న దూరే స్యాత్ ఇతి వేదాన్తడిణ్డిమ ॥ వే.డి.శ్లో.73**

భావము:- ఆత్మ నెరుగకుండిన జన్మ వ్యర్థము ఎరిగిన సార్ధకము. జ్ఞాతకు ఈ ఆత్మ దూరమున లేదు. అని వేదాంతభేరి. కాని అంధ పరంపరలకు లోనై గ్రుడ్డిగా జీవింపక సజ్జన సాంగత్యము చేసి జీవబ్రహ్మైక్య విజ్ఞానము సంపాదించి, సుఖించుచు దివ్యజీవనము నెరపెదరుగాక.

ఓం తత్ సత్.

# అనంహంకారము

మానవుడు స్వరూపస్థితిని తెలిసికొని కృతార్థుడు కాగలందులకు భగవద్గీత పదమూడవ అధ్యాయములో అమానిత్వాది యిరువది గుణములను సాధనమును గురించి విచారించెదము. సాక్షీ చైతన్య సాన్నిధ్యమున అంత:కరణ చేతనవంతమై "అహం" ప్రత్యయము కలుగుచున్నది. శరీర తాదాత్మ్యముతో నేనను జ్ఞానము కలిగి సర్వవిద్యలు నభ్యసించుచున్నారు. దీనినే అపరవిద్య అందురు. దీనివలన ముక్తి కలుగదు. అపరవిద్యను సాధనముగా తీసికొని పరవిద్య నభ్యసించినగాని స్వరూపస్థితి కలుగదు. దీనినే పరమ పురుషార్థమని, మోక్షమని విజ్ఞులు చెప్పెదరు. అపరవిద్య లెన్నెన్ని సంపాదించి నేర్పరియని అనిపించుకున్నను. తానింతటి గొప్పవాడినని, పండితుడనని ధనసంపన్నుడనని అహంకారయుతుడై యుండుట గాంచుచున్నాము. అందువలన దేహమాత్ర పరిచ్ఛిన్నుడై, స్వరూపాజ్ఞాన యుతుడై జననమరణ రూప సంసారమునబడి దారిగానక దు:ఖించుచున్నాడు. దీనినొక కథారూపముగా తెలియగలము.

పాట్నా నగరమందు ఒక పండితుడుండెను. అతడు సర్వ విద్యాపారంగతుడు. తన విద్యను ఇతర పట్టణములకుపోయి అచ్చటి ప్రజలకు వినిపించి వారిని సంతోషపరచి వారిచ్చు ధనముతో భాగ్యవంతుడయ్యెను. వానికి పాండిత్యమునందధికుడనను గర్వమేగాక ధనవంతుడనను గర్వముకూడ పెరిగెను.

విద్యావ్యాసంగము లొనర్చు కార్యక్రమములో ఒకరోజున వేరొక పట్టణమునకు పాదచారియై వెళ్ళుచుండెను. దారిలో ఒక చోటున నది అడ్డురాగా దానిని దాటవలసి వచ్చినది. నదినిండుగా ప్రవహించుచుండెను. పరికించి చూడగా ఒక బెస్తవాడు నదిని దాటించుటకు ఒక పడవతో సిద్ధముగా నుండెను. అతనికి కొంత పైకమునిచ్చి

రెండవ వొడ్డు జేరుటకు పడవనెక్కెను. బెస్తవాడు పడవ నడుపుచుండెను. పండితుడు నావలో కూర్చొని దీర్ఘాలోచనా తత్పరుడై యుండెను. అతనికి ఆకస్మాత్తుగా నేదియో ఒక ఊహజనించి పల్లెవానిని పిలిచి - "ఓయీ! నీవు తర్క విద్య నేమైన అభ్యసించితివా!" అని అడిగెను. బెస్తవాడు పడవ నడుపుచునే లేదని, జవాబిచ్చెను. పండితుడంతట తర్కవిద్య చదువని జీవితము జీవితమేనా! ఆ గొప్ప విద్య నేర్వని నీ జీవితములోని పాతికభాగము వ్యర్థమైపోయినదని తలంచుచున్నాను. మించిన దేమీలేదు. ఇప్పుడైనను నాబోటి పండితుల దగ్గర నేర్చుకొనుము. బాగుపడెదవు అని చెప్పుచూ "మీమాంస" ఏమైనా చదివితివా అని అడిగెను. పల్లెవాడు బాబూ నాకు మీమాంస సంగతి యేమియు తెలియదనెను. అది విని పండితుడు ఓయీ వెఱ్ఱివాడా! మీమాంస నేర్చకొననివాడు ఎవడైన యుండునా? అది నేర్వనందువలన నీ జీవితములో మఱియొక పాతికభాగము వృథా అయినదని నేను భావించుచున్నాను. పోనీ "జ్యోతిష్యము" చదివితివా అని అడిగెను. బెస్తవాడు పడవ నడుపుచు నేనీ జ్యోతిష్యము నేమియు నెరుగనని జవాబిచ్చెను. అది విని పండితుడు భగవంతుడా ! జీవితములో యింకొక పాతికభాగమును నాశనము చేసికొనినావురా వెఱ్ఱివాడా! తర్కమీమాంస, జ్యోతిషములను మూడు శాస్త్రములను తెలియనివాడు ముప్పాతిక జీవితమును వృథా చేసికొనినట్లే యని అనెను. వాటిని తనవద్ద నేర్చుకొని జీవితమును ధన్యమొనర్చుకొనుమని యనెను - పడవ సరిగా నది మధ్యభాగమునుకు వచ్చెను. నీటి ప్రవాహము చాల వడిగానుండెను. ఇంతలో పెనుగాలి మీద నారంభించెను. తుఫాను చెలరేగెను. జలము ఉత్తుంగతరంగ సంయుక్తమై భీతిని గొల్పుచుండెను. తరంగముల తాకిడికి పడవ అటునిటు ఊగులాడుచు డోలాయామానము అగుచుండెను ఇంతలో పడవలో నీరు ప్రవేశింపసాగెను. పడవ మునిగిపోవునేమో అను భయము కలుగు చుండెను. ఆ ఘోర విపత్తు సమయమున బెస్తవాడు పండితుని బిలిచి "అయ్యా బాబూ, తమకు ఈతవిద్య వచ్చునా?" యని అడుగగా "రాదని" జవాబు చెప్పెను. అది విని పల్లెవాడు "మహాప్రభూ! తర్కమీమాంస జ్యోతిషములు చదువనందున నా జీవితములో ముప్పాతిక భాగము మాత్రమే

నాశనమైనది. ఈతవిద్య రానందువలన తమ జీవితమిపుడు మొత్తము పూర్తిగా నాశనమైపోయినది'' అని పలికి యూరకుండెను. ఇంతలో నీరు పడవలో ఎక్కువగా జేరి పడవ మునిగి పోయెను. పండితుడు గంగార్పణ మయ్యెను. బెస్తవాడు ఈదుకొని ఒడ్డు చేరెను. చూచితిరా! నదీ ప్రవాహ మధ్యమున కావలసినది ఈతవిద్య. ఆ సమయమున తర్కమీమాంసా జ్యోతిషములాదిగా గల విద్యలేవియు రక్షింపలేవు. ఈతవిద్య ఒక్కటియే శరణ్యము, అట్లే జీవుడు సంసారసాగర మధ్యమున గ్రుంకు లిడుచున్నాడు. అట్టివారికి తరుణోపాయము, బ్రహ్మవిద్యయే అక్షర పరమార్థతత్త్వము. ఈ లౌకిక విద్యయొక్కటియే జీవుని కృతకృత్యుని చేయగలదు.

పండితుడు అపరవిద్య నభ్యసించి ఇతరులకంటె తన జీవితము సార్థకమైనదని అహంకారయుతుడై పల్లెవానితో పల్కెను. కాని సర్వవిద్యలకు మూలమైన పరవిద్యను అభ్యసించి అనగా జీవబ్రహ్మైక్య విద్య నభ్యసించి "అనహంకారులమై'' అమృత స్వరూపులమై సుఖశాంతులతో నుందుము గాక.

ఓం తత్ సత్

# ప్రమాత

సర్వ వ్యవహారములకు కారణ మంత:కరణమగుటచే శ్రుతియం దంత:కరణము రూపమని చెప్పబడెను. అంత:కరణ సంబంధము వలన ఆత్మ "అహమస్మి", అని వ్యవహరించబడుచున్నది. శ్రుతియందు చెప్పబడిన ప్రతిరూప శబ్దమున కర్థము ప్రతిబింబము. పరమాత్మ ప్రత్యేకాంత: కరణములయందు ప్రతిబింబ రూపముగా ప్రవేశించెనని తాత్పర్యము.

వివరణకారులును, సంక్షేప శారీరక వాదులును ప్రతిబింబవాదులు. వారి సిద్ధాంతమున జీవు డాత్మ ప్రతిబింబము. లోకము నందు దర్పణాది స్వచ్ఛపదార్థముల సమీపము వలన ముఖబింబ రూపవే ముఖమున కంటె భిన్నముగను, దర్పణాంతర్గతముగను నున్నట్లు ప్రతీత మగుచున్నది. వాస్తవముగా బింబరూప ముఖము కంటె భిన్నముగా దర్పణాంతర్గమగు వస్తువేదియు లేదు. అయిన నది మిథ్యకాదు. బింబరూపముగ నదియు సత్యమే.

వార్తికకారు లాభాసవాదులు, జీవుడు చైతన్య భాసమని వీరి సిద్ధాంతము. వీరి మతమునందు బింబభిన్నమును, బింబ సదృశమునగు దర్పణాంతర్గత ప్రతిబింబమును కప్పించెడి శక్తి దర్పణాదుల యందు గలదని చెప్పెదరు. ఈ విధముగ ప్రతిబింబవాదులు ప్రతిబింబము సత్యమనియు, అభాసవాదులు ప్రతిబింబ మసత్యమనియు చెప్పుచున్నారు. వీరుభయులు బింబము సత్యమని యంగీకరించెదరు. చైతన్య ప్రతిబింబము చైతన్యమువలె జ్ఞానరూపమగును. ఆ జ్ఞానరూప ప్రతిబింబ సంబంధము వలన అంత:కరణము ప్రమాత యగుచున్నది. **"యోయం విజ్ఞానమయ: ప్రాణేషు"** అను శ్రుతి జీవుడు విజ్ఞానమయుడని చెప్పుచున్నది. కావున జీవుడు చేతనుడు. **"రూపం రూపం ప్రతిరూపం బభూవ"** అను శ్రుతిచేత జీవుడు ప్రతిబింబ రూపుడని

చెప్పబడెను. జీవుడు చేతనుడైనచో నతడు ప్రతిబింబుడు కాడు. ప్రతిబింబితుడైనచో చేతనుడు కాడు. కావున నిందేది సత్యము?

ప్రతిబింబవాది మతమునందు ప్రతిబింబము నిజబింబమున కంటె భిన్నము కాదు. కాన చైతన్య ప్రతిబింబితుడగు జీవుడు చేతనుడే యగును. అచేతనుడు గాడు. అభాసవాది మతమునందు ప్రతిబింబము నిజబింబము కంటె భిన్నమైనను నది శుక్తిరజకాదుల వలె ప్రాతిభాసికమనియు, నా ప్రాతిభాసికా నిర్వచనీయ ప్రతిబింబమునకు ఉత్పత్తి గలదనియు అంగీకరించుచున్నారు. ఆ యుత్పత్తికి నిజబింబము, అవిద్య యీ రెండు నుపాదానకారణములు. కావున ప్రతిబింబముతో బింబచైతన్యమునకు సంబంధము గలదు. జల ప్రతిబింబ సూర్యునకు తేజస్సుండినట్లు, అంత:కరణ ప్రతిబింబితుడగు జీవుడు చేతనుడే యగును. బింబ ప్రతిబింబవాదుల మతము నందు, ప్రతిబింబరూప జీవుడు చేతనుడే. అభాసవాదుల మతము నందు జీవుడు చేతనాచేతన విలక్షణుడు. కాన జీవుడు చేతనము కంటె విలక్షణుడని రెండు మతము లందును సిద్ధించుచున్నది. అంత:కరణమునందు చైతన్యము ప్రతిఫలించుటచేత ప్రతిబింబ మూలముగా అంత:కరణము ప్రమాతయగుచున్నది. ఆత్మచేతనము, అంత:కరణ మచేతనము. ఈ రెంటియొక్క యేకత్వాధ్యాస వలననే అంత:కరణము ప్రమాత అగుచున్నది. ఈ ప్రమాత ప్రమాణముల ద్వారా ప్రమేయముల నెఱుగుచున్నది.

ఓం తత్ సత్

# సా క్షి

ప్రమాశ్రయము ప్రమాత. ఆ ప్రమాతయే కర్తయు, భోక్తయునగు ఆత్మ, దీపము తాను ప్రకాశించుట యందును ఇతర పదార్ధములను ప్రకాశింపజేయుట యందును మఱియొక ప్రకాశము నపేక్షంచవలసిన పని లేదు. కావున నిక సాక్షి నంగీకరించుట వలన ప్రయోజనమేమి?

ప్రమాత వృత్తిరూప పరిణామము గలది అగుటచే నది వికారి. పరిణామవంతమగు పదార్ధము దృశ్యము. దృశ్యమెప్పుడును ద్రష్ట కాజాలదు. దృశ్యమగు ప్రమాత, దృశ్యమగు ప్రమేయమువలె తన వికారములను, ఉనికి లేములను తానెఱుగజాలదు. అసంగము, నిర్వకారమునగు ఆత్మయే సర్వమునకు సాక్షి. స్వయం ప్రకాశమగు సాక్షిచేతనే సర్వము ప్రకాశింప బడుచున్నది.

**శ్లో॥ దృగ్ దృశ్యౌతౌ పదార్థౌ ద్వౌ పరస్పర విలక్షణౌ**
**దృగ్ బ్రహ్మ దృశ్యం మాయా స్యాత్ ఇతి వేదాంత డిణ్డీమ: వే.డి.శ్లో.29**

భావము:- దృగ్, దృశ్యములని పదార్ధములు రెండు. ఈ రెండును పరస్పర విరుద్ధములు, అందు దృక్కు బ్రహ్మము, దృశ్యము మాయ; అని వేదాంత డిండిమము. ప్రమాతకంటె భిన్నముగ స్వయం ప్రకాశమగు సాక్షి యున్నదనుటకు శ్రుతియే ప్రమాణము.

శ్రు॥ **“తమేవభాంత మనుభాతిసర్వం, తస్యభాసా సర్వమిదం విభాతి”** ఇటువంటి శ్రుతులు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, అగ్ని మొదలగునవి అన్నియు స్వయం ప్రకాశములు కావు. అవన్నియు ఆత్మ ప్రకాశము వలననే ప్రకాశింపబడుచున్నవని చెప్పుచున్నవి. కావున ఆత్మ స్వయం ప్రకాశమని నిశ్చయమగుచున్నది. దృశ్యములగు

ఘటపదాది పదార్ధములు ఇతర పదార్ధములను ప్రకాశింపజేయ జాలనట్లు, దృశ్యములు అగుటచే సూర్యాదిజడ జ్యోతిస్సులు కూడ స్వయముగ ఇతర పదార్ధములను ప్రకాశింప జేయజాలవు. స్వయం ప్రకాశమగు ఆత్మయే సర్వమునకు సాక్షి. ప్రమాణములను వుపయోగించు జాగ్రదవస్థయందు మాత్రమే ప్రమాత వ్యవహారము. జాగ్రదవస్థ అణగిన, స్వప్నావస్థను ప్రకాశింప జేయునది, యీ సాక్షి చైతన్యమే. సుషుప్తి యందు కూడ సాక్షి చైతన్య మంగీకరించబడుచున్నది. సాక్షి చైతన్యము సత్యము, నిత్యము. సాక్షి శబ్దము మాత్రము సాక్ష్యముండు నంతవరకు మాత్రమే. సాక్షి చైతన్యము పరమార్థము.

ఓం తత్ సత్

# శాస్త్ర విచారణావశ్యకత

తత్త్వమసీత్యాది మహావాక్యములు స్వత: ప్రమాణములగును. ఆ స్వత: ప్రమాణజన్య జ్ఞానముచే అజ్ఞానము, అజ్ఞాన జన్యమగు ద్వైత ప్రపంచము నివృత్తి యగుచున్నది. ఇక విచారణ వలన ప్రయోజనమేమి?

తత్త్వమసి మహావాక్యము నందు గల తత్పద త్వంపదముల లక్షణావృత్తిచే చైతన్య జ్ఞానము కలిగినప్పటికిని, తత్పదార్థమునందు గల అనాత్మత్వ పరోక్షత్వాది భ్రాంతులును, త్వంపదార్థమునంనందు గల పరిచ్ఛిన్నత్వ దు:ఖిత్వాది భ్రాంతులును నశించుట లేదు. కావున మోక్షమునకు వుపయోగమగు అద్వితీయాత్మ సాక్షాత్కార జ్ఞానము కలుగుట లేదు. మహావాక్యములు లక్షణావృత్తిచే నఖండ బ్రహ్మ చైతన్య స్థితిని కలిగించుట వలన మహావాక్యార్థజ్ఞాన మావశ్యకము.

ఏ ప్రమాణముచేతను బాధింపబడని పారమార్థికాఖండ బ్రహ్మ చైతన్యమును విషయీకరించెడి మహావాక్యజన్య నిర్వికల్పకాంత: కరణవృత్తి ప్రమ యనబడును. ఆ ప్రమాజ్ఞానమునందే అజ్ఞానమును నివృత్తిచేయు సామర్థ్యము గలదు. మహావాక్యముల కనుకూలమగు పదపదార్థోస్థితిని కలిగించుటయే పదముల యొక్క శక్తి లక్షణా వృత్తుల కార్యము. తత్పదము యొక్క శక్తివృత్తి మాయావిశిష్టేశ్వర చైతన్యమును తెలుపుచున్నది. లక్షణావృత్తి మాయోపహిత చైతన్యమును తెలుపుచున్నది. అట్లే త్వంపదము యొక్క శక్తివృత్తి అంత:కరణ విశిష్ట జీవచైతన్యమును తెలుపుచున్నది. లక్షణావృత్తి అంత:కరణోపహిత సాక్షి చైతన్యమును తెలుపుచున్నది. మహావాక్యములు జహద జహల్లక్షణావృత్తిచే సాక్షి బ్రహ్మముల ఏకత్వమును ముఖ్య సామానాధికరణము చేతను, నంత:కరణ మాయల అఖండ బ్రహ్మ చైతన్యముతో ఏకత్వమును బాధా సామానధికరణ్యము చేతను బోధించుచున్నవి.

మహావాక్యములు స్వత: ప్రమాణములై నిర్వికల్ప కాత్మజ్ఞానమును కలిగించు చున్నప్పటికిని, ఇతరవాదుల వివాదముల వలన కలిగెడు సంశయ రూపమగు ప్రతిబంధము గల మందబుద్ధుల అజ్ఞానమును నశింపజేయ జాలవు. విచారణచే సర్వ సంశయములు నివృత్తియైన పిమ్మట నిర్బాధకముగ అవి అజ్ఞానమును నివృత్తి చేయుచున్నవి.

పగలు శుక్రనక్షత్రము చూచినవాడితరులతో నేను శుక్ర నక్షత్రమును చూచితినని చెప్పినప్పుడు, ఒకనికి పగలు శుక్రనక్షత్రముండునా? యుండదా? అను సంశయము కలుగును. వేఱొకనికి పగలు శుక్రనక్షత్ర ముండదను విపరీత బుద్ధి కలుగుగు. కాని వీరి ముగ్గురి నేత్రదృష్టి సమానముగానే యున్నది. అయిన ఒకనికి నిశ్చయము, మఱియొకనికి సంశయబుద్ధి, వేఱొకనికి విపరీతబుద్ధి కలుగుచున్నది. శుక్రనక్షత్రమును దర్శించినవాడు ఇతరులకు వృక్షశాఖల మధ్య భాగమున దృష్టిని సారించి చూడుమని చెప్పగా, అట్లు చూచినప్పుడు సంశయము గలవానికి మొదట శుక్ర నక్షత్రము దర్శనమగును. విపరీతబుద్ధిగలవాడు విమర్శించి చూచిన పిదప శుక్రనక్షత్ర దర్శనమగుచున్నది.

అట్లే సంశయ విపర్యయము లేని ఉత్తమాధికారికీ వేదాంత మహా వాక్యముల శ్రవణ మాత్రము చేతనే అఖండ బ్రహ్మాకారవృత్తి కలిగి అది కార్యసహితముగ అజ్ఞానమును నివృత్తి చేయుచున్నది. సంశయబుద్ధి గలవానికి శ్రవణముచేసిన మహావాక్యముల అర్థమును సాధకబాధక యుక్తులచే మననము చేసిన పిదప సంశయము తొలగి అఖండార్థజ్ఞానము కలుగుచున్నది. విపరీతబుద్ధిగలవానికి శ్రవణము చేసిన మహావాక్యముల యదార్థమును సాధకబాధక యుక్తులచే మననము చేసి పిదప, సాధింపబడిన అర్థమున అవిచ్ఛిన్న తైలధారవలె నేకాకారముగ ధ్యానించుటచే విపరీతభావము నశించి, అఖండ బ్రహ్మాకారవృత్తి కలుగుచున్నది. కావున విచారణ మావశ్యకము.

తత్పదార్థము శాస్త్ర తాత్పర్యమగుటచే శ్రేష్ఠమైనప్పటికిని, త్వంపదార్థము శాస్త్రజన్య మోక్షరూప ఫలమునకు భాజనమగుటచే దానికంటెకూడ యిది శ్రేష్ఠమైనది. త్వంపదార్థ విషయములో దేహాత్మవాదము మొదలు నిర్ధర్మవాదుల వరకు అనేక బేధములు తెలియబడుచున్నవి. వీరిలోకొందరు ఆత్మ నిత్యమనియు, కొందరు అనిత్యమనియు చెప్పుచున్నారు. అనిత్యమని చెప్పువారు కూడ రెండు విధములుగ వున్నారు. దేహాత్మవాదులు మొదలు, క్షణిక విజ్ఞానవాదుల వరకు ఆత్మ సత్యము, అనిత్యమనుచున్నారు. మాధ్యమిక బౌద్ధులు మిధ్యాభూతమగు, ఆత్మ అనిత్యమనుచున్నారు. ఆత్మ నిత్యమని చెప్పువారు కూడ రెండు విధములుగ నున్నారు. దిగంబర జైను లాత్మ పరిణామనిత్యమందురు. వైశేషికులు మొదలు అద్వైతుల వరకు ఆత్మకూటస్థ నిత్యమనెదరు. అద్వైతమతమునం దుపనిషత్ప్రమాణములచే ఆత్మ స్వరూపము నిర్ధారణ చేయబడెను. కాన శాస్త్ర విచారణ మావశ్యకము.

ఓం తత్ సత్

# చతుర్విధాభావ రహితాత్మ

ఆత్మకు కాలకృత, దేశకృత, వస్తుకృత పరిచ్ఛేదములు లేవు. దేహము మొదలు భోక్తపర్యంతముగాగల సమస్త పదార్థములకు త్రివిధపరిచ్ఛేదము లున్నవి. ప్రాగభావ ప్రధ్వంసాభావములకు ప్రతియోగులగు పదార్థములు కాల, కృతపరిచ్ఛేద్యములు. అత్యంతా భావమునకు ప్రతియోగులగు పదార్థములు దేశకృత పరిచ్ఛేద్యములు. అన్యోన్యాభావమునకు ప్రతియోగులగు పదార్థములు వస్తుకృత పరిచ్ఛేద్యములు. వేదాంత సిద్ధాంతమునందాత్మకు ఏయే భావము అంగీకరింపబడదు. కావున ఆత్మ త్రివిధ పరిచ్ఛేదములు లేనిది. ఆత్మ కంటె భిన్నములగు సమస్త పదార్థములకు చతుర్విధాభావములు వున్నవి గనుక అవి త్రివిధ పరిచ్ఛేదములు గలవి.

ఆత్మకు ప్రాగభావ ప్రాధ్వంసాభావము లున్నవని చెప్పినచో నా యభావముల నెఱుగునదేది? ఆత్మకంటె భిన్నములగు అనాత్మపదార్థములు జడములగుటచే నవి ఆత్మయొక్క ప్రాగభావ ప్రధ్వంసాభావముల నెఱుంగజాలవు. వేదాంత సిద్ధాంతమునందాత్మ యొక్కటియే యగుటచేత దాని అభావముల నెఱుగు మఱియొక ఆత్మలేదు. కావున ఆత్మకు ప్రాగభావ ప్రధ్వంసాభావములు సిద్ధింపవు.

ఆత్మ తన ప్రాగభావ ప్రధ్వంసాభావములను తానే యెఱుగ వచ్చును గదా యనిన అట్లుకాదు.

ఆత్మయొక్క ప్రాగభావ ప్రధ్వంసాభావకాలమున ఆత్మ లేదు. ఆత్మయున్న కాలమునందు దాని ప్రాగభావ ప్రధ్వంసాభావములు సంభవింపవు. కావున నాత్మ తానెట్లు తన ప్రాగభావ ప్రధ్వంసాభావముల నెఱుగగలదు? అంతియేగాక ఆత్మకు ప్రధ్వంసాభావము నంగీకరించినచో ఆత్మయున్నపుడు చేసిన పుణ్యాపాపముల ఫలము లనుభవింపకయే నశించిపోవుననెడి కృతకర్మనాశ దోషము సంభవించును. అట్లే ఆత్మకు

ప్రాగభావము అంగీకరించినచో ఆత్మ ఏ కర్మములను చేయకయే సుఖ దు:ఖరూప ఫలములను అనుభవించునను అకృత్యాభ్యాగమదోషము కలుగును. కావున ఆత్మకు ప్రాగభావ ప్రధ్వంసా భావములు లేవు.

ఆత్మ సన్మాత్ర స్వరూపమని శ్రుతిస్మృతులు చెప్పుచున్నవి. "ఘటోస్తి, పటోస్తి" అను వ్యవహారము చేత కూడ ఆత్మ సర్వత్ర అనుగతముగ నున్నట్లు తెలియబడుచున్నది. సర్వత్ర అనుగతముగ వ్యాపించియున్న ఆత్మ కత్యంతాభావము కలుగదు. శుక్తియొక్క తాదాత్మ్యాధ్యాసచే మిథ్యారజతము ప్రతీతమైనట్లు, ఆత్మయందు మిథ్యావస్తువు లన్నియు నధిష్ఠానాత్మ తాదాత్మ్యము వలననే సిద్ధించుచున్నవి. ఆత్మ తాదాత్మ్యమువలన సిద్ధించెడి అనాత్మపదార్థములతో నా కెప్పుడు భేదము కలుగదు. కావున ఆత్మ కన్యోన్యా భావము కూడ సిద్ధింపదు. ఈ విధముగ ఆత్మయందు చతుర్విధా భావములు లేకపోవుటచే నది యేయభావములకు ప్రతియోగి కాదు.

అభావమునకు ప్రతియోగు లగుటచే దేహేంద్రియాదుల భావములు అగును. దేహము పుట్టకపూర్వము దానికి ప్రాగభావమున్నది. దేహము నశించినపిమ్మట దానికి ప్రధ్వంసాభావమున్నది. దేహము విభువుకాదు కావున దేహములేనిచోట దాని అత్యంతా భావమున్నది. దేహమునకంటె భిన్నములగు ఘటపటాది పదార్థములతో దేహమున కన్యోన్యాభావ మున్నది. ఈ విధముగా దేహమునకు చతుర్విధాభావము లున్నవి. ఇట్లే ఇంద్రియములకును, మనస్సునకును, ప్రాణమునకును క్షణిక విజ్ఞానమునకును కూడ చతుర్విధా భావములున్నవి. కాన నివి అభావముకాని ఆత్మ కాజాలవు.

శరీర మధ్యమునందు అంత:కరణము వ్యాపించియున్నది. ఆ యంత:కరణము నందు చిదాత్మ ప్రతిబింబించుచున్నది. ఆ ప్రతిబింబ సహితాంత:కరణము ప్రమాత. ఆ ప్రమాత నుండి కలిగిన వృత్తులు ప్రమాణములు. ఆ ప్రమాణములు జీవునాచ్ఛాదించిన అజ్ఞానమును నివృత్తిచేసి, విషయమును పొంది, విషయాకారము ధరించును. అప్పుడు వృత్తిచైతన్య విషయచైతన్యముల కేకత్వము కలుగును. ఆ యేకత్వచైతన్యము వృత్తి విశిష్టమై విషయమును ప్రకాశింపజేయుచున్నవి. ఇందు

అంత:కరణ విశిష్టచైతన్యము ప్రమాత. అంత:కరణవృత్తి విశిష్టచైతన్యము ప్రమాణము, విషయోపహిత చైతన్యము ప్రమేయము. విషయమును ప్రకాశింపజేసెడి వృత్తి విశిష్టమగు అపరోక్షచైతన్యము ప్రమ. ఇవి భిన్న భిన్న విశేషణములతో గూడి భిన్న భిన్నములుగ వ్యవహరించుచుండినను, వ్యవహరింపకుండినను, ఇవి యుండినను లేకపోయినను, వీని వ్యవహారా వ్యవహారములను ఉనికి లేములను ప్రకాశింపజేసెడి విశేష్యమైన సాక్షి చైతన్యము స్వయముగ ప్రకాశించుచు స్వతస్సిద్ధమై యున్నది.

ఓం తత్ సత్

# చిదాత్మ - గౌణాత్మ - భిన్నమతములు

చిదాత్మయొక్క గౌణస్వరూపమే చిదాభాసుడు. ఆ చిదాభాసుడు. తన గౌణ స్వరూపము నశించి, ముఖ్యమైన చిదాత్మరూపముగా నుండుట కొఱకు ప్రవర్తించుచున్నాడు. బంధమోక్షములు రెండును చిదాభాసునకే కలుగుచున్నవి. చిదాత్మ అవ్యవహారుడైనను, అజ్ఞానాహంకారోపాధులవలన నతడు వ్యవహారుడగుచున్నాడు. కేవల బ్రహ్మశబ్దమునకు, అహం శబ్దమునకు వాచ్యుడు కాకపోయినప్పటికి, ఉపాధిగత చిదాభాస విశిష్టచిదాత్మ బ్రహ్మ అహంశబ్దములకు వాచ్యమగుచున్నది. వాచ్యార్థములయందు సాబాసోపాధి భాగములను విడిచి, చైతన్యభాగమును గ్రహించినచో జహదజహల్లక్షణ సిద్ధించుచున్నదని అభాసవాదులు చెప్పుచున్నారు. వారు చిదాభాసాభిన్న చైతన్యమే తత్త్వంపదములకు వాచ్యార్థము. ఆవాచ్యార్థములయందొక భాగమును త్యజించి, మరియొక భాగమున గ్రహించినచో జహతజహల్లక్షణ సిద్ధించునని అభాసవాదుల మతము.

ప్రతిబింబ వాదులలో వివరణ కారాదు. అజ్ఞానోపహిత బింబ చైతన్య మీశ్వరుడు. సంస్కార సహితాంత:కరణాపచ్ఛిన్నా జ్ఞానప్రతిబింబ చైతన్యము జీవుడనియు, సంక్షేపశారీరకకారాదుల జ్ఞాన ప్రతిబింబిత చైతన్య మీశ్వరుడు, బుద్ధి ప్రతిబింబచైతన్యము జీవుడు, నిరుపాధిక చైతన్యము శుద్ధమనియు చెప్పుచున్నారు. ఈ రెండు పక్షముల యందును బుద్ధుల భేదముచే జీవులనేకులు. ప్రతిబింబము పారమార్థిక బింబాభిన్నమగుటచే తత్ త్వం పదముల యందు జహదజహల్లక్షణ సంభవించునని బింబ ప్రతిబింబవాదులు చెప్పెదరు.

అజ్ఞానమునకు విషయమగుచైతన్య మీశ్వరుడు, అజ్ఞానమున కాశ్రయమగు చైతన్యము జీవుడని వాచస్పతి మిశ్రులనుచున్నారు. ఈ పక్షము నందజ్ఞానము

లనేకములగుటచే జీవులనేకులగుచున్నారు. భిన్నభిన్న జీవులయొక్క ప్రపంచములు కూడ భిన్న భిన్నములు. జీవుడజ్ఞానోపాధికు డగుటచే నతడు సంసారమునకు ఉపాదానకారణు డగును. జీవనోపాధియగు అవిద్యకు, అవిద్యాకారమగు ప్రపంచమునకు నీశ్వరుడదిష్ఠానమగుటచే, ఈశ్వరునియందు జగత్కారణత్వ మౌపచారికముగా చెప్పబడుచున్నదని అవచ్ఛేదవాదుల సిద్ధాంతము.

అజ్ఞానోపహిత బింబచైతన్య మీశ్వరుడు, అజ్ఞానమునందుగల ప్రతిబింబ చైతన్యము జీవుడు లేక నిరుపాధిక శుద్ధచైతన్య మీశ్వరుడు, అజ్ఞానోపహిత చైతన్యము జీవుడని యేక జీవవాదుల మతము. ఈ పక్షము నందు జీవుడే తన కావరకమైన అజ్ఞానము వలన జగత్తునకు పాదాన కారణమును, నిమిత్తకారణమును అగుచున్నాడు. దృశ్య పదార్థములన్నియు ప్రాతిభాసికములు. దేహభేదముల వలన జీవులు భిన్నులనెడి భ్రమ కలుగుచున్నదనెను.

ఏకజీవవాదము రెండు విధములు. కొంద ఱొకేజీవుడు సర్వ శరీరములందు వున్నాడందురు. మఱికొందరుజీవుడొక్కడే యగును. అతడొక్క శరీరములో నుండి యనేక శరీరములను కల్పించుచున్నాడందురు.

ఇందు ప్రథమ పక్షమున ఒకే జీవుడు సర్వశరీరములలో నున్నచో సర్వశరీరముల యందు కలుగు సుఖదు:ఖములు సర్వశరీరములోనున్న జీవులకు కలుగవలయునుగదా? అట్లు కలుగుటలేదు గాన నది సమీచీనము కాదు.

రెండవ పక్షమునందు జీవుడీశరీరములో నున్నాడను నిశ్చయము లేకపోయినను, యేదియెూ యొక శరీరమునందున్నాడను నిశ్చయము కలుగుచున్నది. ఆ ఒక్కశరీరమందున్న జీవుడు ముఖ్యుడు. మిగతా శరీరములందున్న జీవులు కల్పితులు, కావున సర్వము మిథ్యయే యగును.

నానాజీవ వాదమునందు కూడ నొక జీవుని స్వప్నములో ననేక మిథ్యాజీవులు కల్పింపబడుచున్నట్లు, ఏకజీవ వాదమునందుకూడ నొక జీవుని కల్పనయే సమస్త జీవులని చెప్పబడును.

ముఖ్యజీవు డొక్క శరీరములోనే యుండును. ఇతర శరీరములు, ఆ శరీరములందు వున్న అంత:కరణములు వ్యవహారదశలో నున్నట్లు తోచుచున్నను, ఆ శరీరములు, అంత:కరణములు, జీవులు మొదలగున వన్నియు ప్రాతిభాసికములని తలంచ వలయును.

కావున వికల్పములన్నిటిని విడిచి ఒక్క బ్రహ్మచైతన్యమును మాత్రము గ్రహించినచో నన్నిమతములు ఉపాధేయములే యగును.

ఓం తత్ సత్

## వ్యావహారికసత్త - పంచీకరణము

సత్తా "పారమార్థికము, వ్యావహారికము, ప్రాతిభాసికము" అని మూడు విధములు. వానియందు బ్రహ్మచైతన్యము యొక్క సత్త పారమార్థికము. అవిద్య దాని కార్యమగు ప్రపంచము సత్తవ్యావహారికము. శుక్తిరజకాదుల సత్తప్రాతిభాసికము. ఇందు ప్రాతిభాసిక పదార్ధములు వ్యవహారిక దశ యందుపయోగపడుటలేదు. పారమార్థికమగు ఆత్మైక్యరూపస్థితి యందు వ్యావహారిక పదార్ధము లుపయోగపడుట లేదు. కాని ఉపాసనాది వ్యవహార దశయందు వ్యావహారిక పదార్ధములు వుపయోగపడుచున్నవి కాన వాని నిరూపణ మావశ్యకము.

అవిద్య, అవిద్యకు చైతన్యముతో గల సంబంధము, జీవేశ్వర విభాగము అవిద్యాగతచిదాభాసుడు అను ఈ నాలుగును అవ్యాకృత శబ్దముచే చెప్పబడుచున్నవి. అవిద్య ఈశ్వరుని యొక్క అలౌకిక శక్తి. అది జడమైనప్పటికిని స్వరూపముచే స్వచ్ఛము. కావున దానియందు చైతన్య ప్రతిబింబము కలుగుచున్నది. ఆ ప్రతిబింబ మాభాసుడనబడును. చైతన్యాభాసము జడముకాదు, చైతన్యము కాదు. అది జడ చైతన్యములకు విలక్షణము. ఈ యాభాసావిద్య మూర్తామూర్తయగు సమస్త ప్రపంచము నుత్పత్తి చేయుచున్నది. అది ఈశ్వర శక్తి యగుటచే నతనికంటె భిన్నము కాదు.

జీవేశ్వరులు దృక్కునందంతర్భాగములు. జీవేశ్వర విభాగము వ్యాకృతము. అట్లే అవిద్యాచైతన్యములలో చైతన్యము మాత్రము దృక్కు. అవిద్యాచైతన్య మవ్యాకృతము. అవిద్య, అవిద్యా వ్యాప్తమగు ద్రవ్యప్రపంచము పారమార్థిక సత్తగలవి కాకపోయినను, వ్యావహారిక సత్తగలవి యగును కాన వాని రూపణము ఉపాసనాదుల యందు వుపయోగపడును. అవి స్వప్న పదార్థముల వలె ప్రాతిభాసికసత్త గలవి కావు. దృశ్యము కూడ "అవ్యాకృతము, మూర్తము, అమూర్తము" అని మూడు విధములు. ఈ మూటిలోను చిదాభాసాసహిత అవిద్య మూర్తామూర్త రూపమగు సమస్త జగత్తునకు

బీజశక్తి యగును. అవి అవిద్యవలన పుట్టినవి గాకపోయినను, అవిద్యావృత్తివలన నివృత్తములగుచున్నవి. అది స్వయముగ జడమైనప్పటికిని, చైతన్యాభాసచే నుజ్వలమై జీవుల పూర్వకర్మ సంస్కారములచే ప్రేరితమై శబ్ద స్పర్శ రూప రస గంధములు గల ఆకాశవాయ్వగ్ని జలపృథ్వులను నైదు మహాభూతముల నుత్పన్నముచేసెను.

అద్వైత సిద్ధాంతమున గుణగుణులకు తాదాత్మ్య సంబంధము అంగీకరించ బడుచున్నది. కావున ఆకాశముయొక్క సూక్ష్మ స్వరూపము శబ్దము. ఇదే విధముగ వాయ్వాదుల సూక్ష్మస్వరూపములు స్పర్శాదులని గ్రహించవలెను.

శబ్దాత్మకమగు ఆకాశరూపమును పొందిన అవిద్య, స్పర్శాత్మకమగు వాయువు నుత్పన్నము చేయుచున్నది. కారణ స్వరూపాంతర్గతమగు శబ్దము, కార్యమగు స్పర్శాత్మక వాయుపునందనువృత్తమగుచున్నది. కావున వాయువు శబ్దస్పర్శాత్మక మగుచున్నది. వాయుభావమును పొందిన అవిద్య రూపాత్మక మగు తేజస్సును పుట్టించుచున్నది. దానియందు కారణ గుణములను వృత్తములై యుండుటచే, తేజస్సు శబ్దస్పర్శ రూపాత్మక మగుచున్నది. తేజోభావమును పొందిన అవిద్య వలన, రసాత్మకమగు జలముత్పన్న మగుచున్నది. దానియందు కారణ గుణములను వృత్తములై యుండుట చేత, జలము శబ్దస్పర్శ రూపరసాత్మకమగుచున్నది. జలభావము నొందిన అవిద్యవలన, గంధాత్మకమగు పృథ్వి యుత్పన్నమగుచున్నది. దానియందు కారణగుణములను వృత్తములై యుండుట చేత, పృథ్వి శబ్దస్పర్శ రూపరస గంధాత్మకమగుచున్నది. ఇంద విద్యయంతయు నాకాశముగ పరిణమించుట లేదు. అవిద్య యొక్క ఒక భాగము మాత్రమే ఆకాశముగ పరిణమించు చున్నది. అట్లే ఆకాశముయొక్క ఒక భాగము నందు వాయువును, వాయువు యొక్క ఏకదేశమునుండి తేజస్సును, తేజస్సుయొక్క ఏకదేశము నుండి జలమును, జలము యొక్క ఏక దేశము నుండి పృథ్వియును వుత్పన్నములు అయ్యెను.

దిశ లాకాశమునకంటె భిన్నములుకావు. "ఆత్మ నాకాశస్సం భూత:" అని శ్రుతి కూడ చెప్పినది. కాల మవిద్యకంటె భిన్నము కాదు. "సాచ తమ ఆసీత్" అను

నిటువంటి శ్రుతులు, కాలమవిద్య కంటె భిన్నముకాదని చెప్పుచున్నది. కార్యములు వాని కారణముల కంటె భిన్నములుకావు. "తదనన్యత్వ మారంభణ శబ్దాదిభ్యః" అను బ్రహ్మసూత్రము గూడ కార్యములు వాని కారణముల కంటె భిన్నములూ కావని చెప్పుచున్నవి. మృత్తికా కార్యములగు ఘటశరావాదులు, మృత్తిక కంటె భిన్నములు కానట్లు, గుణాత్మకా విద్యా సంపాదితములగు పంచ భూతములు కూడ త్రిగుణాత్మకములే అగును. విద్యా సంపాదితములగు, అపంచీకృత పంచభూతము లమూర్తములు, సూక్షరూపములు నగును.

ఈ అపంచీకృత సూక్షపంచభూతముల జ్ఞానశక్త్యాత్మక సమష్టి సాత్వికాంశము వలన అంతఃకరణము, క్రియాశక్త్యాత్మక సమష్టి రాజసాంశము వలన ప్రాణవాయువు పుట్టెను. ఇందు సమష్టి సాత్వికాంశమువలన పుట్టిన అంతఃకరణము నిశ్చయాత్మకవృత్తిచే బుద్ధియనియు, సంశయాత్మక వృత్తిచే మనస్సనియు చెప్పబడుచున్నవి. అహంకారము కూడ నంతఃకరణముయొక్క నిశ్చయాత్మక వృత్తియగుటచే నది బుద్ధియందు అంతర్గతముగ చెప్పబడినది. చిత్త మంతఃకరణము యొక్క సంశయాత్మక వృత్తి విశేషమగుటచే నది మనస్సునందంతర్గతముగ చెప్పబడినది.

సమష్టి రాజసాంశమువలన గలిగిన ప్రాణవాయువు వ్యాపార బేధము చేతను, స్థానబేధము చేతను, ప్రాణాపాన వ్యానోదాన సమానములను నైదు భేధములను బొందుచున్నవి. ఇదేవిధముగ నొక్కొక్క సూక్ష్మభూతము యొక్క జ్ఞానశక్త్యాత్మక వ్యష్టి సాత్వికాంశమువలన, నొక్కొక్క జ్ఞానేంద్రియమును, క్రియశక్త్యాత్మకవ్యష్టి రాజసాంశము వలన, నొక్కొక్క కర్మేంద్రియమును కలుగుచున్నవి.

ఆకాశము యొక్క సాత్వికాంశమువలన శ్రోత్రేంద్రియమును. రాజసాంశము వలన వాగింద్రియమును కలిగెను. ఇందు ఆకాశము యొక్క ముఖ్యగుణమైన శబ్దమును జ్ఞానశక్తి ప్రదాన సాత్వికాంశము వలన కలిగిన శ్రోత్రేంద్రియ మెఱుగుచున్నది. క్రియాశక్తి ప్రధాన రాజసాంశమువలన కలిగిన వాగింద్రియము చేయుచున్నది. వాయువు యొక్క సాత్వికాంశమువలన త్వగింద్రియమును, రాజసాంశము వలన పాణీంద్రియమును

కలిగెను. ఇందు వాయువుయొక్క ముఖ్య గుణమైన స్పర్శమును, జ్ఞానశక్తి ప్రధాన సాత్వికాంశమువలన గలిగిన త్వగింద్రియ మెఱుగుచున్నది. క్రియాశక్తి ప్రధాన రాజసాంశమువలన గలిగిన పాణేంద్రియము చేయుచున్నది. అగ్నియొక సాత్వికాంశము వలన చక్షురింద్రియమును, రాజసాంశము వలన పాదేంద్రియమును గలిగెను. ఇందు అగ్నియొక్క ముఖ్యగుణమైన రూపమును జ్ఞానశక్తిప్రధాన సాత్వికాంశమువలన గలిగిన నేత్రేంద్రియ మెఱుగుచున్నది. క్రియాశక్తి ప్రధాన రాజసాంశమువలన గలిగిన పాదేంద్రియము రూపమునొద్దకు గమనము చేయుచున్నది. జలముయొక్క సాత్వికాంశము వలన జింహేంద్రియమును రాజసాంశమువలన గుహ్యేంద్రియమును గలిగెను. ఇందు జలము యొక్క ముఖ్యగుణమైన రసమును జ్ఞానశక్తి ప్రధాన సాత్వికాంశము వలన గలిగిన జింహేంద్రియ మెఱుగుచున్నది. క్రియాశక్తి ప్రధాన రాజసాంశము వలన గలిగిన గుహ్యేంద్రియము రసమును విడుచుచున్నది. భూమి యొక్క సాత్వికాంశము వలన ఘ్రాణేంద్రియమును, రాజసాంశము వలన పాయురింద్రియమును గలిగెను. ఇందు భూమి యొక్క ముఖ్యగుణమైన గంథమును జ్ఞానశక్తి ప్రధాన సాత్వికాంశము వలన గలిగిన ఘ్రాణేంద్రియ మెఱుగుచున్నది. క్రియాశక్తి ప్రధాన రాజసాంశము వలన గలిగిన పాయురింద్రియము మలవిసర్జన చేయుచున్నది.

ఇదే విధముగ సూక్ష్మ పంచభూతములు జ్ఞాన శక్త్యాత్మక సమష్టి సాత్వికాంశము వలన గలిగిన యంత:కరణము పంచభూతముల గుణములైన శబ్దస్పర్శ రూపరస గంథముల మంచిచెడ్డల విమర్శించి యెఱుగు చున్నది. అట్లే సూక్ష్మ పంచభూతముల క్రియాశక్త్యాత్మక సమష్టి రాజసాంశము వలన గలిగిన ప్రాణవాయువు ప్రాణాపాన వ్యానోదాన సమానములను ఐదు విధములుగ విభజించబడి క్రమముగా "హృదయము, గుదము, సర్వశరీరము, కంఠము, నాభి" అను నైదు స్థానములందుండి క్రియాశక్తి ప్రధానములగు కర్మేంద్రియములు వానివాని కార్యములను జేయుటకు శక్తి నిచ్చుచున్నవి.

ఓం తత్ సత్

# లయ చింతన

లయము రెండు విధములు. కార్యము కారణమందు లయమగుట, కార్యకారణములు రెండును లయమగుట - ఇందు మూర్త పదార్థములు అమూర్తపదార్ధముల యందు లయమగుట దైనందిన ప్రళయము. అమూర్త పదార్థములవాకృతము నందు లయమగుట ప్రాకృతిక ప్రళయము. అవ్యాకృత సహితముగా సమస్త పదార్థముల లయము ఆత్యంతిక ప్రళయము. మూర్తామూర్తా వ్యాకృత భేధముచే దృశ్యపదార్థములు మూడు విధములు.

"ఆత్మన: ఆకాశ స్సంభూత:" అను శ్రుత్యనుసారము ఆత్మ నుండి ఆకాశము, ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి పృధ్వి క్రమముగా కలిగెను. మరల నివి ప్రళయ కాలమున క్రమముగా పృధ్వి జలమునందును, జలమగ్నియందును, అగ్ని వాయువునందును, వాయువాకాశము నందును ఆకాశ మాత్మయందును లయమగునని చెప్పబడెను. అట్లే జాగ్రస్వప్న సుషుప్తులకు కూడ లయక్రమము చెప్పబడుచున్నది. జాగ్రదవస్థ స్వప్నావస్థయందును. స్వప్నావస్థ సుషుప్త్యవస్థ యందును లయమగుచున్నవి. అట్లే జాగ్రదవస్థాభిమానియగు విశ్వుడు స్వప్నావస్థాభిమానియగు తైజసునియందును. స్వప్నావస్థాభిమానియగు తైజసుడు సుషుప్తవ్యవస్థాభిమానియగు ప్రాజ్ఞనియందును లయమగు చున్నారు. ఈ విధముగా మూలకారణము వరకు లయచింతన చేయుట ముముక్షువునకు కర్తవ్యము. ఈ యుద్దేశముతోనే శంకర భగవత్పాదులు లయచింతన నాదరించిరి.

**శ్లో॥ అజ్ఞానాద్ బ్రహ్మణోజాత మాకాశం బుద్ బుదోపమ్**
**ఆకాశాద్ వాయురుత్పన్నో వాయోస్తేజ స్తత: పయ:**
**అద్భ్యశ్చ పృథివీజాతా తతో వ్రీహియ వాదికమ్."**

భావము:- ఆకాశమునుండి వాయువును, దానినుండి తేజస్సును, దానినుండి పృథివియును, దానినుండి వ్రీహియవాది సస్యములును కలిగినవి. ఇది అనులోమక్రమము.

**శ్లో॥ "పృథివ్యప్సు వయోవహ్నౌ వహ్నిర్వాయౌనభస్యసౌ ।
నభోఽప్యవ్యాకృతే తచ్చ శుద్ధేఽస్మ్యహం హరిః ॥**

భావము:- పృథ్వి జలముననను, జలము అగ్నియందును, అగ్ని వాయువునను, వాయువు ఆకాశముననను, ఆకాశమవ్యాకృతముననను, అనగా మాయ యందును, మాయ శుద్ధ బ్రహ్మముననను వెలయుచున్నవి. నేనా శుద్ధుడనగు హరిని, ఇది విలోమక్రమము. ఇట్లు శ్రీ శంకరాచార్య విరచిత బ్రహ్మానుచిన్తనమ్ నందు చెప్పబడి యున్నది.

అద్వైత సిద్ధాంతము నందు సమస్త జడపదార్థములు చైతన్యమునకు వుపాధులు. ఇందు వ్యష్ట్యుపాది చైతన్యము జీవుడు. సమష్ట్యుపాధి చైతన్య మీశ్వరుడు. చైతన్యమున కుపాధియగు జడజాతమవస్థా బేధముచే స్థూల సూక్ష్మకారణములని మూడు విధములగును. ఇందు పంచీకృత పంచమహా భూతాత్మక భూతాత్మక దృశ్యజగత్తు స్థూలము. ఈ స్థూల జగత్తునకు కారణమగు అపంచీకృత భూతాత్మకము సూక్ష్మము. ఈ సూక్ష్మమునకు కారణమగు మూలాజ్ఞాన మవ్యాకృతము. ఈ మూడును వ్యష్టి సమష్టి బేధములచే జీవేశ్వరులకు ప్రత్యేక ప్రత్యేకముగా మూడుమూడుపాధులగు చున్నవి. ఇందు వ్యష్టి స్థూలోపాధిక జీవచైతన్యము విశ్వుడు. వ్యష్టి సూక్ష్మోపాధిక జీవచైతన్యము తైజసుడు. వ్యష్ట్యవ్యాకృతోపాధిక జీవచైతన్యము ప్రాజ్ఞుడు. అట్లే సమష్టి స్థూలోపాధిక యీశ్వరచైతన్యము విరాట్టు. సమష్టి సూక్ష్మోపాధిక ఈశ్వర చైతన్యము హిరణ్యాగర్భుడు. సమష్ట్య వ్యాకృతోపాధిక చైతన్య మీశ్వరుడు.

ఈశ్వరుడు రజోగుణము ప్రధానముగా నున్నపుడు బ్రహ్మ అనబడుచున్నాడు. సత్వగుణము ప్రధానముగా నున్నపుడు విష్ణువనబడుచున్నాడు. తమోగుణము

ప్రధానముగా నున్నపుడు రుద్రుడు అనబడుచున్నాడు. నిరుపాధిక చైతన్యము బ్రహ్మమనబడుచున్నది. ఈ విధముగా చిన్మయము. అద్వితీయము, నిరవయవము, దృగ్రూప చైతన్యము నందు పాసకుల యభీష్టానుసారము చతుర్భుజాదిమూర్తి కల్పనచేయబడినది. ఇందు రజోగుణోపాధికుడగు బ్రహ్మ చతుర్ముఖుడనియు, నతని భార్య భారతి యనియు, సత్వగుణోపాధికుడగు విష్ణువు చతుర్భుజుడనియు, నతని భార్య లక్ష్మియనియు, తమోగుణోపాధికుడగు రుద్రుడు పంచముఖుడనియు, నతని భార్య భవాని యనియు, కల్పింపబడినది. మఱియు దృగ్రూపచైతన్యమే దుష్ట శిక్షణ, భక్తరక్షణ, ధర్మపాలన నిమిత్తము శుద్ధసత్వ ప్రధాన మాయోపాధికుడై మత్స్యకూర్మాద్యనంతావతారములు లీలగా ధరించెనని కల్పింపబడినది.

**"కార్యసిద్ధ్యర్థం ఉపాసకానామ్ బ్రహ్మణోరూపకల్పన"** అని శ్రుతి వాక్యము.

ఓం తత్ సత్.

# అవస్థాత్రయము

మానవుడు తనకు కన్పించు అనగా పంచేంద్రియములకు తెలియబడు విషయములనే పరిశీలించుచుండును. కొందఱు మనస్సునకు తోచు సుఖ దుఃఖాదులను గురించి, శాస్త్రవిషయములను గూర్చి విచారించుచుందురు. కాని తెలిసికొనుదానిని అనగా ఆత్మను గురించి విచారించువారరుదు.

మానవుడు ఒక దినములో మేల్కొని వ్యవహరించుచున్నాడు. కలతనిద్రలో స్వప్నము గాంచుచున్నాడు. సుషుప్తిలో గాఢ నిద్రలలో ఏమియు తెలియక యున్నాడు. ఇట్లే ప్రతిదినము, జీవితపర్యంతము జరుగుచున్నది. కాన ఒక దినములో అనగా యిరువది నాలుగు గంటలలో జాగ్రత్తు, స్వప్న సుషుప్తులను పొందుచున్నాడు. ఈ అవస్థలను పరిశీలించినచో తెలిసికొను తెలివిని గురించి పరిశీలించిన వారమగుదుము.

**జాగ్రదవస్థ:** ఇంద్రియములకు వృత్తులు గలుగునప్పుడు పదార్థజ్ఞానము కలుగునది జాగ్రదవస్థ. జాగ్రదవస్థయందు మూర్త పదార్థములు ప్రత్యక్షాది ప్రమాణములచే వ్యవహరింపబడుచున్నవి. కావున నవి వ్యవహారము లనబడును. ఈ వ్యావహారిక పదార్థములు విశ్వుడనెడి జీవునిచే అనుభవింప బడుచున్నవి. దేహేంద్రియముల యందు ప్రవేశించి వ్యాపించి యుండుటచే జాగ్రత్ జీవుడు విశ్వుడనబడుచున్నాడు. విశ్వుడనుమానాది ప్రమాణములచే నమూర్తపదార్థములను, అవ్యాకృతమును నెఱుగు చున్నప్పటికిని, వ్యావహారిక జగత్తును విశ్వుడెఱుగుచున్నాడను నియమము చేతను, స్థూలశరీరాభిమాని యగుట చేతను, అతనికి స్వప్న సుషుప్త్యవస్థల వ్యాపకత్వము లేదు.

**స్వప్నావస్థ:** జాగ్రదవస్థల యందు భోగములనిచ్చెడు కర్మ సంస్కారములు నిద్రాదోషముచే క్షయించి, స్వప్నభోగములనిచ్చెడి కర్మ సంస్కారము లుద్భుదమగుట చేతను, నిద్రారూపమగు తామస వృత్తి వలన స్థూలదేహాభిమానము దూరమగుట చేతను,

ఇంద్రియాధి దేవతలింద్రియముల నను(గహింపక పోవుట చేతను, ఇంద్రియములు నిర్వ్యాపారములై లీనములగుట చేతను, విశ్వుడుకూడ లీనమగుచున్నాడు. అప్పుడు స్వప్నావస్థయనబడును.

జాగ్రదవస్థయందు ఘట జ్ఞానము కలుగునప్పుడు, మనస్సు ఘటాకారమును పొంది ఘటము నెఱుగుచున్నది. ప్రాతిభాసిక రజిత జ్ఞానకాల మందు ఆ విద్యయే రజతముగను, రజత జ్ఞానముగను పరిణమించి ప్రాతిభాసిక రజతము నెఱుగుచున్నది. కాని మనస్సెరుగుట లేదు. అట్లే స్వప్నమునందు స్వప్న పదార్థాకారముగ అవిద్యయే పరిణమించి, అవిద్యావృత్తి చేతనే యెరుగబడుచున్నది. కాని స్వప్న పదార్థములను మనస్సెరుగుట లేదు. ఈ విషయమునందు వివాదము లేదు. కాని స్వప్న పదార్థము లెట్లు వుత్పన్నములైనవను విషయములో రెండు మతములు గలవు. అవిద్యా సహకారము వలన మనస్సే స్వప్న పదార్థములను కల్పించుచున్నది. స్వప్న పదార్థములు దేని పరిణామములు కావనునదొక పక్షము. స్వప్నములో సాక్షి చైతన్యమునందు అధ్యస్థమైన అవిద్యయే స్వప్న పదార్థములుగా పరిణమించుచున్నది అనునది మరియొక పక్షము.

పదార్థములు "పారమార్థికము, వ్యావహారికములు, ప్రాతిభాసికములు, బౌద్ధములు" అను నాలుగు, విధములు. ఇందు దేనియొక్క వివర్తముగాని, దేనియొక్క పరిణామముగాని కాని పరమాత్మ పారమార్థికము. ఇదియొక్కటి మాత్రమే సత్యము. మిగతా మూడు పక్షములు మిథ్య. చైతన్య వివర్తము, మూలావిద్య పరిణామమునగు భూతభౌతిక ప్రపంచము వ్యావహారికము. రజ్జ్వవచ్ఛిన్న చైతన్య వివర్తము, తూలావిద్యాపరిణామమునగు రజ్జు సర్పాది పదార్థములు ప్రాతిభాసికములు. మనో విచ్ఛిన్న చైతన్య వివర్తనములును, దేని పరిణామములు కాని శశశృంగాదులు బౌద్ధములు.

అద్వైత వేదాంత దర్శనమునందేయే పదార్థములు పరిణామములగునో, ఆయా పదార్థములు వివర్తములు కూడనగును. ఈ విధముగా పరిణామము వివర్తముయొక్క వ్యాప్యము. అట్లే యేవి యేవి వివర్తములో నవియవి మూలావిద్యయొక్కగాని, తూలావిద్య యొక్క గాని పరిణామములగును. ఇది నియమము, పరిణామత్వము, వివర్తత్వము

అను నీ రెండు ధర్మములు సమనియతములు. కావున స్వప్నపదార్ధములు దేని పరిణామములు కావను మతము సరికాదు. స్వప్న పదార్థములు, నా పదార్థజ్ఞానములు అవిద్యా పరిణామము లగును.

జాగ్రదవస్థయందు మనస్సుయొక్క సహాయ్యము చేతనే ఘటపటాదుల జ్ఞానము కలుగుచున్నది. కావున అప్పుడాత్మయందు స్వయంజ్యోతిష్ట్వము సిద్ధించుటలేదు. స్వయముగా ప్రకాశించుటయే స్వయంజ్యోతిష్ట్వము. స్వప్నావస్థ యందు మనోవృత్తి లేకపోయినను అచ్చట అవిద్యావృత్తి అంగీకరించబడుచున్నది. ఆ అవిద్యా వృత్తి మనస్సునందున్న సంస్కారముల సహాయముతోగాని, లేక యిదమాకార మనోవృత్తి సహాయముతోగాని కలుగు చున్నది, కావున భ్రమస్థలములలో, మనస్సునందు జ్ఞానకారణత్వమున్నది. స్వప్నావస్థయందు **"అత్రీఽయం పురుషః స్వయం జ్యోతిర్భవతి"** అను శ్రుతి స్వప్నావస్థ యందు ఆత్మ స్వయంజ్యోతియని చెప్పుచున్నది. స్వప్నము నందు మనస్సే గజతురగాద్యాకారములుగా పరిణమించుచుండుటచే నది దృశ్యకోటిలోని దగును. కావున నాత్మకు స్వయంజ్యోతిష్టము సిద్ధించుచున్నది. అందువలన స్వప్నపదార్ధములు సాక్షిభాస్యములనబడుచున్నవి.

**సుషుప్త్యవస్థ:-** "సుషుప్త్యేకసిద్ధం" ఆత్మ సుషుప్త్యవస్థకు సాక్షి కావున సుషుప్తియందు సాక్షికభావము లేదు. సుషుప్తియందు సాక్షి లేనిచో జాగ్రదవస్థ యందు నేను మూఢుడనై నిద్రించితనను స్మరణ కలుగదు. ప్రమాత, ప్రమాణము, ప్రమ, ప్రమేయము ఇవి పరస్పరములు భిన్నము లైనప్పటికిని వాని సత్తాసత్తల నెరిగెడి సాక్షి మూడుకాలముల యందును నాశములేనిదగును. సుషుప్త్యవస్థ యందు మూడత్వానుభవము లేనిచో జాగ్రదవస్థ యందు మూఢత్వ స్మరణ కలుగనేరదు. సుషుప్తిలో మూఢత్వా నుభవమున్నది కావున ఆ అనుభవము వలన సంస్కారములు కలుగుచున్నవి. ఆ సంస్కారముల వలన మూఢత్వస్మరణ కలుగుచున్నది.

ఇట్లు జాగ్రత తోచినపుడు స్వప్న సుషుప్తులు లేవు. స్వప్నము తోచినపుడు జాగ్రత్ సుషుప్తులు లేవు. సుషుప్తియందు జాగ్రత్ స్వప్నములు లేవను విషయము సర్వానుభవము.

ఈ అవస్థాత్రయము దేనియందు తోచి దేనియందణగుచున్నవో అదియే ఆత్మ - మన స్వరూపము. అది సత్యమై, నిత్యమై, అజమైయున్నదని తెలిసికొను మానవుడే ధన్యుడు.

ఈ అవస్థాత్రయమును గురించి మాండూక్యోపనిషత్తు. మాండూక్య గౌడపాదకారికల యందు పూర్తి వివరములను గ్రహించగలము. శ్రుతులు **"యతోవా ఇమాని భూతానిజాయంతే, యేనజాతాని జీవంతి, యత్ప్రయం త్యభివిశంతి తద్ బ్రహ్మేతి"** యనియు **"జన్మాద్యస్యయత:"** అని బ్రహ్మ సూత్రములు, చెప్పుచున్నవి. ఆత్మకు అవస్థాత్రయము తటస్థ లక్షణముగా శాస్త్రములు చెప్పుచున్నవి.

ఓం తత్ సత్

## ఉపలంభము : ఆశ్రయము

## సుఖ మహమస్వాప్సమ్, నకించి దవేదిషమ్

### సుఖమహమస్వాప్సమ్ నకించిదవేదిషమ్

అర్థము:- నేను సుఖముగ నిద్రించితిని. నాకేమి తెలియదు.

జాగ్రత్స్వప్నావస్థల భోగముల వలన పరిశ్రాంతుడైన జీవుడు పై రెండు అవస్థలకు కారణములైన కర్మములు నష్టములగుటచే జ్ఞాన శక్త్యవచ్ఛిన్న వాసనాసహితాంత:కరణము తనకు కారణమైన అజ్ఞానము నందు లయము అగుచున్నది. అదియే సుషుప్త్యవస్థ. ఆ యవస్థయందు జీవుడు విశ్రాంతిని పొందుచున్నాడు. ఈ విధముగా **"నకశ్చిదవేదిషమ్"** కారణమాత్రముగా నున్న అవస్థ సుషుప్తి. ఈ లక్షణమునకు ప్రళయమునందతి వ్యాప్తి గలదు. కావున ప్రళయము యొక్క కారణము నందుపలంభ పదము చెప్పబడెను. ప్రళయకాల మందవిద్య, మూలస్వరూపముగా నున్నది. ఆ సమయము నందు దానికే వృత్తియు లేదు. సృష్టికాలము నందు అవిద్యకు అజ్ఞానాకారమగు ప్రాథమిక వృత్తి కలుగుచున్నది. ఆ అజ్ఞానాకారవృత్తి జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడవస్థలయందు కలిగియుండును. అవస్థాత్రయమునందు గూడ "నేను బ్రహ్మనెరుగను" అను ప్రతీతి కలుగుచున్నది. ఈ ప్రాథమికావిద్యావృత్తి వ్యావహారిక శబ్దాది జ్ఞానములకు విరుద్దము కాదు. కావున కేవలము ప్రాథమికా విద్యావృత్తి వలన సుషుప్త్యవస్థ యుపపాదింపబడుటలేదు గాని, వ్యావహారిక శబ్దాది జ్ఞానమును నిరోధించెడి అవస్థావిశేషమగు అజ్ఞానాకార అవిద్య యొక్క అన్యవృత్తి సుషుప్త్యవస్థ యందవశ్య మంగీకరింప వలయును. కావున సుషుప్త వ్యవస్థ యందు సాక్ష్యాకారమును, సుఖాకారామునకు నవిద్య యొక్క మరియొక వృత్తి అవశ్యము కలుగుచున్నది. కావున జాగ్రవవస్థయందు **"సుఖమహస్వాప్సమ్ నకించిద వేదిషమ్"** అనెడి అనుసంధానము

కలుగుచున్నది. ఈ అనుసంధానము సుషుప్తి యందలి యనుభవము వలన కలుగుచున్నది. కావున నాయనుసంధాను సారముగ సుషుప్తి కాలము యొక్క అనుభవమునందు నాలుగంశములు కల్పనమగుచున్నవి. సుఖాంశము, అహమంశము, స్వాపాంశము, అజ్ఞానాంశము. సుషుప్తియందు వృత్తి సహితముగ నంత:కరణము లయమగుచున్నది. కావున నంత:కరణ వృత్తి విశేషమగు అహమంశమచ్చట లేదు. జాగ్రత్కాలము యొక్క **"సుఖమహమస్వాప్సమ్"** అను అనుసంధానము నందహమంశము యొక్క ప్రవేశ మితర మూడంశముల వలె అనుసంధానమునకు విషయమగుట లేదు. కాని అనుసంధానమున కాశ్రయమై యున్నది. ఆయాశ్రయమైన యహంకారము జాగ్రదవస్థయందనుసంధానకాలము నందే యున్నది. కావున "సుఖమహమస్వాప్సమ్" అను నిటువంటి అనుసంధానమున కనుపపత్తి లేదు. శేషించిన మూడంశములు తదాకారముతో అవిద్య యొక్క మూడు వృత్తులు అగుచున్నవి.

అనుపపత్తి = హేతువు

కథమపి = ఏలా అయినప్పటికి

జాగ్రత్ యొక్క యుపలంభము మనోవృత్తి రూపము. స్వప్నము యొక్క యుపలంభము అవిద్యాకల్పిత మనోవృత్తి రూపము. ఈ విధముగా ప్రాతిభాసిక రజతము యొక్క యుపలంభము కూడ అవిద్యాకల్పిత మనోవృత్తియే యగును. సుషుప్తి యొక్క యుపలంభము కథమపి మనోవృత్తి రూపము కాదు. అది సాక్షి రూపమే యగును. అదియే స్వాపాకారవృత్తి. కారణమాత్రోపలంభ మగు సుషుప్తియే స్వాప పదమున కర్థము.

సుఖాజ్ఞానములు రెండును సహమర్థధర్మములు. ఈ రెండింటికి పరస్పర వైశిష్ట్యము కలుగదు. వానికి వైశిష్ట్యముండినచో వానికాశ్రయమగు సహమర్థమునకు ప్రతీతి కావలయును. సుఖా జ్ఞానముల కాశ్రయమగు అహంభావము సుషుప్తి యందు లేదు. అహంభావము యొక్క ప్రతీతి నంగీకరించినచో సుషుప్తియే అభావమగును.

**"సుఖమహమహమస్వాప్సమ్ నకించిదవేదిషమ్"** అను ప్రతీతి కనురోధమగుటచే సుషుప్తి యదు అవిద్య అంగీకరింప బడుచున్నది. సుషుప్తి యందవిద్యావృత్తి నంగీకరించుటచే సుషుప్తికి ప్రళయమునకు వైలక్ష్యము సిద్ధించుచున్నది. స్మరణ మనుభవజ్ఞానజన్యము. జాగ్రత్తయందు కలిగెడి స్మరణరూపమగు కార్యముచే సుషుప్తియందలి యనుభవ మనుమానింప బడుచున్నది. అనుభవవము వృత్తి రూపము, కావున సుషుప్తి యందలి అవిద్యావృత్తి యుండినట్లు విదితమగుచున్నది.

వాస్తవముగా అహంకారము స్మరణకాశ్రయము కాజాలదు. సాక్షి చైతన్యమే స్మరణకు ఆశ్రయమగును, అనుభవియే స్మరణ కాశ్రయమగును. ఇది నియమము. ఇచ్చట సాక్షి చైతన్యమే అనుభవియగును గాని, అహంకారము గాదు, సుషుప్త ్యవస్థయందు అహంకారము లీనమగుచున్నది గదా?

వ్యావహారిక మనస్సు యొక్క తాదాత్మ్యము చేతనే అవిద్యా కల్పిత మనస్సున కధ్యాస కలుగుచున్నది. కావున కల్పితమనోవృత్తి వలన కలిగిన సంస్కారములు, కల్పిత మనోధ్యాస కధిష్ఠానమగు వ్యవహారిక మనస్సునందే కలుగుచున్నవి. ~~ఈ~~ విధముగా సుషుప్త వ్యవస్థలో సాక్షి యందు తాదాత్మ్యా ధ్యాసచే అవిద్యాకల్పిత సాక్షి సుఖాజ్ఞానముల ననుభవించుచున్నది. కాని దాని వలన కలిగిన సంస్కారములు, మనస్సునకు కారణమైన అజ్ఞాన విశిష్ట సాక్షి యందు కలుగుచున్నది. ఇందువలన జాగ్రదవస్థయందు కార్యమగు మనో విశిష్ట సాక్షిచే వాని స్మరణ కలుగుచున్నది. కాని స్మరణ మనో పరిణామము కాదు. స్మరణకు విషయములగు పదార్థములన్నియు సాక్షి భాస్యములు.

ముఖ ప్రతిబింబమున కాశ్రయమైన అద్దమునందు జపా పుష్పము యొక్క రక్తవర్ణ మధ్యస్థమైనప్పుడు ముఖమెఱ్ఱగా నున్నట్లు ప్రతీతమగుచున్నది. అధ్యస్థమైన లౌహిత్యమునకును, ముఖ ప్రతిబింబమునకు ఆశ్రయము దర్పణమగును. ప్రతిబింబము లౌహిత్యమున కాశ్రయము కాదు. అయినను లౌహిత్యమును, ప్రతిబింబము, నొక దర్పణమందే సామానాధికరణ్యము కలవి యగుచున్నవి. కావున ముఖమెఱ్ఱగా నున్నదని ప్రతీతి కలుగుచున్నది. అట్లే స్మరణకు, అహంకారమునకు

నొక్క సాక్షి చైతన్యమే ఆశ్రయమగుటవలన నవి రెండును సాక్షి చైతన్యమునందు సామానాధికరణ్యముగలవి యగుచున్నవి, అందువలన స్మరణకాశ్రయత్వ మహంకారమైనట్లు ప్రతీతమగుచున్నది.

సాక్షి చైతన్యము సుషుప్తి యందనుభూతములైన సుఖాదులను జాగ్రదవస్థయందు అహంకారాశ్రయత్వము స్మరించుచున్నది. జాగ్రత్కాలము నందలి స్మరణకాశ్రయమైన సాక్షి చైతన్యమే అహంకారమునకు కూడ నాశ్రయమగుచున్నది.

**"స్మృతి, సంశయము, విపర్యయము"** అను ఈ మూడును సాక్షి చైతన్య ఆశ్రయములు. ప్రమాణ జన్యజ్ఞానమున కహంకారమాశ్రయము. ఇది నియమము. అహంకార జన్య జ్ఞానము ప్రమ. అవిద్యా జన్యజ్ఞాన మప్రమ. ప్రమాజ్ఞాన మహంకారజన్యము.

ఈ విధముగ సుషుప్త్యవస్థయందానంద మనుభవింపబడుచున్నది. ఆ యానందము ననుభవించు సుషుప్త్యవస్థాభిమానియగు జీవుడత్యంతాజ్ఞాని యగుటచేతను, సుషుప్తియందు సుఖాకారా, జ్ఞానాకారాది వృత్తులచేతను, ఇతర విషయావచ్ఛేదము లేకపోవుట చేతను, ప్రకృష్టజ్ఞానవంతుడగుటచేతను ప్రాజ్ఞుడనబడుచున్నాడు.

సుషుప్తియందు **"సతాసోమ్య సంపన్నోభవతి"** అను శ్రుతి జీవునకు ఈశ్వరునితో అబేధము ప్రతిపాదించుచున్నది. ఈ ప్రతిపాదన జీవున కాసమయములో దేహేంద్రియాదుల యందభిమానము లేకపోవుట చేత నౌపచారికముగా చెప్పినది. ఆత్మ ప్రమాతృ, ప్రమాణ ప్రమేయముల అభావమునకు కూడ సాక్షియేయగును.

మూర్తపదార్థ వ్యవహారములు గల జాగ్రదవస్థ "అ" కారము. అమూర్త పదార్థ వ్యవహారములు గల స్వప్నావస్థ "ఉ" కారము, అవ్యాకృత స్థితిగల సుషుప్త్యవస్థకు "మ" కారము వాచకములు, వాచ్యవాచకములు, ఆభేధములు, ఇవయన్నియు పరస్పర వ్యతిరేకములు, దృశ్యములు నగుటచే మిథ్య. వీని కధిష్ఠానమగు శుద్ధ చైతన్యము

తురీయము.  అది సర్వానుగతము.  ఆ తురీయ చైతన్యమే సాక్షి.  ఆ సాక్షియే సత్యము. అదియే నేను.  ఈ సాక్షిని విధిముఖముగా బోధించెడి శబ్దములుగాని, శాస్త్రములుగాని లేవు.  ఇది అమాత్రా బోధ్యము, మౌనవ్యాఖ్యానముచే గ్రహింపదగినది.

ఓం తత్ సత్

## ఏ కా త్మ ప్ర త్య య సా రం

**శ్లో॥ బాల్యాదిష్వసి జాగ్రదాదిషు తథా సర్వా స్వవస్థా స్వపి**
**వ్యావృత్తా స్వనువర్తమాన మహమి త్యంతస్స్ఫురంతం సదా**
**స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో భద్రయాముద్రయా**
**తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీదక్షిణామూర్తయే ॥**

టీ॥ బాల్యాదిషుఅపి = బాల్యము మొదలుగా గల యవస్థలయందును, జాగ్రదాదిషు = జాగ్రదవస్థ మొదలయిన అవస్థలయందును, తథా = అట్లు; వ్యావృత్తాసు = పరస్పరభిన్నములైన; సర్వాసు = సమస్తములయిన; అవస్థాస్వపి = అవస్థలయందును; అనువర్తమానం = అనువర్తించుచున్న; అంత: = లోపల; అహమితి = నేను అని; సదా = ఎల్లప్పుడును; స్ఫురంతం = తోచుచున్నవాని; స్వాత్మానం = తన ఆత్మనుగా; య: = ఎవ్వడు; భజతాం = సేవించు వారలకు; భద్రయా = మంగళకరమయిన; ముద్రయా = జ్ఞానముద్ర చేత; ప్రకటీకరోతి = తెలియబఱచుచున్నాడో; తస్మై = అట్టి; శ్రీగురుమూర్తయే = శ్రీమంతుడైన గురువు యొక్క యాకారాము గల; శ్రీదక్షిణామూర్తయే = శ్రీదక్షిణామూర్తికొఱకు; ఇదం = ఈ; నమ: = నమస్కారము; (అస్తు = అగుగాక).

మాయ యొక్క మిధ్యాభ్యాసమును వదలిన నిజమైన ఆత్మ స్వరూపమును గుర్తించు విధము ఇక్కడ చూపించబడుచున్నది. నేను అను ప్రత్యయమునకు నిజమైన విషయ మేది అని పరిశీలించుట ద్వారా నిశ్చయించ వచ్చును. మాండుక్యం ఏడవ మంత్రము “ఏకాత్మ ప్రత్యయసారమ్” అను విశేషణముతో చూపించినది.

నేను అని తోచు ఈ దేహము మఱియొకసారి మనకు విషయముగా తోచుచున్నది. అనగా నా దేహమని చెప్పుచున్నాము. నాకు విషయమై తెలియవచ్చుచున్నది.

చిన్నతనమున తల్లి ఒడిలో యుంటిని. పెద్ద అయిన తర్వాత పాఠశాల యందు చదువుతూ యుంటిని. మఱికొంతకాలం పెద్ద అయిన పిమ్మట వివాహమాడి గృహస్థుడనైతిని. ఇట్లే బాల్యము, యౌవనము, కౌమారము, వార్థక్యము అను అవస్థలు దేహము పొందుచున్నది. ఇదే బాల్యాదిషు అనగా, ఈ అవస్థలు వేరువేరుగా మార్పు చెందుచున్నప్పటికి "నా"యందు ఏమార్పు కలుగలేదు. పై అవస్థల అనుభవములన్నియు నాయందుండుచున్నవి. ఆ మార్పులను చూచుచున్న నేను మాత్రము అతనే అని నిశ్చయించుకోగలము. ఈ విధముగా ఆత్మప్రత్యయము. లేక నేను అను జ్ఞానము - దేహము, ప్రాణము, ఇంద్రియములు, మనస్సు బుద్ధి - వీటన్నిటిని అనుసరించుకొనియున్న నేనే ఆత్మ అని ఈ ప్రత్యయము ద్వారా నిశ్చయించవచ్చును. శ్లోకములోని "వ్యావృత్తాస్వను వర్తమాన" అనగా వ్యావృత్తాసు మార్పు చెందుచు వేరువేరుగా కన్పించు బాల్యాది అవస్థల యందన్నిటి యందున" అను వర్తమానం "నేను, నేనని అనువర్తించుచున్నది. కాన మార్పులేని "నేను" నందు మారుచున్న అవస్థలు తెలియబడుచున్నవి. నేను సత్యము, బాల్యాది అవస్థలు ఆభాసలు.

ఆత్మను ప్రత్యక్షాది ప్రమాణములచే తెలియ వీలులేదు. ఎందువలన అనగా అతని ననుసరించియే ఈ ప్రమాణములన్నియు తమ తమ విషయములను చూపించుచున్నవి. ప్రమాణములు, ప్రమాణములు చూపు విషయములు మారుచున్నను. వాటిని విషయీకరిస్తున్న ఆత్మయే నేను. అందువల్ల దీనిని విషయి అందురు. కాన ఆత్మప్రత్యయము ద్వారా తెలిసికొనవలెనే గాని, తెలియబడునట్టి విషయముగా తెలియుటకు వీలులేదు.

నేను, ఇది అను విభాగముద్వారా మన లోపల బయటా కనబడే దంతయు మన ఆత్మకు విషయమై ఉంటుంది.

రోడ్డు సెంటరులో దీపపుస్తంభము తాను కదలక ఒకచోటునే యుండినను, అటు నిటు పోవు వాహనములను, ప్రాణులను, మనుష్యులను ప్రకాశింపజేస్తూ కనుపింపజేయునుగదా! అవ్విధముగనే బాల్యాది అవస్థలు వచ్చి పోవుటను ఎప్పుడూ

ఈ ఆత్మ తన స్వరూపమైన జ్ఞానముతో ప్రకాశింప జేస్తూ మహాప్రదీపమువలె ఉన్నాడు. మార్పులన్నిటిని తెలిసికొనే సమయమున ఈ ఆత్మ యందు ఏ మార్పు కలుగుటలేదు. ఈ ఆత్మస్వరూపమును మనమున్నదని లేదని గాని తెలిసికొనుటకు వీలులేదు. అన్ని విషయములను తెలిసికుంటున్న ఈ ఆత్మస్వరూపము ఉన్నది అనుట అనుభవమాత్రంతోనే మనకు గుర్తుగలుగును.

దీనినే మాండూక్యోపనిషత్తు ఏడవ మంత్రమున ఏకాత్మ ప్రత్యయసారం అని వర్ణించినది. అనగా వ్యావర్తించియుండు అవస్థాత్రయమున అనువర్తించి యుండునదేదియో దానినే ఏకాత్మ ప్రత్యయసారమని తెల్పినది. ఆ మంత్రము నందు దానినే పంన్రెడు విశేషములు, ప్రతిషేధరూపములు, వీనిచే ఆత్మ శూన్యమగునేమోయని దానిని నివారించుటకై చివరి అయిదు విశేషణములచే దాని అస్తిత్వముచెప్పి చివరకు సవిజ్ఞేయ: అని ముగించినది. బాల్యాద్యవస్థలు ఏవియు కూడా ఏవిధముగాను లిప్తతలేకయున్నాయో ఆ విధముగానే జనన మరణములను అవస్థలు కూడ ఆత్మను అంటవు. ఎందువలననగా దేహము పుట్టుటవల్ల ఆత్మస్వభావము పుట్టుక కలది కాజాలదు. దేహము చనిపోవుటవలన అది చావదు. (బృ. 44-4-25) **"సవాఏష మహానజ. ఆత్మాஉజరోஉమరోஉమృతోஉభయం బ్రహ్మ"** అని చెప్పుచున్నది. అనగా ఈ మన ఆత్మే జన్మలేని మహా ఆత్మ. ఇతడు ముసలితనము, చావులేనివాడు. చావురాని స్వభావము కలవాడు. భయము లేనివాడు. బ్రహ్మము అని శ్రుతిచాటుతున్నది. ఈ ఆత్మనిత్యమూ తన యందు తాను ఉన్నట్లే యుండు స్వభావముగలదై యున్నది. ఇప్పటివరకు బాల్యాదిషు అను దానిని పరిశీలించి నిత్యవస్తుదర్శనం చేయగలిగితిమి.

జాగ్రదాదిషు అనుదాని విమర్శించి చూతము. ఈ రెండు అవస్థారాసుల యందునూ ఒకదానికంటె యొకటి విలక్షణమై యున్నది. బాల్యాదులు ఒకదాని వెనుక ఒకటి వస్తున్నట్లు కనబడుచున్నవి. జన్మనుండి మరణము వరకు కలుగు దేహముయొక్క వికారములు ఒకదాని వెనుక యొకటి వస్తున్నప్పటికి ఈ దేహాదులు నాకే సంబంధపడియున్నాయి అను భ్రాంతి అవివేకులకు వుండును. బాల్యము మొదలు

ముసలితనము వరకు చెప్పుటకు గుర్తులేని విధముగా మార్పులు కలిగినను, ముందుండిన దేహమే ఈనాదేహము అనుభావన మనల వెన్నంటియున్నది. "అదే ఇది" అనుబుద్ధికి విషయమై ఉన్న వస్తువులను పరిణామి, నిత్యవస్తువులు అని చెప్పుదురు. ఈ భ్రాంతిని వృత్తి కొఱకే అనుభవము నొకదానిని చూపించి ఆవశ్యకత యున్నది గాన జాగ్రదాది అవస్థలను పరిశీలించవలసి యున్నది.

జాగ్రదాది అనగా జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యవస్థ, మూర్ఛాది అవస్థలు. జాగ్రత్త, కల - ఈ రెండింటియందుకూడా ఏదో ఒక విధమైన వస్తువును చూపిస్తున్నవి. సుషుప్తియందు మనకు ఏమియు కన్పించుటలేదు. రెండవ వస్తువు యొక్క జ్ఞానమున్న అవస్థను దర్శనవృత్తవస్థ యనియు, ఏ జ్ఞానములేని అవస్థను అదర్శనవృత్తవస్థ యనియు అందురు. ఈ రెండు విభాగములకు చేరని ఏ అవస్థయులేదు. అందుచేత సన్నిపాతము, మూర్ఛ మొదలైనవానిని వేరుగా విచారించవలసిన అవసరంలేదు.

బాల్యాది అవస్థలకు జాగ్రదాది అవస్థలకుగల విలక్షణత్వమేమనగా - బాల్యాదులన్నియు జాగ్రదవస్థకు చేరియున్నవి. అన్నియు జాగ్రత్‌కాలమందు కలుగుచుండును.

జాగ్రత్, కల మొదలగు అవస్థావిచారణయందిట్లు కాదు. జాగ్రత యున్నపుడు స్వప్నముగాని, సుషుప్తిగాని యుండవు. అవి అప్పుడు ఎక్కడో వేరొకచోట నిజముగా ఉండియున్నాయని ఎవ్వరము భావించము. అట్లే వేరొక అవస్థలో నున్నపుడు మిగిలిన అవస్థలనుకూడ అన్వయించుకొనవచ్చును. ఇదియునుగాక జాగ్రత, కల, నిద్రమూడు, బాల్యయౌవన, కౌమారమును ఈ అవస్థలవలె ఒకే కాలప్రవాహమునందు ఒక తర్వాత మరియొకటి కలుగుచుండుట లేదు. ఏలన జాగ్రత యందు మనకు అనుభవమునకు వచ్చు కాలము వేరు - స్వప్నమునందు కన్పించు కాలము వేరు. కలయందు కన్పించు కాలప్రవాహములో పూర్వము - ఇప్పుడు - ముందు అను విభాగములన్నను, జాగ్రత కాలప్రవాహమునందుండు పూర్వము - ఇప్పుడు - ముందు అను విభాగమునకు సంబంధముండదు. అయినా జాగ్రత్త యందునూ కలయందునూ ఆత్మ ఒక్కడే

ఉన్నాడు. నేనే జాగ్రతను చూచుచున్నాను. నేనే స్వప్నమును చూచుచున్నానను అనుభవము అందరికి సమానమే. అందుచేత అవస్థలు ఒక్కొక్కటి మిగతా రెండవస్థలను పూర్తిగా విడిచియే కనబడుచున్నాయన్నట్లయినది. ఏ రెండవస్థలకు ఏ కాలకృతమైన సంబంధము లేదు. ఈ అవస్థలు ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. అంటే అవి వేరువేరుగా వుండి వస్తున్నాయని అర్థముకాదు. ఒకటి మరి రెండింటినీ తుడిచి వేసియే వస్తున్నాయని అర్థము.

ఈ వివేచన వలన అవస్థలు మారుచున్నను, ఆత్మ అన్ని అవస్థలను చూస్తూ, తన స్వరూపమునందెట్టి మార్పు లేక ఉన్నాడని తెలియగలము. కాన అతడు పరమార్థ సత్యస్వరూపుడు. అయితే అవస్థలు దానియందుతోచి అణగుచున్నవి. కాన అవి మిధ్యాభాసములు. అవస్థాగుణదోషములు ఆత్మనంటవు. ఈ అవస్థలను నేనే అనుభవిస్తున్నాను. అవి మన అనుభవము. ఇక్కడ ఉన్న "నేను" అను శబ్దమునకు గురియైన లేక లక్ష్యమైన ఆత్మవస్తువేదో, అది ఒక అవస్థకు కట్టుబడియుండక పోవుట చేత అహం ప్రత్యయమునకు విషయమైన వస్తువునేమీ ఇచ్చట నేను అను మాటలో చెప్పలేదు. దానిని "అహమిత్యస్త: స్ఫురస్తమ్" చెప్పబడినది. అందుచేత సదా అను శబ్దము కూడ కాలవాచకముగాదు. ఎందువలననగా వేరువేరు కాలముయొక్క భావము కలుగుచున్న జాగ్రత్స్వప్నములు యందునూ తోచుటగాని, కాలము యొక్క జ్ఞానము గాని లేని సుషుప్తి యందునూ ఆత్మ తన రూపమును దాచకుండ స్వప్రకాశముగానే కనబడుచున్నాడు. అతడే మనము "నేను" అని వ్యవహరించుచున్న ఆత్మ యొక్క పరమార్థస్వరూపము.

ఏవిధమైన మార్పులు తన స్వరూపమునందు లేకుండ, బాల్యాద్యవస్థ లందు, జాగ్రదాది అవస్థలయందు కన్పించుచు, అవస్థల వికల్పములకు సాక్షిగాయుంటూ తన చైతన్యముతో అన్ని వికల్పములను వ్యాపించికొని యున్న ఈ అద్వైత స్వరూపము, శ్రీ దక్షిణామూర్తియైన పరమేశ్వరుని యొక్క భక్తులకే దొరకును. అతడే మన బుద్ధి వృత్తులను ధర్మమార్గమునకు త్రిప్పి స్వరూప జ్ఞానమును అనుగ్రహించును. ఎవరు

పరమేశ్వరుని విషయమున విముఖులో, ఎవరు లౌకిక విషయభోగముల యందే ఆసక్తి కలిగియుందురో, వారికి ఈ పరమార్థము ఆత్మే అయి యున్నది ఏ ప్రయోజనము కలుగజేయ కున్నది.

ఇట్లు వివేకశాలురు ఉపనిషత్తులు చెప్పు **"అహంబ్రహ్మాస్మి, తత్త్వమసి"** ఇత్యాది మహావాక్యములయందిమిడి యున్న గర్భితార్థమును గ్రహించగలిగి, పరమశాంతినిపొంది ఆమృతులై కృతార్థులగుదురుగాక.

ఓం తత్ సత్

# మిథ్యాచారము

**శ్లో॥ కర్మేంద్రియాణి సంయమ్య, య ఆస్తే మనసా స్మరన్**
**ఇంద్రియార్థా న్విమూఢాత్మా, మిథ్యాచారం స ఉచ్యతే ॥ భ.గీ.అ.3.శ్లో.6**

తా॥ అర్జునా! వాగాదికర్మేంద్రియములను మాత్రము నిగ్రహించి, శబ్దాది విషయములను మనస్సుతోస్మరించుచుండెడి మూఢుఢు మిథ్యాచారుడు అనబడును.

రాగద్వేషాది దుర్గుణములచే దూషితమైన మలినాంతఃకరణమును గలవాడు కుతూహలముతో, వాక్పాణిపాదాది కర్మేంద్రియములను నిరోధించి, రాగద్వేషాదులచే ప్రేరేపింపబడిన మనస్సుతో శబ్దస్పర్శాది విషయములను స్మరించుచు, ఆత్మతత్త్వమును గూర్చి చింతింపక "నేను సర్వకర్మలను సన్యసించితిని" అనెడి దురభిమానముతోనే కర్మమును చేయనివాడు మిథ్యాచారుడని చెప్పబడుచున్నాడు. అపరిశుద్ధచిత్తముగల అజ్ఞానులను మూల ప్రకృతివలన కలిగిన సత్వరజస్తమోగుణములును, వానివలన గలిగిన ద్రవ్యవాసనలు, గుణవాసనలు, కర్మవాసనలు, అభిమాన రాగద్వేషాదులు మొదలగునవి కాయిక, వాచిక, మానసికములగు సమస్తలౌకిక వైదిక కర్మలను చేయించుచున్నవి. అంతఃకరణము పరిశుద్ధము కాకపోవుటచే జ్ఞాననిష్ఠా రూపమగు ఫలమును పొందుటకు యోగ్యతలేనివాడు పాపాచారుడనబడును. ఈ విషయమునుగూర్చి శాస్త్రమునందు **"త్వంపదార్థవివేకాయ, సన్న్యాసః సర్వకర్మాణాం। శ్రుత్యావిధీ యతేతస్మా, త్తత్త్యాగీపతితో భవేత్"** అని ఉన్నది. శ్రుతియందంతఃకరణ పరిశుద్ధిగల ఉత్తమాధికారులు త్వంపదార్థమగు ఆత్మతత్త్వ విచారణ చేయుటకొఱకు మాత్రమే సర్వకర్మ సన్యాసము విధించబడియున్నది. కాని మలినానంతఃకరణములుగల అజ్ఞానులు కుతూహలముతో వేదవిహితములగు నిత్యనైమిత్తిక కామ్యకర్మలను విడిచి, కాషాయ దండకమండలములను ధరించి, త్వంపదార్థమైన ఆత్మ తత్త్వవిచారణ చేయక, సోమరులై తిరుగువారు

పతితులగుదురని చెప్పబడెను. కావున మలినాంతంకరణము కలవాడు సర్వకర్మలను విడిచి సన్యాసివేషము వేసికొనినను అతనికి జ్ఞాననిష్ఠ సిద్ధింపదు.

పరిశుద్ధాంత:కరణము గలవాడై వివేకయుక్తమగు మనస్సుతో పాపోత్పత్తికి హేతువులు అగు శబ్దాది విషయాసక్తి గల శ్రోత్రాది జ్ఞానేంద్రియము లను నిగ్రహించి, వాగాది కర్మేంద్రియములతో శాస్త్రవిహితములగు కర్మలను ఫలేచ్ఛారహితముగ ఆచరించు కర్మయోగి మలినాంతంకరణముకల మిధ్యాసన్యాసి కంటె మిగుల శ్రేష్ఠుడు.

పరిశుద్ధాంత:కరణము కలవాడును, అపరిశుద్ధాంతంకరణము గల వాడును చేయు పరిశ్రమ సమానమైనప్పటికిని, అపరిశుద్ధాంత: కరణము గలవాడు వాగాది కర్మేంద్రియములను నిరోధించి మనస్సు తోను, శ్రోత్రాది జ్ఞానేంద్రియములతోను, విషయములందు అనురాగముతో ప్రవర్తించుచు, పరమ పురుషార్థమగు మోక్షమునకు దూరము అగుచున్నాడు. పరిశుద్ధాంత:కరణము గలవాడు మనస్సును, శ్రోత్రాది జ్ఞానేంద్రియములను, శబ్దాది విషయముల నుండి నిరోధించి, వాగాది కర్మేంద్రియములతో ఫలేచ్ఛా రహితముగ కర్మలను చేయుచుండినను, పరమపరుషార్థ రూపమగు మోక్షమును పొందుచున్నాడు. కావున చిత్తశుద్ధిలేని మిధ్యాచారి సన్న్యాసికంటె, చిత్తశుద్ధి కొఱకు నిష్కామ కర్మలననుష్ఠించు కర్మయోగి అత్యంత శ్రేష్ఠుడునని గ్రహించవలెను.

ఓం తత్ సత్

## గురు పాదుకాపూజ - దాని విశిష్టత

మనము మన దృష్టిలో దేనిని గొప్ప విలువైనదానినిగా తలంతుమో దానిని సహజముగా పూజింతుము. దేనికైతే మనము విలువ నిచ్చెదమో అది మన జీవితములో అర్ధవంతమై యుండును. ఏదోమార్గంగా దానిని గుర్తించుచునే యుందుము. మనము మన మాతృభూమిని ప్రేమించు చుందుము. కనుక మన జాతీయపతాకమునకు వందనమిడి హృదయ పూర్వకంగా జాతీయగీతమును పాడెదము.

రామాయణములోని రామ పాదుకలను గురించి విస్తారముగ వ్రాయబడినది. రాముని పాదుకలు సింహాసనమునందుచి పదునాలుగు సంవత్సరములు భరతుడు రాజ్యమేలెను. అనగా రాములవారదిష్ఠించిన పాదుకలను రాములవారిగనే భావించి, వారి ప్రతినిధిగా రాజ్యపాలన చేసెను.

**శ్లో॥ యదంఘ్రికమలద్వంద్వం । ద్వంద్వతాపనివారకం ।**
**తారకంభవసింధోశ్చ । శ్రీగురుం ప్రణమామ్యహం ॥**

తా॥ ఏ సద్గురువుయొక్క పాదకమలములు, శీతోష్ణములు మొదలైన సుఖ, దు:ఖద్వంద్వములను బోగొట్టునవియును, సంసార సముద్రమును దరింప( జేయునవియు అగుచున్నవో, అట్టి సద్గురువును గూర్చి నేను నమస్కరించుచున్నానని ఈశ్వరు(డు గురువందనము జేసి చెప్పుచున్నాడు.

**శ్లో॥ నగురోరధికం నగురోరధికం నగురోరధికం నగురోరధికం ।**
**శివశాసనత శ్శివశాసనత శ్శివశాసనత శ్శివశాసనత: ॥**

తా॥ ఈశ్వరాజ్ఞవలన గురువుకంటె శ్రేష్ఠమైనదిలేదు. దృఢత కొఱకు నీ శ్లోకమునందు, నాలుగు పాదములయందును నొక్కటే యర్థమును జెప్పంబడినది.

గురుపాదుకలను పూజించుట మనకు దివ్యమైన అవకాశముగ గుర్తించ వచ్చును. వెంటనే మనకు పారమార్థికదృష్టి కలుగును. తద్వారా భగవత్ తత్త్వమును తెలిసికొను సాధనయందు ప్రవేశితము, మనలోనేనున్న పరతత్త్వమును ఉదాహరణలతోను యుక్తులతోను మనకు తెలిపెడు గురువునకు కృతజ్ఞత చూపవలెను.

హిందువుల వైదిక కర్మకాండభాగములందువలె, పాదపూజకూడ ఘనముగా గుర్తించవలసిన ఒక గొప్ప విధానమే. గురుపాదుకలనే గురువుకు చిహ్నముగా మనస్సున నిల్పి దానికి పాదాక్రాంతులమై నిరంతరానుసంధానము చేయుచున్నచో, మన బుద్ధిశక్తిని గురుస్థాయికి లేవనెత్తగలదు. మనము దేనిని కోరి దేనిని పూజించిన దాని ఫలితము క్రమముగా లభించును. గురువును ధ్యేయముగాపెట్టుకొని వారికి చిహ్నముగా వారి పాదుకలయందు మనస్సు నిల్పి ఏకాగ్రత పొందినపుడు గురువుయొక్క పారమార్థికజ్ఞానము క్రమముగా పూజచేయువానికి లభించును. లౌకికధర్మము, సత్యము, ప్రేమ, సేవ ఎప్పుడు గురువు పారమార్థికములగు విలువలపై నిలిచియుండునని అన్ని శాస్త్రములు చెప్పుచున్నవి.

**శ్లో॥ పాదుకాసన శయ్యాది । గురుణాయదభీష్టితం ।**
**నమస్కుర్వీతతత్సర్వం । పాదాభ్యాంన్నస్పృశేత్క్వచిత్ ॥**

తా॥ శిష్యుడు గురువుచేత ననుభవింపబడిన పాదుకాసన శయ్యలు మొదలైన సమస్తమునకు నమస్కరించవలయును. వానికి పాదములు తగులునటుల( జేయగూడదు.

**శ్లో॥ జ్ఞానం వైరాగ్య మైశ్వర్యం । యశశ్శ్రీ స్వముదాహృతం ।**
**షడ్గుణైశ్వర్య యుక్తశ్చ । భగవాన్ శ్రీగురుఃప్రియే ॥**

తా॥ ఓ పార్వతీ! సద్గురువు, జ్ఞానమును, వైరాగ్యమును ఐశ్వర్యమును, యశస్సును, సంపదయును, నాత్మయును వీనితో( గూడుకొనుట వలన షడ్గుణైశ్వర్య యుక్తుండగు భగవంతు(డగు చున్నాడు.

అట్టి గురువు ఏ పాదుకలపై నిలబడి తమ ధర్మోపదేశముల గావించు చున్నారో అట్టి పాదుకలను వారికి చిహ్నముగా తీసికొనుట సముచితమే. అట్టి గురుపాదుకలను వారి చిహ్నముగా తీసికొని పూజించునపుడు మన దైనందిక జీవితమునగూడ గురువునడచిన ధర్మమార్గమున నడవగలము.

పాదుకలపై ప్రతిదినము పూజించునపుడు పుష్పముల నుంచెదము. ఇదికూడ ఒకదానికి చిహ్నమే. మనము చేసిన కర్మలు నశించినను వాటి వాసనలు మనకు మిగిలి యుండి తిరిగి జన్మకు హేతువగునని శాస్త్రవచనము. శుభవాసనల వలన మంచి జన్మ కలుగును. అశుభవాసనల వలన నీచజన్మ కలుగును. మనలోనున్న వాసనలకే పుష్పములు చిహ్నములు. గురుపాదముల యందు మనము వాసనతో గూడిన పుష్పముల విడచుట, మనలోనున్న వాసనలు విడుచుచున్నామనుటకు చిహ్నము. మన వాసనలను విడువగా జన్మరాహిత్యమునకు కారణమై దివ్యతత్త్వమున సదాసుఖశాంతులతో నుండగలము.

పూజచేయునపుడు చిల్లర నాణెములను కూడ ఉంచెదము. ధనమే ప్రధానముగా నెంచిన భావమును విడుచుటకు చిహ్నము. మన శరీరము నందు ప్రాణమునిల్పుటకు ఆహారముకావలెను. కనుక దానికి కొంత ధనము కావలెనేకాని, మన జీవితమంతయు ధనసంపాదనకే వినియోగించుట పొరపాటని భగవంతుని గురించి విచారించుట కుపయోగించవలెనని దృఢనిశ్చయముతో, పూర్వభావనతో సంపాదించిన ధనమును విడుచుట చిహ్నమైయున్నది.

మనముచేయు అర్చన అనగా సహస్రనామార్చన ప్రతిపదమునందు మొదలు నమ: అని పలుకుదుము అనగా భగవంతునియందు ప్రపత్తి చూపుకొనుట మరియు తన అహంకారమును విడుచుట. ఉదాహరణ:- "ఓం భగవతేనారాయణాయ" అందుము. అనగా భగవంతుని యందు మాత్రమే నా మనస్సున్నది. మరి నేననుదానియందు లేదు.

పూజ పూర్తి అయిన తర్వాత పండ్లు, కానుకలు గురుదక్షిణగా నుంచుదుము. అవి గురువునందుగల కృతజ్ఞతాభావమునకు సూచనలు.  గురు పాదుకాపూజకంటె మించిన దేమియు లేదు.

**శ్లో॥ జన్మకర్మ విలీనకారణం హేతుభూత మభూతకం**
**జన్మకర్మ - నివారకం రుచిపూరకం భవతారకం**
**నామరూప వివర్జితం నిజనాయకం శుభదాయకం**
**ప్రాతరేవహి మానసాంతరభావయే గురుపాదుకామ్.** గు.గీ.

ఓం తత్ సత్

# పరమార్థ దర్శి

శ్లో॥ కర్మణ్యకర్మ య: పశ్యేదకర్మణి చ కర్మ య:

స బుద్ధిమాన్ మనుష్యేషు, స యుక్త: కృత్స్నకర్మకృత్ ॥ భ.గీ.అ.4.శ్లో.18

తా॥ అర్జునా! కర్మమునందకర్మమును, అకర్మమునందు కర్మమును తెలియువాడు సర్వమానవుల యందు బుద్ధిమంతుడును, యోగయుక్తుడును, సర్వకర్మముల నాచరించినవాడును నగును.

భా॥ దేహేంద్రియ మనోబుద్ధులయొక్క శాస్త్రవిహిత వ్యాపారమును, శాస్త్రనిషిద్ధ వ్యాపారమును కర్మమనబడును. ఆ కర్మము వాస్తవముగ దేహేంద్రియ మనోబుద్ధులయందు మాత్రమేయుండును గాని, అసంగాత్మ యందుండజాలదు. అయినను ''అహంకరోమి'' అను ధర్మాధ్యాన రూపమగు ప్రతీతి బలముచే నాత్మయందారోపింపబడుచున్నది. నదీతీరమునందున్న వృక్షములయందు వాస్తవముగ గమన క్రియ లేకపోయినను, నౌకయందున్న పురుషుడా నౌక యొక్క గమన క్రియను వృక్షముల యందు ఆరోపించు చున్నట్లు, శాస్త్రవిచార రహితుడగు మూఢుడక్రియుడగు ఆత్మ యందు దేహేంద్రియాదుల వ్యాపార రూపమగు కర్మము నారోపించుచున్నాడు. అతడు విచారించి చూచినచో వాస్తవముగ ఆత్మయందే కర్తృత్వమును తెలియబడదు. ఈ విధముగ పురుషుడు కర్మమునందకర్మమును తెలియవలెను.

సత్వరజస్తమో గుణముల పరిణామములగుటచే తమతమ కార్యములను జేయుచుండు దేహేంద్రియమనోబుద్ధులయందు వాస్తవముగ కర్మాభావము లేకపోయినప్పటికిని వాని యందు కర్మాభావమా రోపించ బడుచున్నది. బహుదూరమున నడచుచున్న పురుషుని యందు గమన క్రియాభావము లేకపోయినప్పటికిని వానియందు దూరత్వదోషముచే గమనక్రియాభావ మారోపించబడుచున్నది. సర్వదా వ్యాపారవంతములగు దేహేంద్రియ మనోబుద్ధలయందు వ్యాపారాభావము

లేకపోయినను అధ్యాస ప్రతీతి బలము వలన వాని తూష్ణీంస్థితి యందు కర్మత్వాభావ మారోపించ బడుచున్నది. దేహేంద్రియాదుల యందుగల తూష్ణీం భావము గూడ ఒక కర్మయేయని యెఱింగినవాడు దేహేంద్రియాదు లెప్పుడును వ్యాపార వంతములే యను యథార్థము నెఱిగినవాడగుచున్నాడు. ఉదాసీనావస్థ యందు నేను ఉదాసీనుడనై వున్నానను అభిమానము కూడ నొకకర్మయే యగును.

ఇట్లు కర్మమునందు అకర్మమును, అకర్మము నందు కర్మమును చూచువాడు పరమార్థదర్శి యగును. అతడే సర్వ మానవులయందు బుద్ధిమంతుడు. అతడే యోగయుక్తుడు. అతడే సర్వకర్మములను చేయువాడు. ఇచ్చట "బుద్ధిమత్వము, యోగయుక్తత్వము, కృత్స్న కర్మకృత్వము'' అను మూడు ధర్మములతో శ్రీకృష్ణభగవానుడు పరమార్థదర్శియగు పురుషుని స్తుతించుచున్నాడు. **"కర్మణ్యకర్మయ: పశ్యేత్"** అను ప్రథమ పాదము చేత భగవానుడు విహితనిషిద్ధకర్మముల వాస్తవ స్వరూపము దెలిపెను. కర్మశబ్దము విహితనిషిద్ధకర్మముల రెంటికి వాచకము అగును'' **"అకర్మణీ చ కర్మయ:"** అను ద్వితీయ పాదమునందు అకర్మము యొక్క వాస్తవస్వ రూపము తెలుపబడినది.

సర్వకర్మములు బంధహేతువులగుటచే వానిని చేయుట యోగ్యము కాదనియు, తూష్ణీంభావముతో సుఖముగా నుండుటయే యోగ్యమనియు, తలంచుట మిధ్యాజ్ఞానమగును. నేను కర్మములకు కర్తననెడి కర్తృత్వాభిమాన మున్నంత వఱకు విహితకర్మములుగాని, నిషిద్ధకర్మములుగాని, పురుషునకు సంబంధమునే కలిగించును. ఈ కర్మములు నేను చేయుచున్నాననెడి కర్తృత్వాభిమానము లేక, యివి దేహేంద్రియాదుల ధర్మములని తలంచువాని కీకర్మములు బంధమును కలిగింపజాలవు. **"నమాంకర్మాణి లింపంతి"** అని భగవానుడు పూర్వమే చెప్పియుండెను. కర్మచేయక తూష్ణీంభావముగ నున్నానను అభిమానముకూడ కర్మయేయగుచు బంధమును కలిగించును. కర్తృత్వాభిమానముగలవాడు వస్తువు యొక్క వాస్తవస్వరూపము

నెఱు(గడు. కావున పరమార్థదర్శకులు కర్తృత్వాభిమానము లేనివారై ఫలేచ్ఛారహితముగ శాస్త్రవిహితములగు శుభకర్మములను చేయుచుండవలెను.

ఈ శ్లోకమునకు మఱియొక యర్థముకూడ గలదు. ప్రత్యక్షాది ప్రమాణజన్య జ్ఞానమునకు విషయమగు జడమైన దృశ్య ప్రపంచము కర్మము. ప్రత్యక్షాది ప్రమాణజన్యజ్ఞానమునకు విషయముకాని సర్వాధిష్ఠాన స్వప్రకాశ చైతన్యమకర్మము. దృశ్యమును, జడమునునగు జగద్రూప కర్మము నందు సత్తాస్ఫురణరూపముగ ననుస్యూతమైయున్న స్వప్రకాశాధిష్ఠాన చైతన్య రూపమగు అకర్మమును, స్వప్రకాశ అధిష్ఠాన చైతన్యరూపమగు అకర్మమునందు జడమును, దృశ్యమునగు కల్పిత ప్రపంచ రూపకర్మమును చూచువాడు సర్వమానవులలో బుద్ధిమంతుడు. ద్రష్టయగు చైతన్యమునకును, దృశ్యమగు ప్రపంచమునకును ఏ సంబంధమును లేదు. ఈ దృశ్య ప్రపంచము ద్రష్టయగు చైతన్యమునందు కల్పితమై తోచుచున్నప్పటికిని, అది వాస్తవముగ లేదు. **"యస్తుసర్వాణీ భూతాని, ఆత్మ న్యేవాను పశ్యతి । సర్వభూతేషు చాత్మానం, తతోనవిజుగుప్సతే॥"** సర్వాధిష్ఠానమగు నాత్మయందు సమస్త భూత భౌతిక ప్రపంచము కల్పితమై తోచుచున్నదనియు, ఆభూతభౌతిక ప్రపంచమునందు సత్తాస్ఫురణ రూపముగ ఆత్మయనుస్యూతమై వ్యాపించి యున్నదనియు, నెఱిగెడి పరమార్థదర్శి సర్వమానవులలో శ్రేష్ఠుడని శ్రుతి చెప్పుచున్నది.

ఇట్లు ద్రష్టయగు చైతన్యాత్మయును, దృశ్యమగు జడజగత్తును, అధిష్ఠానాధ్యస్థములై కలిసియున్నట్లు తోచుచున్నను, అధ్యస్థమును, జడమును అగు దృశ్యజగత్తును విడిచి, అధిష్ఠానమును, ద్రష్టయునగు చైతన్యాత్మ నెఱింగిన విద్వాంసుడు మనుష్యులందరిలో అత్యంత బుద్ధిమంతుడగును.

కాన సర్వాధిష్ఠానమగు చైతన్యాత్మ నెరింగినవాడు పరమార్థ దర్శి అగుటచే నతడు బుద్ధిమంతుడనియు, అనాత్మ ప్రపంచమును నెరిగెడి అజ్ఞాని మిథ్యాదర్శియగుటచే బుద్ధిమంతుడు కాడనియు తెలియవలయును. ఆ బుద్ధిమంతుడే అంత:కరణ

పరిశుద్ధికొఱకు కర్తృత్వాభిమానము లేనివాడై ఫలేచ్ఛారహితముగ విహితకర్మల నొనర్చిన యోగయుక్తుడు, ఇట్లు బుద్ధిమత్త్వము, యోగయుక్తత్వము, కృత్స్నకర్మకృత్త్వము అను నీ మూడు ధర్మముల చేత పరమార్థదర్శి స్తుతింపబడుచున్నాడు. నీవుకూడ అట్టి పరమార్థదర్శివి కాదలంచినచో కర్తృత్వాభిమానరహితముగ విహితకర్మలను చేయుము. అట్లు చేసినచో నీ యంతఃకరణము పరిశుద్ధమై కర్మాకర్మముల జ్ఞానము వలన సంసారబంధ విముక్తుడవగుదువు. పరమార్ధమగు చైతన్య జ్ఞానమున కంటె భిన్నముగ నేయనాత్మపదార్ధముల జ్ఞానము వలనను అశుభ సంసార బంధవిముక్తి కలుగనేరదు.

ఓం తత్ సత్

# జ్ఞానా జ్ఞాన ఫలములు

**శ్లో॥ అసుర్యా నామ తేలోకా, అన్ధేన తమసా వృతా:**
**తాగ్ంం స్తేప్రేత్యాభి గచ్ఛన్తి, యేకే చాత్మహనోజనా: ॥ ఈ. ఉ-3**

టీ॥ అసుర్యా: = అసురులకు (రాక్షసులకు) చెందిన; అంధేన తమసా = చిమ్మచీకటి చేత; ఆవృతా: = ఆవరింబడినవి; నామ = నిజంగా; తే = ఆ; లోకా: = సన్మలు; యేకే = ఎవరెవరైతే; చ = కూడా; జనా: = జనులు; ఆత్మహన: = ఆత్మహంతకులో; తే = వారు ప్రేత్య = మరణానంతరము; తాన్ = ఆయాలోకములను (జన్మలను); అభిగచ్ఛంతి = పొందుతారు.

తా॥ గాఢతమమగు అజ్ఞానముచే ఆవృతములగు జన్మములు అసురులమని ప్రసిద్ధములు. జనన మరణములు లేని ఆత్మయొక్క వాస్తవ స్వరూపమును తెలియక జననమరణములు గల స్థూలదేహమే ఆత్మయని తలంచు అజ్ఞానులు ఆత్మఘాతకులు. ఆ యాత్మఘాతుకులు మరణించిన పిదప ఆ యా సురములగు నీచజన్మములను పొందుచున్నారు.

ఈశావాస్యోపనిషత్తు మొదటి మంత్రమున ఆత్మ ధ్యాననిష్ఠను అవలంభించడానికి అధికారియైన సన్యాసియొక్క ధర్మాన్ని చెప్పి యున్నది. నిరంతరము నీటి సంపర్కము చేత గంధపు చెక్కనుండి దుర్గంధము వచ్చును. కాని దానిని నీటితో రాతిమీద రుద్దినపుడు దాని సహజ సుగంధము తెలియబడుచున్నది. అట్లే పరివర్తనశీలము, లోపభూయిష్టము అయిన ఈ ద్వంద్వ ప్రపంచ నిమగ్నమై దు:ఖ భూయిష్ఠ జీవితము అనుభవించుచున్నారు. కాని ఈ ద్వంద్వ ప్రపంచములో భగవంతుడొకడే చలనరహితమైన ఆధారమని గుర్తించి, నిరంతర ధ్యాననిష్ఠులై శాస్త్రవిచారణశీలత గలిగి, స్వరూపజ్ఞానము పొంది, దివ్య జీవన మనుభవించగలరని ధ్వనించుచున్నది.

రెండవ మంత్రములో సర్వసంగ పరిత్యాగము చేసి నిరంతర ధ్యానములో లీనం కాని అసమర్ధులకు శాస్త్రవిహిత కర్మలను ఆచరించుచూ మాత్రమే నూరు సంవత్సరములు జీవించగోరాలని సూచించుచున్నది. మానవ జీవితముపై ప్రీతియున్నంతవరకు దుష్కర్మ కాలుష్యాన్ని దూరం చూసుకోవడానికి ఇది తప్ప వేరే మార్గం లేదు. ఇది భగవద్గీతలో చెప్పిన కర్మయోగమునకు సరితూగును.

ప్రస్తుతమైన యీ మూడవ మంత్రము ఆత్మను సాక్షాత్కరించుకొనక, కర్మకు మాత్రమే అధికారం కలిగినవారిని గురించి చెప్పుచున్నది. ఆత్మ సాక్షాత్కార సమక్షమున ఇది వర్ణనాతీత నికృష్టస్థితి.

మోక్షమునకు జ్ఞానమొక్కటియే సాక్షాత్సాధనము. నిష్కామ కర్మోపాసనలు పరంపరా సాధనములు. ఇంతకంటె నన్యమగు మార్గములేదు. అజ్ఞానులీ రెంటిని త్యజించి జన్మజన్మాంతర విషయ భోగముల కొఱకు కామ్య నిషిద్ధ కర్మములను, వివిధమగు దేవతోపాసనలు, భూత ప్రేత పిశాచారాధనలు చేసెదరు. అట్టి మూఢులీ దేహత్యాగానంతరము పొందు స్థితి యీ మూడవ మంత్రమున వర్ణింపబడుచున్నది. దీనినే శ్రుతి యిట్లు చెప్పుచున్నది.

**శ్లో॥ "అన్యోఽసావహావహ మన్యోఽస్మీత్యుపాస్తే యోఽస్యదేవతామ్**
**నస వీద నరో బ్రహ్మ స దేవానం యథాపశు: ॥**

భావము:- ఉపాస్యదేవత కంటె తన్ను వేరుగా భావించి, అన్యదేవత ఉపాసన మొనర్చువాడు, బ్రహ్మము నెరుగక దేవతలకడ పశుసదృశుడగును.

గాఢతమమగు అజ్ఞానముచే నావృతములైన జన్మములు ఆత్మయొక్క యథార్థ స్వరూపము నెఱుంగుటకు యోగ్యములు కావు. కావున, అవి అసురములు, ఆత్మజ్ఞానము కాని, జ్ఞానేపేక్షగాని లేని అజ్ఞానులు ప్రత్యగాత్మ దేహేంద్రియాది జడ సంఘాతముకంటె భిన్నుడనియు, అతడు పరమాత్మ కంటె భిన్నుడు కాడనియు తెలియజాలరు. ప్రత్యగాత్మ దేహేంద్రియాది జడసంఘాత విశిష్టుడనికాని,

దేహేంద్రియాది సంఘాతమే ప్రత్యగాత్మ యనిగాని తలంచుచున్నారు.

అట్టి మూఢులు దేహేంద్రియాది ధర్మములైన జననమరణాది వికారములను నిర్వికారుడైన ప్రత్యగాత్మయందు కల్పించుచున్నారు. జనన మరణాది వికారములులేని ఆత్మకు జనన మరణాది వికారములను కల్పించు అజ్ఞానులే యీ మంత్రమున ఆత్మఘాతుకులని చెప్పబడెను. ఇట్టి ఆత్మఘాతుకులు, ఆత్మయొుక్క వాస్తవస్వరూపము నెఱుంగరు. ఆత్మ స్వరూపము నెరుంగుటకు, సాక్షాత్సాధనమైన జ్ఞాననిష్ఠనుగాని, పరంపరా సాధనమైన నిష్కామ కర్మనిష్ఠను గాని అవలంభింపరు. కేవలము స్వార్థబుద్ధితో ఇహపరలోక విషయభోగముల కొఱకు కామ్యనిషిద్ధ కర్మములను, వివిధ దేవతోపాసనలను, భూతప్రేత పిశాచాదులను మాత్రమే ఉ పాసింతురు.

అట్టి మూఢులీ మనుష్య శరీరమును విడిచిన పిదప తాము చేసిన కర్మోపాసన ఆరాధనల ననుసరించి అసురములగు నానావిధ నీచయోనుల యందు పుట్టుచు, చచ్చుచు, అనేక దు:ఖపరంపరలను పొందుచున్నారు.

కాన మానవుడు బ్రహ్మనిష్ఠుడు కాలేకపోయినను, బ్రహ్మ విద్యా జిజ్ఞాసువు అయి మానవజన్మ సార్థకము చేసుకొనవలెను.

ఓం తత్ సత్

# గాయత్రీ మంత్రము

వేదము లీశ్వరీయములని వైదికులెల్లరు విశ్వసిస్తారు. అందు ఈశ్వర ఉపాసనా విషయక మంత్రంగా గాయత్రిని పేర్కొంటారు. శ్రుతిస్మృతీతిహాస పురాణాదులన్నింట ఈ గాయత్రీ ప్రశంసలు బహుళంగా కనబడుచున్నవి.

సృష్ట్యాదియందు పరమేశ్వరునిద్వారా అగ్ని, వాయు, ఆదిత్య, అంగిరా అను ఋషుల హృదయములందు ప్రకాశితమై బ్రహ్మవిద్యకు మూలమై యథార్థగురుమంత్రమై గాయత్రీమంత్రరాజము విలసిల్లుచున్నది. మంత్రములకు కేవలము శబ్దపాండిత్యముతో, నిఘంటువుల సహాయముతో మామూలు శ్లోకములకు - పద్యములకు - చెప్పినట్లు అర్థముచెప్పుటకు వీలులేదు. మంత్రము లీశ్వరీయములు - ఈశ్వరుడు సర్వజ్ఞుడు. కాన మంత్రములలో ఎంతో అర్థము ఇమిడియుండును. సత్వశుద్ధి సంపాదించి ఏకాగ్రతతో మననము చేయగలవారు మాత్రమే శక్తికొలది సూటిగ ఆ యర్థమును గ్రహించగలరు. అందువలన మొదట శబ్దశక్తి సాయమున స్థూలముగా శక్యార్థమును తెలిసికొని పిమ్మట మననము చేయుచు విశేషార్థముల గ్రహించుటకు ప్రతివారు ప్రయత్నించవలెను. అందువలన నీ ప్రకరణములో తొలుత గాయత్రీ మంత్రమునకు ప్రతిపదార్థ తాత్పర్యములు సామాన్యులు కూడ గ్రహించుటకై స్థూలముగా వ్రాయబడును. పిమ్మట బ్రాహ్మణములలో గాయత్రీ మంత్రమునకు చెప్పబడిన విశేషార్థములు సంక్షిప్తముగా దెలుపబడును. కావున గురువులకు గురువగు జగదీశ్వరుని యొక్క అమృతమయమైన గురుమంత్రమును - గాయత్రిని - అర్థసహితముగ ధ్యానమొనర్చి ఆ ఈశ్వరునికృపకు పాత్రులమయ్యెదముగాక! ఆదిభౌతిక ఆదిదైవిక ఆధ్యాత్మిక దు:ఖములనుండి తప్పుకొని - విడివడి - పరమధామమును బడయుదము గాక.

## గాయత్రీ మంత్రము

**శ్లో॥ ఓం భూర్భువ స్వః। తత్ సవితు ర్వ రేణ్యం।**
**భర్గో దేవస్యధీమహి। ధియో యోనః ప్రచోదయాత్ ॥**

పదవిభాగము:- ఓం, భూః, భువః స్వః (సువహ), తత్, సవితుః, వరేణ్యం, భర్గః, దేవస్య, ధీమహి, ధియః యః, నః, ప్రచోదయాత్ ॥

అన్వయము:- ఓం । భూః । భువః । స్వః । సవితుః దేవస్య । (తన) తత్వరేణ్యం భర్గః । ధీమహి । యః (భవాన్) । నః । ధియః । ప్రచోదయాత్ ॥

ప్రతిపదార్థము:- ఓం = హేరక్షక, భూః = సత్ స్వరూప, భువః = చిత్ (జ్ఞాన) స్వరూప, స్వః = ఆనందరూప పరమాత్మా, సవితుః = సకల జగత్తును సృష్టించు, దేవస్య (తన = సమస్త విశ్వమును ప్రకాశింపజేయు నీయొక్క, తత్ = ప్రసిద్ధమ, వరేణ్యం = సర్వోత్కృష్టమునగు, భర్గః = విజ్ఞాన స్వరూపమును, ధీమహి = ధ్యానింతుము, ఉపాసింతుము, యః (భవాన్) = సర్వేశ్వరుడవగు నీవు, నః = మాయొక్క, ధియః = బుద్ధులను, ప్రచోదయాత్ = (సత్కర్మలయందు) ప్రేరేపింపుము.

దండాన్వయము:- హేరక్షక । సచ్చిదానందస్వరూప । పరమాత్మా ! సకల జగత్తును సృష్టించు, సమస్త విశ్వమును ప్రకాశింప జేయు నీయొక్క ప్రసిద్ధము, సర్వోత్కృష్టమునగు విజ్ఞానస్వరూపమును ధ్యానింతుము. ఉపాసింతుము. సర్వేశ్వరుడవగు నీవు మాయొక్క బుద్ధులను సత్కర్మలందు ప్రేరేపింపుము.

భావార్థము:- హేరక్షక ! సచ్చిదానందస్వరూప ! జగదుత్పాదకదేవా ! ప్రసిద్ధము, సర్వోత్కృష్టమునగు నీ విజ్ఞాన స్వరూపమును మేము నిత్యము ఉపాసింతుము. మాకు సద్బుద్ధిని యిచ్చి సత్కర్మలు ఆచరించునట్లు అనుగ్రహింపుము.

1. గాయత్రీశబ్దార్థము:- స్తుత్యర్థక "గై" ధాతువుతో "అవన్" ప్రత్యయము చేరుటవలన గాయత్రీశబ్దము సిద్ధమగుచున్నది.

2. గాయతోముఖాత్ ఉదపతదితి గాయత్రీ - నిరుక్తము - 6-12 గానము చేయుచున్న పరమేశ్వరుని ముఖమునుండి మొట్టమొదట ఈ ఛందస్సు వెలువడెను. కావున దీనిపేరు "గాయత్రి" యయ్యెనని బ్రాహ్మణములు చెప్పుచున్నవి.

3. "గాయంతం త్రాయతే ఇతి గాయత్రి" దీనిని జపించు వానినిది కాపాడుచున్నది. కాన గాయత్రి యయ్యెను.

4. ప్రాణములు "గయ" యనబడుచున్నవి. కావున నట్టి ప్రాణములను గాపాడుటచే దీనిపేరు గాయత్రియయ్యెను.

5. "గాతారం త్రాయతే యస్మాద్ గాయత్రీ తేన గీయతే ॥ స్కంద. పు. కాశీఖం - 4 - పూర్వార్థ - అ - 9 = గానము చేయువానిని రక్షించుచున్నది. కాన గాయత్రియని చెప్పబడుచున్నది.

గాయత్రీ మంత్రము బహునామములతో పిలువబడుచున్నది.

1. గురు మంత్రము:- బ్రహ్మచారి విద్య నభ్యసించుటకు గురువుచెంతకు వెళ్ళునపుడు గురుకులమునందు ఉపనయనముతో మొట్టమొదట వేదారంభసూచకముగా గురువుచే గాయత్రీమంత్రము ఉపదేశింపబడును. కనుక నిది గురుమంత్ర మనబడుచున్నది. అట్టి యీ గాయత్రీ మంత్రమునందు ఋగ్యజుస్సామముల యొక్క రహస్యముల తెలియజేయుశక్తి గర్భితమైయున్నది.

ప్రణవములోని మొదటి అక్షరమగు "అ", వ్యాహృతులలోని మొదటి లోకమగు "భూః", మంత్రములోని మొదటి పాదమగు "తత్సవితుర్వరేణ్యం" ఈ మూటిపై ("అ + భూః + తత్సవితుర్వరేణ్యం") ధ్యానముంచుటచే పరమాత్మ సహాయము లభించి, అనేక విద్యలకు నిధియైన "ఋగ్వేదమును" పూర్తిగా తెలిసికొను శక్తి ప్రాప్తమగుచున్నది. అట్లే - ప్రణవములోని రెండవ అక్షరమగు "ఉ", వ్యాహృతులలోని రెండవలోకమగు "భువః", మంత్రములోని రెండవ పాదమగు "భర్గోదేవస్యధీమహి" - ఈ మూటిపై (ఉ + భువః + భర్గోదేవస్యధీమహి) నేకాగ్రచిత్తము నుంచుటచే యజుర్వేదము యొక్క

జ్ఞానమును యథోచితముగ యథాసమయమున కార్యాన్విత మొనర్చుశక్తి లభించు చున్నది.

ప్రణవములోని మూడవ అక్షరమగు "మ్", వ్యాహృతులలోని మూడవలోకమగు "స్వ:", మంత్రములోని మూడవ పాదమగు "ధియోయోన: ప్రచోదయాత్" ఈ మూటిపై (మ్ + స్వ: + ధియోయోన: ప్రచోదయాత్) మనస్సు సమాహితమైన పిమ్మట వ్యాపక పరమేశ్వరునియొక్క సాహాయముచే సామవేదము యొక్క సామ్య శక్తి (To be at level with God) ప్రాప్తమై తన కార్యము లధికముగా పరమాత్మకనుకూలము కాసాగును. పరమాత్మ వలన తిన్నగా నుపదేశము లభించుటకు సాధనమగుటచే నిది గురుమంత్రమై యున్నది.

**2.** మంత్రరాజము:- పరిపూర్ణ ఫలదాయక మంత్రములలోనిది సర్వశ్రేష్ఠముగ శీఘ్రఫలదాయకముగ నెన్నబడుచున్నది. ఇది వైదికసిద్ధాంతము కావున ఇది మంత్రరాజము అనబడుచున్నది.

**3.** కామధేనువు:- గాయత్రీ మంత్రము సిద్ధించిన పిమ్మట కోరినది లభించును. ఈ మంత్రసిద్ధి పొందినవాని సంకల్పములు నెరవేరుచుండును. కనుక వసిష్ఠమహర్షి దగ్గర బహుశ: ఈ గాయత్రీరూప కామధేనువే యుండియుండవచ్చును.

**4.** వేదమాత:- ఉపనిషత్కాలమున గాయత్రీమహాత్మ్యము మిగుల పెంపొందుటచే ప్రజలు గాయత్రిని వేదమాత లేక ఛందస్సుల మాతయని చెప్పసాగిరి. "గాయత్రీ ఛందసాంమాతా" (మహానారా - ఉ. 15-1) గాయత్రి వేదములకు తల్లి.

**5.** సావిత్రి:- గాయత్రీ మంత్రమున పరమాత్మ "సవితా"యని ప్రార్థింపబడెను. సవితకు సంబంధించినది కాననిది సావిత్రి యనబడుచున్నది. మరియు నీ మంత్రాధిదేవత సావిత్రి. కాననిది సావిత్రి యనబడుచున్నది. (ఈ సావిత్రి సవిత పుత్రిక)

6. వేదముఖము:- వేదముఖమన వేదవాణి యని అర్థము. శరీరమున వాణి - సమస్తమునకు అర్థమును వివరించుచు సకల - ఆంతరంగిక భావముల కనుకూలవాదము చేయుచున్నట్లు, గాయత్రి వాణియై వేదములయొక్క సమస్తభావములను వర్ణించుచున్నది. కాన వేదముఖమనబడుచున్నది. ఈ నామము లన్నింటిలో సుప్రసిద్ధమైనది "గాయత్రి" యనియే.

మొట్టమొదట గాయత్రీ మంత్రార్థమును ప్రత్యక్షము చేసికొనినది "విశ్వామిత్రమహర్షి" కావుననే ఈ మంత్రమాయన పేరుతో నడచుచున్నది.

"ఋషి" యన మంత్రమును చూచువాడేగాని నిర్మాణకర్త మాత్రముకాదు. ఏలయన "ఋషయో మంత్రద్రష్టార:" - "ఋషిర్దర్శనాత్" అని నిరుక్తము (2-1) నందు వ్యాఖ్యానించబడియున్నది. కావున మంత్రమును చూచి దాని జ్ఞానమును పొందువాడు ఋషి, దృశ్యధాతువునకు చూచుట - తెలిసికొని - అనుభవము చేసికొని తెలియజేయుటయేగాని నిర్ణయించుట యను నర్థ మిప్పటి వరకు నెవరును చెప్పరైరి.

**శ్లో॥ యథా చ మధు పుష్పేభ్యో ఘృతం దుగ్ధా ద్రసాత్పయ: ।**
**ఏవం హి సర్వవేదానాం గాయత్రీసార ముచ్యతే ॥**
**గాయత్రీ వేదజననీ గాయత్రీ పాపనాశనీ ।**
**గాయత్ర్యాస్తు పరంనాస్తి దివి చేహచ పావనమ్ ॥**

**బృహద్ యోగీయాజ్ఞ వల్క్య 4-16**

భావము:- పుష్పసారము మధువైనట్లు, పాలసారము నేయియైనట్లు, రససారము పాలైనట్లు, సర్వవేదముల సారము గాయత్రియై యున్నది. గాయత్రి వేదమాత. గాయత్రి పాపనాశని, గాయత్రికంటె పవిత్రపఱచెడి దెద్దియు నిహపరలోకములయందెచ్చట లేదు.

## బ్రాహ్మణములలోని యర్థము

గాయత్రీ మంత్రమునందు మూడుభాగములు గలవు. మొదటి భాగమున ప్రణవము, రెండవ భాగమున వ్యాహృతిత్రయము మూడవ దానియందు త్రిపదాగాయత్రీమంత్రమును ఉన్నవి. (1) ప్రణవము - ఓమ్ (అ + ఉ + మ్)

2. వ్యాహృతిత్రయము - భూ: - ర్భువ: - స్వ:

3. మంత్రము:- తత్సవితుర్వరేణ్యం - భర్గోదే వస్యధీమహి -
ధియో యోన: ప్రచోదయాత్

ప్రణవము యొక్క మూడుమాత్రలు సృష్టి క్రమ చిహ్నములు. అవి అవ్యక్త విజ్ఞానమయ క్షేత్రమున లేక మనోమయక్షేత్రమున వర్తమానమై యుండును. ఈ మానసికశక్తి క్రమముగా అవతార ప్రాణరూపము నందుండును. దీని చిహ్నములే మూడు వ్యాహృతులు, స్పందనమే వ్యాహరణము - ఉచ్ఛారణ. దీనికి వ్యతిరేకమే సమాహరణము - చెదరినవాని నొకటిగా చేయుట, సమష్టిలోపల నుండియే వ్యష్టిభావము జనించుచున్నది. ఇటులనే ప్రజాపతి మానస సమాధి విశ్వము, నిమిత్తము, వ్యాహృతుల రూపమున ప్రకటము అగుచున్నది. భూ:, భువ:, స్వ: - ఈమూటి యుచ్ఛారణ వలన క్రమముగా భూర్లోక, భువర్లోక, స్వర్లోకము లేర్పడుచున్నవి. వీనిపేరే పృథివి, అంతరిక్ష, ద్యులోకములు. వీనివలననే ప్రజాపతియొక్క విజ్ఞానత్రికము దర్శనమగుచున్నది. దానివలననే సృష్టి ప్రాదుర్భవించుచున్నవి. ఈ వ్యాహృతులచే విరచితమైన ప్రాణాత్మక సంస్థానమేది గలదో, దేని స్వరూపము త్రేతాగతియో అది భూతము యొక్క ధరాతలముపై నవతరించినపుడు ప్రాణము.

మరియు భూతముయొక్క అసమ్మిళిత రూపవర్ణన గాయత్రీ మంత్రము యొక్క మూడుపాదములయందు నగపడుచుండును. దీని ప్రథమ పాదమున సవిత లేక మనస్సుయొక్క శక్తి యున్నది. "మన ఏవ సవితా"

రెండవ పాదమున పరమాత్మని పరణీయ భర్గసంకేతము లేక ప్రాణము యొక్క సంకేతము కలదు. అది తన ప్రేరణ నిమిత్తము అథవా తాను మేలుకొనియుండుటకై నిరంతరము సవితపై నాధారపడి యుండును. అనగా సమస్త జీవనము మనస్సుపై నాధారపడి యుండునన్నమాట. మనోరూప సవిత వినా జీవనము యొక్క స్వరూప మేమియు నుండదు.

మంత్రము యొక్క మూడవపాదమున ధరాతలములో ప్రకటనమగు దాని (జీవనము) యొక్క కర్మశక్తులు వివరింపబడియున్నవి అని "ధియ:" అనబడుచున్నది. "కర్మాణిధియ:"

ఇది బ్రాహ్మణముల పరిభాష. ఇది గాయత్రీమంత్ర సమగ్ర జీవనము యొక్క సారగర్భితమాత్రము. బ్రహ్మచర్య కాలమునందెట్లు సవితృ లేక మనస్తత్త్వము, యౌవనమున భర్గలేక ప్రాణతత్త్వము, మిగిలిన భాగమున ధియ: లేక జ్ఞానాదిష్ఠిత కర్మ తత్త్వము యొక్క విశేషమహత్వము కలదో అటులనే ఈ మూడును పడుగుపేకలవలె పరస్పరము ఓతప్రోతమై యున్నవి. ఒకటిలేకుండ మరి యొకటి యుండజాలదు.

గాయత్రి యొక ఛందస్సు. ఛందస్సు ప్రయోజనము గానము. ఏ గాయత్రము సామమును గానము చేయుచుండునో దానిని గాయత్రి రక్షించుచుండును. కనక బ్రాహ్మణములయందీ వ్యుత్పత్తి చెప్పబడినది.

సమస్త లోకములయందు వ్యాప్తమైయున్న సామగానమును ఋషులు గాయత్రమనిరి. అనగా గాయత్రి లోకత్రయ సంజ్ఞయైయున్నది. దీనిని సూక్ష్మదృష్టితో విచారించినచో వేదప్రతిపాదిత విద్యలనేకములు ఈ గాయత్రి యందు అంతర్భూతమైనట్లు విదితముకాగలదు. అనగా ప్రాణవిద్య గాయత్రీ స్వరూపము. ప్రాణముయొక్క స్వరూపము. సమంచన ప్రసారములు ముడుచుకొనుట, తిరుగుట "ప్రాణోవై సమంచన ప్రసారణమ్".

**శ్లో॥ జపన్నాసీత సావిత్రీం ప్రత్యగాతారకోదయాత్ ।**
**సంధ్యా ప్రాక్ ప్రాతరేవం హితిష్టేదాసూర్యదర్శనాత్ ॥**

భావము:- సాయంకాలము నక్షత్రోదయుమగువరకు ప్రాత: కాలము సూర్యోదయుమగువరకును గాయత్రీ మంత్రమును జపించుచుండవలెను. (యాజ్ఞవల్క్యస్మృతి ఆచారాధ్యా 245)

**శ్లో॥ సహస్ర నరమా దేవీం శతమధ్యాం దశావతారామ్ ॥**
**గాయత్రీం యో జపేన్నిత్యం స న పాపేనలిప్యతే ॥ హరీతస్మృతి - అ. 4-48**

భావము:- వేయి పర్యాయములు గాయత్రిని జపించుట శ్రేష్ఠము, నూరుపర్యాయములు జపించుట మధ్యమము. పది పర్యాయములు జపించుట అధమము. ప్రతిదినము గాయత్రిని జపించువాడు పాపలిప్తుడు కాజాలడు.

**శ్లో॥ విధియజ్ఞా జ్జపయజ్ఞో విశిష్టో దశభిర్గుణైః ।**
**ఉ పాంశు స్స్యాచ్ఛతగుణః సహస్రో మానసస్స్మృతః మను 2-67**

భావము:- విధియజ్ఞము (అగ్నిహోత్రాదులు) కంటె జపయజ్ఞము పదిరెట్లు, అది ఉపాంశువైనచో నూరురెట్లు, మానసికమైనచో వేయిరెట్లును శ్రేష్ఠము, మరియు వాచక జపనామము గాయత్రి. ఇది వాక్కును తీవ్రపఱచి పరిశుద్ధ మొనర్చును. మానసిక జపనామము సావిత్రి. ఇది మనస్సును పవిత్రపరచి రక్షించును. ఆత్మ కజప (ధ్యాన) నామము సరస్వతి. ఇది ఆత్మకళ్యాణ మొనర్చుచు ఆవరణమును దూరముచేయును.

జపముకూడ నీతి, శ్రద్ధ, ప్రీతి, సత్కర్మలతోకూడి జ్ఞానయుక్త ఉపాసనా సమన్వితమై యుండవలెను. వీనియందేది కొరవడినను ఫలితము కూడ తరుగుచుండును. కాని జపము నిష్ఫలమెన్నటికిని కానేరదు.

గాయత్రిపై ప్రముఖ భాష్యము:-

వేద భాష్యములను రచించిన ఉవ్వటుడు, సాయణుడు, మహీదరుడు, దయానందసరస్వతి, అరవిందఘోష మున్నగువారు గాయత్రీ మంత్రమునకు కూడ విపుల వ్యాఖ్యానములు చేసిరి. అందు ఆంధ్రులు ముఖ్యముగా స్వీకరించు సాయణభాష్యమిందు పొందు పరుపబడినది.

సాయణభాష్యము:- "తత్సవితు ర్వ రేణ్యం భర్గోదేవస్యధీమహి ధియో యోనః ప్రచోదయాత్ ॥'' ఋ - 3-5-62-10.

యః సవితాదేవః నో౽స్మాకం ధియః కర్మాణీ ధర్మాది విషియవా బుద్ధీః ప్రచోదయాత్ ప్రేరయాత్। తత్ తస్య సర్వాసు శ్రుతిషు ప్రసిద్ధస్య దేవస్య ద్యోతమానస్య । సవితుం సర్వాంతర్యామి తయా ప్రేరకస్య జగత్ స్రష్టుః పరమేశ్వరస్య । ఆత్మభూతం వరేణ్యం సర్వైరుపాస్యతయా జ్ఞేయతయా చ సంభవనీయం । భర్గః అవిద్యాతత్కార్య యోర్భర్జనాత్ భర్గః స్వయంజ్యోతిః పరబ్రహ్మకం తేజః ధీమహివయం ధ్యాయేషు ॥

సృష్టికర్తయగు ఏ దేవుడు మాకర్మలను లేక ధర్మవిషయక బుద్ధులను ప్రేరేపించుచుండునో, ఆ దేవుడు సకలశ్రుతులలో ప్రసిద్ధుడు. ప్రకాశమానుడు. సర్వాంతర్యామియై సర్వము ప్రేరేపించువాడు. సృష్టికర్తయునై యున్నాడు. అవిద్యను అవిద్యాకర్మలను నాశమొనర్చునదియు, కోరి అందరు నుపాసింపదగినదియు - తెలిసికొనదగినదియునగు ఆ దేవుని యొక్క స్వప్రకాశస్వరూప తేజమును మేము ధ్యానింతుముగాక.

ప్రాణాయామము:- ప్రాణాయామమునకు జపమునకు సంబంధము కలదు. కావున "గాయత్రీమంత్రము'' అను నీ వ్యాసములో ప్రాణాయామ విషయములు స్థూలంగా కొంతవరకు వివరింపదలంచి చేర్చబడినవి.

రక్తము శరీర వ్యాపారమున కుపయోగపడుటవలన అశుద్ధమగు చుండును. ఈ రక్తము శుద్ధము కావలెనన్న హృదయమునుండి శ్వాసకోశములకు పోయి అచ్చట శుద్ధమై తిరిగి హృదయమునకు రావలెను. హృదయము నుండి రక్తము ఊపిరితిత్తులకుపోయి యచట శుద్ధమై తిరిగి హృదయమునకు చేరుసరికి హృదయ మొక్కసారి కొట్టుకొనును. యువకుని హృదయము నిమిషమునకు డెబ్బది రెండు పర్యాయములు కొట్టుకొనును. వయస్సును బట్టి మారుచుండును. హృదయము కొట్టుకొనుట - ''లూప్ + డవ్'' శబ్దోచ్చారణ వలె నుండును. రక్తమును వెడలగ్రక్కునపుడు "లూప్'' శబ్దమువలె కొట్టును. తిరిగి రక్తమును గ్రహించునపుడు "డవ్'' శబ్దమువలె ధ్వనించును. దీనిని విశేషజ్ఞులువినా యితరులు గ్రహింపజాలరు. కాన చాలినంత ప్రాణవాయువు శాసాశమయములకు చేరకపోయినచో శ్వాసకోశ

సంబంధమైన వ్యాధులు పుట్టుచుండును. పూర్తిగా పరిశుద్ధముకాని రక్తమే తిరిగి హృదయమున చేరి శరీరమంతా వ్యాపించుటచే దురద మొదలగు సాధారణవ్యాధులేగాక, కొన్ని భయంకరమగు రోగములు కూడ సంభవించును. కాన ప్రాణాయామము చేయుటవలన శరీరారోగ్యమునకు చాలా ప్రయోజనము వున్నది.

"తస్మిన్సతి శ్వాస ప్రశ్వాస యోర్గతి విచ్ఛేద: ప్రాణాయామ:" (యో, ద-2-49). బాహ్యవాయువును లోనికి తీసుకొనుట శ్వాసము. లోపలి కోష్ఠము నందలి వాయువును బయటికి విడుచుట ప్రశ్వాసము. పద్మాసనాదులు సిద్ధించిన పిదప నిట్టి శ్వాస ప్రశ్వాసములయొక్క స్వాభావికగతి నిరోధమే ప్రాణాయామమనబడును.

రేచకము, పూరకము, కుంభకము, కేవల కుంభకము అని ప్రాణాయామము నాలుగు విధములగును. లోపలి వాయువును బయటికి తీసి అచట స్తంభింపచేయుట రేచక ప్రాణాయామము. బాహ్యవాయువును లోపలికి తీసికొని యట స్తంభింపజేయుట పూరక ప్రాణాయామము. ఎక్కడి వాయువునక్కడ నిలుచునట్లు చేసి లోపలికి గాలి పోకుండ జేయుట కుంభక ప్రాణాయామము. కుంభకము, కేవల కుంభకములకు స్వల్ప బేధమున్నది. కుంభకము శ్వాస ప్రశ్వాసల నక్షేపించును. కేవల కుంభకము శ్వాస ప్రశ్వాసల అపేక్షింపదు. ప్రాణాయామపద్ధతులు మహర్షి పతంజలి విరచితయోగ దర్శనమున బాగుగా వివరించబడినవి. పై పద్ధతులలో ప్రాణాయామము చేయుచో పూర్తిగ శుద్ధవాయువు- ప్రాణవాయువు- శ్వాసకోశముల యన్ని భాగములను చేరును. అందువలన శ్వాసకోశవ్యాధులు మున్నగునవి రానేరవు. ప్రాణాయామము వలన శరీరబలము వృద్ధియై మనోశక్తు లున్నతిపొందును. ప్రాణశక్తి సూర్యుని ద్వారా వాయువులో వ్యాపించుచుండును. ఆ ప్రాణశక్తితో గూడిన ప్రాణవాయువు ప్రాణాయామము ద్వారా శరీరములో ప్రవేశించి యచట రక్తములో కలిసి తన జీవశక్తిని రక్తమున కర్పించి, చెడురక్తము నందలి బొగ్గుపులుసు వాయువును గ్రహించి తిరిగి వెలుపలికి వచ్చును. రేచకపూరక కుంభకరూప ప్రాణాయామము శరీరమునకు జీవశక్తినిచ్చి ఆరోగ్యముగా వుంచును. ఇది పరమాత్మశక్తియగుటచే మరియే మందులు

దీనికి సాటిరావు. ఇట్లు ప్రాత: సాయంసమయములందు ప్రాణాయామ మాచరించి మనస్సు పవిత్రము, పరిపుష్టము ఉత్సాహవంతముగా నుంచుకొనవలెను. ప్రబలమైన యిచ్ఛాశక్తి ద్వారా యీ ప్రాణశక్తిని రోగగ్రస్తమైన శరీరభాగమునకు పంపినచో రోగము తొలగిపోవును. దీనినే మానసికచికిత్స యందురు.

ఆరోగ్యముగల మనుష్యుని శ్వాస దినమునకు 21600 పర్యాయములు నడచును. అనగా గంటకు - 900 నిముషమునకు - 15 పర్యాయములు అని పెద్దలు చెప్పుచుందురు. ప్రాణాయామము చేయుటచే శ్వాసగతి అవరోధింపబడి పైసంఖ్య తగ్గును. శ్వాస ఎంత తక్కువగా నడచునో అంత మానవుని ఆయువు వృద్ధినొందును, తపస్వులైన మహర్షులు జీవన మరణములను తమ యధీనము జేసుకొనుటకు ప్రాణాయామమే ప్రధాన కారణము.

**శ్లో॥ యావద్బద్ధో మరుద్దేహే య వృచ్చిత్తం నిరామయం**
**యావ దృష్టిర్ భ్రూవోర్మధ్యే తావత్కాలం భయంకుత: ॥**

ఎంతవరకు ప్రాణవాయువు కుంభకముద్వారా స్థిరముగా నుండునో, ఎంతవరకు చిత్తము విషయవాసనలకు దూరముగ నుండునో- అంత:కరణము నిర్వికారముగ నుండునో, ఎంతవరకు దృష్టి భ్రూమధ్యలో నిశ్చలమై యుండునో అంతవరకు యముని భయముండదు. అని అనుభవగ్నులగు పెద్దలు అనుచుందురు.

పూజ్యులగు ఆర్యులు వేదమంత్రమగు గాయత్రికి ప్రాణాయామమునకై చేర్చిన భాగము

**శ్లో॥ ఓం మహ:, ఓం జన:, ఓం తప:, ఓగ్ం సత్యం,**
**ఓం భూ:, ఓం భువ:, ఓం స్వ: (సువ:)**
**ఓం తత్ సవితు ర్వ రేణ్యం ।**
**భర్గో దేవస్యధీమహి । ధియోయోన: ప్రచోదయాత్॥**
**ఓం మాపోజ్యోతీ రసోమృతం బ్రహ్మ**
**ఓం భూర్భువస్సువరోమితి దిగ్బంధ:**

భావము:- మహర్లోక జనలోక తపోలోక సత్యలోకములు భూలోకము భువర్లోకము స్వర్లోకము మొత్తము ఏడు లోకములు సుఖముగా శుభముగా నుండుటకై నేనీ గాయత్రిని జపించుచున్నాను.

మరి జ్యోతిస్సులకు జ్యోతిస్సగు రసామృత పరబ్రహ్మము నందే నా ఆత్మ లీనమగుగాక. ఈ విధముగా నా మనస్సు ఏ వైపునకు పోకుండ నా హృదయమున దిగ్బంధము చేసికొనుచున్నాను.

పూజ్యులగు సాధువులు ఈ త్రిపద గాయత్రికి ఆధర్వవేదము నుండి ఉద్ధరింపబడిన

"ఓం పరోరజసే సావదోమ్" అనుదానిని చేర్చిరి. దానికి వారు వివరించిన భాష్యము ఈ క్రింది విధముగా నున్నది.

పరోరజసే = సోస్సేఇతిసూత్రేణ, రజసేపర; ఇత్యర్థ: = రజో గుణాతీత: ఇత్యర్థ:, ఉపలక్షకతయా సత్వరజ స్తమోగుణాతీత: ఇత్యర్థ: సావద: = అవద:సవద:, ఓం, ఓం = అవతీతి, ఓం = రక్షక: ఇత్యర్థ:, సవద: = వక్తుంశక్య:, ఉదాహృతి:, వేదై: సర్వై: అహమేవవేద్యం: నేను వేదవేద్యుడను కాన శబ్దాములచే వాడుకొనదగిన వాడను అని అర్థము.

అవద: = వక్తుమశక్య:= నేను మాటలచే పేర్కొనదగిన వాడనుగాను.

ఉ:- యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసా సహోవాఙ్మనస్సులకు అతీతుడు.

**భావార్థము:-** త్రిగుణాతీతుడను, వేదవేద్యుడను అగు భర్గ స్వరూపమును, మేము ధ్యానింతుము, ఉపాసింతుము.

## మంత్రానుష్ఠానము

ఈ మంత్రము ధ్యానధారణ విషయమేకాని జపవిషయమును బోధించుట లేదు. జపింపబడినది నామము. అనుష్ఠింపబడునది మంత్రము. ధ్యానమువలననే ధారణ జరుగును. దేనిని ధ్యానింతుమో దానినే ధరింతుము. ఎట్లు ధ్యానింతుమో అట్లేయగుచుందుము.

సంకల్పము, చిత్తము, చింతన, దృష్టి, శ్రుతి, స్పర్శశక్తి, గంధశక్తి, రసశక్తి - ఈ యెనిమిది ధారణలనబడును. సవితృ దేవతయొక్క దివ్యప్రేరణలు - శక్తులు ప్రేరితములై దివ్యకిరణములు ప్రకాశించును. దివ్యప్రేరణ వలన ధారణలు దివ్యమగును. ధారణలు దివ్యమైన పిమ్మట సవితయొక్క దివ్యరూప సౌందర్య ప్రకాశములు సాక్షాత్కారమగును.

అనుష్ఠానమనే మంత్రానుసారము వ్యవహరించుట. అనగా మంత్రము నందు చెప్పబడిన స్థితిని తనయందు ధరించుట. అంతస్థ విజ్ఞానమును ప్రత్యక్షముగ సంసిద్ధపరచుటయే. ఆత్మబోధనము, ఆత్మ ఉద్బోధనము, దివ్యత్వ ప్రాప్తి, దేవసవితయొక్క సాక్షాత్కారము, దేవసవితయందు సమాహితమగుట - కొఱకే గాయత్రీ మంత్రానుష్ఠానమును ఆచరించ వలయును. ఈ మంత్రానుష్ఠానము వలన ఆధ్యాత్మిక - ఐశ్వరములు ప్రాప్తమగునటులే సాంసారిక వైభవములును ప్రాప్తమగుచుండును. సాంసారిక వైభవములు ఆధ్యాత్మిక విభూతికి నీడలే. కాని యేదోయొక సాంసారిక లాభమును దృష్టియందుంచుకొని యీ మంత్రానుష్ఠాన మొనర్చినచో ఆత్మహాని జరుగగలదు.

ప్రథమమున ధ్యానమును నిలబెట్టుటకు సరళము స్వాభావికమునైన విధి - నేత్రములను మూసికొనినపిదప నేత్రములందు ధవళ కాంతి యేది కనబడునో దానిపై ధ్యానమును కేంద్రీకరించుటయే. ఇట్లు ధ్యానము చేయగా కొంతకాలమునకు నీ ధారణలో - ధ్యానము నందు - దివ్య ప్రకాశము సంచారము చేయసాగును. దృష్టి దివ్యమైన పిమ్మట దేవసవితయొక్క పరమ ప్రకాశమయ విరాట్ స్వరూపము గోచరించును. దేవసవిత స్వరూపము ప్రకాశమయమేకాని ఆకారవంతము కాదు. ప్రకాశయుక్త వస్తువు సాకారమే కాని ప్రకాశము మాత్రము సదానిరాకారము. గాయత్రీ మంత్రము యొక్క ప్రతి ఆవృత్తితో ఏ ధారణ దివ్యమగుచున్నట్లు, క్రిందినుండి పైకి, పైనుండి క్రిందికి దివ్యప్రకాశము యొక్క ఆరోహణ అవరోహణలు జరుగుచున్నట్లును

అనుభవము చేసికొనవలెను. ఈవిధముగా గాయత్రీ మంత్రము పున:పున: పఠనము, ధ్యానము (ఈ రెండు) నేకాకారమైనట్లు అనుభవమగునంతవరకు చేయవలెను.

నేత్రములు మూసికొనిన పిమ్మట నేత్రములందు నిర్మల ధవళ ప్రకాశము కనబడినపుడు అందే దృష్టిని, ధ్యానమును స్థిరమొనర్పవలెను. అట్లు ముప్పది నిముషములవరకు నుండునట్లు అభ్యాసము చేయవలయును. ప్రతి నాలుగైదు నిమిషములకు ద్యానాభ్యాసము భిన్నము కావచ్చును. అట్లు ధ్యానము భిన్నమైనపుడెల్ల, అర్థ తాత్పర్యముల స్మరించుచు మరల గాయత్రిని ముమ్మారు పఠించి పూర్వము వలె ధ్యాననిమగ్నులు కావలెను. ఇట్లు నిత్యము ముప్పది నిమిషముల వరకు అభ్యాసము చేయవలయును. మొదట ఐదు నిమిషములతో ప్రారంభించి క్రమముగా పెంచవచ్చును.

అభ్యాసము చేయగా చేయగా సత్వము శుద్ధమై పరిష్కృతమగును. పైనుండి జ్యోతిష్కోశము వికసించును. క్రిందనుండి కుండలినీ శక్తి ప్రసరించును. ఊర్ధ్వలోకము నుండి జ్యోతి యవతరించును. ధృవలోకము నుండి జ్యోతి పైకెక్కును. ధారణ జ్యోతిర్మయమగును. అట్టి జ్యోతిర్మయధారణలో దేవసవిత యొక్క వరేణ్యం భర్గధారితమగును - ధరించబడును. ధారణలు దివ్యమే, సాధకుని ఆత్మ దేవసవిత యొక్క దివ్య స్వరూపమును దర్శించి అందు సమాహితమగును. అనుష్ఠానమునకు అనారోగ్యము అడ్డురాకుండునట్లు సాధకుడు సాత్వికాహారము స్వీకరించు చుండవలెను.

గాయత్రీ మంత్రానుష్ఠానము సూర్యుని కెదురుగ ఆసనముపై కూర్చుండి కేవలము ప్రాతంకాలమందే చేయవలెను. అనగా సూర్యోదయమునకు పదునైదు నిముషములు ముందునుండి ప్రారంభించి పదునైదు నిమిషములు ప్రొద్దెక్కువరకు చేయవలెను. స్నానమాచరించి ఉతికిన వస్త్రములు ధరించవలెను. ఏకాంత స్థలమున సూర్యునికెదురుగా - సూర్యోదయపు ఎఱ్ఱని కిరణములు హృదయముపై ముఖముపై పడునట్లు - పద్మాసనము లేక బాసికపట్టు వేసికొని కూర్చుండవలెను. ఒక గజము వెడల్పుగల తివాసిని భూమిపై పరచి, తెలుపు, కాషాయవర్ణములుగల వస్త్రములను

పఱచి ఆసనము సిద్ధపరచుకొనవలెను. మనస్సునందే అర్ధతాత్పర్యములను మననము చేయుచు గాయత్రీ మంత్రమును పఠించుచుండవలెను. అర్ధగ్రహణము లేకుండ పఠించుట సరికాదు.

## గాయత్రీ మంత్రము

**శ్లో॥ ఓం భూర్భువ స్సువ: । తత్ సవితు ర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి । ధియో యో న: ప్రచోదయాత్ ॥**

గాయత్రీ మంత్రముపై పండితుల అభిప్రాయములు.

ప్రాచీనులు, అర్వాచీనులు - నవీనులు, ప్రాగ్దేశవాసులు, పశ్చిమదేశ వాసులు - అయిన పండితులెందరో గాయత్రిని గురించి తమ అభిప్రాయములను తమ తమ రచనలలో వెల్లడించియుండిరి. అందుకొందరు పెద్దల యభిప్రాయముల నిందు పొందుబరచుచున్నాము.

1. శ్రీ స్వామివివేకానంద:- (రామకృష్ణ పరమహంస శిష్యులు) అమెరికా యందు గాయత్రీ మంత్రమును గూర్చి యుపన్యసించుచు నిట్లు చెప్పిరి.

హిందువులు విగ్రహారాధకులు కారు. ఏలయన వారి ధ్యేయ (Greed) మంత్రము గాయత్రి. ఈ మంత్రమున "తత్" - (ఆ) శబ్దమే యొక పరోక్ష (Invisible) సృష్టికర్త - అనగా సవిత వంకకు సంకేత మొనర్చుచున్నది. అనేకులీ మంత్రమును సూర్యోపాసనా మంత్రముగ నుడువుచున్నారు. కాని అది సరికాదు. ఏలయన సవితా శబ్దము సృష్టికర్తయైన ఈశ్వరునే బోధించుచున్నది. ఇదియును గాక ఈ మంత్రమున జ్ఞానము - బుద్ధి నిమిత్తమే ప్రార్ధన కలదు. కావున ఆ జ్ఞానదాత జడసూర్యుడు ఎన్నటికిని కానేరడు. ఇంతేకాదు. ఇందొక గొప్ప విశేషము కలదు. ఏమన: ఈ మంత్రమునందుగల "న:" శబ్దము సమాజవాచకమై యున్నది. కాన స్త్రీ పురుషాది మానవ మాత్రులందరికి, దీని జపించు నధికారము కలదు. ఇట్లు మనపూర్వులు విగ్రహారాధకులు కారనియు, నిరాకార ఈశ్వరునే ధ్యానించుచుండిరనియు, ఈ నిరాకార

ధ్యానమునకు ముఖ్య సాధనము గాయత్రీమంత్రమనియు, స్త్రీ పురుషులకు గాయత్రీమంత్రము జపించు నధికారము కలదనియు స్పష్టమగుచున్నది.

**2.** గౌతమబుద్ధుడు:- స్తుతినిపాతమున బ్రాహ్మణకర్మ విధానమును వర్ణించుచు గౌతమబుద్ధుడు వేదమునకు ప్రాముఖ్యమొసగి అట్టి వేదాధ్యయనమునందు గాయత్రీ మంత్రమునకు మిగుల విశేషమొసంగెను.

**3.** మహాత్మాగాంధి:- పూజ్యపాద మహాత్మాగాంధి యీ గాయత్రిని గురించి ది. **24.3.1920** తేదీ "యంగ్ ఇండియా"లో ఇట్లు వ్రాసిరి ".................. తదనంతరము ఉపన్యాసము, వ్రతము, ప్రార్థన కలదు. అదియొక పూర్వాచారము. పూర్ణోపవాసము శరీరమును, మనస్సును, ఆత్మను పరిశుద్ధపరచుచున్నది. ఉపవాసమువలన మజ్జ కరిగి జీర్ణమై ఆత్మపైనున్న నిరర్థకముగు బరువు తొలగిపోవుచున్నది. హృదయపూర్వకముగా చేయు ప్రార్థన యొక్క ప్రభావితము మిగుల నాశ్చర్యముగ నుండును. ఒక వున్నతావస్థ నుండి మరియొక ఉన్నతావస్థకు చేరుటకై ఆత్మ తొందరపడుచు వుండునని ప్రార్థన ప్రకటించుచున్నది. ఈ విధముగ లభించిన పవిత్రత యొక్క ప్రయోగము ఉన్నతాకాంక్షలతో జరిగినపుడు అది నిజమైన ప్రార్థన అనబడుచున్నది. కావున నిరంతర గాయత్రీమంత్రజపము యొక్క ప్రయోగము నేనిచ్చిన ప్రార్థన పరిభాషను సర్వవిధముల చరితార్థపరచుచున్నది. మరియు నీ గాయత్రీ మంత్రజపము రాష్ట్రీయ విపత్కాలమున శాంత చిత్తముతో చేయబడిన యెడల అది సంకటములను రూపుమాపుటకై పరాక్రమ ప్రభావములను చూపెట్టగలదు? మరియు "క్రీ.శ.**1912** ఫిబ్రవరి **13**న ఢిల్లీలో లిబ్బియా కాలేజీని తెఱచుచు ఇట్లు చెప్పెను - "వర్తమాన చికిత్సా పద్ధతి సర్వవిధముల ధర్మరహితమయ్యెను. విధి ప్రకారము ప్రతిదినము నమాజు చేయువాడు గాని, గాయత్రీ జపము చేయువాడుగాని యెన్నటికిని రోగగ్రస్థుడు కాజాలడు. పవిత్రమైన ఆత్మయే పరిశుద్ధమైన శరీరమును నిర్మింపగలుగు

చున్నది. ధార్మిక జీవన నియమము యథార్థముగా శరీరాత్మలను కాపాడగలదని నా నిశ్చితాభిప్రాయము''.

(స్వరాజ్య మెట్లు లభించును? అను దానినుండి)

**4.** సర్ మోనియర్ విలియం:- ఇతడు తన "ది బుద్ధిజం'' (The Buddhism) అను గ్రంథమునందు గాయత్రిని గురించి యిట్లు వ్రాసెను:- "క్రైస్తవ మతమునకు క్రీస్తుదక్క మరెద్దియును లేదు. ముస్లిము మతమునకు హజరత్ మహమ్మదు దక్క మరెద్దియు లేదు. బౌద్ధ మతమునకు బుద్ధుడు గాక మరేమియు లేదు. ఈ పురుషులే వారి వారి ధ్యేయములు. అనగా నీ పురుషులు దక్క వారికి ధ్యానింప దగినదేదియు లేదనుట. నేను క్రైస్తవుడనే అయినను సత్యము చెప్పుటలో నాకెట్టి సంశయములేదు. హిందువులయొక్క ధ్యేయ మంత్రము "గాయత్రి! ఇది లేకుండ ఋషులుగాని, మునులుగాని మహాపురుషులు గాని జీవింపజాలరు. హిందూమతము ఏ మానవవ్యక్తి విశేషముపై నాధారపడి యుండలేదు. ఈ గాయత్రి ద్వారా తిన్నగ పరమేశ్వరు నుండియే వారు జ్ఞానమును బడయగలుగుచున్నారు.''

**5.** యోగివర శ్రీ అరవిందఘోషు:- వీరు తన "లైట్ ఆన్ యోగ'' అను గ్రంథమునంతిట్లు వ్రాసిరి-

**"ఆత్మజ్ఞానము, ఆత్మ నియంత్రణ, ఆత్మసమర్పణ"**-మార్గమే యోగముయొక్క మార్గము. గాయత్రీ మంత్రమునందును ముఖ్యముగా నీ మార్గమే ఉపదేశింపబడినది. గ్రాయత్రీమంత్రము యొక్క మొదటి రెండు పాదములయందు పరమాత్మ యొక్క మహత్తర గుణములు వర్ణించబడినవి. ఈ గుణముల యొక్క అనుభూతి ద్వారానే సాధకునికి ఆత్మజ్ఞానము కలుగగలదు. ఈ ఆత్మజ్ఞానము కలుగగలదు. ఈ ఆత్మజ్ఞానము ద్వారా తన్ను ప్రభువు దగ్గరకు చేర్చు కోరికతో సాధకుడు స్వయముగ ఆత్మ నియంత్రణ మార్గము నవలంబించును. గాయత్రి యొక్క మూడవ భాగమున

మా బుద్ధిని ప్రేరేపించుగాక! యని పరమాత్మ ప్రార్థింపబడెను. కావున నీ ప్రార్థన యొక్క అభిప్రాయము సాధకుడు ఆ పరమాత్మ యొదుట తన ఆత్మసమర్పణ మొనర్చుచున్నాడనియే. సాధకుడెపుడు తన బుద్ధియొక్క ప్రేరణ స్రోతస్సు ఆ పరమాత్మయని తలంచుచున్నాడో అపుడాతనియందు మిథ్యాభిమానము అథ నా అహంకారము ఎట్లు, ఎచట మిగిలియుండును.

ఈ విధముగ ప్రాపంచిక సమస్త దు:ఖములనుండి విముక్తి నొందుటకును వాస్తవిక యోగము ద్వారా మోక్ష ప్రాప్తికిని మార్గము గాయత్రి యందు వివరింపబడియున్నది. కావున నా ధ్యాత్మిక సాధకులకు ముక్తి కేవల మీ గాయత్రీ మంత్రము యొక్క నిరంతర జపము ద్వారా కలుగగలదు.''

## ఋషి దేవతాబీజాదులు - కరన్యాస హృదయన్యాసములు

## గా య త్ర్యా వా హ న ము

ఆయాతు వరదా దేవీమక్షరం బ్రహ్మ సమ్మితం గాయత్రీం ఛందసాం మాతేదం బ్రహ్మ జుషస్వమే య దహ్నాత్కురుతే పాపం త దహ్నాత్ ప్రతిము చ్యతే, య ద్రాత్ర్యాత్కురుతే పాపంత ద్రాత్ర్యా త్ప్రతిముచ్యతే సర్వవర్ణే మహాదేవి సన్ధ్యా విద్యే సరస్వతీ, ఓజోఽసి, సహోసి బలమసి భ్రాజోఽసి, దేవానాం ధామనామసి, విశ్వమసి విశ్వాయు: సర్వమసి, సర్వాయు రభిభూరోం, గాయత్రీ మావాహయామి, సావిత్రీ మావాహయామి, సరస్వతీ మావాహయామి, ఛన్దఋషీ నావాహయామి, శ్రియమావాహయామి బలమావాహయామి.

## మం త్ర వి వ ర ము

గాయత్ర్యా గాయత్రీ ఛందో విశ్వామిత్ర ఋషి స్సవితా దేవతాఽగ్నిర్ముఖం బ్రహ్మశిరో విష్ణుర్హృదయగ్ం రుద్రశ్శిఖా పృధివీయోని: ప్రాణాపాన వ్యానోదాన సమానాస ప్రాణా శ్వేతవర్ణా సాంఖ్యాయన సగోత్రా గాయత్రీ చతుర్విం శత్యక్షరా త్రిపదా షట్కుక్షి: పఞ్చ శీర్షోపయనే వినియోగ:

టీ.వరదా = వరముల నిచ్చునదియు, అక్షరం = నాశరహితమైనదియు, సమ్మితం = వేదచోదితమైనదియు, బ్రహ్మ = పరబ్రహ్మ బోధకమైనట్టిది యునగు, దేవీ = దేవత, ఆయాతు = వచ్చుగాక, ఛన్దసాంమాతా = వేదజననియగు, గాయత్రీం = గాయత్రి, మే = నాకు, ఇదం బ్రహ్మ = పరశివ బ్రహ్మ మిదియని, జుషస్వ = వచించుగాక, ఆహ్నాత్ = పగటినుండి, యత్పాపం = ఏ పాపము, కురుతే = కలిగినదో, తత్ = ఆ పాపము, ఆహ్నాత్ = పగటి నుండియే, ప్రతిముచ్చతే = విగతమగుచున్నది, రాత్ర్యాత్ = రాత్రి నుండి, యత్పాపం = ఏ పాపము, కురుతే = కలుగుచున్నదో, తత్ = ఆ పాపము, రాత్ర్యాత్ = రాత్రి నుండియే, ప్రతిముచ్యతే = విగతమగుచున్నది, సర్వవర్ణే = అన్ని వన్నెలను బొందిన, మహాదేవీ = గొప్పతల్లీ, సన్ధ్యా విద్యే = సద్ధ్యానముచే తెలియదగిన, సరస్వతీ = ఓ విద్యాదేవతా, ఓజ: అసి = ఇంద్రియశక్తి, వై: = సహా:, అసి = ఓర్పుశక్తివై, బలం అసి = దార్ఢ్యమై, బ్రాజ: అసి = తేజస్సువై, దేవానాం = దేవతల యొక్క, ధామ = తేజమును, నామ = పేరును, అసి = పొందినదానవై, విశ్వం = ప్రపంచమును, విశ్వాయు: = దీర్ఘాయుస్సు కలదానవును, అసి = అయి, సర్వం = సమస్తమును, సర్వాయు: = సర్వ ప్రాణుల ప్రాణమవును, అసి=అయి, అభిభూ: = ఉద్భవించిన, ఓం=పరమాత్మయగు, గాయత్రీం = గాయత్రీ మంత్ర దేవతను, ఆవాహయామి = పిలుచుచున్నాను, సావిత్రీం = (అట్టి) సవితారూపిణీని, ఆవాహయామి=పిలుచుచున్నాను, సరస్వతీం = (అట్టి) విద్యా దేవతను, ఆవాహయామి = పిలుచుచున్నాను, ఛన్దఋషిమ్ = ఛందస్సును ఋషిని, ఆవాహయామి = పిలుచుచున్నాను, శ్రియ: = (అట్టి) లక్ష్మిని, ఆవాహయామి = పిలుచుచున్నాను.

గాయత్ర్యా = గాయత్రీ మహామంత్రమునకు, చంధ: = ఛంధస్సు, గాయత్రి = గాయత్రియే, విశ్వామిత్ర: = విశ్వామిత్రుడు, ఋషి: = (మంత్ర ప్రవర్తకుడగు) ముని, సవితా = పరబ్రహ్మము, దేవతా = (మంత్రాధి) దేవత, అగ్ని: = అగ్ని దేవుడు, ముఖం = మంత్రముఖము, శిర: = శీర్షము, బ్రహ్మ = పరమాత్మ, విష్ణు: = విష్ణుమూర్తి, హృదయం = అంతస్సు, రుద్ర: = ఈశ్వరుడు, శిఖా = సిగ, యోని: = జన్మస్థానము,

పృథివీ = భూమి, ప్రాణాపానవ్యానోదానసమాన: = ప్రాణము, ఆపానము, వ్యానము, ఉదానము, సమానములనెడు, ప్రాణా = ప్రాణములతో, స = కూడియున్నది, శ్వేత = తెల్లనైన, వర్ణా=రంగుగలది, సాంఖ్యాయన=సాంఖ్యాయన ఋషి యొక్క, గోత్రా = గోత్రములతో, స=కూడియున్నది, చతుర్వింశత్యక్షరా = ఇరువది నాలుగక్షరములు గలది, త్రిపదా = మూడు పాదములు గలది, షట్కుక్షి: = (ప్రాక్పశ్చిమ దక్షిణోత్తరోర్ధ్వాదర దిశలు) ఆఱును కక్షలుగా గలది, పంచశీర్ష: = అయిదు శిరస్సులు గలది, ఉపనయనే = జ్ఞానోపదేశము నందు, వినియోగ: = ఉపయోగపడునది.

గాయత్రీ మంత్ర ఋషి దేవతాబీజాదులు - అంగన్యాస కరన్యాసములు.

**క ర న్యా స ము**

**ఓం తత్సవితు: - అంగుష్ఠాభ్యాన్నమ:**

**వరేణ్యం - తర్జనీభ్యాన్నమ:**

**భర్గోదేవస్య - మధ్యమాభ్యాన్నమ:**

**ధీమహి - అనామికాభ్యాన్నమ:**

**ధియోయోన: - కనిష్ఠికాభ్యాన్నమ:**

**ప్రచోదయాత్ - కరతలకర పృష్ఠాభ్యాన్నమ:**

**హృ ద య న్యా స ము**

**తత్సవితు: బ్రహ్మాత్మనే - హృదయాయైనమ:**

**వరేణ్యం విష్ణ్వాత్మనే - శిరసే స్వాహా**

**భర్గోదేవస్య రుద్రాత్మనే - శిఖాయైవషట్**

**ధీమహి సత్యాత్మనే - కవచాయహుం**

**ధియోయోన: జ్ఞానాత్మనే - నేత్రత్రయాయ వౌషట్**

**ప్రచోదయాత్సర్వాత్మనే - అస్త్రాయఫట్**

**శ్లో॥ భూర్భువస్సు వరోమితి దిగ్బంద:**
**"నగాయత్ర్యా: పరం మంత్రం"**

గాయత్రి కంటె సర్వోత్కృష్టమైన మంత్రము మరియొకటి లేదు. దీని మహిమను గూర్చి భగవద్గీత ఇట్లు ప్రవచించినది.

**శ్లో॥ బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్॥ భ.గీ.అ.10.శ్లో.35**

సామవేదమునందుండు ఏ రథంతరాది సామమంత్రములు గలవో వాని లోపల బృహత్సామమును నేనే. గాయత్రి మున్నగు ఛందోయుక్తములైన మంత్రముల లోపల ఇరువదినాలుగు అక్షరములు గల గాయత్రీ మంత్రమును నేనే.

ఏతద్విధమగు పరమపవిత్రమగు గాయత్రీ మంత్రమును సదా ధ్యానము చేయుచు ధారణ చేసి తరింతురుగాక.

**గాయత్రీ మంత్ర గానము**

**గాయత్రీ మంత్రగానము సేయరా**
**మంత్ర రాజమని మాన్యతగనెరా**
**సర్వోపనిషత్సా రసంగ్రహంబు రా**
**బ్రహ్మాదులకు బ్రహ్మత్వ మొసగెరా**
**పార్ధమారుతుల పరమార్థమురా**
**ముక్కోటి సురలకు ముక్తిదంబురా**
**విశ్వామిత్ర దేవతాకమై వెలుగొందునురా**
**కృష్ణుడు తానె గాయత్రినని నొక్కివక్కాణించెనురా**

**బీజకీలకాస్త్రమైన భీతి నణచురా**
**విశ్వశ్రీ గురుమంత్రమై విలసిల్లెనురా**
**భారతీయాత్మతత్వమై భాసిల్లెనురా**
**వేదాంత విదులకు వేదితవ్యమురా**

**సర్వ వేదాంత సిద్ధాంత సంగ్రహంబురా**
**పరోరజ సేయను - పరమార్థమురా**
**గుప్తతమంబనుట గ్రుడ్డితనంబురా**
**దైవస్తుతులకు దాపరికమేలరా**

**మానసంబె - గాయత్రిగా మారిపోవాలిరా**
**కామధేనువు వోలె కాపాడునురా!**
**చిత్తైకాగ్రతను చేకూర్చునురా!**
**ఓంకార నాదము ఓర్పుతో వినరా!**

**అంతరాత్మ ధ్వనులను ఆలకించరా!**
**అమాత్ర తురీయ బ్రహ్మము సదాతానగురా!**
**సచ్చిదానంద స్వరూపమవ్వాలిరా!**
**నిర్గుణాత్మతత్త్వ మెఱుంగవలెరా!**

ఓం తత్ సత్

# గురు తత్త్వము - గురు గీత

ఆధ్యాత్మిక బోధను ప్రధానముగా తీసికొనియే బహుగీతలు వ్రాయబడి యున్నవి. భగవద్గీత, గురుగీత, అవధూతగీత, గణేశగీత, ఉత్తరగీత, ఉద్ధవగీత మొదలైనవి కలవు. బ్రహ్మ విద్యా వివరణమునందు కృష్ణభగవానుడు బోధించిన భగవద్గీతయే ముఖ్యమైనది. ఇందు కర్మ, భక్తి, యోగ, జ్ఞానములు, సాధనములు బహువిధములుగా వివరించబడినవి. గురుగీత యందు గురువు యొక్క గొప్పతనమును బహువిధములుగా తెలుపబడినది. దీనిలో సూక్ష్మమైన గురుతత్త్వము వివరించబడియున్నది. గురుశిష్యుల అర్హతలు విపులముగా తెలియగలవు. 274 శ్లోకములతో గురుగీతను స్కంధ పురాణాంతర్గత ఉత్తర ఖండము నందలి ఉమామహేశ్వర సంవాదమునందు చూడగలము.

శౌనకాది మహామునులు సూతమహర్షిని ఇట్లు అడిగిరి.

**శ్లో॥ గుహ్యాద్గుహ్యతరంసారం । గురుగీతా విశేషతః।**
**త్వత్ప సాదాచ్ఛ్రోతవ్యా । తత్సర్వం బ్రూహి సూతనః॥** గు.గీ-2

తా॥ ఓయి సూతా! గురుగీతలు నీ యనుగ్రహము నుండి వినదగినవి, గనుక సమస్త రహస్యములలో మిక్కిలి రహస్యమును, శ్రేష్ఠమునునగు ఆ సమస్తమును మాకు జ్ఞొమాయని శౌనకాది మహాఋషులు సూతుని ప్రార్థించిరి. సూతుడిట్లు చెప్ప నారంభించెను. మనోహరంబగు కైలాస పర్వతము నందు పార్వతి భక్తితో ఈశ్వరునికి నమస్కరించి భక్తి సాధన యొక్క కారణము నడుగుచు స్వామీ! నాకు గురుదీక్షను ఇమ్మాయని కోరెను. సమస్తవ్రతములలో మేలయినదియు శ్రేష్ఠమునగు గురు మహాత్మ్యమును నాకు జెప్పుము.

**శ్లో॥ భగవన్ సర్వధర్మజ్ఞ । వ్రతానాం వ్రతనాయకం ।**
**బ్రూహిమే కృపయాశంభో । గురుమహాత్మ్య ముత్తమం॥** గు.గీ. శ్లో.5

ఇట్లు ప్రార్థించి, ఓ స్వామీ జీవుడు, ఏ మార్గము ద్వారా పరబ్రహ్మ రూపమగును. నా కొఱకు అట్టి యనుగ్రహమును దయచేయుము. మీ పాదములకు నమస్కరించుచున్నానెను. (గు.గీ-6) మహాదేవుడిట్లు పలికెను. ఓ పార్వతీ, పూర్వము ఇట్టి లోకోపకారకమగు ప్రశ్న ఎవరిచేతను వేయబడలేదు. నీవు ప్రత్యక్షముగా నా స్వరూపురాలవైతివి గనుక నీ భక్తి కొఱకై చెప్పుచున్నాను వినుము.

**శ్లో॥ యోగురుస్స శివ: ప్రోక్తో । యశ్శివస్సగురుస్మృత: ।**
**వికల్పం యస్తుకుర్వీత । సనరో గురుతల్పగ: ॥** **గు.గీ.శ్లో.9**

తా॥ ఓ పార్వతీ, పరమాత్మ స్వరూపము తెలియజేయునట్టి గురువు ఈశ్వరుడుగాను, ఈశ్వరుడు గురువుగాను జెప్పబడినది. ఇందు ఈ విషయమై సంశయ మనస్సు గల మనుజుడు గురుభార్యను బొందిన దోషము గలవాడగుచున్నాడు. భగవంతునియందెట్లు భక్తి శ్రద్ధలు కలిగియున్నామో అట్టి భక్తి శ్రద్ధలు గురువునందు చూపగలిగినవారు ఉపనిషత్సారమైన భగవంతుని సాక్షాత్కరించుకోగలరు. భగవంతుని సాక్షాత్కారము కావలెనన్నా, గురుబోధ లేనిదే జరుగదు. గురువనగా ఉపాధిరూపములో నున్న భగవంతుడే. అజ్ఞానాంధకారమున బడియున్న జీవుల నుద్దరించుట కొఱకై దేహరూపము ధరించిన భగవంతుడు, అతడు పరావిద్యను బోధించి సంసార సముద్రమును దాటింపజేయును. కాన జ్ఞాన గురువనబడును. దీనినే గురుగీత యిట్లు చెప్పుచున్నది.

**శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య । జ్ఞానాంజనశలాకయా ।**
**చక్షురున్మీలి తంయేన । తస్మై శ్రీ గురుదేవేనమ: ॥** **గు.గీ.శ్లో.47**

తా॥ ఏ గురువు చేత సజ్ఞానమనెడు చీకటిచే గ్రుడ్డివాడగు జనుని యొక్క జ్ఞాన చక్షుస్సు పరబ్రహ్మ జ్ఞానమను కాటుకయొక్క కణికతో దెరవబడుచున్నదో, అట్టి సద్గురువుకు నమస్కారము. అపరా విద్యను బోధించి వ్యావహారిక లాభమును కలిగించుట గురువులను ఉప గురువులందురు.

**శ్లో॥ యావానర్థ ఉదపానే సర్వత: సంస్లుతోదకే।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానత:॥** **భ.గీ.అ.2.శ్లో.46**

తా॥ నలువైపుల నీరు పాఱుచున్నపుడు బావిజలముతో నెంత అవసరముండునో జ్ఞాన విలసితుడగు బ్రాహ్మణునికి వేదములన్నింటితోను అంతే అవసరముండును.

**శ్లో॥ అలం యాగైరలం యోగై:అరం భుక్తైరలం ధనై:**
**పరస్మిన్ బ్రహ్మణీ జ్ఞాతే ఇతి వేదాంత డిణ్డీమ:** **వే.డి.శ్లో.22**
**అలంవేదైరలం శాస్త్రైరలం స్మృతి పురాణకై:**
**పరమాత్మని విజ్ఞాతే ఇతి వేదాంత డిణ్డీమ:** **వే.డి.శ్లో.23**

దీనినే గురుగీత.

**శ్లో॥ జపస్తపోవ్రతం తీర్థం। యజ్ఞోదానం తథైవచ।**
**గురుతత్త్వమవిజ్ఞాయ। సర్వం వ్యరథంభవేత్ప్రియే॥** **గు.గీ.శ్లో.13**

ఓ పార్వతీ, జనుడు గురుస్వరూపము యొక్క నిజ స్థితిని తెలిసికొనక చేసెడి జపమును, తపస్సును, నియమమును, గంగాది పుణ్యతీర్థ సేవయును, యాగమును, గోదానము మొదలైనవియును నిష్ఫలమైనవేయగును.

జీవు డెందువలన సద్గురు పాదపద్మముల సేవనుండి సమస్త పాపములు నశించుటవలన పరిశుద్ధ స్వరూపుడై పరబ్రహ్మ స్వరూపుడగునో దానిని దెలియవలెను. తనకు బ్రహ్మజ్ఞానోపదేశము చేసిన గురు నామమును స్తోత్రము చేయుటయే - అంతములేని పరమశివుని యొక్క నామస్తుతియగును. ఏ గురువు వలన జ్ఞానోపదేశానుగ్రహమును బొంది, విశేషమగు అజ్ఞానమును విడుచునో, అట్టి సద్గురువుకు నమస్కరించు చుండవలెను. గురువే విశ్వేశ్వరుడుగాను, ఆ గురు నివాసస్థలమే కాశీక్షేత్రముగాను, ఆ గురు పాదోదకమే గంగగాను, ఆ గురువుచే ఉపదేశింపబడిన పరబ్రహ్మ జ్ఞానమే తారకోపదేశముగాను గుర్తించవలెను. జనులు గురు ముఖము నందున్న పరబ్రహ్మము, గురువు యొక్క అనుగ్రహము వలన పొందబడుచున్నారు. గనుక జనులు గురువునెల్లప్పుడు నెడతెగకుండ, వ్యభిచారియగు స్త్రీ తనకెన్ని

పనులుండినను పర పురుషునియందు మనస్సుంచునటులనే, ఏకాగ్రచిత్తులై ధ్యానించవలెను. (గు.గీ.-28) బ్రహ్మచర్యము మొదలైన ఆశ్రమములను, బ్రాహ్మణాది జాతులను, కీర్తిని, బలాతిశయమును, సర్వమును విడిచి గురువుకంటె వేఱుగుదానిని దేనిని తలంచగూడదు. గురు స్వరూపులై గురు ధ్యానము చేసెడి వారలకు పరమానంద సుఖము సులభముగా బొందదగినదగుచున్నది. గురు ముఖమునందున్న బ్రహ్మ విద్య గురువునందలి అచంచల భక్తిచేత బొందబడుచున్నది. ఇట్లు పొందినవారు మూడు లోకముల యందును స్ఫుటవాక్కుగల దేవాసురపన్నగులవలెనే యగుచున్నారు. గుకారమే గాఢమగు చీకటిగాను, రుకారమే ఆ గాఢమగు చీకటిని హరించెడి తేజస్సుగాను చెప్పబడినది. కాన అజ్ఞానాంధకారమును నశింపజేసెడి పరబ్రహ్మము గురువేయగుచున్నాడు. దీనికి సంశయము లేదు. సమస్త జగత్తునకును గురుడొక్కడే బ్రహ్మ, విష్ణు, శివాత్మక స్వరూపము అగుచున్నాడు. ఏ గురుస్మరణ మాత్రముచేతనే పరబ్రహ్మజ్ఞానము స్వకీయముగానే పుట్టుచున్నదో, అట్టి సర్వస్వతంత్ర రూపుడగు సద్గురు స్వామిని పూజింపవలయును. ఈ దేహమను చెట్టునెక్కియున్న జీవులు, నరక సముద్రము నందు బడుచున్నారు. అటువంటివారల నందరిని ఏ గురువు జ్ఞానోపదేశము చేత నెత్తి రక్షించబడుచున్నారో అట్టి గురువుకు నమస్కరించి పూజించవలెను. అంతటా వ్యాపించి స్థావర జంగమాత్మకముగా నున్న యుష్మత్పదార్థమైన జీవరూపము చూపింపబడినదో, సమస్త జగత్తును వ్యాపించి నిర్గుణమును నిర్మలమును, శాంతమునునైయున్నదియో, ఏ పరబ్రహ్మ ప్రకాశముచేతనే జగత్తంతయు వెలుగుచున్నదో, యే పరబ్రహ్మము యొక్క ఆనందము చేతనే లోకులందరు ఆనందించుచున్నారో, ప్రేమ రూపమైన పుత్రాదికమంతయు ఏ పరబ్రహ్మము యొక్క ప్రేమచేత కలుగుచున్నదో, ఏ పరమాత్మచే జనుడు జాగ్రత్స్వప్న సుషుప్త్యాది సమస్త ప్రపంచమును గూర్చి లలనాది వ్యాపారములు గలవాడుగా జేయబడుచున్నాడో, ఏ పరమాత్మ సంబంధమగు నెరుకయే యీ సమస్త జగత్తు నీవై ప్రపంచమునందలి వేఱువేఱువస్తువుల యొక్క భేదముల వలన దెలియబడకయున్నదో అట్టి అద్వితీయ స్వరూపుడగు పరమాత్మ స్వరూపుడైన సద్గురువుకు నమస్కారములు.

పరమాత్మకు, జీవేశ్వర స్వరూపముల చేత ప్రకాశించుచు దెలియవచ్చెడి యీ సమస్తము, కేవల స్వరూపమేయైయున్నది. తన యొక్క కేవల స్వరూపము తానేయై తనకు వేఱొకటి లేకపోవుట వలన వేఱుగా జూచి తెలిసికొనుట లేదు. సర్వకారణుడగు భగవంతుని కొఱకు కార్యరూపమైన సమస్త ప్రపంచము ప్రకాశించుచున్నది. నానా రూపాత్మకమగు నీ సమస్త ప్రపంచము ఏ పరమాత్మకు వేఱుగాక వున్నదియో. అట్టి కార్య కారణాత్మకము అగు పరమాత్మయైన సద్గురువుకు నమస్కారము. ఈ ప్రపంచమంతయు సద్గురువునందున్నది. సద్గురువు ప్రపంచమునందున్నాడు. ప్రపంచమంతయు సద్గురువే.

ఈశ్వరు డాగ్రహించుచుండగా గురువే రక్షించెడి వాడగుచున్నాడు. గురువాగ్రహించునపు డెవడును రక్షించెడివాడు లేడు. మకరందము నందాసక్తిగల తుమ్మెద యొక పుష్పము నుండి వేఱొక పుష్పము నెట్లు పొందునో, ఆ ప్రకారమే స్వరూపజ్ఞానము నందాసక్తిగల శిష్యుడొక స్వల్ప గురువు నుండి వేఱొక నిజ గురువును బొందవలయును. సద్గురువు ప్రత్యక్షముగా మూడు కన్నులు లేని ఈశ్వరుడుగాను, నాల్గు భుజములు లేని విష్ణువుగాను, నాలుగు ముఖములు లేని బ్రహ్మగాను జెప్పబడుచున్నాడు. అదృష్టము లేనివారు సద్గురువు యొక్క శ్రేష్టమైన రూపమును, గ్రుడ్డివాడు సూర్యోదయమును, నెదురుగా నిల్చి చూడనట్లు చూడజాలడు.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు మొదలైనవారందరును గురు కృపను బొందుటచేతను, మిక్కిలిగా గురుసేవ చేయుటచేతను, నట్టి సామర్థ్యమును బొందిరి.

**శ్లో॥ నగురోరధికం త్త్వం । నగురోరధికం తప: ।**
**తత్త్వజ్ఞానాత్పరం నాస్తి । తస్మై శ్రీ గురవేనమ: ॥**

ఓం తత్ సత్

# ప్రా త: స్మ ర ణీ య ము లు

1. శ్లో॥ బ్రహ్మానందం పరమ సుఖదం, కేవలం జ్ఞానమూర్తిమ్
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్
ఏకం నిత్యం విమలమచలం , సర్వధీసాక్షిభూతమ్
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి.

2. శ్లో॥ ఊర్ధ్వామ్నాయగురో: పదం త్రిభువనోంకారాఖ్య సింహాసనం,
సిద్ధాచార సమస్త వేదపఠితం షట్చక్ర సంచారిణం ।
అద్వైత స్ఫురదగ్ని మేకమమలం పూర్ణ ప్రభాశోభితం ।
శాంతం శ్రీ గురుపంకజం భజమనశ్చైతన్య చంద్రోదయం ॥

1. తా॥బ్రహ్మానంద స్వరూపుడును, పరమ సౌఖ్యము నిచ్చువాడును, కేవల పరమాత్మ స్వరూపుండును, జ్ఞాన స్వరూపుండును, సుఖదు:ఖాది ద్వంద్వములు లేనివాడును, నాకాశ సమానుండును, తత్త్వమస్యాది మహావాక్యములకు లక్ష్యార్థమైన అఖండమగు పరబ్రహ్మ స్వరూపుండును, అద్వితీయుండును, శాశ్వతుండును, విమలుండును, చలనవర్జింతుండును, బుద్ధికి సాక్షిమాత్రుండును, తలంపులకు లోఁబడక అతిక్రమించి యుండెడివాడును, రజస్సత్వ, తమోగుణములు లేనివాఁడును నగునట్టి సద్గురు స్వరూపునిం గూర్తి నమస్కరించుచున్నాను.

2. తా॥ ఓ మనసా సమస్త ఉపనిషత్తుల యందును జెప్పబడిన పరమాత్మ స్వరూపమునకు స్థానమైనదియును, స్వర్గాదిలోకములు మూడును స్వరూపముగాగల ఓంకారము సింహాసనమైనదియును, సమస్త వేదముల యందును జెప్పఁబడినదియును, మూలాధారాధి షట్చక్రములయందు సంచరించుచున్నదియును, అద్వయస్వరూపమై ప్రకాశించునట్టి తేజో మయమును, అద్వితీయమును, నిర్మలమును, నిండైన

ప్రకాశముతో ప్రకాశించునదియును, ప్రకాశస్వరూపమైన చంద్రునియొక్క అభివృద్ధి రూపమునైనదియగు శ్రీ గురుపాదపద్మములను సేవించుము.

**3. శ్లో॥ మూ॥ యో విశ్వాత్మా విధిజవిషయాన్ ప్రాశ్యభోగాన్,**
**స్థవిష్ఠాన్ పశ్చాచ్చాన్యాన్ స్వమతివిభవాన్ జ్యోతిషాస్వేన సూక్ష్మాన్ ।**
**సర్వానేతాన్ పునరపి శనై: స్వాత్మనిస్థాపయిత్వా ।**
**హిత్వాసర్వాన్ విశేషాన్ విగతగుణగణ: స్వాత్మసౌనస్తురీయః॥**

3. తా॥ ఏ చైతన్య స్వరూపుడు విరాట్పురుష శరీరమై పుణ్య పాపకర్మల వలన కలిగినట్టియు, స్థూలతమములైనట్టియు భోగములననుభవించి తరువాత సూక్ష్మములైనట్టియు నిజమనోవాసనా స్వరూపములైనట్టియు జాగ్రత్కాలిక భోగములచే స్వీయమగు జ్యోతిస్సుచే స్వప్నమునందనుభవించియు, నిజమనోవాసనా స్వరూపములైనట్టియు, జాగ్రత్కాలిక భోగములనే స్వీయమగు జ్యోతిస్సుచే స్వప్నమునందనుభవించియు, ఈ స్వప్న జాగ్రద్భోగములనన్నిటిని తన కారణ శరీరమునందు ఉపసంహరించుకొని, నిర్విశేషుడై వీడిపోయిన గుణములు గలవాడగుచున్నాడో యట్టి తురీయుడు మమ్ములను రక్షించుగాక.

**4. శ్లో॥ హంక్షాభ్యాం పరివృత్తపత్రకములైర్ద్విత్వై జగత్కారణం ।**
**విశ్వోత్తీర్ణ మనేక దేహనిలయం స్వచ్ఛందమానందకం ॥**
**ఆద్యంతైక మఖండచిద్ఘనరసం పూర్ణం హ్యనంతశుభం ।**
**ప్రత్యక్షాక్షర విగ్రహం గురుపదం ధ్యాయే ద్విభుంశాశ్వతం ॥**

4. తా॥ హకారక్షకారముల చేత జుట్టుకొనబడి ప్రకాశమానములగు దేహముల యందలి మూలాధారాది కమలముతో గూడుకొని సమస్త జగత్కారణమునై ప్రపంచము నుద్ధరించుచు(. పిపీలకము మొదలుకొని బ్రహ్మ వఱకుండెడి సమస్త దేహములందుండి స్వతంత్రమును కేవల నానందమును, సమస్త సృష్టికి పూర్వము నందును, ఈ సృష్టి యొక్క నాశమందును ఏకస్వరూపమైనదియును, ఎడతెగని జ్ఞానరసమైనదియును,

అంతట నిండి మంగళస్వరూపమైనదియును, అంతటా వ్యాపించి నిత్యమైనదియును, ప్రత్యక్షమగు ఆకారము మొదలైన యేబది వర్ణములును నాశరహితమగు ఆకారముగా గలదియునైన అధికమగు పరబ్రహ్మ వస్తువును ధ్యానించవలయును.

**5. శ్లో॥ విశ్వవ్యాపిన మాదిదేవమమలం నిత్యంపరం నిష్కళం ।**
**నిత్యోద్బుద్ధ సహస్రపత్ర కమలే లుప్తాక్షరే మంటపే ।**
**నిత్యానందమయం సుఖైక నిలయం నిత్యం శివం స్వప్రభం ।**
**ధ్యాయేద్ధం నపరం పరాత్పరతరం స్వచ్ఛందతస్సర్వదా ॥**

5. తా॥ ఎల్లప్పుడును వికసించియున్న సహస్రారమను పద్మమునందలి, ఆకారాదివర్ణములులేని మంటప మధ్యమమునందుండి సర్వత్ర వ్యాపించినదియును, సమస్తమునకు మొట్టమొదటి దైవ స్వరూపమును, నిర్మలమును, నిత్యమును, అవ్యక్తము మొదలగు సమస్త ప్రపంచమునకు వేఱైనవియును, ప్రాణము మొదలైన షోడశకళలును లేనిదియును, ఎడతెగని ఆనందస్వరూపమైనదియును పరమ సౌఖ్యమునకు స్థానమైనదియును, స్వతంత్రముగా నెల్లప్పుడును నాసికారంధ్రము ద్వారా ఉచ్ఛ్వాస నిశ్వాసములతో రాకపోకలు కలిగిన హంసమంత్రము యొక్క వరుసకు పైపై పైగా నుండునదియును, శాశ్వతమును, మంగళస్వరూపమునునగు ఆత్మ ప్రకాశమును ధ్యానించవలయును.

**6. శ్లో॥ బ్రహ్మాండంబు సృజింప( బెంప సమయింపన్ జాలు సామర్థ్యముల్ ।**
**బ్రహ్మోపేంద్రనగేంద్రచాపులకు సంపాదించుచున్ వారికిన్ ।**
**బ్రహ్మాత్మైక్య వివేకమిచ్చుచును సంభావించుచున్ బ్రోచునా ।**
**బ్రాహ్మీమంగళ దేవతా గిరిజల౯ బ్రార్థింతు నశ్రాంతము౯ ॥**

6. తా॥ సకల ప్రపంచమును సృష్టించునట్టి బ్రహ్మదేవుని పత్నియగు సరస్వతీదేవిని, సర్వప్రపంచమును పోషించునట్టి నారాయణునిత్యానపాయిని యైన మహాలక్ష్మీదేవిని, సకల లోకములను ఉపసంహరింపజేయు పరమేశ్వరుని భార్యయగు పార్వతీ దేవిని నిరంతరమును ప్రార్థించుచున్నాడను.

**7. గు.గీ. ఓనమ: శ్రీ గురుదేవాయ పరమపురుషాయ సర్వ**
**దేవతావశీకరాయ సర్వానిష్టావినాశనాయ సర్వ**
**యంత్రచ్ఛేదనాయ త్రైలోక్యం వశమానాయ స్వాహా ॥**

7. తా॥ టు 27 వ్యా॥

**8. గాయత్రి సాయం సాయం గృహపతి ర్నో అగ్నిః**
**ప్రాతః ప్రాతః సౌమనస్య దాతా**
**వసో ర్వసోర్వసు దాన ఏధి**
**వయం త్వేన్ధానా స్తన్వంపు షేమ.** **(అథ 19-55-3)**

భావము:- ఈ జీవునకు స్వామియైన అగ్నిరూప (అగ్నిర్వై గాయత్రీ - శత. 1-4-1-9) పరమాత్మను ప్రతి సాయంకాలము ఆరాధించుటవలన మనస్సు ప్రాతఃకాలమువరకు, ఆనందితమై ఈశ్వరునకు, వేదమునకు అనుకూలముగ నుండును. పరమేశ్వరా! నీవు మంచి పదార్థములయొక్క దాతవై మా హృదయములందు నివసించుము. మేము మా సమస్త అహంకారములను, దుర్గుణములను నీ ప్రకాశమునకు సమిధలుగ జేయుదము గాక.

**9. ప్రాతం ప్రాతః గృహపతి ర్నో అగ్నిః**
**సాయం సాయం సౌమనస్య దాతా,**
**వసోర్వసోర్వసుదాన ఏధీన్ధానా**
**స్త్వాశతహిమహిబు ధేను ॥** **(అథ 19-55-4)**

భావము: ప్రతి ప్రాతఃకాలమునందీ విధముగా భగవంతు నారాధించుట వలన సాయంకాలము వరకు మనస్సు అదే విధముగా సుఖియైయుండును. కాన నీ మనోవృత్తి సహాయముతో నూరువత్సరముల వరకు దోషములను, అవగుణములను జయించుచు శరీరము, ఆత్మ ఉన్నతి నొందుచుండును.

## రామాయణము

10. అదౌ రామ తపోవనాదిగమనం । హత్వామృగం కాంచనం,
వైదేహీ హరణం । జటాయు మరణం । వాలీ నిగ్రహణం,
సముద్ర తరణం । లంకాపురీ దహనం । పశ్చాద్రావణ
కుంభకర్ణ హననం । యేతద్ధి రామాయణం.

## మహాభారతము

11. అదౌ పాండవ ధార్తరాష్ట్ర జననం ।
లాక్షాగృహే దహనం । ద్యూత స్త్రీ హరణం ।
వనే విహరణం । మత్స్యదేశేవర్తనం । లీలా గోగ్రహణం ।
సంధిక్రియోజ్జృంభణం । రణే విహరణం ।
పశ్చాద్భీష్మ సుయోధనాది హననం ।
యేతత్ మహాభారతం ।

## మహాభాగవతము

12. అదౌ దేవకీదేవి గర్భజననం । గోపీగృహేవర్ధనం ।
మాయా పూతన జీవితాపహరణం । గోవర్ధనోద్ధారణం ।
కంసచ్ఛేదనం కౌరవాది హననం । కుంతీ సుతానాం పాలనం ।
యేతద్భాగవతం పురాణ కథితం । శ్రీకృష్ణ లీలామృతం ॥

ఓం తత్ సత్.

# సంక్షేపాక్షర వివరణం

| | | |
|---|---|---|
| భ. గీ. | = | భగవద్గీత |
| శ్వే. ఉ. | = | శ్వేతాశ్వతరోపనిషత్తు |
| గు.గీ. | = | గురు గీత |
| ఈ.ఉ. | = | ఈశావాస్యోపనిషత్తు |
| మహానార. ఉ. | = | మహానారాయణోపనిషత్తు |
| టీ. | = | టీక |
| అ. | = | అధ్యాయము |
| మను. | = | మనుస్మృతి |
| ఋ. | = | ఋగ్వేదము |
| యో॥ ద॥ | = | యోగ దర్శనము |
| క్రీ.శ. | = | క్రీస్తుశకము |
| శ్రు. | = | శ్రుతి |
| బృ. | = | బృహదారణ్యకోపనిషత్తు |
| తా. | = | తాత్పర్యము |
| శ్లో. | = | శ్లోకము |
| ఉ. | = | ఉపనిషత్తు |

ఇది శ్రీమద్వేదాంతసారుండును, ప్రకృతిద్వయ దోషరహితుండును,
అశరీరుండును, అద్వైత పరిపూర్ణుండును, నిర్గుణ శేఖరుండును,
నితాంత బ్రహ్మనిష్ఠుండును, అనంత శ్రీ విభూషితుండును,
గుడివాడ ప్రణవాశ్రమ పీఠాధిపతియు, కులపతియునగు
బ్రాహ్మీమయ తేజోవిరాజిలు **శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వామి** వారి
శిష్యుండును, శ్రీవారి పాదరేణుతుల్యుండును, పువ్వాళ్ళ
గోత్రసంభవుండును, యోగి త్యాగియైన శ్రీత్రిపురనేని
గోపయ్యగారికిని, కరుణామూర్తియు,
సర్వభూతహితరతయు, మహాసాధ్వియు అగు
తులసీదేవిగారికిని, వరప్రసాదులైన
కుమారద్వయములో ద్వితీయపుత్రుండును,
ఆత్మవిద్యా విశారదుండును, సంయమీంద్ర
సంసేవా నిరతుండును, శాశ్వత
ధర్మపథానువర్తియు అగు శ్రీ త్రిపురనేని
విష్ణుశంకరరావుగారి శంకరాద్వైత వ్యాసమాల
ప్రథమ ద్వితీయ భాగములు, ఆశ్రమము -
ఆచరణ, ప్రమాత, సాక్షి, గాయత్రీ మంత్ర
వివరణ ఇత్యాది త్రింశత్ (ముప్పది)
వ్యాసరాసితో శంకరాద్వైత వ్యాసమాల
తృతీయ భాగ వచన రచన సర్వము -
సంపూర్ణము.

హరి: ఓమ్ తత్ సత్.